"There is more in the novel than the physical eye can see, and the rationalist mind can comprehend. The sap and essence of the novel can only be experienced by people with a sensibility that responds to the intense pangs of a soul in anguish, to the beauty of literary art and to the charm of a great tradition."



అక్షరజ్ఞానమెఱుగదో యాంధ్ర జాతి,
విమలకృష్ణానదీ సైకతముల యందు
కోకిలపుబాట పిచ్చుక గూండ్లు కట్టి
నేర్చుకున్నది పూర్ణిమా నిశలయందు!

(విశ్వనాథ - ఆంధ్ర పౌరుషం)

ఇమ్ముగగాకుళమ్ము మొదలీవరకుంగల యాంధ్ర పూర్వరా
జ్యమ్ముల పేరు చెప్పిన హృదంతరమేలో చలించిపోవు నా
ర్ద్రమ్ముగు చిత్త వృత్తుల పురాభవ నిర్ణయమేని యెన్ని జ
న్మమ్ములు గాగ నీ తనువునన్ బ్రవహించునో
యాంధ్రరక్తముల్

(విశ్వనాథ - వేంగి క్షేత్రం)

92

అనుబంధం

- విన్నకోట రవిశంకర్

మనిషే కానవసరం లేదు
పక్షి, జంతువు, మొక్క ..
ఏదైనా సరే
నిదురించిన హృదయ వీణ తంత్రుల్ని
కదిలించి
స్వరం పలికించాలని చూస్తుంది.

బయటి ప్రపంచం నుంచి విడదీస్తూ
చుట్టూ నిర్మించుకున్న మెష్ మీద
మళ్లె తీగెలా అల్లుకుని
మళ్ళీ మళ్ళీ పలకరిస్తుంది.

అమాయకంగా
అస్వతంత్రంగా
మన మీదే ఆధారపడిన ప్రాణి
బీడుపడ్డ మనసుకి
తడిని పరిచయం చేసి
మమతల సేద్యానికి సమాయత్తం చేస్తుంది.

వేళకు పెట్టే తిండి
గంట లేటయితే చాలు
పెంపుడు జంతువు
కుంకుడు కాయల్లాంటి కళ్ళతో ప్రశ్నిస్తూ
చేదుని రుచి చూపిస్తుంది.

ఒక రోజు నీరు పోయటం మరచినా
కళకళలాడే మొక్క
తల వేలాడేసి
బ్లాక్ మెయిల్ చేస్తుంది.

వీటి అలక, ఆరాటం
ఉసూరుమనే మనసుకు కూడా
ఉల్లాసం కలిగిస్తాయి.
కాలానికి దయ ఉండదు ..

మనుషులైనా, జంతువులైనా, మొక్కలైనా
సుద్దముక్కతో గీసిన బొమ్మల్లా
ఒకటొకటిగా
తన చేతితో తుడిచి వేస్తుంది.

కానీ, వసివాడని సౌరభంలా
ఆ జ్ఞాపకాలు మాత్రం
ఎడద తోటలో ఎప్పటికీ
గుబాళిస్తూనే ఉంటాయి.

క్షమయా ధరిత్రి

- సత్యం మందపాటి

జ్యోతి అపార్ట్మెంట్ బాల్కనీలో నుంచుని క్రింద వున్న పూల మొక్కల అందాలు చూస్తూ నుంచున్నది.

సెల్ఫోన్లో తేదీ చూస్తూ అనుకున్నది, ఈరోజుకి తను అమెరికాకి వచ్చి సరిగ్గా మూడు సంవత్సరాలయింది. అంటే తనకి పెళ్ళయి ఇప్పటికి మూడున్నర సంవత్సరాలయింది.

వెనక్కి తిరిగి చూసుకుంటే ఈ మూడు సంవత్సరాల్లోనూ ఎన్నో విషయాలు జరిగాయి. అన్ని నవలల్లోనూ వున్నట్టే, మన జీవితాల్లో కూడా ఎన్నో అధ్యాయాలుంటాయి. తన జీవితంలోనూ అంతే. గుంటూరులో పుట్టి, పెరిగి, అక్కడే డిగ్రీ పూర్తి చేసింది. తర్వాత మురళితో పెళ్ళి. గుంటూరులోని చుట్టాలనీ బంధుకోటినీ వదిలిపెట్టి, అతనితో పాటు అమెరికా వచ్చేసింది. అంతటితో తన జీవిత పుస్తకంలో

మొదటి అధ్యాయం పూర్తయి, రెండవ అధ్యాయం మొదలయింది.

మొదటి అధ్యాయం అమ్మా నాన్నా తమ్ముడూ చెల్లెలూ, వారి ప్రేమానురాగాలతోనూ, ఎంతోమంది స్నేహితుల మధ్య ఆనందంగానూ మరువలేని మధుర క్షణాలతో హాయిగా గడిచిపోయింది.

అమెరికానించి సెలవలకు ఇండియాకి వచ్చి అప్పటికప్పుడే ముక్కూ ముఖం తెలియని మురళి తనని పెళ్ళి చేసుకోవటం, తర్వాత కొన్ని నెలలకే తను అమెరికా వచ్చి, తనకేమాత్రం పరిచయం లేని మురళితోనూ, పూర్తిగా కొత్తదయిన అమెరికా దేశంలోనూ, ఆ సంస్కృతిలోనూ ఇమిడిపోవటానికి ప్రయత్నం చేయటంతో రెండవ అధ్యాయం మొదలయింది. ఇంకా ఎన్ని అధ్యాయాలున్నాయో తన జీవిత పుటలలో అనుకున్నది జ్యోతి.

మురళి కెమికల్ ఇంజనీరింగ్ చదివి ఒక పెట్రోలియం కంపెనీలో ఇంజనీరుగా చేరాడు. వాళ్ళే గ్రీన్ కార్డ్ కూడా తెప్పించారు. తనని పెళ్ళి చేసుకుని అక్కడికి వచ్చాక, ఇద్దరి సంసారం మధుగీతాలు పాడుకుంటూ హాయిగా నడిచింది. మురళికి కొంచెం కోపం ఎక్కువయినా, తన మీద ఆ కోపం అప్పుడప్పుడూ కొంచెం గట్టిగానే చూపించినా, తనంటే బాగా ప్రేమ చూపించేవాడు. వెంటనే క్షమాపణ చెప్పేవాడు. తను కూడా అలాటప్పుడు అతనికి ఎదురు చెప్పకుండా అతను శాంతించే దాకా సర్దుకుపోయేది.

అప్పటిదాకా బ్రహ్మచారిగా వున్న మురళికి వేరే తెలుగు కుటుంబాలతో ఎక్కువగా పరిచయం లేకపోవటం వల్ల తనకూ ఎక్కువమంది కొత్త స్నేహితులు పరిచయం అవలేదు. కానీ తమ పక్క ఎపార్ట్మెంటులో ఉండే ఒక కన్నడ యువతీ యువకులతో పరిచయం అయింది. మంజునాథ్ ఏదో ఫైనాన్స్ కంపెనీలో పెద్ద ఉద్యోగమే చేస్తున్నాడు. విజయ సైకాలజీలో ఎమ్మెస్ చేసి, కొన్ని సర్టిఫికేషన్స్ కోసం పరీక్షలు వ్రాస్తున్నది. ఇద్దరూ దాదాపు ఒకటే వయసు వారవటంతో, వెంటనే మంచి స్నేహితులయిపోయారు. ఇప్పుడు విజయ కౌన్సెలింగ్ సైకాలజిస్టుగా పనిచేస్తున్నది. తర్వాత వేరే ఇల్లు కొనుక్కుని ఇద్దరూ వెళ్ళిపోవటంతో కొంత వెలితి కనబడినా, వాళ్ళ ఇల్లు కూడా అక్కడికి దగ్గరగానే వుంది. రాకపోకలూ బాగానే వున్నాయి. విజయ సలహా మీదనే తను కూడా కాలేజీలో చేరి చదవటం మొదలుపెట్టింది. ఫైనల్ పరీక్షలు కూడా వ్రాసేసింది కనుక ఇంకో నెలరోజుల్లో డిగ్రీ కూడా చేతికి వచ్చేస్తుంది. అది రాగానే తనూ ఉద్యోగంలో చేరవచ్చు.

కానీ పెట్రోలియం కంపెనీలలో లాభాలు తగ్గాయని ఉద్యోగస్తులని తగ్గిస్తున్నప్పుడు, కొన్ని నెలల క్రితమే మురళికి ఉద్యోగం పోయింది. అప్పటినించే రెండవ అధ్యాయంలో ఎక్కువ పేజీలు నడవకుండానే, జ్యోతి జీవితంలో మొదలయింది మూడవ అధ్యాయం

★★★

జ్యోతి తను చదువుకుంటూనే యూనివర్సిటీ లైబ్రరీలో చిన్న ఉద్యోగం చేస్తున్నది. తనకి ఉద్యోగం లేకుండా భార్య ఉద్యోగం చేయటం అతనికి చిన్నతనంగా వుండేది.

"అందరూ ఏమనుకుంటారు? నువ్వు సంపాదిస్తుంటే, ఉద్యోగం సద్యోగం లేకుండా నేను ఇంట్లో కూర్చుంటే బాగుంటుందా? ఉద్యోగం మానేయి" అన్నాడు మురళి.

"ఎవరు ఏమనుకుంటేనేం? మనం అపార్ట్మెంటుకి అద్దె కట్టాలి, బిల్స్ కట్టాలి, తిండి తినాలి. నేనూ ఉద్యోగం మానేస్తే ఎలా? అదీకాక అమెరికాలో ఇది మామూలే. మన కష్టసుఖాలు మనమే పంచుకోవాలి కదా!" అన్నది.

"అందుకని.. " మురళి ముఖం ఎర్రబడింది.

అతని దగ్గరికి వచ్చి, బుగ్గ మీద ముద్దు పెట్టుకుని, "అందుకనే నాకు నువ్వూ, నీకు నేను" అన్నది.

అతనికి ఒక్కసారిగా కోపం రెచ్చిపోయింది. "నువ్వేం నాకు తిండి పెట్టనక్కరలేదు, నా సేవింగ్స్ నాకున్నాయి" అన్నాడు.

"లేవు అని నేనన్నానా.. ఏదో వేన్నీళ్ళకి చన్నీళ్ళు"

"చన్నీళ్ళా.. గిన్నీళ్ళా" అంటూ ఆమె చెంప ఛెళ్ళు మనిపించాడు మురళి.

ఎర్రగా కందిన ఆమె బుగ్గ మీద కన్నీళ్లు మరుగుతున్నాయి.

కానీ జ్యోతి ఏమీ మాట్లాడలేదు.

తనని చిన్నప్పటినించీ, తల్లీ తండ్రీలతో సహా ఎవరూ ఇంతవరకూ కొట్టలేదు. ఇదే మొదటిసారి ఇలా దెబ్బ తినటం. చకచకా బెడ్రూములోకి వెళ్ళి తలుపు వేసుకుంది.

అప్పటినించీ మురళి అడపాదడపా చేయి చేసుకుంటూనే వున్నాడు. ఇంతకుముందులా కాకుండా, ఇప్పుడలా కోపం వచ్చి కొట్టినప్పుడు, కోపం తగ్గాక అతను జ్యోతికి క్షమాపణ కూడా చెప్పకుండా దూరంగానే వుంటున్నాడు.

తన మనసులోని సంక్షోభం కొన్ని వేల మైళ్ళ దూరంలో వున్న తల్లిదండ్రులకు చెప్పి వాళ్ళని బాధ పెట్టటం ఇష్టం లేదు జ్యోతికి. అయినా తన దుఃఖం ఎవరితో పంచుకోవాలో అర్థం కాలేదు. విజయ మంచి స్నేహితురాలే కానీ ఇంకా అంత దగ్గరవలేదు.

చివరికి కాగల కార్యం గంధర్వులే తీర్చినట్టు అయింది.

★★★

మురళికి అప్పుడే తెలిసింది, అతను ఎన్నో ఆశలు పెట్టుకుని ఎదురుచూస్తున్న ఉద్యోగం తనకి రాలేదని. ఆ కంపెనీ వాళ్ళనీ, అమెరికాలో శ్వేత జాత్యహంకారాన్నీ తిట్టి పోశాడు. ఏ ముహూర్తాన జ్యోతిని పెళ్ళి చేసుకున్నాడోగానీ, అప్పుడే తన జీవితం పట్టాలు తప్పటం మొదలయిందన్నాడు. తన చెడ్డ రోజులకి ఆమెతో వివాహమే కారణం అన్నాడు.

అతని కోపం చూసి జ్యోతి ఇక నోరు విప్పలేదు. ఏమంటే ఏంచేస్తాడో అని మౌనంగా ఉన్నది.

"నేనింత చెబుతున్నా, నువ్వు నోరు విప్పవేం. నాకు ఉద్యోగం రాలేదని నీకు ఆనందంగా వుందా?" అంటూ రెండు చెంపలూ ఎడా పెడా వాయించాడు.

జుట్టు పట్టుకుని లాగుతూ ఆమెని బలంగా తోశాడు. ఆమె నుదుటికి గాయమయి రక్తం వస్తున్నది.

అయినా పట్టించుకోకుండా వెంటనే గట్టిగా శబ్దం చేస్తూ తెలుపు బాదేసి, బయటికి వెళ్లిపోయాడు.

ఆ హటాత్పరిణామానికి విస్తుపోయి చెంప తడుముకుంటూ బాత్రూం వేపు నడిచింది జ్యోతి. అక్కడ కారుతున్న రక్తాన్ని గుడ్డతో అద్ది కట్టు కట్టుకుంది.

అలా మంచం మీద నడుము వాల్చగానే, డోర్ బెల్ మ్రోగింది.

జ్యోతి చటుక్కున లేచి, జుట్టు సర్దుకునే లోపలే, తెలుపు మీద రెండుసార్లు తట్టి, "జ్యోతీ, నేను విజయని. బజారు పని మీద వచ్చి ఇటు వస్తుంటే నువ్వు గుర్తొచ్చావు. మీ తలుపు వేసివుంది కానీ లాక్ చేయలేదు. ఇంట్లో వున్నావా?" అంటూ లోపలికి వచ్చింది విజయ.

ఎదురుగా వచ్చిన జ్యోతిని చూసి నిశ్చేష్టురాలయింది. ఆమెని దగ్గరకు తీసుకుని, "ఏమయింది? ముఖమంతా ఎర్రగా వాచిపోయింది. ఆ కట్టేమిటి? క్రింద పడ్డావా?" అన్నది.

జ్యోతి మాట్లాడలేదు. విజయ భుజం మీద తల పెట్టుకుని వెక్కివెక్కి ఏడ్చింది.

విజయ కూడా మళ్ళీ ఏమీ అడగకుండా జ్యోతి వీపు మీద మృదువుగా రుద్దుతూ ఊరటనిస్తున్నది.

రెండు నిమిషాలు ఆగి, "అతను నన్ను కొట్టాడు. ఒళ్ళు తెలియకుండా కొట్టాడు" అన్నది ఏడుపు ఆపుకుంటూ.

"ఇలారా ఇక్కడ కూర్చో" అని జ్యోతిని సోఫాలో కూర్చోబెట్టింది.

గ్లాసుతో చల్లటి నీళ్ళు తెచ్చి "ఇవి త్రాగు" అన్నది.

జ్యోతి చేతిని, తన చేతితో ప్రేమగా పట్టుకుని "అసలేమయింది?" అడిగింది విజయ.

"మొదట్లో బాగానే వుండేవాడు. మంచివాడే. కానీ చీటికీమాటికీ అతనికి విపరీతమైన కోపం వస్తుంది. కంట్రోల్ చేసుకోలేడు. రాక్షసుడైపోతాడు" అంటూ అంతకుముందూ, ఆరోజూ జరిగినదంతా చెప్పింది జ్యోతి.

"నువ్వు చెప్పావు కనుకా, నేను ప్రత్యక్ష్యంగా నిన్నిలా చూస్తున్నాను కనుకా నమ్ముతున్నానుగానీ, అతన్ని ఇన్నాళ్ళు చూశాక ఇలాటి వాడా అని ఆశ్చర్యం వేస్తున్నది. నమ్మశక్యంగా లేదు". అసలు నమ్మలేకపోయింది విజయ.

జ్యోతి మాట్లాడలేదు.

"మరిప్పుడు ఏం చేద్దామనుకుంటున్నావు?" అడిగింది విజయ.

"ఏం చేస్తాను? పాత కాలపు భావాలతో కుళ్ళిపోయిన పవిత్ర భారత స్త్రీని కదా. అందులోనూ మన దేశం కాని ఈ దేశంలో నా అన్నవాళ్ళు ఎవరూ లేకుండా, నాకంటూ ఏ ఆర్థిక స్థోమతా లేకుండా ఏం చేయను? ఎలా చేయను. నేనీ సమస్యని ఎలా ఎదుర్కోవాలా అని ఆలోచిస్తునే వున్నాను. కొన్నాళ్ళు ఇలాగే గడుపుతాను. అతనిలో మార్పు వస్తుందేమో చూద్దాం" అన్నది జ్యోతి నిర్లిప్తంగా.

విజయ జ్యోతిని వింతగా చూసింది. "అలా ఎందుకు అనుకుంటావ్. ఇది ఇండియా కాదు. ఎంత గృహహింసకు గురైనా చట్టం నోరు కప్పటానికీ, చట్టాన్ని కొనుక్కోవటానికీ. అతనిది కోపం అనేది ఒక సిప్టమ్ మాత్రమే. అతనిలో వున్నవి ఇన్ఫీరియారిటీ కాంప్లెక్స్. సాడిజం. ఇలాటి మనస్థత్వం గురించి నేను చాల చదివాను. ఈ మనస్థత్వం ఉన్న వాళ్ళలో మార్పు దానంతట అది రావటం కూడా దాదాపు అసాధ్యం" అన్నది.

జ్యోతి ఆలోచనలో పడింది.

రెండు నిమిషాలు ఆగి అన్నది విజయ, "నేను వెడతాను జ్యోతీ. మురళి వచ్చి నన్నూ నిన్నూ ఇలా చూస్తే, మనల్నీ ఎంతో దూరం చేస్తాడు. అది మనిద్దరికీ మంచిది కాదు. ఈ గృహహింసలో నేను నీకు సహాయం చేయగలను. కాకపోతే నీ భవిష్యత్తుని ఏదారిన నడుపదల్చుకున్నావో ముందు అది నువ్వే నిర్ణయించుకోవాలి. నేనూ, మంజు నీ పక్కనే వుంటాము. నీకే సహాయం కావలసినా అతనికి చూడకుండా ఫోన్ చేయి. ఏ ఉద్రేకాలకూ లోనుకాకుండా, నిదానంగా ఆలోచించుకుని నీ నిర్ణయం నాకు చెప్పు. సరేనా?" అన్నది విజయ.

జ్యోతి విజయని కావలించుకుని, "అలాగే, థాంక్స్!" అన్నది.

★★★

ఇది జరిగి నాలుగు రోజులయినా మురళిలో ఏమాత్రం తేడా రాలేదు. కాకపోతే కొంచెం మెత్తపడినట్టున్నాడు.

జ్యోతి ముభావంగా వుంటున్నది. అయినా ఉద్యోగంతో పాటు, ఇంటి పనులు తనే చేసుకుంటున్నది.

ఒకరోజు యూనివర్సిటీలో లంచ్ సమయంలో జ్యోతి విజయకు ఫోన్ చేసింది.

"ఎలావున్నావు? మళ్ళీ అతనేమైనా..." అడిగింది విజయ.

"ఒకటి రెండుసార్లు మళ్ళీ కొట్టాడు. అతనికి ఏ కారణమూ అక్కర్లేదు. ప్రతిదీ కొట్టటానికి కారణమే"

"అందుకే నేను అన్నది, అది ఒక సంఘటన గురించి కాదు. అతని మనస్థత్వం గురించి"

"మరెలా... ఒక్కొక్కప్పుడు అనిపిస్తుంది నేనెందుకు జీవిస్తున్నాను అని" అన్నది జ్యోతి నిస్సహాయంగా.

సాలోచనగా అన్నది విజయ. "అటువంటి పిచ్చి ఆలోచనలు ఎన్నడూ రానీయకు. నేనెప్పుడూ నా గురించి నీకు చెప్పలేదు. నేను మా అమ్మానాన్నలకి ఒక్కతే కూతురిని. కొడుకుని కనమంటే కూతుర్ని కన్నదని మా అమ్మని బాలింతగా వున్నప్పటినించే కొట్టేవాడు మా నాన్న. అమెకి చదువుగానీ, తనకి ఆర్థిక స్వాతంత్రం లేకపోవటం వల్ల, తన తల్లిదండ్రులు

కూడా డబ్బున్నవారు కాకపోవటం వల్ల ఏమీ చేయలేక అలాగే బ్రతకటం అలవాటు చేసుకుంది. నా ముందే కొట్టేవాడు. పెద్దవుతున్న కొద్దీ నాకు ఆయన ఎందుకు అలా అనవసరంగా కొడుతున్నాడో అర్థమయింది. నేను అడ్డు వస్తే నన్నూ కొట్టాడు మా నాన్న. ఒకరోజు స్కూలునించీ ఇంటికి వచ్చేసరికీ మా అమ్మ చనిపోయివుంది. కారణం నాకు తెలుసు. మా అమ్మే నాతో అంటుండేది అలా నిర్జీవంగా తను ఇక జీవించటం వృధా అని. డాక్టర్ చేత హృద్రోగం అని వ్రాయించుకుని తప్పించుకున్నాడు మా నాన్న. ఆయనదీ ఇదే మనస్తత్వం. నా జీవితంలో ఆ సంఘటన ప్రతిరోజూ వేటాడుతూనే వున్నది. అందుకే నేను సైకాలజీ చదివి ఇలాటి గృహహింసలు చేసేవారికి, 'మనం పుట్టింది జీవించటానికి, చనిపోయేవరకూ జీవించండి, అంతేకానీ ఆత్మహత్య సమాధానం కాదు. మీ కాళ్ళ మీద మీరు నిలబడటానికి ప్రయత్నం చేయండి' అని చెబుతుంటాను. ఇది ఆనాటి కథమాత్రమే కాదు. సమాజంలో ఈ గృహహింస అనేది ఇంకా పోలేదు. ఇప్పుడప్పుడే పోతుందని కూడా నేను అనుకోను. నా కౌన్సెలింగ్ ఇంత బిజీగా ఉండటానికి కారణం అదే" కళ్ళు తుడుచుకుంది విజయ.

జ్యోతికి ఒక్క క్షణం నోటమాట రాలేదు.

విజయే అడిగింది, "జ్యోతీ, లైన్లో వున్నావా?" అని.

"ఉన్నాను, నీకూ ఇలాటి కథ ఒకటి వుందని అనుకోలేదు. సారీ" అన్నది జ్యోతి.

"సరే, నీ కథని సుఖాంతం చేసుకునే ధైర్యం నీకుందా?" సూటిగా అడిగింది విజయ.

ఒక్క నిమిషం ఆలోచించి "ఉందని నేను అనుకోను. నాకంత ధైర్యం లేదు" అన్నది జ్యోతి.

విజయకి కళ్ళు తిరిగినట్లయింది.

కొంచెం తట్టుకుని, జ్యోతితో చాలసేపు మాట్లాడింది.

★★★

రెండు మూడు రోజులయాక జ్యోతి నెమ్మదిగా "కూరలు అయిపోయినట్టున్నాయి. ఇండియన్ షాపుకి వెడదామా" అన్నది.

"సరే, వెడదాం" అన్నాడు మురళి, చాల మృదుస్వరంతో.

అతనిలో ఏదో మార్పు వస్తున్నట్టుంది అనుకున్నది జ్యోతి.

"కూరలే కాదు. కొన్ని పప్పులూ ఉప్పులూ కూడా కావాలి" అన్నది జ్యోతి.

"నేను స్నానం చేసి వస్తాను" అన్నాడు మురళి సోఫాలోనించీ లేస్తూ.

అతను స్నానానికి వెళ్ళినప్పుడు విజయతో ఫోన్లో మాట్లాడింది జ్యోతి.

మురళికి గ్రోసరీ షాపుల్లోకి వెళ్ళటం ఇష్టం వుండదు.

బయట వాతావరణం కొంచెం చల్లగా ఆహ్లాదకరంగా కూడా వుంది.

అది ఒక పెద్ద షాపింగ్ సెంటర్. ఎన్నో షాపులు వున్నాయి. చుట్టూ పూల మొక్కలూ, చెట్లూ ఎంతో అందానిస్తూ చక్కటి ఆహ్లాద వాతావరణాన్ని సృష్టిస్తున్నాయి.

"నువ్వు లోపలికి వెళ్ళి కావలసినవి తీసుకో. నేను బయట ఈ షాపుల చుట్టూ కాస్త వాకింగ్ చేస్తుంటాను" అని

బయటే వుండిపోయాడు. జ్యోతి లోపలికి వెళ్ళింది.

కొంచెం ముందుకు వెళ్ళేసరికే అక్కడ ఆగిన కారులోనించీ మంజునాథ్, విజయ కూడా కారు దిగుతున్నారు.

విజయ మురళిని చూస్తూ చేయి ఊపింది.

అక్కడే ఆగాడు మురళి.

"వాకింగ్ చేస్తున్నారా? పదండి నేనూ వస్తాను. నా కాళ్ళకి కాస్త వ్యాయామం కావాలి" అన్నాడు మంజునాథ్.

'సరే, మంజూ. నేను బయటికి రాగానే సెల్ ఫోన్లో పిలుస్తాను" అంటూ షాపులోకి వెళ్ళింది విజయ.

మురళీ, మంజునాథ్ ఇద్దరూ మాట్లాడుకుంటూ వాకింగుకి వెడుతున్నారు.

విజయ వచ్చాక అక్కడే నిలుచుని పలకరించింది జ్యోతి.

"మళ్ళీ కొత్త ఎపిసోడ్స్ ఏమీ లేవు కదా?" అడిగింది విజయ, అక్కడ షాపింగ్ బండి తీసుకుంటూ.

బాధగా నవ్వి అన్నది జ్యోతి. "ఇది మన టీవీ సీరియల్లాటిదే వందో రెండొందలో ఎపిసోడ్స్ అయితేగానీ పూర్తవదు. అతను ఏదో వంకపెట్టి కొడుతూనే వున్నాడు. మనవాళ్ళు శయనేషు రంభ, భోజ్యేషు మాత అనే కాకుండా క్షమేయ ధాత్రి అని ఆడవారిని కట్టి పడేశారు కదా! మన పెద్దలు చెప్పినట్టే ఓర్పుతో అతన్ని క్షమించి రోజూ ఏడుస్తూ ముందుకు వెడుతున్నాను" అన్నది.

జ్యోతి చుట్టుపక్కల ఎవరికీ వినపడకుండా చాల నెమ్మదిగా అన్నా కూడా, విజయకి ఆమె మాటల్లో ఆవేదనా, నిరాశా తెలుస్తూనే వున్నాయి.

"అవన్నీ ఎవడో, ఏనాడో వ్రాసిన పురుషహంకార వాక్యాలు. అవి ఈనాటి సమాజంలో పని చేయవు. ప్రేమా, సంస్కారం వున్నవాడు ఎవరూ అలా భార్యని కొట్టడు. అది కోపానికి సంబంధినది కాదు, అతని విలువలకు సంబంధించినది. ప్రమాదకరమైన ఆ మనస్థత్వానికి సంబంధించినది. రోజూ ప్రొద్దున్నే పూజలు చేస్తే పుణ్యం రాదు. మనిషిగా పుట్టినందుకు మనిషిగా బ్రతికితేనే ఆ పుణ్యమూ పరమార్థమూనూ. అసలు అలాటి Anger Control కౌన్సెలింగ్ చేసుకోమని అమెరికాలో ఇంటా బయటా చెబుతూనే వుంటారు. నా ఉద్యోగంలో అదీ ఒక భాగమే" అంది కౌన్సెలింగ్ సైకాలజిస్ట్ విజయ.

జ్యోతి మాట్లాడలేదు. తనకి కావలసినవి తీసుకుని బండీలో పడేస్తున్నది. విజయకు తెలుసు జ్యోతి ఆలోచనలో పడిందని. తను కూడా మాట్లాడకుండా తనకి కావలసినవి బండీలో పడేసుకుంటూ ఆమె వెనకే వెడుతున్నది.

ఇద్దరూ పే చేసి బయటకు వస్తున్నప్పుడు, జ్యోతి అన్నది. "నా ఎంబీయే కూడా పూర్తయింది కదా. ఇక ఉద్యోగం వెతుక్కోవాలి" అని.

"నీకేమిటి టాప్ స్టూడెంటువి. వాళ్ళే వెతుక్కుంటూ వచ్చి నీకు ఉద్యోగం ఇస్తారు" అన్నది విజయ, మంజునాథుకి తను బయటికి వచ్చానని ఫోన్ చేస్తూ.

అంతకముందే బయట నడుస్తున్న మంజునాథుతో, తనకి రావలసిన ఉద్యోగం తనకన్నా తక్కువ అనుభవం వున్న ఒక తెల్లతనికి వెళ్ళిందనీ, ఈ జాత్యహంకారాలు తనలాటి వారి పురోగమనానికి ఎలా అడ్డొస్తున్నాయో చెప్పి తన బాధ వెళ్ళబుచ్చుకున్నాడు.

"అవును, నేను కూడా అలాటి వారిని చూశాను. కోర్టుకి వెళ్ళి మనం నిరూపించగలిగితే బాగానే వుంటుందిగానీ, ఆ లాయర్ ఫీజులు భరించలేము. అంతేకాక మనశ్శాంతి కూడా వుండదు. అన్ని కంపెనీలు అలా వుండవు. చాల కంపెనీలు మన వల్ల వాళ్ళకి లాభాలు వస్తుంటే వదులుకోవు. మనల్ని ఉద్యోగాల్లో ఉంచుకోవటమే కాక బాగా చూసుకుంటారు కూడాను. అదే కదా కాపిటలిజంలో వున్న లాభం. అదే లేకపోతే మనకి వాళ్ళు ఉద్యోగాలు ఎందుకు ఇస్తారు? ఇప్పుడే జాబ్ మార్కెట్ మళ్ళీ పుంజుకుంటున్నది. కొంచెం ఓపిక పట్టండి" అన్నాడు మంజునాథ్.

ఇద్దరూ విజయ, జ్యోతి నుంచున్న చోటికి వచ్చారు.

"హలో బాగున్నారా?" మురళిని అడిగింది విజయ.

"మీ రెస్యూమే నా ఈమైలుకి పంపించండి. మా కంపెనీలో ఇప్పుడు చాల ఓపెనింగ్స్ వున్నాయి" అన్నాడు మంజు జ్యోతితో.

"సరే" అంది జ్యోతి.

అది విన్న మురళి ముఖం ఎర్రబడటం చూసింది విజయ.

ఇంటికి వెళ్ళాక జ్యోతితో దురుసుగా అన్నాడు మురళి, "మంజునాథ్ తనకి నీ రెస్యూమే పంపించమని అడిగాడే, నువ్వు అతన్ని దేబిరించి అడిగావా?"

నవ్వింది జ్యోతి. "లేదు, విజయే చెప్పింది. ఏదో మాటల్లో మంజునాథ్ వాళ్ళ కంపెనీ బాగా లాభాల్లో వుందనీ, ఇంకా కొంతమంది ఎంబీయే ఫైనాన్స్ వాళ్ళ కోసం చూస్తున్నారనీ చెబితే, విజయే అతనితో చెప్పిందిట" అన్నది.

"అయితే...?" అతని ముఖం ఎర్రబడుతున్నది.

"అంత సులభంగా అవకాశం వస్తుంటే వదులుకోవటమెందుకు? నాకు ఎలాగూ ఉద్యోగం కావాలి.

అదీకాక అమెరికాలో ఎంప్లాయీ రిఫరెల్స్ మామూలేగా" అంది జ్యోతి.

మురళి కోపం ఆపుకోలేక పోతున్నాడు. "నన్ను అవమానించటానికే ఇలాటి పనులు చేస్తున్నావ్" అని గట్టిగా కాలితో ఆమెని తన్నాడు.

జ్యోతి ఎగిరి అవతల పడింది. అక్కడ డైనింగ్ టేబులుకి తగలకుండా జాగ్రత్తపడిందిగానీ, లేకపోతే పెద్ద దెబ్బే తగిలివుండేది.

అతను బెడ్రూములోకి వెళ్ళి తలుపు వేసుకున్నాడు.

★★★

మర్నాడు ప్రొద్దున్న ఇద్దరూ ముభావంగా వున్నారు.

డైనింగ్ టేబుల్ మీద కూరలు తరుగుతున్నది జ్యోతి.

అతను గత రాత్రి ఏమీ జరగనట్టు అక్కడే కుర్చీలో కూర్చుని కాఫీ త్రాగుతున్నాడు.

కాసేపాగి అతనే అన్నాడు, "ఏమిటి. అన్ని కూరలు తరుగుతున్నావివాళ?" అని.

జ్యోతి తల ఎత్తి అతన్ని సూటిగా చూస్తూ అన్నది. "ఒకటి, ఇవాళ నీ పుట్టినరోజు. రెండు, నేను నీకోసం వండటం బహుశా ఇవాళే చివరిసారి. అందుకు." అంది.

అతనికి అర్థం కాలేదు.

"అంటే..." అన్నాడు.

"తెలుగులోనే చెప్పాను. అర్థం కాలేదా?" అంది.

"అటువంటి పిచ్చి మాటలే వద్దన్నది. చితక్కొట్టేస్తాను" అన్నాడు కోపంగా.

"ఏదీ, కొట్టు. చూద్దాం" అన్నది జ్యోతి పెద్దగా.

అతను లేచి చేయి పైకెత్తాడు.

జ్యోతి కూడా చటుక్కున లేచి, కూరలు తరుగుతున్న కత్తి అతని వేపు ఎత్తి పట్టుకున్నది.

"కొట్టు. ఇక నేను భరించేది లేదు. నిన్ను భూదేవిలా క్షమించి వదిలిపెట్టే సహనం పోయింది. దాన్ని నువ్వే నాశనం చేసుకున్నావు" అన్నది.

అతను మాట్లాడలేదు. అతనికి ఏం చేయాలో తెలియలేదు.

"ముందా కత్తి క్రింద పెట్టు" అన్నాడు నెమ్మదిగా.

"పెట్టను. నీకిప్పుడు రెండే రెండు మార్గాలు. ఒకటి, అక్కడ విడాకుల కాగితాలు పెట్టాను. అవి సంతకం చేసి, నాజీవితంలోనించీ నీ లగేజీ తీసుకుని ఇప్పుడే ఇలాగే వెళ్ళిపో. రెండవది, నువ్వు పోయిన రెండు మూడుసార్లు నన్ను కొట్టినవి నా ఫోన్లో రికార్డు చేసి వుంచాను. అవి పోలీసులకి ఇస్తే జైలుకి వెడతావు. ఈ కత్తి తీసుకుని నన్ను పొడుస్తావా? వాళ్ళే నిన్ను ఎటెంప్టెడ్ మర్డర్ అని కలకాలం జైల్లో కూర్చోబెడతారు. ఇటీజ్ యువర్ ఛాయిస్" అన్నది జ్యోతి.

మురళి ఆమె వేపే భయం భయంగా చూస్తున్నాడు.

★★★

ఎంతో శాంతంగా వున్న పిల్లిని కూడా గదిలో పెట్టి కొడుతుంటే, ఏదో ఒకరోజు పులిలా ఎదురు తిరుగుతుంది మరి!

★★★

(ఇండియాలో ఎన్నో జరిగిన, ఇంకా జరుగుతున్న ఇలాటి సంఘటనలు చూసీ, ఈమధ్య అమెరికాలో కూడా మన తెలుగువారి జీవితాల్లో జరుగుతున్న అవే సంఘటనలకు స్పందించి ఈ కథ వ్రాశాను)

పాట కచేరీ

- పాలపర్తి ఇంద్రాణి

నేను పాటకచేరీకి
వెళతాను
కులుకు కన్నుల
పట్టు కోక చుట్టి
సుఖాసీనయై సనసన్నని
రాగాలలా
సన్నజాజుల మీదుగా
నా వజ్రపు దిద్దులను
మీటుతోంటే
హాయిలోన లీనయై
రాగానికీ రాగానికీ
రంగురంగుల భావచిత్రాలు
వసంతోత్సవాలుగా మెరసి
మరచినవేవో మంచి సంగతులు
చిన్న నవ్వులు పూయించి
పురాతన కాంక్షలేవో
దేహళీ దత్త దీపాల్లా
మెల్లిమెల్లిగా
లోలోన జ్వలించి
కరతాళములతో
జత కలిపిన దేహాన్ని దాటి
చల్లగాలుల గంధర్వ లోకాన్ని
సభను దాటి
పెనుచీకటులు దాటి,దాటి
నా ఆత్మ ఆనంద నర్తనల
విస్ఫులింగాలుగా విడిపోవడాన్ని
లోకన్నులు విప్పార్చి వీక్షించి
విస్మయం చెందిపోవడానికి
నేను పాటకచేరీకి
వెళతాను

(Written after coming back from Ranjani-Gayatri concert,
RaGa with Raja on Saturday, 29th, April 2023)

ప్రగతివాది, ప్రయోగశీలి కుందుర్తి

- డా. పాపినేని శివశంకర్

ఆధునిక వచనకవితా పరిణామంలో తప్పక కన్పించే ఆనవాలు శ్రీ కుందుర్తి ఆంజనేయులు. ఆ ఆనవాలు లేకుండా వచనకవిత్వ చరిత్ర లేదు. కనుకనే ఎప్పుడో 1922లో గుంటూరు జిల్లా కోటవారి పాలెంలో పుట్టి, విద్యార్థి దశలో విశ్వనాథ, జాషువా ప్రభావానికి లోబడి, రసధుని, అమావాస్య, నా ప్రేయసి లాంటి ప్రేమ కావ్యాలు రాసి, ఆపై కమ్యూనిస్టు ఉద్యమ ప్రభావంలో పడి, 1944లో ఏల్చూరి సుబ్రహ్మణ్యం, బెల్లంకొండ రామదాసులతో కలిసి 'నయాగరా' కావ్యాన్ని వెలువరించి, నరసరావుపేటలో నవ్య కళాపరిషత్తును సాగించి, 1956లో 'తెలంగాణ' దీర్ఘ కావ్యం, 1988లో 'యుగే యుగే', 'కుందుర్తి కృతులు' (కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు, 1977), 'నగరంలో వాన', 'నాలోని నాదాలు', 'హంస ఎగిరిపోయింది', 'తీరా నేను కాస్తా ఎగిరిపోయాక', 'మేఘమాల', 'ఇది నా జెండా' 'కుందుర్తి వ్యాసాలు', 'ఆత్మకథ' మొదలైనవి రచించి, 1982లో దాటిపోయిన శ్రీ కుందుర్తి ఆంజనేయుల్ని నేటికీ తలుచుకుంటున్నాం. ఇది కేవలం అతని శతజయంతి సంవత్సరం కావటం చేత కాదు.

'నేను గీతాన్ని
ఎండిపోయి పండని బ్రతుకు పొలంలో సకాల వర్షపాతాన్ని
కుందుర్తి గుండె శిఖరాలనుండి పరుగులెత్తిన భావ జలపాతాన్ని
ముక్కోటి తెలుగుల మూగ గొంతుల సంగీతాన్ని
ఛందస్సు బంధాలకు పక్షవాతాన్ని
పీడకులను నిర్జించకుండా వదలని పెనుభూతాన్ని
రచనల పూల తోటలో ఛందస్సు మొక్కలు నాటను
భావనలో సామాన్యుని జీవితం వలయాలు దాటను' (నా గీతం)

అని తనను తాను నిర్వచించుకున్నాడు కుందుర్తి. దానికి ఉదాహరణప్రాయంగా మొదట ఏల్చూరి సుబ్రహ్మణ్యం, బెల్లంకొండ రామదాసులతో కలిసి కూర్చిన 'నయాగరా' సంయుక్త కావ్యం కనపడుతుంది. మన్యం తిరుగుబాటుతో మొదలైన ఈ రచనలో, 'మన్యంలో, జయిస్తుంది, తరువాత' అని మూడు భాగాలున్నాయి. ఏవరు ఏది రచించారో తెలియదు. రచనాకాలం మాత్రం 1941-43. 'ఒక జాతికి నెత్తిన కళ్ళూ / మరో వర్గపు మహావమానం / పొడసూపని ఏదో వ్యవస్థ' కావాలని కోరుతున్న ఈ కవిత, 'విప్లవ సైన్యం జయిస్తుంది' అంటూ, 'విప్లవమన్నది రక్తపాతమను / వెర్రి నినాదం వినకండీ / మారే జగతికి మరో జగత్తుకు / చేరే మార్గం చూడండీ' అని ప్రబోధిస్తుంది. శ్రీశ్రీ ప్రభావం స్పష్టంగా కనపడుతున్న ఈ కూర్పులో వచనపద్ధతి, గేయపద్ధతీ రెండూ ఉన్నాయి.

భూమి సమస్య భూమికగా 1946-51 మధ్య కమ్యూనిస్టు పార్టీ నాయకత్వంలో తెలంగాణా విముక్తి పోరాటం జరిగింది. నిజాం నవాబు అండతో దేశముఖులు, జాగీర్దార్లు (దొరలు) సాగించిన దౌర్జన్యాలకు వ్యతిరేకంగా కమ్యూనిస్టు పార్టీ నేతృత్వంలో జరిగిన సాయుధ పోరాటమే తెలంగాణా విముక్తి ఉద్యమం. స్వాతంత్ర్యానంతరం కాంగ్రెస్ప్రభుత్వం పోరాటాన్ని ఉక్కుపాదాలతో అణిచివేసింది. చివరికి కమ్యూనిస్టు పార్టీ 1951లో పోరాట విరమణ చేసింది. ఆ విషయం ఇతివృత్తంగా వెలువడిరదే 'తెలంగాణ' దీర్ఘ కావ్యం. మహాభారతం పద్దెనిమిది పర్వాలు ఉన్నట్టుగా ఈ కావ్యం కూడా ప్రస్తావన, సింహాసన. బీజోత్పన్న. సంఘోదయ మొదలు దండయాత్ర, ఉపసంహార దాకా పద్దెనిమిది ఖండాలుగా కూర్చబడిరది.

'బహుశా ఇదే మొదలనుకుంటాను
గేయాలు తెచ్చిన కొత్త వెలుగు
ఆధునిక యుగంలో ఒక పూర్ణకావ్యంగా
బ్రతుకును వర్ణించటం'

అని కుందుర్తి ఆత్మవిశ్వాసంతో చెప్పుకున్నాడు. అప్పటికే తెలంగాణా పోరాట స్ఫూర్తితో ఆరుద్ర 'త్వమేవాహమ్', సోమసుందర్'వజ్రాయుధం', గంగినేని 'ఉదయిని' రచనలు వెలువడ్డా ఆ పోరాటాన్ని సమగ్రంగా వర్ణించిన కావ్యం కుందుర్తిది.

ఉద్యమకాలంలో స్త్రీలపై అత్యాచారాలు, గృహదహనాలు, పోలీసుల, రజాకార్ల దురంతాలు, సామాన్య ప్రజల ప్రతిఘటన, నిజాం రాజ్యం మీద ప్రభుత్వం సైనికచర్య

మొదలైన సంఘటనలన్నీ ఈ కావ్యంలో చిత్రించబడ్డాయి. అయితే ఉద్యమకారుల మీద ప్రభుత్వం సాగించిన దమనకాండను ప్రస్తావించలేదు.

'ఈ నేల ఎవరిది?
కోటి ప్రజల సొత్తు గదా
కొందరు వద్దంటే ఒప్పుకోని చరిత్రా!
ముందుకు పదా!'
అని ముగింపు పలికాడు కవి.

వచన కవిత్వంలో కథాకావ్యాలు రావాలని ఆశిస్తూ, అందుకు దారి తీస్తూ, 'తెలంగాణ' సృష్టించాడు కుందుర్తి. 'కథాకావ్య రచన వచనకవితకు వైవిధ్యాన్ని, స్థిరత్వాన్ని సమకూరు స్తుంది' అని భావించాడు. కథ, రసపోషణ, పాత్రలు, నాటకీయత– ఇవన్నీ కథాకావ్యాల్లో ఉండాలని ఆయన ఆలోచన. శ్రీ శ్రీ 'భిక్షు వర్షీయసి', 'బాటసారి', 'ఆకాశదీపం' కథామాత్రక గల ఖండికలని, ఈ మూడిటిలో కరుణరసం తొణికిసిసలాడుతుం టుందని అన్నాడు. అవి తన దృష్టిలో స్వల్ప కథాకావ్యాలు. అయితే రాను రాను తెలుగులో దీర్ఘకవితలు వెలువడ్డాయి గాని కథ, పాత్రపోషణ లాంటి అంశాలతో కథాకావ్యాలు రాలేదు. నగ్నముని 'కొయ్యగుర్రాన్ని' చేకూరి రామారావు (చేరా) 'ఆధునిక మహాకావ్యం' అన్నాడు గాని అందులో కథ లేదు. ఆయనే 'తెలంగాణ' కావ్యాన్ని 'తొలి తెలుగు విప్లవకావ్యం' అని మెచ్చుకున్నాడు. ఇటువంటి రచనలకు కావ్య లక్షణాలు పూర్తిగా అన్వయిస్తాయా అనేది ప్రశ్నార్థకమే.

'ఆశ' అనే కవితాత్మక రూపకం ప్రత్యేకమైంది. అది నాలుగు రంగాలుగా ఉంది. నాందీ ప్రస్తావనలతో పాటు పాత్రలు కూడా ఉన్నాయి. కాలం, చరిత్ర, ఆశ, సూత్రధారుడు, నటి, కవి, గుమాస్తాలు, బంట్రోతు– వీళ్ళందరూ పాత్రలు. రూపకం చివర ఆశావాదం ప్రతిపాదించబడిరది. 'స్వార్థాన్ని సముద్రగర్భంలో ముంచుతాను/ మనిషి ఎత్తు పెంచుతాను/ సంఘాన్ని బజారులో నిలేసి అడుగుతాను/ కుళ్లంతా కడుగుతాను/ గౌరీశంకర శిఖరం మీద/ స్నేహ సౌహార్దాల మొక్కలు నాటిస్తాను/ అన్యాయాన్ని కాటేస్తాను/ ఆహ్వానించండి అందర్నీ / అదే నా కర్తవ్యం/ కర్తవ్య గాఢదీక్షాశీలిని నేను' అంటాడు కవి. అందుకోసం 'పదండి పదండి పోదాం' అని ముందుకు నడిపిస్తాడు. ఇట్లాంటి స్వీయ ప్రకటనలు అప్పటి అభ్యుదయ కవిత్వంలో మామూలే.

'శిక్ష ఏమిటి' అనే కవితారూపకంలో కూడా సూత్రధారుడు మొదలు కవి, ప్రేక్షకుడిదాకా, కార్మికులు, వ్యవసాయ కూలీలు, హరిజనుడు, కాంట్రాక్టర్, ఇంజనీరు, గుమాస్తాలదాకా అనేక పాత్రలుంటాయి. గోపయ్య ఇందులో ప్రతికూల పాత్ర. కవి సానుకూల పాత్ర. 'ప్రజల పక్షాన నిలబడి పాపాలు బయటపెట్టే కవిని/ అభ్యుదయ కవితా మహాకాశపథంలో వెలిగే రవిని నేను' అంటాడు. సమాజంలో రాజకీయనాయకుల అండతో కాంట్రాక్టర్లు చేసే మోసాలమీద విమర్శ ఉంటుంది ఈ రూపకంలో.

'నగరంలో వాన' కవితాసంపుటిలో తొలి కవిత 'నగరంలో వాన'. వాన అనేది ఒక నెపం మాత్రమే. ఆ నెపంతో కవి నగరంలో సామాన్యుల కష్టనష్టాలను చిత్రిస్తాడు.

ఇక 'నాలోని నాదాలు' సంపుటిలో కవి హృదయ విపంచి పలికిన 34 నాదాలు వినిపిస్తాయి. 'ఈగ దూరను సందు లేదు/ ఇది అడివి/ భూలోకమంతా కలిసి జానెడు నిడివి/ నాలోకి నేను వెడతాను' అంటూ తొలి నాదం. ఈ నాదాలలో దేనికీ శీర్షిక ఉండదు. అంకెలు మాత్రమే ఉంటాయి ఇందులో కవి యొక్క బహిరంతర సంఘర్షణ తెలుస్తుంది. జీవితం, కవిత్వం, కాలం మొదలైన విషయాలతో ఆత్మాశ్రయరీతిలో సాగిన రచన. నాగరిక జీవితంలోని ఒడిదుడుకుల్ని, దుర్మార్గాలని చూసి సహించలేక, 'నిర్మానుష్యమైన అడవిలో కొన్నాళ్లు/ నివసించాలని వుంది' అంటాడు కవి. ఇట్లా వచనకవిత్వంలో ఎన్నెన్నో ప్రయోగాలు చేశాడు కుందుర్తి.

తొలినాటి గురువు విశ్వనాథ సత్యనారాయణ మార్గంనుండి పక్కకు పోయినా ఆ గురుభావం పోలేదు కుందుర్తికి. గురువు గారి షష్టిపూర్తి సందర్భంలో, 'పుంభావ సర్వతి, పూజ్యపాదులు గురువుగారికి నమస్కారం' అంటూ 'విశ్వనాథ షష్టిపూర్తికి' అనే దీర్ఘకవిత రాసి పంపారు. 'నీ శిష్యత్వానికి చిహ్నంగా ఒక పద్యం రాసి ముగిస్తాను' అన్నారు. అది ఇది.

నీవాంధ్రాఖిల నీవృతాదృతుడవై, నీలో కవిత్వాపగల్
ప్రోవుల్పడ్డ రసాత్మవై, మృదులతాముగ్ధంబులున్ తీక్ష్ణతా
భావప్రౌఢములైన నీ పలుకులాస్వాదించి, భావించి, నీ
ఈ వైదగ్ధ్యములోన నొక్కణువుగా నీ కావ్యముప్పొంగితిన్

మార్గం మారినా తొలి పాఠాలు నేర్పిన గురువు పట్ల ఉండాల్సిన గౌరవం తెలిపే కవిత యిది. (పద్యంలో అన్వయలోపం ఉన్నట్టుంది.) తెలుగునేలపై వ్యాపించిన బౌద్ధం పట్ల ప్రేమతో పద్యకవిత ఒకటి రచించాడు కుందుర్తి. పద్యాల పేర్లు, పాదవిభజన మాత్రం ఉండవు.

ఒక చోట నేమి? తెలుగుల
సకలోర్విని ఎచట త్రవ్వ చైత్యకములు, స్థూ
పకములు (sic), పద్మాసనగత
ముకులిత నేత్రములు, ధ్యానముద్రారీతుల్

విమర్శకుడుగా సాహిత్యంలో వచ్చిన రకరకాల మార్పుల్ని కుందుర్తి బేరీజు వేశాడు. ఆధునిక యుగం గురించి ఆయన మాట్లాడుతూ, 'సాంస్కృతిక విప్లవానికి వీరేశలింగం ఆది పురుషుడు. భాషను ప్రజలకు సన్నిహితంగా తెచ్చినవాడు గిడుగు. వ్యవహారిక (sic) భాషకు కావ్యగౌరవం తెచ్చింది గురజాడ. ఈ ముగ్గురు మహాపురుషుల కృషిచేత 19వ శతాబ్దపు చివరకు తెలుగు సాహిత్యంలో వచ్చిన అభ్యుదయ మార్గం బాగా స్థిరపడింది.' అన్నాడు. ఇది సవ్యమైన సాహిత్యావగాహన.

'సామాజిక స్పృహ లేని భావకవిత్వం గుణంలో చెప్పుకోదగిన మార్పు తేలేదు. ఆకృతిలో మాత్రం అతి స్వల్పమైన అప్రధానమైన మార్పు కలిగింది. భావ కవిత్వం పూర్తి అపజయం పొందిన ఒక కవితావిప్లవం. అనాటి దేశభక్తి కవిత్వంలో మాత్రమే సామాజిక స్పృహ అనేది కనిపించింది. అభ్యుదయ కవిత్వానికి సామాజిక స్పృహ ప్రాణం వంటిది. అభ్యుదయ సాహిత్యం మన సాహిత్యంలో వచ్చిన అన్ని విప్లవాలలోనూ సంపూర్ణమైనదీ, హేతుబద్ధమైనదీ.' (సాహిత్యంలో సామాజికస్పృహ.)

భావకవిత్వంలో దేశభక్తి కవిత్వం అంతర్భాగమని డాక్టర్ సి. నారాయణరెడ్డి 'ఆధునికాంధ్ర కవిత్వము, సంప్రదాయములు, ప్రయోగములు' అనే విమర్శ గ్రంథంలో భావించాడు. కాని ఆ రెండిటి పునాదులు వేరని కుందుర్తి గుర్తించాడు. 'సాహిత్యం'మౌలిక భావనలు' అనే నా పరిశోధనాగ్రంథంలో అదే ప్రతిపాదన చేశాను, దిగంబర కవిత్వం అరాజక కవిత్వం అన్నాడు. 'ఆవిష్కరణ పద్ధతులు కీర్తికి షార్ట్ కట్ మార్గం. 'ఏ దేశమేగినా ఎందుకాలిడినా' వంటి అశ్లీలాలు. యువకుల వైపరీత్యాలకు వింత పోకడలకు 'దిగంబర కవులు' సంపుటులు పరాకాష్ట. ప్రయోగం విశ్వ శ్రేయోదాయకం కాదు' అని ప్రకటించాడు.

'మినీ కవితలు ముక్తకాల వంటివి. ఇదే ప్రక్రియ, ఇదే ఒక ఎండ్అంటే నేను ఒప్పుకోను. అది అభ్యాసానికి పనికొస్తుందని నేననుకుంటా. నీటి ద్వారానే ప్రజల్లో చైతన్యం తీసుకురావడం కష్టం' (ఆధునిక కవిత'అభిప్రాయాలు). 'మినీ కవిత్వం నిలవదు. క్షణికంగా చమత్కారంతో రాణించగలదు' అని వేరొక చోట అన్నాడు. మినీ కవిత్వాన్ని ప్రోత్సహిస్తున్న ఆంధ్రజ్యోతి వారపత్రిక సంపాదకులు పురాణం సుబ్రహ్మణ్యశర్మ అడిగినప్పుడు, 'మినీ కవితలను ప్రోత్సహించడం సాహిత్యానికి సేవ కాదు, ద్రోహం చేయడమే' అన్నాడు.

సమకాలిక కవుల పట్ల ఆయన అభిప్రాయాలు తెలుసుకోవడం ఆసక్తికరంగా ఉంటుంది. నారాయణ బాబు గురించి రాస్తూ, 'ఆధునిక కవిత్వంలో కొత్త ఇమేజెస్బాగా ప్రవేశపెట్టాడు. ఆధునిక కవిత్రయంలో ఒకడు. మిగిలిన వారు శిష్ట్లా, శ్రీశ్రీ.' అట్లానే శ్రీశ్రీ గురించి, 'అతను యుగకర్త, మహాశాబ్దికుడు, వైచిత్రీ ప్రియుడు' అని నిర్ధారించాడు. 'ద్విగుణీకృతమైన శ్రీకారం / యుగకర్తగా నిలిచింది తెలుసా' (ఆశ). ఈ 'యుగకర్త" అనే మాట పింగళి లక్ష్మీకాంతము, డా॥ సి. నారాయణరెడ్డి మొదలైన వాళ్ల ద్వారా బాగా వ్యాప్తి చెందింది. 'ఇద్దరు యుగకర్తలు' అంటూ సినారె విశాల దృక్పథంతో గురజాడతో పాటు రాయప్రోలునూ చేర్చాడు. సాహిత్య రంగానికి పరిమితమైన గురజాడ యుగకర్త అయితే సాహిత్య సాంస్కృతిక రంగాల్లో విశేష కృషి చేసి, 'నవయుగ వైతాళికుడు'గా ప్రఖ్యాతుడైన వీరేశలింగం ఏమవుతాడు? శ్రీశ్రీకి సమకాలంలో కవులే గాక మహా పరిశోధనలు చేసిన

విమర్శకులున్నారు. అద్భుతమైన కథలు రాసిన రచయితలున్నారు. ఈ అంతటికీ ఒక్కడే యుగకర్త ఎట్లా అవుతాడు? శ్రీశ్రీ మహాకవి అనటంలో విప్రతిపత్తి లేదు. యుగకర్త అనటంతోనే అభ్యంతరం. వ్యాకరణంలో ఒక పద్ధతి ఉంటుంది. ఒక సూత్రం మరొకదాన్ని బాధించరాదు. అట్లాగే ఒక సాహిత్యకారుడికి వాడే విశేషణం మరొకళ్ల గొప్పదనాన్ని భంగం చెయ్యగూడదు.

ఆరుద్ర 'త్వమేవాహం' గురించి రాస్తూ కుందుర్తి, 'టెక్నిక్ వచ్చి ఇతర కవితాలక్షణాలన్నిటిని మింగేసిన పరిస్థితి" అన్న మాట వాస్తవం. శ్రీశ్రీ, దాశరథి ఆ కావ్యం గురించి వివరించేదాకా దాని విషయం చాలా మందికి అంతుబట్టలేదు. తిలక్గురించి చెబుతూ, 'భావకవుల్లో చివరివాడు. కవిత్వపు అభిప్రాయాల్లో కృష్ణశాస్త్రి వంటి వాడే' అని నిర్ణయించాడు. తిలక్లో రెండు పార్శ్వాలు ఉన్నాయి. ఒకటి, అభ్యుదయ దృక్పథం. రెండు కాల్పనిక ధోరణి. భావలాలిత్యం, సౌందర్యదృష్టి ఆయన్ని కృష్ణశాస్త్రి సరసకు చేర్చుతుంది.

'బైరాగి ఆలోచనలో సంశయం తొంగి చూసింది. నూతనత్వం కోసం అన్వేషించాడు. శబ్దచిత్రాలు, భావచిత్రాలు నిర్మించడంలో ఆయన అందె వేసిన చేయి. వచనకవిత్వ ప్రక్రియను తీర్చిదిద్దిన తొలి కవుల్లో ఆయన ప్రముఖంగా చెప్పదగినవాడు' కుందుర్తి. బైరాగే చెప్పినట్టు 'నూతిలో గొంతుకలు' సంశయ కావ్యం. కర్మ పూర్వం, కర్మ క్రమం, కర్మానంతరం మానవుడు పడే అస్తిత్వవేదనే బైరాగి 'నూతిలో గొంతుకలు'. అయితే అది కథాకావ్యం కాదు. దీర్ఘ కవిత.

'సాహిత్య పరిణామంలో గాని, జీవిత పరిణామంలో గాని కుందుర్తి గమనించిన గొప్ప సత్యం ఏమిటంటే పరిణామశీలం. 'ఎప్పుడైనా మారకుండా ఉండేది ఒక్కటే, అది మార్పు' అన్నాడు. తెలుగు సాహిత్య ప్రగతికి సంప్రదాయ భావన, భాషాప్రాగల్భ్యం, ఆంగ్లభాషాప్రభావం మొదలైనవి అడ్డుపడుతున్నాయని భావించాడు. పాలక వ్యవస్థలోని సంప్రదాయధోరణులనూ ఎదుర్కోవాలన్నాడు. 'ఎప్పుడు కవి ప్రతిపక్షంలోనే ఉండాలి' అన్నాడు. తెలుగు నుడికారంతో, దాని శక్తితో పరిచయం లేకపోవడం వల్ల ఆధునిక కవిత్వంలో ఆంగ్ల పదాడంబరం చోటు చేసుకుంటుందని కుందుర్తి భావం. సజీవమైన వ్యావహారిక భాషా పదాలు వాడాలని, ఆంగ్లంలో ఆలోచించి తెలుగులోకి తర్జుమా చేయడం మంచి లక్షణం కాదని చెప్పాడు. వర్తమాన కవులు ఆలోచించాల్సిన విషయం.

'ఏ కవి అయినా గొప్ప కవిగా చలామణి కావడానికి మొట్టమొదటి షరతు తన పూర్వుల కంటే ఏదో ఒక ప్రత్యేకతను చూపగలగడం. ఎవరెన్ని నిర్వచనాలు చెప్పినా ప్రతిభ అంటే ఇదే.' (సంప్రదాయం మారుతుంది, 'స్వతంత్ర' పత్రిక, 1960.) ఇది నూటికి నూరు పాళ్లు వాస్తవం.

'పాత కాలం పద్యమైతే వర్తమానం వచనకవిత' (నాలోని నాదాలు).

వచనకవిత్వం గురించి స్పష్టమైన అవగాహనతో కుందుర్తి అనేక వ్యాసాలు రాశాడు. 'ఛందస్సును వదిలి అంతస్సౌందర్య దర్శనం కొరకు అన్వేషణ వచనగేయం. పద్యం 'మాత్రాఛందస్సు 'ఫ్రీవర్స్. ఇదొక సహజ పరిణామం....వచనగేయం వర్ధిల్లాలంటే నేటి కవులు కొన్ని నియమాలను పాటించాలి. సమకాలీన జీవితచిత్రణ ఉండాలి. తెలుగుదనం వుండాలి. ప్రగతిశీలమైన దృక్పథం వుండాలి. కవి సంఘంలో అగ్రశ్రేణిలో నిలబడి దారి చూపాలి. భవిష్యత్తును స్పష్టంగా దర్శించగల ప్రతిభ వుండాలి. వ్యవహారభాషా పదప్రయోగాలకు కవితలో గౌరవనీయమైన స్థానం వుండాలి. ఛందో గ్రాంథిక బంధాలు, పాత కథలు, కవి సమయాలు, సంస్కృతం మొ॥ ఇతర భాషల పెత్తనం, అస్పష్టత, అయోమయత, అతి వర్ణనలు, పులుముడు, ఆంగ్లభాష పెత్తనం ఉండకూడదు. (నవత ద్వితీయ సంచిక, 1967)

'వచనకవిత ఒక ఉద్యమం అని నేను ప్రచారం చేశాను. ఇప్పటికీ అలానే అనుకుంటాను. అంటే నా భావం వచనకవిత సూర్యుని వెలుగుల్లాగా ఒక మహోద్యమంలా వ్యాపించిందని...దీనికి మౌలికమైన, ప్రత్యేకమైన సిద్ధాంతం ఏమైనా ఉన్నదా అనే ప్రశ్న. ఏ మూలసిద్ధాంతం అభ్యుదయ కవితామార్గానికి ప్రవర్తక శక్తి అయిందో, ఆ మార్క్సిస్టిసిద్ధాంతమే వచనకవితకు కూడా పునాది. (విస్తరిస్తున్న వచనకవిత, విశాలాంధ్ర దినపత్రిక, 14-03-1976)

'వచనకవిత తెలుగు కవిత్వంలో ప్రక్రియకు

సంబంధించిన విప్లవం' అన్న కుందుర్తికి దాని పరిమితి కూడా తెలుసు. సామాన్య ప్రజలకి చేరువ కావాలంటున్నా అది శ్రామికవర్గానికి చేరజాలదని చెప్పాడు. వచనకవితా ప్రాచుర్యానికి జీవితం అంకితం చేశాడు. ఇంటా బయటా విస్తృతంగా ప్రచారం చేశాడు. ఆ దిశగా యువకవుల్ని ప్రోత్సహించాడు. వచనకవిత్వ రచనకి ప్రాచీన కవిత్వాధ్యయనం తప్పనిసరి అవసరమేమో అనే బెరుకు పోగొట్టాడు. ఆ క్రమంలో 'వచనకవితా పితామహుడు'గా బిరుదు గాంచాడు. కార్యకర్తలందరూ కావ్యకర్తలు కాలేనట్టుగానే కావ్యకర్తలందరూ కార్యకర్తలు కాలేరు. మంచి గంధం రాసుకొని, మల్లెపూలమీద పరుండకపోయినా కవులు అంత తొందరగా అంతరంగ క్షేత్రం వదిలి బహిరంగ భూమిక మీదకి రాలేరు. అందుకు మినహాయింపు కుందుర్తి. అతను కావ్యకర్త ప్లస్ కార్యకర్త. ఈ కార్యరంగమే 1967లో 'ఫ్రీవర్స్‌ఫ్రంట్' స్థాపనకు దారి తీసింది. ఆ పేరులోనే పద్యకవిత్వానికి ఎదురొడ్డిన తత్త్వం ఉంది. నచ్చిన, మెచ్చిన యువ(వచన)కవులకు ఆ పేరుతో అవార్డులు కూడా ఇవ్వటం మొదలుపెట్టాడు. తొలి పురస్కారం శీలా వీర్రాజు 'కొడిగట్టిన సూర్యుడు'కి 1967లో దక్కింది. వరసగా, వరవరరావు (చలి నెగళ్లు, 1968), వేగుంట మోహనప్రసాద్(చితి`చింత, 1969), చెరబండరాజు (దిక్సూచి, 1970), నగ్నముని (తూర్పు గాలి, 1973), కె. శివారెడ్డి (రక్తం సూర్యుడు, 1974), కొత్తపల్లి సత్యశ్రీమన్నారాయణ (వెలుతురు పిట్టలు, 1975), ఇస్మాయిల్(మృత్యు వృక్షం, 1976), ఇంద్రగంటి శ్రీకాంతశర్మ (అనుభూతి గీతాలు, 1977), పి. హనుమయ్య (విభావరి, 1979), దేవిప్రియ (అమ్మ చెట్టు, 1980) మొదలైన వాళ్లు ఈ అవార్డును పొందారు. ఈ కవులంతా కాలక్రమంలో సాహిత్యలోకంలో సుప్రసిద్ధులయ్యారని మనకు తెలుసు. తొలి దశలో వారి ప్రతిభను గుర్తించటమే విశేషం. మొదట్లో నూటపదహారు రూపాయలతో సత్కరించేవాడని విన్నాను. అయితే అది డబ్బుతో కొలిచేది కాదు. బెరుకు బెరుగ్గా రాసుకుపోతున్న ఎంతోమంది యువ వచనకవులకు అది ఉత్సాహ శక్తి అయ్యింది. తదనంతరం ఫ్రీవర్స్‌ఫ్రంట్‌ని ఆయన కుమారుడు సత్యమూర్తి, శీలా వీర్రాజు అవే విలువల్తో నడిపారు. (1985లో నా 'స్తబ్ధత`చలనం' కవితాసంపుటికి 'ఫ్రీవర్స్‌ఫ్రంట్' అవార్డు లభించింది. కాలక్రమంలో మరెన్నో వచ్చినా ఆ తొలినాటి ఉత్తేజానికి సాటి రావు.)

ఇక్కడే రెండు మూడు ప్రశ్నలు ఎదురవుతాయి. వచనకవిత ఒక ఉద్యమమా? మార్క్సిస్ట్సిద్ధాంతమే వచనకవితకు పునాది అవుతుందా? కుందుర్తి వచనకవితా పితామహుడేనా?

నిర్దిష్ట భౌతికాశయంతో ఒక సమూహం చేసే సమష్టి ప్రయత్నాల, చర్యల పరంపర ఉద్యమం. సాహిత్యోద్యమానికి సామాజిక వస్తువుతో, అంటే సమాజ మౌలికాంశాలతో` ఆర్థిక, రాజకీయాలతో ` ప్రధాన ప్రమేయం ఉంటుంది. ఆ మౌలికాంశాలను ప్రభావితం చేసే శక్తి ఉంటుంది. సామాజికోద్యమం లేకుండా సాహిత్యోద్యమం ఉండదు. ఈ ప్రమాణాన్ని బట్టి చూస్తే భావకవిత్వం, దిగంబర కవిత్వం బలీయమైన ధోరణులే గాని ఉద్యమాలు కాజాలవు. 'నవ్య కవిత్వములో తాలోత్తాలమైన ఉద్యమములు రెండే రెండు. ఒకటి భావ కవిత్వము; రెండు అభ్యుదయ కవిత్వము.' (డా॥ సి. నారాయణరెడ్డి, ఆధునికాంధ్రకవిత్వము: సంప్రదాయములు, ప్రయోగములు.) భావకవిత్యోద్యమం అంటూ అందులో దేశభక్తి/జాతీయోద్యమ కవిత్వాన్ని అంతర్భాగం చెయ్యటం సరైన అవగాహన కాదని నా అవగాహన.

ఇక పద్యం, గేయం, వచనం మొదలైనవన్నీ సాహిత్య రూపానికి చెందిన ప్రక్రియలు. వాటిలో దేని గురించి రాస్తున్నాం అనే దానితో, అంటే వస్తువుతో సంబంధం లేదు. ఏ భావాలైనా అందులో చొప్పించవచ్చు. మార్క్సిస్ట్సిద్ధాంతానికి భిన్నమైన, వ్యతిరేకమైన భావజాలం కూడా వచనకవిత్వంలో వ్యక్తమైంది. అందుచేతనే వచన గేయానికి ఒక ప్రత్యేకమైన తత్త్వం (ఫిలాసఫీ) ఉన్నదా అని కె.వి. రమణారెడ్డి అడిగినపుడు నాకేమీ కన్పించటం లేదని కుందుర్తి చెప్పాల్సివచ్చింది. ఆ ప్రక్రియకి సంబంధించి భౌతికమైన/సామాజికమైన ఉద్యమం ఏదీ కన్పించదు. అసంఖ్యాకంగా వచనకవిత్వం రాసినా, రాస్తున్నా ఎందరో పాటిస్తున్నారు కాబట్టి అది ఒక బలీయమైన ధోరణి అవుతుంది.

కాగా, పద్యం-గేయం`వచనకవిత అనేది

రచనాసౌలభ్యా నికి సంబంధించిన సాధారణ పరిణామం. తనకన్న ముందే శ్రీశ్రీ, నారాయణబాబు, ఆరుద్ర, దాశరథి, బైరాగి, సినారె మొదలైనవాళ్లు వచనకవితలు రాశారు. అయితే దాన్ని వేగవంతం చేసినవాడు, దానికొక ప్రత్యేక స్థితి కల్పించినవాడు కుందుర్తి. దానికి మొదటి వాడు కాకున్నా 'ట్రెండ్‌సెట్టర్' గా కుందుర్తిని గౌరవించవచ్చు. వచనకవితా సారధి అనవచ్చు. పితామహుడు లాంటి విశేషణాలు అంతగా నప్పవు.

కుందుర్తి కృషిని గౌరవిస్తూనే వచనకవితా శిల్పానికి ఆయన గొప్ప ఉదాహరణ కాదని భావిస్తాను. కుందుర్తి కవిత్వ నిర్మాణంలో ధారాళతతో పాటు ఒక వదులుతనం ఉంటుంది. సారళ్యంతో పాటు ఒక అసాంద్రత/పలచదనం ఉంటుంది.

'కొండకు వస్తానని మొక్కుకోని

రాకుంటే నీకు కోపమంట
మరి రాలేనితనం మాకు కల్పించింది
నీవు కాక మరెవ్వరా దీర్ఘంగా ఆలోచిస్తాను
జవాబు మా మనస్సుకు దొరకదు
చెప్పే నాథుడూ లేడు
అందరూ ఒక గుడ్డి నమ్మకంతో ఆ దారినే పోతున్నారు
ఆడవాళ్లది మరీ గోల, అది వింటే నీకే నవ్వొస్తుంది
ఒంటిమీదకి వచ్చి నువ్వు కావాల్సివన్నీ కోర్తావట!'

ఇందులో కించిత్కమత్కారం తప్ప కవిత్వం దినుసు కనపడదు. ఇక్కడే వచనానికీ, కవిత్వ వచనానికీ, వచనకవితకీ తేడా గమనించాల్సి ఉంది. కుందుర్తి కవిత్వంలో భావ చమత్కారం ఉన్నంతగా భావ గాంభీర్యం ఉండదు. అది దగ్ధతతో కూడిన, ఆవేశంతో కూడిన తీవ్రత కాదు. అవగాహనతో కూడిన ఆలోచన. అది మునకలు వేసి అన్వేషించాల్సిన సముద్రం కాదు. నడుము లోతు సరోవరం. ఆ లోతు తక్కువ పైకి తెలియకుండా ఉండటానికి అంత్యప్రాసల అలలు, చమత్కారాల పొంగులు చాలా సాయ పడ్డాయి. సులభ శైలిలో, నిరాడంబరంగా సామాన్య పాఠకుల్ని చేరుకోవటమే కుందుర్తి ఉద్దేశం. కనుక వచనకవిత్వ ప్రచారం గూర్చి ఆలోచించినంతగా ఆయన దాని అంతర్గత సౌష్ఠవం గురించి ఆలోచించలేదేమో. ఆవంత్స సోమసుందర్, 1975లో వెలువడిన 'కుందుర్తి సన్మాన సంచిక'లో ఇలా అంటున్నాడు.

'ముక్తచ్ఛంద కవితాప్రకియతో సంపూర్ణకావ్యాలు సంతరించి, అనూన సంప్రదాయ వ్యుత్పన్నతాబలంతో ఎంతో పరిపుష్టం చేసి, మండనార్హుడైన కవి శ్రీ కుందుర్తే! కాని వచనకవిత ప్రతి అర్భకుడూ రాయగలిగేటంత సులువైనదన్న తేలిక భావాన్ని కలిగించి దండనార్హుడవుతున్నదీ అతనే!'

ఏది ఏమైనా వేగుంట మోహనప్రసాద్‌అన్నట్టు, 'ఆధునికాంధ్ర కవిత్వానికి కుందుర్తి ఓ తప్పనిసరి అవసరం అయ్యాడు.'



కలుద్దాం

- మమత కొడిదెల

ఒకే నది నుంచి పుట్టి ఎక్కడెక్కడికో ఆవిరైపోయి
నీలాకాశంలో హఠాత్తుగా ఎదురుపడిన
రెండు మబ్బుతునకల్లా మనం
శిశిర శ్వేత సందోహానికి సిద్ధమవుతూ
ఎర్రనీ, పసుపుపచ్చనీ ఆకుల్ని సింగారించుకున్న చెట్ల మధ్య
పక్కపక్కనే కూర్చుంటాం అలా కాసేపు
ఇదిగో ఇక్కడే
నీకోసం ఎన్నో ఏళ్లుగా ఎదురు చూస్తూ కూర్చొని వున్నానని
నీకు చెప్పెయ్యాలని అనిపిస్తుంది
ఈరోజు
కోటి పువ్వులు ఒక్కసారిగా వికసించినట్లుందని
వేల సీతాకోకచిలుకలు ఝుమ్మని రెక్కలు విప్పార్చుకున్నట్లుందని
నీకు చెప్పాలని అనిపిస్తుంది
ఒక్కొక్కటిగా నేల రాలుతున్న ఆకుల చిరు సవ్వడి మనమధ్య!
గొంతు పెగలని ఈ సంధిగ్ధావస్థలో నా ఒడిలోకి చేరిన ఎర్రని ఆకుని
చేతిలోకి తీసుకుంటున్నప్పుడే తెలిసిపోయింది
నువ్విక్కడే వున్నావనీ,కానీ
నువ్వింకా రాలేదని.
నింగికెగసిన కోట్లాది బిగిపిడికిళ్లతో కలిసి నా హృదయం
హోరెత్తుతున్న ఈవేళ
అగాధానికి అంచున ఇంకా దేనికోసమో వెతుక్కుంటున్న నీకోసం
నేనిక ఇక్కడే వేచి ఉండలేను
కలుద్దాం
మళ్లెప్పుడైనా, ఇంకెక్కడైనా
సమస్త జీవం కాసింతైనా శాంతితో జీవించేందుకు
నీ పిడికిలీ బిగుసుకున్నప్పుడు

చిలక పచ్చ డిజైనర్ చీర

- సుజాత వేల్పూరి

"ఎంత బాగుందో ఈ రంగు. ఎవురిది ఉస్సేన్ అన్నా ఇది? ఇంత ఖర్చు పెట్టి చేపిస్తుండారే?' చీరను తడిమి చూసింది రమణ. మెత్తని టెక్స్చర్, కనీ కనిపించని సన్నని మెరుపు. ఆ చీర ఎంత ఖరీదో చెప్పేస్తున్నాయి.

హుస్సేన్ నవ్వాడు. అలాటి చీరలు అతని చేతిమీదుగా కొన్ని వేలు రక రకాల పని తనాలు నింపుకుని కళ కళ లాడే పెళ్ళి కూతుళ్లలా తరలి పోయాయి. ఒక్కో చీరా అతని చేతుల నుంచి బయటికి వెళ్ళేపోయేటపుడు, ఒక్క చిన్న నిట్టూర్పు వచ్చేది మొదట్లో.

అతని వయసు అరవై పైనే ఇప్పుడు. ఇప్పుడా నిట్టూర్పులేవీ లేవు. యాంత్రికంగా పని పూర్తి చేసి చీర మడత పెట్టి ఇచ్చేస్తాడు.

"అనా, చెప్పు, ఈ చీర ఎంతవుద్ది?" గుప్పిట్లో ఇమిడిపోతున్న ఆ చీర మృదుత్వాన్ని అనుభవిస్తూ చెంపకు ఆనించుకుంది.

"ఎంతైతే ఏముంది రవణమ్మా, మనం కొనేదీ, కట్టేదీ కాదు. ఎవురి దో పెళ్ళి కూతురిది. మన మేడంకి ఆర్డర్ ఇచ్చారు. ఈ డిజైన్ చేసే దానికే పది రోజులు పట్టింది. "

చీరను నెమ్మదిగా వదిలి పెట్టి ఫ్రేమ్ ముందు కూచుని కుందన్లు సూదిలోకి ఎక్కించే పనిలో పడింది. అలాంటి చీరను కట్టుకునే అదృష్టం, అవకాశం తన చిన్న జీవితంలో ఎన్నటికీ రాదు. చిన్నప్పుడే తెలుసు తనకి. నాల్గు వేళ్ళూ నోట్లోకి పోతే ఆ రోజుకి అదే గొప్ప. ఇంటర్మీడియట్ చదువుతుండగానే ఇకపై చదవడం కుదరదని అర్థమైంది.

చదువు మానేసి రైస్ మిల్లులోకి పోవలసి వచ్చింది. రోజూ కాలేజీకి పోయే దార్లో కనపడే రైస్ మిల్లులో తలకి గుడ్డ చుట్టుకుని పొట్టు బస్తాలు మొయ్యడం,బియ్యం బస్తాలకెత్తడం లాటి పన్లు చేయవలసి వచ్చింది.

సుబ్బారావ్ ని పెళ్ళి చేసుకున్నాక,జీవితం కొన్నాళ్ళు గాడిలో పడ్డట్టే కనపడ్డా, అతని అనారోగ్యంతో ఉద్యోగం పోగొట్టుకున్నాక అర్థమైంది, రెక్కల కష్టం లేనిదే తన జీవితం వెళ్ళమారదని.

కొన్నేళ్ళు ఆ పనీ ఈ పనీ చేసాక, భవాని ఇంట్లో మంచంలో ఉన్న ఆవిడ అత్తగారికి కేర్ టేకర్ గా చేరింది. జీతం బాగానే ఇచ్చేది. భోజనం కూడా అక్కడే. కొంత వెసులుబాటు దొరికింది. కింద ఫ్లోర్ లోనే భవాని బొటిక్. ముసలావిడ నిద్ర పోతున్నపుడు కిందకు వచ్చి ఆసక్తి గా ఆ పనులన్నీ చూసేది. కొన్నాళ్ళకి ముసలామె చనిపోయింది. "ఇంట్లో పనులు చేస్తావా ఇక్కడే?" అడిగింది భవాని

"చేస్తా మేడమ్, కానీ బొటికి లో జరీ పని కూడా నేర్చుకుంటా. జర్దోసీ, కుందన్ వర్క్" కొంచెం సంకోచపడింది చెప్పడానికి.

భవాని ఆశ్చర్యపడలేదు. పనిలో పెట్టింది. మధ్యాహ్నం వరకూ ఇంటి పనులు చూసి, సాయంత్రం వరకూ మగ్గం వర్క్ నేర్చుకోవడం మొదలు పెట్టింది రమణ. ఇద్దరు పిల్లలు, భర్త అనారోగ్యం వీటితో నెట్టుకొస్తూనే పని నేర్చుకుంది.

సంపాదించింది మొత్తం మందులకీ ఇంటి ఖర్చుకీ బొటాబొటిగా సరిపోయేది.

మంచి చీర కట్టుకుని, బారెడు జుట్టు దువ్వి జడేసుకుని కనకాంబరాలు పెట్టుకుని రోడ్డు వెంట రేపటి గురించిన ఆలోచన లేకుండా హాయిగా నడవాలని, దార్లో అంజమ్మ ఫాన్సీ కొట్టు దగ్గర ఆగి కొత్త కొత్త గాజులు బేరం చేయాలని రమణకి మనసులో చిన్న కోరిక. కోరిక చిన్నదే అయినా, రమణ కి అది చాలా పెద్దదే

★★★

మగ్గానికి బిగించి ఉన్న చీరను చూస్తుంటే రమణ మనసులో ఆందోళన పెరిగి పోతోంది. ఎప్పటి నుంచో మంచి నాణ్యత గల ఆకుపచ్చని చీర కొనుక్కోవాలనుకుంటుంది. కానీ నాణ్యం కాదు కదా, మామూలుది కూడా కొన్లేక పోయింది.

పమిటంచు మీద నెమళ్ళ డిజైన్ వేసింది భవాని. అంచు వెంట సూదిని కిందకు దించి పైకి లాగి, ఒక చుట్టు తిప్పి, ముత్యం ఎక్కించి పువ్వు కుడుతోంది.

"అనా, ఇయి నిజంగా ముత్యాలేనా ?పూసలా?"

" ఎహె..నిజం ముత్యాలే. వాళ్ళే తెప్పించుకున్నారంట యాడ

నుంచో. సరే గానీ ఆ పని వొదిలి, ఇదిగో ఈ జాకీటు వైపు, మామిడి పిందెలే శాను. ఈటికి ఈ ముత్యాలు కుట్టు. ఇటేపు రా" మగ్గం మీద నుంచి దృష్టి మరల్చకుండానే అన్నాడు హుసేన్.

నున్నగా మెరుస్తున్న ముత్యాలు చిన్న బౌల్ లో పోసి తీసుకుంటూ "ఇట్టాటి చీర , జర్దోసీ పని చేసింది.. కట్టుకోవాల ఎప్పటికైనా 'గొణుక్కుంది

హుసేన్ మొహంలోకి నవ్వు చేరింది. తనకీ ఇట్టాటి కోరికలే ఉన్నాయి. కూతురు పెళ్ళికి తన చేత్తో వర్క్ చేసిన ఖరీదైన చీర ఇవ్వాలని. కనీసం పాతిక వేలవుతుంది. కుదరదని తెలుసు కాబట్టి చార్మినార్ పోయి చెమికీ పూల తీసుకొచ్చారు చవకలో. దాని మీదే నాలుగు పూలు కుట్టి ఇస్తే..పిచ్చిది, అది చూసే ఎంత సంబర పడిందో. రమణ గొణుగుడు మీద తన తీర్పేమీ ఇవ్వక, "పని చూడు, తొందరగా ఇచ్చేయాల ఈ చీర" అన్నాడు

★★★

నవారు మంచం మీద బొంత పర్చుకుని వాలింది రమణ. వేసవి రాత్రులు. చల్లగాలి తిరిగింది. అందరూ నిద్రలకు పడ్డారు. రమణ కళ్ల ముందు మగ్గం మీద బిగించిన ఆకుపచ్చని చీరే మెదులుతోంది. తను ఇచ్చిన చీర కట్టుకుని వెళ్తే భవాని ఎగాదిగా చూసి "ఎంత బాగున్నావు రమణా ఈ చీరలో. నీ రంగుకి ఈ చీర బాగా నప్పింది."అంది మొన్నా మధ్య. అందరూ అదే అంటారు.

"మీ అమ్మ అందమేనే రమణా నీది. కారం మెతుకులు తిన్నా అయి నీ ఒంటికి వెన్న పూసల్లే పడతై చూడు. నీడపట్టు పని గదా ఇపుడు. బాగా రంగు తేలావు."అంటాది సంపూర్ణం పిన్నాం.

కాస్త మంచి చీర కట్టుకున్న రోజు ఎవరో ఒకరు "బాగుండావే రమణా"అంటే ఇస్టంగా వినాలనిపిస్తది.

పెళ్ళయిన మర్నాడు చవకదే అయినా, గులాబి రంగు షిఫాన్ చీర కట్టుకుని "గుడికెళ్దామా" అని మొగుడి ముందుకు వెళ్తే " సరే గానీ, ఇంగ రెండు రోజులాగి పన్లోకి పో. ఊరకే డబ్బులెందుకు పోగొట్టుకునేది? " అన్నాడు. అప్పట్లో తనూ సంపాదించే వాడు ఎంతో కొంత. ఇపుడు అదీ లేదు. నిట్టూర్చింది.చిలక పచ్చ సిల్క్ చీర మీద తనే జర్దోసీ పూలు కుట్టినట్టూ, ఆ చీర కట్టుకుని మంగళ గిరి పానకాల స్వామి గుడికేళ్తే, అందరూ తన్నే చూసినట్టూ, " యాడ డిజైన్ చేయించారండీ రవణా గారూ?" అని అడిగితే "ఇటీజ్ మై వర్క్. నేనే చేశాను" అని తను స్టైలు గా చెప్పినట్టూ, " ఇంత బాగుండారే మీరు" అని అందరూ అంటున్నట్టూ తీయని ఊహలతో నిద్రలోకి జారిన రమణ మీద పక్కింటి పున్నాగ చెట్టు ప్రేమగా నాలుగు సన్నాయి పూలు రాల్చింది.

★★★

"ఏంటి? అలాటి చీరా? ఆ చీర ఎంతనుకుంటున్నావు?' హాంగర్లకు తగిలించిన డిజైనర్ డ్రెస్ లను సర్దుతూ, ఇటు తిరిగింది భవాని.

"అచ్చం అట్టాంటిదే కాక పోయినా, కాస్త తక్కువలో అయినా సరే, సీర కొని, డీజైన్ మీరేస్తే, వర్క్ నేనే చేసుకుంటా" కొంచెం తలొంచి చెప్పింది.

భవాని మాట్లాడలేదు.సాలోచనగా చూసిందంతే. సాయంత్రం బయలు దేరుతూ మగ్గం మీద, అలంకరణ పూర్తి చేసుకుని అందంగా తయారైన చీరను తడిమి చూసింది. మేలి ముత్యాలు, బంగారు జరీ తీగలతో అందంగా మిడిసి పడుతోంది. పెళ్ళి కూతురి ఒంటి మీద మెరిసేందుకు సిద్ధమైంది. భవాని ఆ గదిలోకి వచ్చి తృప్తిగా చూసింది.ఒక్క క్షణం ఆగి రమణ వైపు చూసింది

"రవణా, ఎంత చెట్టుకంత గాలి. అంతంత చీరలు నువ్వు కొన గలవా?, వర్క్ చేయించగలవా చెప్పు? ఈ చీర రెండు లక్షలైంది. చీర కాస్త తక్కువ లో తీసుకున్నా, వర్క్ కి కొంత తక్కువేసుకున్నా, అరవై వేలవుద్ది. వెంటనే తయారు కాదు కూడా. మన మగ్గాలు ఎంత బిజీగా ఉన్నాయో చూశావు గా? కనీసం నాలుగైదు నెలలు పడద్ది చీర నీ చేతికి రావాలంటే" ఇదంతా రమణ ఎప్పుడో లెక్కలేసేసింది. "తెల్చు"

"తెలిసేనా మరి? అంత ఆశ పడతన్నావ్? ఆలోచించుకో కాస్త తీరిగ్గా" కొంచెం సౌమ్యంగానే అంది, నచ్చజెప్పే ధోరణిలో . నేల చూపులే సమాధానం.

★★★

"ఇదిగో పదేలు. ముందు సీర తెప్పించు మేడమ్. ఎక్కువ పడితే జీతం లోంచి కట్టుకో. కుట్టు పనికి కూడా జీతంలోంచి కట్టుకో పెతి నెలా. ఎట్టగో సర్దుకుంటా. ఆ సీర కట్టుకోవాలమ్మా నేను. రేత్తిరి పూట కూడా తొమ్మిదింటి దాకా సేస్తా పని"

భవాని మొహంలోకి నవ్వొచ్చి చేరింది. ఎంత మొండిది ఈ పిల్ల!

"చస్తావ్ అన్నన్ని గంటలు పని చేస్తే"

"సచ్చినా సరే, ఈ సీర కట్టుకోవాల్సిందేనమ్మోవ్. ఎట్టైనా సరే, సేపిచ్చుకుంటా"

★★★

పొద్దున్నే ఆరింటికల్లా ఇంటి పన్లు ముగించి, రెండు స్టూడెంట్స్ మెస్సుల్లో గిన్నెలు తోమే పని ఒప్పుకుంది. పాత సల్వార్ వేసుకుని, చీర బాగ్ లో పెట్టుకుని వెళుతుంది పనికి. పని అయ్యాక చీర కట్టుకుని బొటిక్ కి ! పని ఎక్కువై శరీరం అలసి పోతున్నా సరే, చిలక పచ్చ జరీ పూల చీరను కళ్ళ ముందు నిలుపుకుని ఓపిక తెచ్చుకుంటుంది. మరో రెణ్ణెల్లకి రమణ డబ్బుతో భవాని చిలక పచ్చ రంగు సిల్క్ చీర తెప్పించింది. చీరను ముట్టుకుని మురిసిపోయింది రవణ. మేడం డిజైన్ సెలెక్ట్ చేశాక, సొంతంగా తనే కుడతాది పూలు దీని మీద. కాస్త కష్టవైన పమిటంచు మీద ఉసేన్ అన్న చేత చేయిస్తాది. చీర మొత్తం తయారయ్యాక ఎంత బాగుంటదో ఏందో! తల్చుకుంటేనే నే మైమరపుగా ఉండాది.

"తొందర పడితే కుదర్దు రవణా. మన మగ్గాలన్నీ ఎంత బిజీగా ఉన్నయో చూశావు గా. కాళీ ఉన్నపుడు చెప్తా. అప్పుడు బిగిద్దాం చీరని" ఖరాఖండి గా చెప్పేసింది భవాని

★★★

మూడు నెలలు గడిచాయి, ఎడతెరిపి లేని చాకిరీ తో చిక్కి శల్యమై పోయింది. ఎంత లేదన్నా, చీర, వర్క్ మొత్తం కలిపి 40 వేలవుతుంది

ఇంటి ఖర్చులు, మొగుడి మందులు, పిల్లల స్కూలు ఖర్చులు ఇవన్నీ పోను ఎంత జాగ్రత్త గా దాచినా చాలట్లేదు.

చీర మీద పని మొదలైంది. చక్కని జరీ పూల అంచు, చీర మీద బుటా తో డిజైన్ చేసింది భవాని. ఆ చీర తయారయ్యాక ఎలా ఉంటుందో ఊహించుకుంటేనే రమణ మొహాన నవ్వులు పూస్తున్నాయి. వారం రోజుల పాటు జ్వర పడి లేచింది. ఒంటి మీద మునుపటి నునుపు దనం లేదు. కళ్ళ కింద నల్ల చారలు పరుచుకున్నాయి. బొటిక్ లో పని పూర్తయ్యాక తన చీర మీద సాయంత్రాలు ఉండి పని చేస్తోంది. జాకెట్ మీద వర్క్ తయారైంది. చీర మీద పువ్వుల్లో కుందన్లు అమర్చే పని నడుస్తోంది. అద్దంలో మొహం చూసుకుని గబ గబా సబ్బుతో రుద్ది కడుక్కుని పౌడరేసుకుని బొట్టు దిద్దుకుంది కళ్ళ కింద కాస్త ఎక్కువగా అద్దుకుంది.. జుట్టు గట్టిగా దువ్వి బిగించి పోనీ టెయిల్ వేసుకుని, పమిట పొందిగ్గా మడతలు సర్దుకుని వేసుకుంది. భవాని ఇంటి బాల్కనీ లోంచి ఒక గులాబి పువ్వు తెంచి తల్లో పెట్టుకుంది

"కుసింత సిక్కి పొయ్యాను. అంతే గానీ నాకేంది? సూపర్ గా ఉండాను. నా ఒంటి మీద ఆ సీర ఇంకా సూపర్ గా ఉండిద్ది సూడు" అద్దం ముందు నిలబడి తనతో మాట్లాడింది. ఉషారుగా వచ్చి పనిలో పడింది.

★★★

"ఒంట్లో రక్తం లేదు. నీకొచ్చి తగ్గింది మామూలు జొరం కాదు. టైఫాయిడు. అది తెల్సుకోకుండా మందుల కొట్లో మందులు తెచ్చి యేసుకుంటే ఇట్లానే ఉంటది. కనీసం పది రోజులు ఇంట్లో ఉండు. పనికి పోవాకు. నెల రోజులు మదులేసుకోవాలి. పాలు, పండ్లు తినాలి. ఈ పరీక్షలు చేయించుకోని రేపు రా. బయట నర్సు కి చెప్పు. రక్తం తీసుకుంటది"

"ఎంతైద్ది డాట్రు గారూ టెస్టులకి?" సుడిగాలి ప్రశ్న

"టెస్టులకి మొత్తం ఆరువేలయిద్ది. ముందు ఈ మందులు తీసుకో. రెండు వేలవతాయి. టెస్టులయ్యాక ఇంకా మందులు రాస్తారు. నువ్వు రోజూ కోడి గుడ్లు తినాలంట. " నర్సు చదువుకుంటూ పోతోంది.

రమణ గబ గబా లెక్కలేస్తోంది. 'చీరకి ఇంకా పన్నెండు వేలు కట్టాలి. పది రోజుల్లో శ్రావణ మాసం లో ఆ చీర కట్టుకోని, రామలక్ష్మి వొదిన కూతురి పెళ్ళికి పోవాలి తను. "రవణ కి ఈ చీర ఎంత బాగుందో. ఏమే రవణా, ఎంతయిందే ఈ చీర? నువ్వే కుట్టావా ఇయ్యన్నీ? ఎంతైనా నీది కళ గల్ల మొహం " అని అందరూ అనాలి. జీవితంలో మొదటి సారి ఇంత కష్ట పడి సొంతంగా తను కోరుకున్న చీర తయారు చేసుకుంది. ఎప్పుడూ ఇంటికి, మొగుడికి, పిల్లలకి తప్ప తనకంటూ ఏదీ కావాలని అనుకోలేదు. 'ఛ,మొగుడికి, పిల్లలకు ఖర్చు పెట్టింది కూడా లెక్కలేస్తోందేంటి తను. నీకు బుద్ది లేదే రవణా" తిట్టుకుంది.

"టెస్టులు చేపిచ్చుకుంటావా ఇపుడే" అడుగుతోంది నర్సు

"రేపొస్తా. ఇప్పుడు డబ్బుల్లేవు" చెప్పేసి బయట పడింది. మందులు, టెస్టులు ఇవన్నీ తన వల్ల కాదు. చీర పూర్తి కావాలి. హోటళ్ల వాళ్ళు డబ్బులు ఇస్తారివాళ. అవి భవాని మేడమ్ కి కట్టాలి. "ట్యూషన్ పెట్టిచ్చుకోక పోతే కష్టం అమా, లెక్కలు, ఫిజిక్స్.. ఈ రెంటికీ మూడు నెల్లైనా చెప్పిచ్చుకోవాలి. రామా రావు మాష్టారు మూడు నెల్లకి 20 వేలిస్తే రెండూ చెప్తానన్నారు. మిగతా వాళ్ల దగ్గర ఒక్కో సబ్జెక్ట్ కి నెలకి పది వేలు తీసుకుంటున్నారు" సాయంత్రం కాలేజీ నుంచి వస్తూనే చెప్పింది కూతురు. నెత్తిన మరో రాయి పడింది. లేవబోయిందల్లా కాసేపు అలాగే పడుకుంది. మొగుడు బయట ఎవరితోనో నవ్వుతూ గోల గోల గా మాట్లాడుతున్నాడు. ఒళ్ళు మండి పోయింది. ఇంట్లో ఉండి చేసే తేలిక పనులైనా చెయ్యడు. సాయంత్రం తను వచ్చే తలికి తిన్న కంచం బయట గాబు దగ్గరైనా పడెయ్యడు. ఒంట్లో బాలేదనే వొంకతో ఇంట్లోనే కూచుని, "అయి తీస్కరా ఇయి తీస్కరా" అని ఆర్డర్లు వేయడం మాత్రం రెడీ. కోపం దుఖంగా మారింది. కళ్ళు తుడుచుకుని లేచింది.

★★★

"రవణా, నీ కో ఆఫర్ వచ్చింది. చెప్పనా? నమ్మలేవు అసలు. మంచి లాభం". భవాని మాటలు అర్థం కాలేదు.

"ఆఫరా? ఏంది మేడమ్?" కొత్త జరీ దారాల డబ్బా తీసింది.

"నిన్న చీర డిజైన్ చేయించుకునే దానికి వచ్చిందొకామె. మన వర్క్ షాప్ చూస్తానంటే రమ్మన్నాను లోపలికి. నీ చీర బాగా నచ్చింది వాళ్లకి. వాళ్లమ్మాయి కి నచ్చే రంగంట. మొత్తం వర్క్ అంతా పూర్తయి పోయింది గదా? నువ్వు ఇస్తానంటే డబ్బులిచ్చి తీసుకుంటానంది".

"నా చీరా? నా చీర నేనెందుకిస్తాను. అంత కష్టపడి నా కోసం చేసుకున్న చీర గదా మేడమ్. ఇంకోసారి మళ్ళా ఇట్టాంటి చీర కట్టుకుంటానో లేదో తెలవదు.

"చీర చాలా చక్కగా వచ్చింది రవణా. మొత్తం కలిపి నీకు 30 వేలు కూడా పడలేదు. చీర ఖరీదు తప్ప మనం పెట్టిందేముంది? నిన్న వచ్చినామె మేయర్ కోడలట. ఈ రంగూ, నెమళ్ల డిజైనూ చూసి చాలా ముచ్చట పడింది. లక్ష రూపాయలవుతుందని చెప్పాను. వెంటనే ఒప్పుకుంది "

"లక్షా?" నోరు తెరిచింది రమణ.

"అవును. నీ వర్క్ కి ఎంతయినా ఇయ్యడానికి రెడీ అయిందామె. వాళ్లాయనకి ఈ చిలక పచ్చ అంటే చాలా ఇష్టమట. ఇంకో ఇరవై వేలిమ్మన్నా ఇస్తది, ఏం పర్లేదు. అన్ని డబ్బులుంటే మళ్ళీ ఇలాటి చీర డిజైన్ చేసుకోవచ్చు."

నమ్మలేక పోతోంది. లక్ష రూపాయలు! "అమ్మా, లెక్కలూ, ఫిజిక్సూ కలిపి 20 వేలకే ట్యూషన్ చెప్తానన్నాడు మాష్టారు" కూతురు గుర్తొచ్చింది. "టెస్టులు మొత్తం ఆరు వేలవుతాయి. పండ్లు తినాల నువ్వు." కౌంటర్ లో నర్సు. ఈ నెల డబ్బులు చాలక మొగుడికి రెండు రకాల మందులే కొన్నది. మూడో రకం ఒక నెల ఆగచ్చు అన్నాడు డాక్టరు. లక్ష రూపాయలు. ఎప్పుడైనా అనుకుందా కళ్ళ చూస్తానని? 500 రూపాయల నోట్లు ఇస్తుందా? 50 వేల కట్టలు రెండు ఇస్తుందేమో? ఇన్ని అవసరాలు కళ్ళ ముందు పెట్టుకోని, ఇప్పుడు తను చిలకాకు పచ్చ చీర కట్టుకోని పెళ్ళికి పోక పోతే ఏమంట?

పిల్ల చదువుకంటే ముఖ్యమా? బాగా చదువుద్ది అని చెప్పాడు గా మొన్న మాష్టారు?

తల పగిలిపోయేలా ఉంది. పని తనంతో చీరకు ఎంత ఖరీదు వచ్చి పడిందో. లక్ష రూపాయలు తీసుకుని ఇచ్చేస్తే ? పిల్లని ట్యూషన్ లో పెట్టొచ్చు. తనకి మందులనీ, టెస్టులనీ.. చాలా అవుతై గదా, పనికొస్తై .."

మొగుడు ఇంట్లోకొచ్చాడు. " అమ్మాయి ప్రవేట్లో చేరతానంటుంది. చెప్పిందా నీకు?" అన్నాడు

నీరసంగా పక్కకి తిరిగింది. "చెప్పింది. డబ్బులేయి?యాడ నుంచి తెస్తాం ఇరవై వేలంటే?"

"అందుకని? అది సదూకుంటానంటే వొద్దంటావా? ఎట్టనో ఒక రకంగా తేవాల. పిల్ల సదువు కంటే ఎక్కువా? పొద్దున్నే పోయి హోటల్లో కూడా పని చేస్తన్నావ్ గావాల గా? ఏం చేస్తన్నావ్ డబ్బులన్నీ?" ఆరా తీశాడు.

ఒక్క క్షణం పట్టలేని దుఖం వచ్చింది. గుండెల్లో సుడులు తిరిగి పోతోంది.

సాధారణంగా రమణ ఏడవదు. "తప్పని పన్లకు ఏడుస్తూ

కూచోవడం అసయంగా ఉంటది " అనుకుంటుంది. రెక్కల కష్టం అలుసై పోయి, ప్రశ్నలు ఎదుర్కొని, లెక్కలు చెప్పాల్సి వస్తుంటే, శారీరకంగా బలహీనమై పోయి ఉన్న క్షణాన చప్పున దుఖాన్ని కౌగిలించుకుంది

"సెప్పవేంటి? ఎగస్ట్రా డబ్బులు వొస్తున్నై గదా, ఏం చేస్తన్నా?" రెట్టించాడు

పెళ్ళయిన ఏడాది నుంచీ, ఊపిరి తిత్తుల జబ్బునీ, బలహీనమనీ ఏదో ఒకటి చెప్పి,పని కి పోవడం మానేసి ఇంట్లో కూచుంటాడు.

"రోజంతా చెట్టు కింద కిళ్ళీ బడ్డీ దగ్గర పనికిమాలిన బాతాఖానీ ఏసే దానికి, ఎక్కడ లేని ఓపికా వస్తది నీకు" అనాలనుకుని మానేసింది.

ఏళ్ళ తరబడి రోగం పేరుతో కూచుని తినడం అలవాటైన మనిషి, ఇవాళ తన డబ్బు లెక్కలు అడుగుతున్నాడు.

""సిట్టీలేవైనా ఏస్తన్నావా ఏంది? ముందు పిల్లకు ఫీజు కట్టు. నీ సిట్టీలూ అయ్యా తరవాత" వార్నింగ్ ఇచ్చాడు.

★★★

చిలక పచ్చ రంగు మీద, చంద్రకాంతం, నెమలి కంఠం రంగుల్లో పువ్వులు, మిల మిల లాడుతున్నాయి. పమిట చెంగున కుట్టిన నెమళ్ళు పించాలు ఆరబోసి, నేలకి దిగి వస్తాయేమో అన్నట్టు జీవం తో తొణికిస లాడుతున్నాయి. జాకెట్ గుడ్డ అంచులకు కుట్టుకోమని భవాని ముత్యాలు ఇచ్చింది.

"జాకెట్ కట్ చేయించనా మరి? ఆలోచించుకున్నావు గా? "

స్థిరంగా తలూపింది రమణ. "ఆ, ఆలోసించుకున్నా. ఎవరికీ అమ్మను మేడమ్ చీర. నేనే కట్టుకుంటా"

భవాని ప్రేమగా నవ్వింది .

"సరే, ఈ జాకెట్ నేనే కట్ చేస్తా ఉండు. అందంగా రావాలి మరి"

రమణ ఎన్నో సార్లు, అత్యవసర సమయాల్లో అర్ధ రాత్రులు కూడా ఉండి, అర్జెంట్ ఆర్డర్ల డెలివరీ కి ఎంతో సహాయ పడింది. ఒళ్ళు దాచుకోదు. ఎన్ని కష్టాలు ఎదురైనా జీవితం మీద ఫిర్యాదు చెయ్యని రమణ తత్వం ఎన్నో సార్లు ఆశ్చర్యాన్ని కల్గిస్తుంది తనకి. అంతటి యాక్సెప్టెన్స్ ఎక్కడ నుంచి వస్తుందో తనకి!!

"రెండు రోజుల్లో జాకెట్ కుట్టించి ఇస్తాను. చీర కట్టుకుని పెళ్ళికి వెళ్ళు. టెస్టులవీ చేయించుకోవాలని డాక్టర్ చెప్పాడంటగా? ఏం పర్లేదు. నేను డబ్బులు కడతాను. పోయి చేయించుకో. పెళ్ళిళ్ళ సీజన్ అయిపోవచ్చింది కదా. మనకి ఖాళీ ఉంటది. ఒక రెండు మూడు వారాలు ఇంట్లో ఉండి మందులేసుకోని, తిని పడుకో.. నీ సంతోషం కోసం నువ్వు బతికింది నేను ఇంతవరకూ చూడలేదు. ఇన్నేళ్ళలో ఈ చీర ఒక్కటే నువ్వు కోరుకుంది. కట్టుకో. సంతోషంగా కట్టుకో." భవాని రమణ భుజం మీద చెయ్యేసింది

రాలబోయిన కంటి చివరి చుక్కను ఆపేసింది రవణ

★★★

"ఏందే రవణా ఇట్ట సిక్కి పొయ్యావు? అయ్యో, ఆ రంగేది? మొహం చూడు ఎట్ట పీక్కు పోయిందో. డాట్రు కాడ సూపిచ్చుకున్నావా? బొవికలు తేలి, ఇట్ట పిశాచి మొహం పడిందేందే? అయ్యో, పిల్ల ఎట్ట పాడై పోయిందమ్మా. ఇంత సక్కని చీర కట్టినావు గానీ, మొహంలో కళేదీ?" పెళ్ళి లో కనపడ్డ నలుగురైదుగురూ ఇదే మాట. చిన్నబోయింది రవణ మొహం. ఒక్కరు కూడా ఈ చీర నీకు బాగుందనలేదు. చీర మోజులో ఆరోగ్యం నిర్లక్ష్యం చేశానా అనుకుంది మొదటి సారి. “ఎంత బాగుందే రవణా నీ సీర? వామ్మో, బాగా డబ్బున్నోళ్ళ సీర లాగే కుట్టుకున్నావే? బాగా సిక్కి పోయావు గానీ, నీ ఒంటి రంగు ఏం తగ్గలా. నీ ఒంటి మీద ఈ సీర ఎంత బాగుందో. దిష్టి తగులిద్ది సూడు ఇయాళ నీకు" వెనక్కి తిరిగింది. ప్రెసిడెంట్ గారి భార్య. "ఎంత బాగున్నావే, లచ్చిందేవి లాగ" బుగ్గలు పుణికింది. చిక్కి పోయిన రవణ బుగ్గల్లో మెరుపులు, మొహంలో నవ్వు పరిగెత్తుకొచ్చాయి .మొగుడి మందులు, పిల్ల ట్యూషన్ ఫీజు.. ఇవన్నీ కఠినంగా పక్కన పెట్టి, ఒంటిని చుట్టుకున్న మెత్తని చీరను ప్రేమగా తడిమింది రమణ .

“వెళ్ళేటపుడు అంజమ్మ కొట్లో గాజులు బేరం చెయ్యాల “



పల్లెకు పోదాం!

- శ్యామలాదేవి దశిక

నేపథ్యం: ఇక్కడ పుట్టి అసలుసిసలైన అమెరికా పిల్లగా పెరుగుతున్న మా అమ్మాయిని పెంచడంలో ఎన్నో ఇబ్బందుల్ని ఎదుర్కొన్నా, ఎంతో కష్టమనిపించినా రెండు విషయాల్లో నేను తల్లిగా గర్విస్తూ ఉంటాను! ఒకటి తను చక్కని తెలుగు మాట్లాడ్డం, రెండోది 1988 లో తొమ్మిదేళ్ళ వయసులో ఒక్కతే ఇండియా ప్రయాణం చేసి ఎటువంటి సౌకర్యాలు లేని మావూరు వెళ్ళి అక్కడ ఉండటం! అప్పటినుంచీ తరచూ ఇండియా వెళ్తూ అక్కడి బంధుప్రేమను, చిన్నిచిన్ని సరదాలను మొన్నమొన్నటి వరకు ఎంజాయ్ చేస్తూ వచ్చింది! అయిదేళ్ళ క్రితం ముత్తమ్మమ్మ-ముత్తాతగారింట్లో మా మనవరాళ్ళు అల్లరిచేస్తూ.. ఆటలాడుతూ... పరుగులు పెడుతున్నప్పుడు నా మనసులోనుంచి పుట్టుకొచ్చిన ముచ్చటే ఈ పల్లెకు పోదాం!

తండ్రీ , కూతురు కలిసి ఏమిటో మంతనాలు ఆడుతున్నారు! అది చెప్పిన దానికన్నింటికీ మీరు తలాడిస్తున్నారేమిటీ? ఏమిటీ... రేపు మనం ఇండియా వెళ్ళినప్పుడు అందరం కలిసి మా ఊరు వెళ్దాం అంటుందా? దాని పిల్లలకు తన అమ్మమ్మ తాతయ్యల ఊరు, ఆ ఇల్లు చూపించాలా?

ఇప్పుడు మా అమ్మా నాన్నే అక్కడ ఉండటం లేదు. పెద్ద తనంలో ఒక్కరే అక్కడ ఉంటే ఇబ్బంది అవుతుందని నేను, అన్నయ్యా నచ్చచెప్పి ఎలాగో విజయవాడ మారేటట్లు చేసాం. వాళ్ళు ఆ ఊరు వదిలి పదేళ్లు దాటిపోయింది. తొంభై ఏళ్ళ వయసులో ఉన్న మా నాన్నగారిని, ఎనభై ఐదేళ్ళ అమ్మను తీసుకుని అందరం అక్కడికి వెళ్ళి ఆ ఇంట్లో సరదాగా నాలుగు రోజులు గడపాలని దాని కోరికా? ఈ గెట్ టుగెదర్ గురించి వాళ్ళ మామయ్యతో వివరంగా అంతా మాట్లాడేసుకుందా? ఇందుకోసం గోపీ అన్నయ్య ఆ ఇల్లంతా శుభ్రం చేయించి, రంగులు వేయిస్తున్నాడా? అవున్లేండి... మన సుమ సంగతి మనకంటే మా అన్నయ్యకే బాగా తెలుసు!

అసలు మీ అమ్మాయి ఆంధ్రదేశంలో పుట్టాల్సిన పిల్ల...పొరపాటున అమెరికాలో పుట్టింది! ఆ రోజుల్లో ఒంటి కాయ శొంఠి కొమ్మల్లే పెరుగుతున్న కూతుర్ని చూసి "ఏమిటో దీనికి మన వాళ్ళు...మన బంధువులు...ఆ ఆప్యాయతలు ఏమి తెలియవు కదా" అంటూ మీరు ఒకటే దిగులు పడుతూ ఉండేవారు. నేను కూడా మొదట్నుంచీ ఉద్యోగం చెయ్యడంతో, పసికందుగా ఉన్నప్పటి నుంచీ బేబీ సిట్టర్లు, డేకేర్ సెంటర్లు, ఆఫ్టర్ స్కూల్ ప్రోగ్రాములు పాపం సుమకి తప్పలేదు.

ఒక ఏడాది అమెరికాలో సమ్మర్ కాంప్ కు బదులుగా ఇండియా పంపిస్తే ఎలా ఉంటుందీ...అన్న ఆలోచన వచ్చి అందరూ మనల్ని భయపెట్టినా, ధైర్యం చేసి ఒక్కదాన్నే పంపించాం. అప్పుడు సుమకు పదేళ్లు. మన ఆలోచనని, మన భయాన్ని అర్థం చేసుకున్న మా అన్నయ్య "సుమని జాగ్రత్తగా చూసుకుంటాం పంపించండి" అంటూ ఉత్తరం రాసాడు. అమ్మాయి ఇండియాలో రెండు నెలలు ఉండాలంటే బాంబే బెటర్ అని..అక్కడైతే దానికి అన్నివిధాలా బావుంటుందని అనుకున్నాం. దానికోసం మా అన్నయ్య ఉన్నంత లో పాపం అన్ని సదుపాయాలు చేసి సుమ ఆక్కడ ఉన్న న్నాళ్ళు దానికి బోర్ కొట్టకుండా ఉండటానికీ...మన మీద బెంగపడి "బేర్" అని ఏడవకుండా ఉండటానికీ ఏవేవో ప్లాన్లు వేసి సిద్ధంగా కూచున్నాడు.

మనం కూడా " గోపీమామయ్యా దగ్గర బుద్ధిగా ఉండాల ని, వాళ్ళింట్లో అవిలేవు.. ఇవిలేవు అంటూ... కంప్లయింట్ చెయ్యకూ డదని, అడ్జస్ట్ అవ్వాలని" ఏవేవో చెప్పి ప్లయిట్ ఎక్కించాం. అది తిరిగి అమెరికా వచ్చేలోపు ఒక్కసారి పల్లెలో ఉంటున్న మా అమ్మా, నాన్నల దగ్గరకు తీసికెళ్ళమని అన్నయ్యకు ఉత్తరంలో రాసాం. సుమ బాంబేలో అడుగుపెట్టటం, అన్నయ్యకు జాబ్ లో ప్రమోషన్ రావడం ఒకేసారి జరిగాయి! తీరుబడిగా తరువాత తీసికెళ్దాంలే అని అనుకున్న అన్నయ్య, ప్రమోషన్ కారణంగా సెలవ పెట్టడానికి కుదురుతుందో లేదో అని వెళ్ళిన వారం రోజులకే ఊరికి ప్రయాణం పెట్టాడు. అక్కడ ఉండే రెండురోజుల భాగ్యానికి పసివాడిని తీసు కెళ్ళి, అవస్థ పడటం ఎందుకని మా వదిన ఇంట్లోనే ఉండి పోయింది. అంత దూరం ఆ రైలు ప్రయాణంలో, ఏ వసతులు లేని ఆ పల్లెటూరిలో ఎంత ఇబ్బంది అవుతుందో...పిల్ల ఎక్కడ సిక్ అవు తుందో అని చాలా భయపడుతూ పాపం నా మాట కాదనలేక సుమని తీసికెళ్ళాడు అన్నయ్య.

ప్రయాణం చేస్తున్నంత సేపు రైల్లో అమ్మే సమోసాలు, కట్లెట్స్, మసాలా వడలు, పప్పుండలు అలా వచ్చినవన్నీ కావాలని మా అన్నయ్యను అడిగిందిట! వాడు " నువ్వు అమెరికా నుంచి తెచ్చుకున్న స్నాక్స్ ఉన్నాయిగా? చక్కగా అవితిను!" అంటే "దీజ్ స్నాక్స్ లుక్ డిఫరెంట్...అయి వాంట్ టు ట్రై దెమ్!" అంటూ వాడ్ని వదిలిపెట్ట లేదుట! సుమ మొదటినుంచి ఏ రెస్టారెంట్ కు వెళ్ళినా కొత్త ఫుడ్ ధైర్యంగా ట్రై చేసేది. విజయవాడ దాకా రైల్లో వెళ్ళి అక్కడ నుంచి కారు చేసుకుని సరాసరి మా ఇంటికి తీసుకెళ్ళాడు సుమని.

మీ అమ్మాయి, లోపలికి అడుగుపెడుతూనే "దిస్ ఈజ్ సో కూల్.. వావ్!" అంటూ.. హాల్లో ఉన్న ఉయ్యాల బల్లమీద కెక్కి ఊగడం మొదలుపెట్టిందిట. ఆ మండువా ఇల్లు....ఆ ఇంట్లో మను షులు...ఆ ఇంట్లో వస్తువులు అన్నీ దానికి వింతగా అనిపించాయి! మా పాలేరు వీరయ్య దొడ్లో బావిలో చాద వేసి నీళ్ళు తోడటం, సూరమ్మ తిరగట్లో కందులు విసిరి పప్పు చెయ్యడం, కొబ్బరి చెట్టు నుంచి బోండాలు దింపించడం --- పనివాళ్ళ కట్టు-బొట్టు అన్నీ దానికి భలేగా, తమాషాగా అనిపించాయిట! ఇంట్లో అమ్మకు సహాయంగా ఉండే పార్వతమ్మగారు దొడ్లో కట్టెల పొయ్యిమీద అరిశలు, జాంగ్రీ, జంతికలు, కారప్పూస చేస్తుంటే ఆవిడ చుట్టూ తిరుగుతూ అవి తయారవుతుంటే కళ్ళింతలు చేసుకుని చూసేదిట! అమ్మమ్మా వాళ్ళింట్లో కుక్ అవుట్ భలేగా ఉంటుంది అంటూ మనకు అక్కడినుంచి ఓ పెద్ద ఉత్తరం రాసింది గుర్తుందా!?

నాన్నతో కలిసి అన్నయ్య పొలాలు చూడ్డానికి వెళ్తుంటే "నేనూ వస్తా" అని వెంటబడి వెళ్ళింది. పొలంలో మంచ మీదకు ఎక్కి, రివ్వున వీచే గాలితో ఆడుకుంటూ ఇంగ్లీషు పాటలు పాడటం మొదలుపెట్టిందిట! ఇక వెళ్దాం రమ్మంటే "కెన్ వుయి స్టే సంమోర్ టైం?" అంటూ వాళ్ళను ఆపేసిందిట.! ఊరికి ఇలా వెళ్ళి, అలా వచ్చేయడం అని అనుకున్న మా అన్నయ్య దీనికోసం ఇంకో వారం రోజులు సెలవ పొడిగించాడు. మనం బాంబే వెళ్ళాలి బయలుదేరు అంటే "నేను రాను. నువ్వెళ్ళు" అన్నదే నీ కూతురు అంటూ ఇప్పటికీ గుర్తుచేసుకుంటాడు మా అన్నయ్య!. "మళ్ళీ వద్దాం.. ఇప్పుడు నాకు ఆఫీస్ లో పని ఉంది" అంటే "అయితే ట్రైన్ లో వద్దు చక్కగా ఈ బండిలో వెళ్దాం" అంటే వాడికి నవ్వాగలేదని అమ్మ ఎప్పుడూ చెప్తుంది! మనం సుమకి బాంబే నచ్చుతుందనుకుంటే దానికి ఆ పక్కా పల్లెటూరు బహు గొప్పగా నచ్చింది! "అమ్మమ్మాస్ హౌస్ ఈజ్ నైస్...షి హాజ్ కూల్ స్టఫ్" అంటూ తిరిగొచ్చి మనకు బోలెడు కబుర్లు చెప్పింది!

ఇక ఆ తర్వాత నుంచీ ప్రతి ఏడాది సమ్మర్ సెలవల్లో హైస్కూల్ అయేంత వరకు ఇండియా వెళ్తూనే ఉంది! అక్కడ ఉన్నప్పుడు అమ్మా వాళ్ళతో అందరి ఇళ్లకు వెళ్ళటం, మన బంధువులందరినీ చూడటం... నెమ్మది నెమ్మదిగా తెలుగు బాగా మాట్లాడటం నేర్చుకుంది. వాళ్ళందరి కోసం ఇక్కడినుంచి మనచేత ఏవేవో గిఫ్టులు కొనిపించుకుని, అక్కడికి పట్టికెళ్తూ ఉండేది. ఇక్కడకొచ్చి మనకు వాళ్ళందరి గురించి చెప్తుండేది. ఒకసారి ప్లయిట్ దిగి కారెక్కగానే "మామయ్యా వాళ్ళ నైబర్స్ బాగా ఉన్నవాళ్ళుట! అక్కడ కౌస్ గార్బేజ్ తింటాయి మామీ! యునో...రఘు అంకుల్ మారేజ్ లో హ్యూజ్ ఫైట్ అయింది తెలుసా! ఇండియాలో అందరి హస్బెండ్స్ పేరు "ఏమండీ" అనే ఉంటుంది డాడీ!" అంటూ లొడలొడా తెలుగులో మాట్లాడుతుంటే ఇద్దరం నోళ్ళుతెరిచాం!

టీనేజ్ లోకి వచ్చాక ఇండియాలో షాపింగ్ చెయ్యడం సుమకు పెద్ద సరదా అయిపోయింది. ఆ రోజుల్లో షాపులోకి వెళ్ళగానే, అందులోనూ అమెరికా నుంచి వచ్చేవాళ్ళకు వాళ్ళు చేసే మర్యాదలు దానికి బాగా నచ్చేవి! ఒక ఏడాది మనమూ సుమతో కలిసి ఇండియా వెళ్ళాం. షాపులోకి వెళ్ళగానే దీన్ని చూసి అందరూ "గుడ్ మార్నిగ్ మేడం!" అంటూ విష్ చెయ్యడం, షాపు మేనేజర్ "అమెరికా మేడం కు "మాజా డ్రింక్" తీసుకురమ్మని" పురమాయిం చడం చూసి మనం ఆశ్చర్య పోయాం! లేటెస్ట డిజైన్స్ లో చుడీదార్ లు, సరికొత్త లంగా-వోణీలు కిందటి రోజే వచ్చాయంటూ గబగబా షెల్ఫ్ లో నుంచి తీసి చూపించటం మొదలు పెట్టాడు. మీ కూతురు తీరుబడిగా ఒక్కొక్కటే చూస్తూ ఈ డిజైన్ ఫలానా రంగులో ఉందా!ఈ కలర్ కాంబినేషన్ ఈ డిజైన్ లో ఉందా అంటూ అసలైన ఆడపిల్ల లాగా సవాలక్ష ప్రశ్నలేస్తూ షాపింగ్ చేసింది. మీరు నావైపు తిరిగి "షాపింగ్ ఎలా చెయ్యాలో సుమని చూసి నేర్చుకో. నువ్వయితే వాళ్ళు ఏది చూపిస్తే అది మాట్లాడకుండా కొంటావు. సుమ చూడు వాళ్ళను ఎలా ముప్పతిప్పలు పెడుతోందో?!" అంటూ కూతుర్ని చూసుకొని మురిసిపోయేవారు!

తీరుబడిగా అన్నీ సెలక్ట్ చేసుకుని వాళ్ళు బిల్లు రాయబోయే టైములో ఇది " మేము చాలా కొన్నాము కదా ఎంత డిస్కౌంట్ ఇస్తారు?" అంటూ బేరం మొదలు పెట్టింది. మనిద్దరం

తెల్లబోయాం! మొత్తానికి వాళ్ళ చేత అమౌన్టు కొంత తగ్గించి మనవైపు చూసి నవ్వుతూ కన్నుకొట్టింది! మనం బయటకొచ్చాక అలా ఎందుకు చేసావు అని కోప్పడితే "జస్ట్ ఫర్ ఫన్! అమెరికాలో ఇలా చెయ్యడానికి చాన్స్ రాదుకదా? అసలు ఇలా బార్గయిన్ చెయ్యకపోతే మనల్ని "ఒట్టి ఈడియట్స్ అనీ.. యోగర్ట్ రైస్ (దద్దోజనానికి వచ్చిన తిప్పలు!) అని అనుకుంటారుట!" రాము అన్నయ్య చెప్పాడు అంటూ క్లాస్ తీసుకుంది!

మనం ఇండియాలో పుట్టి పెరిగినా ఈ దేశం వచ్చాక ఇక్కడి సుఖాలకు, సౌకర్యాలకు బాగా అలవాటుపడి అక్కడకు వెళ్ళినప్పుడు ఇబ్బంది పడేవాళ్ళం. సుమ మాత్రం అక్కడి వాతావరణానికి, పరిస్థితులకు తగినట్టుగా ఉంటూ ఉన్నంతలో హాయిగా గడిపేది! దానికి మనవాళ్ళ ప్రేమ..అక్కడి సరదాలు..ఆ సందడి బాగా నచ్చాయి. అలా పదో ఏట నుంచీ ఇండియా వెళ్తున్న సుమ చూస్తుండగానే పెద్దదై పోవడం, కాలేజీలో చేరడం..మెడిసిన్ పూర్తిచేసి తనతో చదువుకున్న కిశోర్ ని పెళ్ళిచేసుకోవడం..ట్విన్స్ పుట్టి ఒకేసారి ఇద్దరు పిల్లలకి తల్లి అవడం అన్నీ చకచకా జరిగినట్టనిపిస్తుంది!

నలభై ఏళ్ళు దాటిపోయినా నాకు మాత్రం నిన్నకాక మొన్ననే ఆరునెలల పసికందుని ఎత్తుకుని తల్లిదండ్రులుగా మనం ఇండియా వెళ్లినట్టుంటుంది! ఇప్పుడు ఆరేళ్ళ వయసులో ఉన్న మనవరాళ్ళను తీసుకుని అమ్మమ్మా– తాతయ్యలుగా మనం ఇండియా వెళ్తున్నాం అంటే ఆశ్చర్యంగా లేదూ?! మన దివ్య–దీప ఆదిదంపతుల్లాంటి మా అమ్మ–నాన్నగార్లను చూడగలగటం ఎంత భాగ్యమో కదండీ?!!!



ఇప్పటికీ మధుమాసంలో సహకార తరువుల క్రింద పవళించిన వేళ
నా గళాన సౌందర్య మధూళి చిందుతుంది
ఇప్పటికీ దిగులునీరు నిండిన కోటి మనస్సరస్తీరాల నా కవిత
కోరికల కోణాకారపు కొత్త చెట్లను నాటుతుంది
(తిలక్ – అదృష్టాధ్వగమనం)

తెలుగు సాహిత్యం పై పురాణాలయొక్క ప్రభావం

- బాలాంత్రపు వేంకట రమణ

సాహిత్యం అనే పదానికి 'సహితస్యభావః సాహిత్యం' లేదా 'హితేనసహితం సాహిత్యం' అనే నిర్వచనం పెద్దలు చెబుతారు. అనగా హితంతో కూడినది, హితాన్ని చేకూర్చేది అని అర్థం. సమాజానికి మేలుకూర్చేది సాహిత్యం. ఇది ఆ యా జాతినిబట్టి, సంస్కృతిని బట్టి, దేశాన్నిబట్టి, కాలాన్నిబట్టి మారుతూ ఉంటుంది.

అయితే 'విశ్వఃశ్రేయం కావ్యమ్; అన్నారు. సాహిత్యం అనేది సకల శాస్త్ర విషయాలతో కూడినది కూడా అయి ఉంటుంది. ఒక జాతియొక్క సంస్కృతి, సంప్రదాయాలు, నాగరికత భావి తరాలకు అందించేది వాఙ్మయం. వాక్+మయం, వాఙ్మయం అయింది. భాష వాక్కుతో ప్రారంభం అయ్యి, అభివృద్ధి చెంది లిపిరూపం సంతరించుకుంది. ఒక జాతి ఎంత అభివృద్ధి చెందితే, ఎంత నాగరికత సంతరించుకుంటే, ఆ జాతియొక్క భాష తద్వారా దానిలోని సాహిత్యం అంత ఐశ్వర్యవంతమవుతూ ఉంటాయి.

సాహిత్యం వాఙ్మయం, సాహిత్యం, సారస్వతం అనే పదాలు ఒకే అర్థంలో వాడబడుతూ ఉంటాయి. సరస్వతికి సంబంధించినది సారస్వతం. సకల విద్యలకు అధిదేవత సరస్వతి.. సరస్వతి అనగానే వేదాలు, ఉపనిషత్తులు స్ఫురిస్తాయి.

మన వాఙ్మయం – వేదాలు, ఉపనిషత్తులు, శాస్త్రాలనుండి, పురాణాలు, ప్రబంధాలు, ఆధునిక సాహిత్యం, ఇలా పరిణమించింది. వాఙ్మయం, సాహిత్యం, సారస్వతం – ఈ పదాలన్నిటినీ ఒకే అర్థంలో స్వీకరిస్తున్నాం కాబట్టి, వీటన్నిటిమీదా పురాణాల ప్రభావం తప్పక ఉంది అని చెప్పవచ్చును.

వేదోపనిషత్తులు శాస్త్రాలు పితృసంహితలు, పురాణాలు మిత్రసంహితలు. కావ్యాలు కాంతాసంహితలు అన్నారు. అంటే మానవాళియొక్క జీవన విధానాన్నీ, సత్ప్రవర్తనా నియమావళిని వేదాలు తండ్రివలె శాసిస్తూ చెబుతాయి. వాటినే పురాణాలు మిత్రుడిలా లేదా తల్లిలాగా అనునయంగా చెబుతాయి. వాటినే కావ్యాలు ప్రియురాలిలాగా ముద్దారగా చెబుతాయి.

వేదాలు, శాస్త్రాలు సంస్కృతంలో ఉన్నాయి. వాటిలోని సూక్తులను ఋషితుల్యులైన నన్నయాది కవిత్రయము మొదలు కొని, నాచన సోమనాథుడు, శ్రీనాథుడు పోతనాది మహా కవులు ఎందరో భారత భాగవతాది పురాణాలరూపంలో తెలుగు భాషలో మనకి అందించారు. పెద్దనాది మహాకవులు పురాణాలనుండి కొన్ని ఘట్టాలను లేదా ఇతివృత్తాలను తీసుకొని ప్రబంధాల సృష్టించారు. అందుచేత తెలుగు ప్రబంధాలమీద ముందుగా పడినది పురాణాల యొక్క ప్రభావమే అని చెప్పవచ్చును.

తెలుగుభాష అతి పురాతనమైనదని చెప్పబడింది. పోతన భాగవతం నవమస్కందంలో (9-683) వచనము:

"...సుతపునకు బలియుఁ, బుట్టి; రా బలివలన నంగ వంగ కళింగ సింహ పుండ్రాంధ్రులను పేర్లుగలవా రార్వురు కుమారులు పుట్టిరి; వారలు దూర్పు దేశంబులకు రాజులయి దేశంబులకుఁ దమ తమ నామ ధేయంబు లిడి, యేలిరి;

(త్రేతాయుగంలో పరిపాలించిన. యయాతి వంశంలో "సుతపుడనే వానికి బలియు, ఆ బలివలన అంగ, వంగ, కళింగ, సింహ, పుండ్ర, ఆంధ్రులు అను పెర్లుగలవారు ఆరుగురు కుమారులు పుట్టిరి. వారలు తూర్పు దేశములకు రాజులయి ఆ యా దేశాలకు తమ తమ పేర్లు పెట్టి పరిపాలించిరి.) సుమారు 5,200 సంవత్సరాల పూర్వం జరిగిన మహాభారత కురుక్షేత్ర సంగ్రామంలో ఆంధ్రులు దుర్యోధనుడి పక్షాన చేరి యుద్ధం చేసారని వ్యాస భారతంలోనూ, తిక్కన భారతం లోనూ ఉంది.

మధురకవి మధునాపంతుల సత్యనారాయణ శాస్త్రిగారు "ఆంధ్రపురాణం" లో సాతవాహన పర్వంలో హర్షచరితమ్ లోని భట్టబాణుని ఈ క్రింది శ్లోకం పేర్కొన్నారు.

అవినాశిన మగ్రామ్య
మకరోత్ సాతవాహనః
విశుద్ధ జాతిభిః కోశం
రత్నైరివ సుభాషితైః

116

స్వచ్ఛమైన మేలుజాతి రత్నాలతో ధనాగారమును ఏర్పరచినట్లుగా సాతవాహనమహారాజు స్వచ్ఛమైన పదబంధాలతో ఎన్నటికీ నశించ నిది, అనింద్యమైనది అయిన 'గాథాసప్తశతి' అనే కోశమును అనగా కావ్యమును నిర్మించెను అని ఈ శ్లోకార్థం. అంటే తెలుగునేత సాతవాహనుడు భాణభట్టుకంటెకూడ చాలా ప్రాచీనుడు అని ఈ శ్లోకం ద్వారా ఋజువవుతున్నది. తెలుగు భాష బాణభట్టుకంటే ముందు, సాతవాహనునికంటె ముందు పుట్టినది కనుక ఇది అతి ప్రాచీనమైన భాష అనటంలో ఎటువంటి సంశయానికీ తావులేదు అని చెప్పటానికి ఈ శ్లోకం ఉదాహరించారు మధునాపంతుల వారు.

మొదటి తెలుగు రాజులని చెప్పబడిన సాతవాహనులు క్రీస్తుపూర్వం రెండవ శతాబ్దం నుండి క్రీ.శ మూడవ శతాబ్దం వరకూ దక్షిణాపథాన్ని పాలించారు. ప్రాకృత భాషలో రచింపబడిన సాతవాహన రాజైన హాలుని గాథాసప్తశతిలో తెలుగు పదాలు కొల్లలుగా లభించాయి.

ఇక క్రీస్తు శకానికి వస్తే 11వ శతాబ్దంలో రాజరాజ నరేంద్రుని ప్రేరణవల్ల నన్నయ్యగారు ఆదికవియై మహాభారత రచనకు పూనుకొనటంతో తెలుగు భాషకు కావ్యత్వం వచ్చింది. కాని, ఆయనకు ఒక శతాబ్దం పైచిలుకు ప్రాచీనుడు మల్లియరేచన 'కవిజనాశ్రయము' అనే లక్షణ గ్రంథాన్ని మన భాషలో వ్రాశాడు. ఈయనకన్న కొంత ప్రాచీనుడు అయిన ఉద్యోతనుడు అనే ప్రాకృత భాషాకవి 'కువలయమాల' కథలో తన కాలంలో ప్రచారంలో ఉన్న పద్దెనిమిది దేశాలవారినీ, వాళ్ల భాషలనూ పేర్కొన్నాడు. అతడిచ్చిన జాబితాలో ఆంధ్రదేశం, ఆంధ్రభాషా ఉన్నాయి. ఈ ఉద్యోతనుడు క్రీ.శ 892 ప్రాంతం వాడు. అయితే నన్నయగారి ముందు ఎవరైనా వ్రాసిన కావ్యం బయటపడేవరకూ, మనకు ఆదికవి నన్నయగారే అని పండితులు, పరిశోధకులు ఇప్పటికి నిర్ణయించారు. నన్నయగారు అస్తవ్యస్తంగా ఉన్న తెలుగు భాషను సంస్కరించి దానికి కావ్య గౌరవం తెచ్చిపెట్టారు.

పురాణాల ప్రభావం వల్ల దైవభక్తి దానివల్ల పాపభీతి, నైతిక ప్రవర్తన ఏర్పడతాయి. ఆత్మ వత్సర్వ భూతాని అనే భావంతో సర్వ ప్రాణికోటినీ సమతాదృష్టితో చూసే నడవడిక సిద్ధిస్తుంది. ఇవి భక్తి సాధించే సామాజిక ప్రయోజనాలు. ఇవి లేక పోవటం వల్ల నేటి సమాజం అంతకంతకు ఎంత హీనస్థితికి దిగజారిపోతోందో మనంచూస్తూనే ఉన్నాం.

సాహిత్యాన్ని ఉత్తమ, మధ్యమ, అధమ సాహిత్యాలుగా విభజించవచ్చు. పురాణాదులు, కావ్య ప్రబంధాలు ఇత్యాదులు ఉత్తమ సాహిత్యంగా పరిగణించ వచ్చును. ఆధునిక సాహిత్యంలో సాధారణంగా నవలలు, కథలు, కథానికలు వంటివి మధ్యమ సాహిత్యంగా చెప్పుకోవచ్చును. ఇవి ప్రధానంగా పాఠకులకు కాలక్షేపం కలిగించేవిగా ఉంటాయి. అయితే వీటిలో కూడా ఉత్తమశ్రేణికి చెందిన, సామాజికస్పృహ కలిగిన రచనలు, సమాజానికి ఉపయోగించే రచనలూ అడపా తడపా వెలువడుతూనే ఉంటాయి. ఇంక అధమసాహిత్యం క్రింద క్షుద్ర సాహిత్యం, బూతు సాహిత్యం వంటివి వస్తాయి. ఇవి సమాజం లోని కొన్ని వర్గాలను ఆకర్షిస్తాయి. ఈ రెండవసాహిత్యం చదవటంవల్ల నీతినియమాలు, సామాజిక విలువలు క్షీణించిపోతాయి. ఇటువంటి సాహిత్యం పిల్లలు, యువకులు చదివితే కలిగే అనర్థాలు చెప్పలేనివి. సరే, ఈ విషయం ఈ వ్యాస పరిధిలోకి రాదు. పురాణాల ప్రభావ తెలుగు భాషమీద ముందుగా ఎలా వచ్చిందో పరిశీలిద్దాం.

పురాణయుగం

ఆదికవి నన్నయగారు పదకొండవ శతాబ్దిలో ఏ శుభముహూర్తాన మహాభారతాన్ని తెనిగించటానికి పూనుకొన్నాడోగానీ, దాని ప్రభావం ఈ నాటికీ తెలుగు భాషమీద ప్రసరిస్తూనే ఉంది. ఆయన వ్యాస భారతాన్ని యథాతథంగా అనువదించలేదు. భారతాన్ని ఒక స్వతంత్ర ప్రతిపత్తిగా వెలయించాడు. తిక్కన, ఎఱ్ఱాప్రెగడకూడా ఆయన మార్గాన్నే అనుసరించారు..

నన్నయ వ్యాస భారతాన్ని కొనియాడుతూ ఇలా అన్నాడు.

ధర్మతత్త్వజ్ఞులు ధర్మశాస్త్రంబని, యధ్యాత్మవిదులు వేదాంతమనియు

నీతివిచక్షణుల్ నీతిశాస్త్రంబని, కవివృషభులు మహాకావ్యమనియు

లాక్షణికులు సర్వ లక్ష్య సంగ్రహమని, యైతిహాసికు లితిహాస మనియు

పరమ పౌరాణికుల్ బహుపురాణ సముచ్చయంబని మహి గొనియాడుచుండ

వివిధ వేద తత్త్వవేది వేదవ్యాసు
డాది ముని పరాశరాత్మజుండు
విష్ణుసన్నిభుండు విశ్వజనీనమై
పరగుచుండ జేసె భారతంబు!

నన్నయ భారతం ధర్మతత్త్వజ్ఞులచేత ధర్మశాస్త్రమనియు, ఆధ్యాత్మ విదులచేత వేదాంతమనియు, నీతివిచక్షణులచేత నీతిశాస్త్రమ నియు, కవిశ్రేష్ఠులచేత మహాకావ్యమనియు, లాక్షణికులచేత సర్వ లక్ష్యసంగ్రహమనియు, ఐతిహాసికులచేత ఇతిహాసమనియు, గొప్ప పౌరాణికులచేత ఇది బహుపురాణ సమూహమనియు మహిలో కొనియాడబడుచుండగా మహామహుడైన వ్యాసమహర్షి భారతాన్ని విశ్వజనీనమై ప్రకాశించేలాగ భారతాన్ని వ్రాసెను. ఇంతటి గౌరవం వ్యాసభారతంతో బాటు తెలుగు భారతానికి కూడా దక్కిందని ఘంటాపథంగా చెప్పవచ్చును.

ధర్మేచార్థే చ కామే చ మోక్షే చ భరతర్షభ
యదిహాస్తి తదన్యత్ర యన్నేహాస్తి న తత్క్వచిత్

ధర్మార్థ కామ మోక్ష విషయములలో భారతములో ఏది కలదో వేరు గ్రంథములలో కూడా అదే ఉన్నది. ఇందులేనిది మఱిఎందును లేదు అని ఆత్మవిశ్వాసంతో చెప్పుకొన్నాడు నన్నయగారు.

నన్నయ, తిక్కన, ఎఱ్ఱాప్రెగడ ముగ్గురూ కలిసి వ్యాస భారతాన్ని పూర్తి చేశారు. తిక్కన, ఎఱ్ఱాప్రెగడ కూడా నన్నయగారి మార్గంలోనే తమ భారతకావ్య నిర్మాణం చేసి, కవిత్రయముగా ప్రసిద్ధి చెందారు. భరతజాతియొక్క ఆర్షధర్మానికి పట్టుకొమ్మలు రామా యణ మహాభారతాలు. భరతజాతి సంస్కృతి, సంప్రదాయాలు, నాగరీకతా ఈ పురాణాలనాధారంగా చేసికొని ప్రభవిల్లింది. ఈ పురాణాల ప్రాభవం వల్ల సనాతనధర్మం పునరుద్ధరించబడింది. నాటి రంగనాథ రామాయణం, మొల్ల రామాయణం నుండి నేటి విశ్వనాథవారి రామాయణ కల్పవృక్షందాకా ఎన్నో రామాయణాలు భారతీయుల సాహిత్యాన్ని, జీవితాలను ప్రభావితం చేసాయి.

ప్రబంధయుగం

పురాణయుగంతో తెలుగు భాషమీద ప్రారంభమైన పురాణాల ప్రభావం ప్రబంధయుగాలలో కూడా వెల్లివిరిసింది.

ప్రబంధ పరమేశ్వరుడని బిరుదుగంచిన ఎఱ్ఱాప్రెగడ పురాణాలను ప్రబంధాలుగా తీర్చిదిద్దటానికిమార్గం చూపించాడు. నాచన సోమనాథుడు తన 'ఉత్తరహరివంశము"లో పురాణగాథలను కావ్యపద్ధతిలో రచించి అటువంటి రచనకు శ్రీకారం చుట్టి శ్రీనాథుడు, పోతనవంటి మహాకవులకు ఆదర్శప్రాయుడయినాడు. శ్రీనాథుడు కాశీఖండం, భీమేశ్వరపురాణం వంటి పురాణాలను తెనిగించాడు. ఇక తెలుగుజాతి పుణ్యపేటి పోతనామాత్యుడు భాగవత రచనతో సర్వజనుల హృదయాలలో శాశ్వత స్థానం సంపాదించుకొన్నాడు.

అల్లసాని పెద్దనాది కవులు పురాణాలనుండి ఒక ఘట్టాన్ని లేదా చిన్ని ఇతివృత్తాన్ని స్వీకరించి, అష్టాదశవర్ణనలతో, అలంకార భూయిష్టంగా ప్రబంధాలను మలచారు. (ప్రబంధమన్నా, కావ్యమ న్నా ఒకటే అర్థంలో స్వీకరించారు పండితులు.) ప్రబంధాలు సాధార ణంగా శృంగారరస ప్రధానాలు. తెనాలి రామకృష్ణుడు (పాండురంగ మహాత్మ్యము) , ధూర్జటి (శ్రీకాళహస్తి మాహాత్మము) వంటి మహాకవు లు భక్తి ప్రబంధాలు రచించారు.

క్రీ.శ. 1600-1630 ప్రాంతంలో చేమకూర వేంకటకవి రచించిన "విజయ విలాసం" చివరి ప్రబంధం అన్నారు. కానీ ఈ మధ్యకాలంలో కూడా ప్రబంధాలు వెలువడ్డాయి. ఉదాహరణకు ఆచార్య బేతవోలు రామబ్రహ్మం గారి "శ్యమంతకమణి" అనే ప్రబంధం, శ్రీ ఓరుగంటి వేంకట నరసింహంగారి 'ఉషాపరిణయం' పూర్తిగా ప్రాచీన ప్రబంధ లక్షణాలతో ఈ మధ్యనే వెలువడినాయి. అలాగే కొండేపూడి సుబ్బారావుగారి 'హనుమత్ ప్రబంధం' పౌరాణిక శాఖకు చెందిన ఉత్తమకావ్యం. డాక్టర్ మాడుగుల అనిల్ కుమార్ గారి 'గిరిజాకల్యాణం' విశేష వృత్తాలతో ఎక్కువగా నడిపించిన లఘు ప్రబంధం. డాక్టర్ సుంకర వెంకమాంబగారి 'సంధ్యారాగం' శ్రీకృష్ణప్రేమను భావకవితా మార్గంలో ప్రకటించిన మార్మిక కథాకావ్యం. దీనిని శ్రీ రాచకొండ నరసింహ శర్మగారు ఆంగ్లీక రించారు. ఈ విధంగా నేటికి కూడా పురాణాల ప్రభావం ప్రబంధా లమీద కనిపిస్తూనే ఉంది.

ఆధునిక యుగము

పురణాల ప్రభావం ఆధునిక సాహిత్యం మీద కూడా ఉంది. విశ్వనాథ సత్యనారాయణగారు రామాయణ కల్పవృక్షం

వ్రాసారు. పుల్లెల శ్రీరామచంద్రుడుగారు వాల్మీకి రామాయణాన్ని సంపూర్ణంగా వచనంలో వ్రాసారు. ఆచార్య బేతవోలు రామబ్రహ్మం గారు రామాయణం వ్రాసారు. ఆచార్య ఆచంట శ్రీనివాస్ రామాయణం బాలరు, నడివస్కులు, వృద్ధులు ఇలా అందరికీ అవసరమయేలాగ రచించారు. గడియారం వేంకటశేష శాస్త్రిగారు శివభారతం వ్రాసారు. పురాణగాధలు ఖండకావ్య రూపంలో, నవలా రూపంలో చాలానే వెలువడ్డాయి.

ఇంకా ఎందరెందరో రామాయణ భారతాలను, లేదా వాటిలోని పాత్రలగురించీ లేదా ఘట్టాలను వ్రాస్తూనే వున్నారు. ఉదాహరణకుఃఆచార్య అనుమాండ్ల భూమయ్యగారి 'జ్వలిత కౌసల్య'లో ఇతిహాస వస్తువుని స్వీకరించి స్త్రీహృదయ సంవేదనను వ్యక్తపరచిన కావ్యం రచించారు. అలాగే వీరి 'మకర హృదయము' గజేంద్రమోక్షము ఆధారంగా మకరముయొక్క హృదయ వేదనను ఊహాత్మకంగా వర్ణించిన రచన. గొర్లి శ్రీనివాసరావుగారి 'సేతు రహస్యం' అటు పురాణం, ఇటు చరిత్రను కలగలిపి రచించారు.

రాళ్లబండి కవితాప్రసాద్ గారి 'కాదంబిని' త్రిపురసుందరీ స్తుతిగా వచ్చిన లఘుకావ్యం. చామర్తి కృష్ణమూర్తిగారి గుహ రాఘవం, రామాయణకథలోని గుహుని భక్తిని నిసర్గ సుందరంగా వర్ణించిన కావ్యం.

కరణం బాలసుబ్రహ్మణ్య పిళ్లేగారి "విషాద మాధవి" స్త్రీవాద దృక్పథాన్ని నేపథ్యంగా స్వీకరించిన కావ్యం. మహాభారతంలోని మాధవి కథను విస్తరించి పురుషాధిక్య ప్రపంచంలో ఆమె మానాభిమానాలు ఎట్లా మంటగలిసిపోయాయో వర్ణించిన కావ్యం ఇది.

శ్రీ బులుసు వేంకటేశ్వరులు గారు "నీలమోహనం" అనే ఖండకావ్యంలో ఉత్కృష్టమైన భావుకతతో గోపికాకృష్ణుల ప్రణయా నుబంధాన్ని వైవ్యభరితంగా వర్ణించి మన్ననలందుకొన్నారు.

పురాణాలను అపహాస్యం చేయటం, పురాణ పాత్రలను నీచంగా చూపటం కూడా జరిగింది. అందుకు ఉదాహరణలు ముప్పాళ్ల రంగనాయకమ్మగారి రామాయణ విషవృక్షం, యార్లగడ్డ లక్ష్మీప్రసాద్ గారి 'ద్రౌపది'. మన పురాణాలలోని కొన్ని దుష్టపాత్రలపట్ల సానుభూతిని ప్రకటిస్తూ ఖండకావ్యాలు, వచన కవితలు, నవలలు వెలువడుతూనే ఉన్నాయి.

పురాణ పాత్రలలో దుష్టపాత్రలకు పెద్దపీట వేసే రచనలలో చింతకింద శ్రీనివాసరావగారి 'విక్రర్ణ', బెజ్జారపు రవీందర్ 'తాటక' లను పేర్కొన్నవచ్చును. సినిమాలలో కూడా, N.T. రామారావుగారుకూడా ఒకప్రక్క శ్రీరాముడు, శ్రీకృష్ణుడు పాత్రలను వేసి ఆంధ్రుల ఆరాధ్యదైవంగా పేరు పొందుతూనే, రావణాసురుడు, దుర్యోధనుడు, కర్ణుడు, కీచకుడు వంటి పాత్రను అందలం ఎక్కించే ప్రయత్నం చేశారు. ఈ విధంగా మన సినిమాలపై కూడా మన పురాణాల ప్రభావం పడిందని చెప్పవచ్చును.

శతకాలు

క్రీ..శ. పదమూడవ శతాబ్దంలో వెలువడిన బద్దెన విరచిత సుమతీశతకంతో ప్రారంభమైన శతక రచన అవిచ్ఛిన్నంగా నేటికీ కొనసాగుతూ వస్తున్నది. శృంగార, నీతి, సామాజిక వగైరా శతకాలు వెలువడుతున్నాయి. భక్తి శతకాలపేరున వస్తున్న వందలాది శతకాలపై పురాణాల ప్రభావం ఉంటుందని వేరే చెప్పనక్కఅలేదు. ప్రతిదినము ఎక్కడో అక్కడ ఏదో ఒక శతకం నేటికీ వెలువడుతూనే ఉంది. ఈ శతక రచన ప్రాచీనయుగం ఆధునిక యుగం అని తేడాలేకుండా సాగుతూ వస్తున్నది. క్రోడీకరించి లెక్కించడం సాధ్యం కాదు కానీ, ఇప్పటివరకు శతకాలు కొన్ని వేల సంఖ్యలో వెలువడినాయి. వీటిలో సూర్య శతకాలు, వేంకటేశ్వర శతకాలు, విఘ్నేశ్వర శతకాలు ఇలా అసంఖ్యకంగా ఉంటాయి. వీటిలో ఏ కొందరి కవుల ప్రస్తావన తీసుకొనివచ్చినా అదొక ప్రత్యేక వ్యాసం అవుతుంది. హైదరాబాద్ కి చెందిన శ్రీ దేవరకొండ సుబ్రహ్మణ్యంగారు 700కి పైగా శతకాలు సేకరించారు.

అవధానాలు

గత రెండు మూడు దతాబ్దాలుగా అష్ట-శత-సహస్ర-మహాసహస్రావధానాలకు విరివిగా ప్రోత్సాహం లభిస్తున్నది. మహిళా అవధానులు, బాల అవధానులు కూడా అధికసంఖ్యలో తయారవుతున్నారు. అష్టావధాని మరుమామల దత్తాత్రేయశర్మగారి వంటి మహామహులు పూనుకొని హైదరాబాద్ నగరంలో అవధాన శిక్షణ శిబిరాలను నిర్వహిస్తూ, ఎందరో బాల, యువ అవధానులను

తయారుచేస్తున్నారు. ఈ అవధానాలలో పద్యరూపంలో జరిగే దైవప్రార్థన లవల్లనైతేనేమి, ఇతర అవధాన అంశాలవల్లనతేనేమి పురాణాల ప్రభావం వాటిమీద ప్రస్ఫుటంగా కనిపిస్తున్నది.

దృశ్యమాధ్యమం

పురాణగాథల ఆధారంగా వెలువడిన సోషియల్ నవలలు, నాటికలు ఉన్నాయి. సినిమారంగంలో కూడా పౌరాణికచిత్రాలు అసంఖ్యాకంగా వెలువడ్డాయి. అంతేకాదు పౌరాణిక ఆధారంగా వెలువడిన సాంఘిక చిత్రాలు ఉన్నాయి. ఉదాహరణకు బాపు-రమణల ముత్యాలముగ్గు (ఇది రామాయణగాధను అనుసరిం చింది), రజినీకాంత్ నటించిన దళపతి (ఇది భారతంలోని కర్ణునిగాధను స్మరింపచేస్తుంది) వంటివి. రామానంద్ సాగర్ గారి రామాయణం, బి.ఆర్. చోప్రాగారి మహాభారత్ టీ.వీ లో ధారావాహి కంగా వెలువడి ఆబాలగోపాలాన్నీ అలరించాయి. ఇప్పటికీ అల రిస్తూనేవున్నాయి. కాబట్టి పురాణాల ప్రభావం తెలుగు భాషమీద అన్ని కాలాలలోనూ అన్ని రంగాలలోనూ నేటికీ ఉందని నిర్ద్వందంగా చెప్పవచ్చును.

ముగింపు

సాహిత్యం ఉన్నతంగా ఉంటే దాని ప్రభావం అన్ని వర్గాల మనుషులమీదా కనిపిస్తూ ఉంటుంది. ఉదాహరణకు పోతనగారి భాగవతంలోని పద్యాలలోని మాధుర్యానికీ, కవితాపటిమకీ పరవశించిపోయే నాస్తికులూ ఉన్నారు. ఉత్తమ సాహిత్యం చదివితే మనస్సు నిర్మలంగా ఉండి చదివినవారి ఆలోచనా సరళి ఉన్నతంగా ఉంటుంది. మానసిక నైర్మల్యం ద్వారా ఉత్తమ పౌరులు తయారయ్యి, ఉత్తమ సమాజం అభివృద్ధి పథంలో నడుస్తుంది. ఉత్తమ పౌరులతో ఉత్తమ నాగరీకత పెంపెందుతుంది. కాబట్టి తెలుగువారందరూ దైవభక్తి, పాపభీతి కలిగి, మనపురాణాలపట్ల భక్తి ప్రపత్తులు ఏర్పరచుకొని వాటిని పారాయణం చేస్తూ ఉండాలి. లేదా సమాజం నాస్తికతకు దారి తీసి, మానవతా విలవల్ని కోల్పోతుంది. ఇది సకల అనర్థాలకూ దారి తీస్తుంది.

స్వస్తి! సర్వే జనాస్సుఖినో భవన్తు !



పొలముల రత్నాలు మొలిచెరా యిచట
వార్ధిలో ముత్యాలు పండెరా యిచట
పృథివి దివ్యౌషధుల్ పిదికెరా మనకు
కానల కస్తూరి కాచెరా మనకు
అవమాన మేలరా, అనుమాన మేల
భరత పుత్రుడ నంచు భక్తి తో బలుక!

(రాయప్రోలు -జన్మభూమి)

కాలమాగిన ఒకతూరి

- గరికపాటి పవన్ కుమార్

కాలమాగిన ఒకతూరి
అడుగు జాడలు లేని
పూలు రాలిన రహదారి
ఫక్కుమన్నది నింగి
మక్కువతొ తను వంగి
నీరెండ తెర దీసి
దారి చెక్కిలి పైన
చెక్కినది ఒక ముద్దు
పులకరించిన దారి
కిలకిలగ తను నవ్వి
నింగి కౌగిటిలోన
వలయమై ఒదిగింది
గాలి తాకున తొలగి
పూలు గుట్టగ పడగ
దారి కన్నులలోన
వెన్నెలై కురిసింది

పుష్ప ప్రవాళం

- డా .వైదేహి శశిధర్

ఆకాశాన్ని వెలగపండులా
ఒక్కసారిగా మింగేసిన
కరి మబ్బుల వెనుకనుంచి
అస్పష్టం గా మెరిసిన సూర్యకిరణం లా

అనుకోని అవరోధాల పిడుగుదెబ్బలకు
శిధిలమైన కాంక్షా వృక్షాల బూడిద రాసుల క్రింద
పేరుకున్న చీకట్లను చురుకుగా చీల్చుకుని
తళుక్కుమని తలెత్తిన ఆశాంకురం లా

ఆకులు రాల్చేసిన అనాచ్ఛాదిత బాహువులపై
చలి కంబళ్ళు కప్పుకున్న చెట్ల గుబుర్ల
మధ్యలోంచి ఎర్రగా నవ్వుతుంది,
ఈ కఠిన శిశిరాంతం లో
నిశ్శబ్దం గా పూసిన పుష్ప ప్రవాళం !

శ్రీలు పొంగిన జీవగడ్డయి పాలు పారిన భాగ్య సీమయి
వరలినది యీ భారత ఖండము భక్తి పాడర తమ్ముడా !
విపిన బంధుర వృక్ష వాటిక ఉపనిషన్మధువొలికెనిచ్చట
విపుల తత్వము విస్తరించిన విమల తలమిది తమ్ముడా !

(రాయప్రోలు -శ్రీలు పొంగిన జీవగడ్డయి)



అమ్మమ్మ నవ్వు

- డా. వేదుల సుభద్ర

ఎందుకమ్మా, ఈ గది సర్దిస్తున్నావు? ఎవరైనా వస్తున్నారా? అడిగింది వినీత తల్లిని చూస్తూ..

" మొన్నే చెప్పానుగా విన్నూ. అమ్మమ్మ వస్తోంది అని" అంది వకుళ కూతురివైపు నవ్వుతూ చూసి చెప్పింది..

" ఓ ఔను కదా, భలే ,భలే.. అమ్మమ్మ వస్తే బోల్డు మజా, గుడీస్ కూడా.. అంది చిన్నపిల్లలా సంబరపడుతూ..

ఓపికున్నా లేకపోయినా సహాయకురాలు అనసూయ తో కలిసి పప్పు చెక్కలూ, చక్కిలాలు,జంతికలూ మైసూర్ పాక్, సున్నుండ ల్లాంటి ఎన్నో పిండివంటలూ, ఊరగాయలూ, జున్నూ ఇలాంటివెన్నో పట్టుకుని మరీ వస్తుంది పిల్లల ఇంటికి వచ్చినప్పుడు.

వాళ్ళ చిన్నప్పుడు తెచ్చేదానివి సరే, ఇప్పుడు పెద్దవాళ్ళయిపోయారు కదా.. ఇప్పుడు కూడా ఎందుకివన్నీ మోస్తుకు రావడం? పైగా షాపుల్లో అన్నీ దొరికేస్తున్నాయి కూడా.. అంటుంది వకుళ. దానికావిడ నవ్వుతూ

"మనవడంటే ' మనవాడు ', మనవరాలంటే ' మనవరాలు 'తరాలెన్ని మారినా మారని వరసలూ, ప్రేమలూ ఇవి.

స్వంత బిడ్డలని మించిన ముద్దు వడ్డీలు.." ఏదో నేనున్నన్నాళ్ళూ ఇలా కానివ్వనీ.. అంటుంది.

ఆవిడ వచ్చినప్పటినించీ పిల్లలతో సరదాగా కలిసిపోతుంది.. వాళ్ళ వెనకే తిరుగుతూ, తెలియని విషయాలు అడిగి తెలుసుకుంటూ ఉంటుంది. వాళ్ళతో కలిసి సినిమాలకి, షికార్లకీ వెళ్ళడానికి చాలా ఉత్సాహం చూపిస్తుంది. చిన్నప్పటినించీ అమ్మమ్మ అంటే ఉన్న ప్రేమ వల్ల, వకుళ పిల్లలు విరాట్, వినీత కూడా ఆవిడతో కలిసిపోయి సందడిగా ఉంటారు..

" పెద్దవాళ్ళ పొడగిట్టని ఈ కాలపు పిల్లలు కాదమ్మా నా మనవలు" అంటుందావిడ మురిపెంగా

ఆవిడ వచ్చిన వారం రోజుల తర్వాత..

నాలుగు రోజుల్లో నా క్లోజ్ ఫ్రెండ్ పెళ్ళి, ఓ రెండురోజులు మీకెవ్వరికీ కనబడను.. షాపింగ్ అయిపోయింది కానీ గ్రూమింగ్, మేక్ అప్. చాలా ఉంది.. అంటున్న మనవడు విరాట్ ని..

" పెళ్ళికొడుకు తయారవుతాడు అంటే బానే ఉంది, మీకందరికీ ఏం హడావుడిరా? ఇంత జుట్టు పెంచావేమిట్రా? స్నేహితుడి పెళ్ళికేనా ఈ హంగంతా?" అందావిడ

" అమ్మమ్మా, ఊళ్ళో పెళ్ళైతే" సామెత వినలేదూ మనం " వినీత అందుకుంది.

"ప్రస్తుతం నవీన్ గాడి పెళ్లితో బిజీగా ఉన్నాను, అదయ్యాకా నీ పని చెప్తానుండు" అన్నాడు చెల్లెలివైపు కోపంగా చూస్తూ..

రోజుకొకటిగా చెప్పేవాడు స్నేహితుడి పెళ్ళి విశేషాలు.. వినీతా, విశాలాక్షి ఆసక్తిగా వినేవారు.. స్నేహితులందరూ కలిసి సలూన్ కి వెళ్ళడం, చివరినిమిషాల్లో ఏదో మర్చిపోయమాని పరిగెత్తడం అవీ ఆసక్తిగా ఉందావిడకి.

పెళ్ళిరోజున ఎవరూ చెప్పకుండానే పొద్దున్నే నిద్రలేచాడు విరాట్..

గబ గబా తయారయ్యాడు.. గదిలోంచి బయటకు వచ్చిన అతన్ని చూసి చిరునవ్వు నవ్వీదావిడ మొదట. ఆ తర్వాత ఫకాల్న నవ్వింది గట్టిగానే

"ఏమయింది అమ్మమ్మా? పొద్దున్నించీ నన్ను చూసి ఒకటే నవ్వుతున్నావ్. ఏమిటి విషయం?" అన్నాడు విరాట్ తను వేసుకున్న డ్రెస్ ని అద్దం లో మరోసారి చూసుకుంటూ..

మాట్లాడలేదు ఆవిడ. మనవడినే తేరిపారా పైనుంచి కిందకు చూస్తోంది.

పెద్ద జరీ అంచులున్న పట్టు పంచె, సిల్క్ లాల్చీ, పైన నెహ్రూ కోట్, కండువా వేసుకున్నాడు. ప్రాణ స్నేహితుడి పెళ్ళి,

122

కోసమే ముందుగా వేసుకున్న ప్లాన్ ప్రకారం మిగతా స్నేహితులంతా కలిసి కొనుక్కున్న ఒకేలాంటి డ్రెస్ లుట అవి. కట్టుకోనక్కర్లేకుండా రెడీమేడ్ పంచెలా కుట్టినది. పైజామా లా కట్టేసుకోవడమే. ఈజీ అని అలాంటిది కొనుక్కున్నారుట.

అతనిది నల్లటి ఒత్తైన జుట్టు. ప్రస్తుత కాలానికి తగ్గట్టు పొడుగ్గా పెంచి స్టెప్ కట్ చేయించుకున్నాడు. దాన్ని అప్పుడప్పుడు పోనీ టెయిల్ లాగా వేసుకుంటాడు, ఈ మధ్యన పైకి మడిచి 'మేన్ బన్' అంటూ ముడి వేసుకుంటున్నాడు కూడ. ఆరోజు కూడా అలాగే వేసుకున్నాడు. కండిషనర్, జెల్ రాసిఉన్నందువల్ల అది మరింతగా మెరుస్తూ, నిగనిగలాడుతోంది

" ఏమీ లేదురా నాన్నా, ఊరికే! " అంది విశాలాక్షి నవ్వు ఆపుకుంటూ.. ఆ ప్రయత్నానికి ఎర్రటి ఆవిడ ముఖం మరింత ఎర్రబడింది..

"కాదులే, నువ్వు వచ్చినప్పటినించీ చూస్తూనే ఉన్నాను.. నన్ను చూస్తే నీకు ఆటగా ఉంది." అన్నాడు కాస్త కోపంగా..

" అరే, అవునా? ఎందుకమ్మమ్మా? వాడిని చూసి నవ్వే విషయం ఏదైనా ఉంటే నాకూ చెప్తూ ఉండు, కలిసి నవ్వి, ఆటపట్టిద్దాం" ఎక్కడనించి వచ్చిందో విరాట్ చెల్లెలు వినీత అంది..

దాంతో విరాట్ కి మరింత చిరాకొచ్చింది.

" నువ్వుండవే, ప్రతీదానికి మధ్యలోకొస్తావు" అంటూ విసుక్కున్నాడు చెల్లెలిమీద.

అప్పుడే తల్లికి కాఫీ తెచ్చిన వకుళ విషయమేమిటన్నట్టు కొడుకు వైపు చూసింది..

" చూడమ్మా! మీ అమ్మ నన్ను చూసి నవ్వుతోంది" అంటూ ఫిర్యాదు చేశాడు తల్లితో.

" మీ అమ్మఅనడం ఏమిట్రా, అమ్మమ్మని పట్టుకుని?" అంది వకుళ చిరుకోపంతో..

" మరైతే ఎందుకు నవ్వుతోందో చెప్పమను. అప్పుడే, అమ్మమ్మా! అని పిలుస్తాను.. ఈ రోజే కాదు, వచ్చినప్పటినించీ ఇంతే" అన్నాడు కోపంగా.

" ఇంతలోనే కోపమా? బావుంది రా నీవరస". చెప్పడమెందుకు? చూపిస్తానుండు" అంటూ ఆవిడ లోపలకి నడిచింది..

తన గదిలోకి వెళ్ళిన ఆవిడ రెండు నిమిషాల్లో చేతిలో ఫోటోతో పాటు తిరిగి వచ్చింది..

" ఈ ఫోటో చూడండర్రా మరి!" అంది నవ్వుతూ..

పాత బ్లాక్ అండ్ వైట్ ఫోటోకి మీ మావయ్య ఈ మధ్యనే రంగులు వేయించిన ఫోటో అది.

ఎరుపు, ఆకుపచ్చ అత్తాకోడళ్ళంచు పట్టుపంచె, సిల్క్ లాల్చీ, పైన పట్టు ఉత్తరీయం ధరించిన ఫోటోలో వ్యక్తి గంభీరంగా ఉన్నారు.. చెవులకి పెట్టుకున్న పెద్ద రవ్వల పోగులు, వెనక వేసుకున్న శిఖ..నుదుట విభూతి పుండ్రాలు..

" ఆ ఇప్పుడు తెలిసిందినాకు అమ్మమ్మ ఎందుకు నవ్వుతోందో" అంది వినీత తనూ నవ్వుతూ..

" ఎందుకు?" అన్నాడు విరాట్..

"ఈ ఫోటోలో ఆయనని గట్టిగా చూస్తే నీలాగే కనబడుతున్నారు అన్నా!" అంది వినీత..

"ఎవరు అమ్మమ్మా ఈయన? "అడిగింది అమ్మమ్మని.

"మా నాన్నగారు, వీడు పెంచుకున్న జుట్టు చూసిన మొదటిసారే వీడు మా నాన్నలా ఉన్నాడే! అనుకున్నాను.

" నువ్వు కట్టుకున్న పిలకనేమంటార్రా? మూంబనా? అందావిడ.. నవ్వు ఆపుకుంటూ

" మూంబన్, రిబ్బన్ కాదు. మేన్ బన్" అన్నాడు విరాట్..

"అదే అదే , మేన్ బన్.. నువ్వు జుట్టు పెంచి పైకి ఎగదువ్వి రబ్బర్ బాండ్ పెట్టుకోవడం, దాన్ని మడత వేసి బన్ లా పెట్టుకోవడం చూసిన నాడు మా నాన్న పెట్టుకునే శిఖ(పిలకముడి) గుర్తొచ్చింది.. "

123

'భలే ! ఈ కాలం కుర్రాళ్ళు మళ్ళీ జుట్టు పెంచుకుంటున్నారే' అనుకున్నాను. అప్పటినించీ మీ ఫేషన్లూ, వేష భాషలు చూస్తూ ఉంటే నాకు ఎంత ఆశ్చర్యం వేసిందో!

"నిజమేనమ్మా, నాకు తోచనే లేదు. తాతగారి ఫోటో ఇన్ని సార్లు చూసినా తట్టలేదు" అంది వకుళ.

"అవున్రా అన్నయ్యా, అమ్మమ్మ చెప్పింది కరక్టే. ఒక్క విభూతి తప్ప నువ్వు ఇప్పుడాయనలాగే కన్పిస్తున్నావు, కావలిస్తే చూడు" అంటూ తన చేతిలోని ఫోటోని అన్న ముఖం పక్కన పెట్టి చూస్తూ అంది వినీత.

బల్బ్ వెలిగినట్టయింది విరాట్ కి. నిజంగానే ఆ ఫొటోలో ఆయనలాగే ఉంది తన ఆహార్యం. అతనికి ఆశ్చర్యం తో పాటు నిరాశగా అనిపించింది..

" మాది లేటెస్ట్ ఫేషన్.. అందరం కలిసి ప్లాన్ చేసుకుని మాన్యవార్ (ఇండియాలో పెద్ద బ్రాండ్ షో రూం) లో బోల్డు ధర పెట్టి కొనుక్కున్నాం." అన్నాడు విరాట్ కినుకగా.

" కాదనడం లేదురా బాబూ. నువ్వు బావున్నావు, నీ స్నేహితులూ బావున్నారు.. నాకు ఆశ్చర్యం ఏమిటంటే, రెండు తరాల తర్వాత ఎన్ని తిరిగొచ్చాయో అని" అందావిడ.

"నేనొచ్చిన నాలుగురోజులకి నువ్వూ, నీ స్నేహితుడు కలిసి వెళ్ళి వజ్రాల చెవి పోగులు కుట్టించుకొచ్చారు చూడు..

అప్పటికే పెంచుకున్న గడ్డం, పొడవైన జుట్టుతో ఉన్న నువ్వు మొదటిసారి మానాన్నలా కన్పించావు మరి.. అప్పటినించీ నిన్ను నిశితంగా చూడ్డం మొదలుపెట్టాను.. మొదటినించీ మా నాన్న కూచినే నేను.. ఆ మాటకొస్తే అమ్మాయిలంతా అంతే అనుకో..

అప్పటినించీ రోజు, రోజుకీ నీలో ఆయన పోలికలు బాగా కనిపించాయి నాకు.. ఇదిగో ఈరోజు ఈ పట్టుపంచెల అవతారం చూస్తే పూర్తిగా ఆయనలాగే అనిపించావు.

"ఈ జుట్టుపోలిగాడిలా జుట్టేవిట్రా?" అంటే " ఫేషన్ అమ్మమ్మా" అన్నావు..

"చెవులకు దుద్దులేమిట్రా అంటే ట్రెండ్ అన్నావు.. పైగా మా ఫ్రెండ్స్ చాలా చోట్ల పియర్సింగ్ చేయించుకున్నారు తెల్సా? " అన్నావు కూడా..

"దానిపైన ఈ పిలక ముడి.. అదే లే.. మేన్ బన్.. " ఫేషన్ అంటే ఏమిటో మరి..

"ప్రతీదీ ఒక చోట మొదలై అక్కడకే తిరిగి వస్తుందేమో అనిపించింది నిన్ను చూస్తే.. లేకపోతే నాకే డెబ్భై ఏళ్ళున్నాయా? మా నాన్నగారుండి ఉంటే వందేళ్ళుండవూ?"

"అప్పటి వారి వేషధారణ లో మీరు మళ్ళీ ఇలా ప్రత్యక్షమైతే ఆశ్చర్యం వెయ్యదూ? . దాంట్లోంచే నవ్వొచ్చింది మరి.

మా నాన్న చెప్పేవారు తన స్నేహితుల్లో కొందరికి ముక్కుకి కూడా కాడలు పెట్టుకునేవారుట.. ఇప్పుడు మీరు మొదలు పెడతారేమో?.." అని మళ్ళీ నవ్వించిందావిడ.

చేతిలో ఫోటొని, అద్దంలో తన ప్రతిబింబాన్నీ చూస్తూ ఉండిపోయాడు విరాట్



మనిషి చిరంజీవి

- హెచ్చార్కే

ఉన్నట్టుండి
అయిష్టమైనవన్నీ బారులు తీరి నిలబడతాయి
మనుషులంతా ఇసుక రేణువు లవుతారు
ప్రపంచం ఒక తెంపు లేని ఎడారి అవుతుంది
వెదుకుతావు వెదుకుతావు వెదుకుతావు
నువ్వెక్కి తిరిగే ఒంటె ఇక నడవలేనని కూర్చుంటుంది
దాని పొట్ట కోసి, లోపల మిగిలిన నీళ్లు తాగేసి
పరిగెడతావు పరిగెడతావు పరిగెడతావు
నీ పొట్టలోని నీటిని సైతం గడ్డ కట్టించే శైతల్యం లోనికి
ఇక పాదాలే కాదు పదాలూ మొరాయిస్తాయి
ఎండలో మంచులో బలవంతపు ధ్యానంలో
ఇక మిగిలిన నీ లోనికి నువ్వు మునిగిపోతావు
లోపల కొన్ని నవ్వు మొహాల చెట్లుంటాయి
చెట్ల ఆకుల గుబుర్లలో కొన్ని పిచికలుంటాయి
నువ్వూ, పిచికలూ, చెట్లూ, చిన్న చిన్న చీమిడి ముక్కుల పిల్లలు
అచ్చిబిళ్లలాటలాడి, ఒకరికొకరు
అప్పట్లు కొట్టి, ఎగిరి, దుంకి నవ్వుకుంటారు
ఎడారి లోలోపల చాల నదులుగా ఊరుతుంది
ఎడారి జ్ఞాపకాల్లో ఎప్పటిదో సముద్ర జాడ,
ఏ తపస్సుకు లొంగని దేవుడిలా
ఒక ఒయాసిస్సు నిద్ర లేస్తుంది
ఉన్న చోట ఉండలేక విస్తరించే ఒయాసిస్సు
నా ఒయ్యారి ఒయాసిస్సు
భలే భలే,
బారులు తీరే అయిష్టాలు కూడా ఉపయోగకరమే
ఇసుక రేణువులుగా మారినా, మనుషులు ఉపయోగకరమే
వాళ్ళే కదా
ప్రస్తుతం మీద వాళ్ల తీవ్రమైన అయిష్టాలే కదా
అన్ని చట్టబద్ధ సరిహద్దులను దాటి, పొంగి, పొర్లి
యుగానికొక చెలియలికట్టను కొత్తగా నిర్ణయించే సముద్రాలయ్యేది
ఏం లేదు
ఎడారి ఇసుకదైనా మంచుదైనా ఉప్పునీటిదైనా
పదాలు పాదాలుగా నడిచే మనిషికి చావు లేదు

కనిపించని నీడ

- ముకుంద రామారావు

ఎంతటి పుస్తక మేధావులైనా
నదిలో పడవ జాడ
ఆకాశంలో పక్షి జాడ
ఎలా తెలుసుకోగలరు?

దానికదే ఆరిపోతుందో
ఎవరు ఆర్పేస్తారో
దీపానికే తెలియదు!

చావుకు ముందర
రెక్కలు విప్పుకునే చీమలది
ఎంత చావు తెలివో !

ఏ చెట్టు కలప
ఎవరి దహనానికి
ఎదురుచూస్తుందో.

అన్నీ వదిలించేసుకుని
ఇంటికి తిరిగొచ్చినా
ఆఫీసు ఫోను శబ్దం
ఇంకా వినిపిస్తూనే ఉన్నట్టు
విశ్రాంత జీవితంలో
ఎంత వద్దనుకున్నా
చివరితీరం దరి
అదే పనిగా గుర్తొస్తూ
ఎందుకు వెన్నాడుతుంటుందో ఏమో?!

గతపు పెట్టె

- డా. కె.గీత

గతపు పెట్టెని తెరవనే కూడదు
బిలబిలా ఎగిరే తూనీగల్తో బాటూ
తోకలు విరగదీసి తలకిందులుగా వేళ్ళాడదీసిన
ముళ్ల తాళ్లు కూడా ఉంటాయి
మిలమిలా మెరిసే నక్షత్రాలతో బాటూ
అగాధాంధకారంలోకి విసిరేసే ఖగోళాంతరాళాలు కూడా ఉంటాయి
గలగలా పారే జలపాతాలతో బాటూ
కాళ్ళకి బరువై ముంచేసే బండరాళ్లు కూడా ఉంటాయి
సువాసనలు అలుముకున్న అడవుల్లో వేటాడే క్రూరమృగాలు!
పచ్చని పరిమళాల పూల పొదల్లో బలంగా చుట్టుకున్న నాగుబాములు !
ప్రశాంత తామర కొలనుల్లో రహస్యంగా పొంచి ఉన్న మొసళ్లు !

గతం పెట్టెని తెరవనే కూడదు
కన్ను మూసి తెరిచే లోగా నీలోంచి నీలోకి
ప్రవహించే అనుభూతుల చాటు అనుభవాలు
నిన్ను సలసలా మరిగిస్తాయి

అయినా జలజలా జారే కన్నీళ్లతోనే
గాయాల్ని కడిగే సంయమనం ఒక్కటి చాలు

గతం పెట్టెని మోసుకుని
నువ్వెన్ని ఊళ్ళు తిరిగినా
తటాలున ఒక వాన చినుకు
దూరాన ఒక్క మిణుగురు
చిటారున వీచే ఒక తెమ్మెరల తో
నీ తల మీద భారాన్ని దించి
తూనీగల్ని నక్షత్రాల్ని జలపాతాల్ని
దోసిట పట్టి తెచ్చి
పరిమళాల వర్తమానాన్ని బహూకరిస్తుంది!

మనస్విని

- లలిత రామ్

పెళ్ళి కోలాహలం. సన్నాయి వాద్యము, పట్టు చీరల తళతళలు, మెరుపు తీగల కాంతి రేఖలు, సుగంధ ద్రవ్యాల ఘుమ ఘుమలు. పెద్దలూ, చురుకైన యువతీ యువకులూ, పలు దేశాల నుండి వచ్చిన అతిథులందరూ ఆనంద అంబోరాశులలో తేలియాడుతున్నారు.

"తాతయ్యా! నీకు మంచి నీళ్ళ బాటిల్ తెచ్చేదా? అమెరికా సమ్మర్ లో ఎండలు దంచుతున్నాయి. మన గుంటూరే బెట్టర్ సుమా." తాతగారి చేయి పట్టుకొని అడిగింది సజని.

"ఒక బీయర్ ఇవ్వవే సజూ. బెట్టర్ దన్ వాటర్. అట్లాంటిక్ మహా సముద్రానికి ఇంత దగ్గర మన ఊరు. అయినా సూర్యుని ప్రతాపము ముందర సాగరమెంత?"

"ఓకే తాతయ్యా. అలాగ హాలు వెనక రూములోకి వస్తే, ఒక బీయర్ స్నీక్ చేస్తా."

"వద్దులే! అదుగో పెళ్ళి కూతురు సైగ చేస్తోంది, నీ కోసం. వెళ్ళి పక్కన నుంచో మరి." ఆదేశించారు తాతగారు.

రజనీకాంత్ శర్మ గారు మనుమరాలి ఆటపాటలు తలుచుకుని నవ్వుకున్నారు. అల్లరి పిల్ల. ఎంత తెలివైనదో అంత సున్నితం. సజని వైపు చూసి, ఎంత పొడుగో, అచ్చు నా కొడుకు లాగే అనుకున్నారు.

"నీలో నువ్వు నవ్వుకుంటున్నావు, మన ఐ.ఐ.టీ రోజులు గుర్తుకొస్తున్నాయి. రజనీ, నువ్వేనా?" ఆయన భుజంపై చేయి పడింది. పక్కకు తిరిగి చూస్తే యూనివర్సిటీ క్లాస్ మేట్ మహీధర్.

"మహీ! ఇంత సేపూ ఇక్కడే కూర్చున్నావా? గుర్తు పట్టలేదు సుమా. అయినా నీ కాళ్లేటు స్మైల్ మటుకు మారలేదు." అన్నారు రజనీగారు ఆనందంగా.

"40 సంవత్సరాల తర్వాత కలిశాము. ఎలా వుంది నీ భార్య ఎలిజబెత్? నువ్వు అమెరికన్ అమ్మాయిని పెళ్ళి చేసుకోవటముతో మాకు దూరమయ్యావు అనుకున్నాము." మహీధర్ మాటలతో బాణాలు విసరగలడు అని రజనీగారు గుర్తుతెచ్చుకున్నారు.

ఇంతలో స్నేహితుని కూతురు మాంగళ్య ధారణ అవ్వటముతో, అందరూ వధూవరులపై అక్షంతలు జల్లారు. ఇంకా తలంబ్రాలు, బ్రహ్మముడి, సప్తపది, అప్పగింతలు జరుగుతున్నాయి. పెళ్ళి భోజనము గురించి ఆశగా అలోచిస్తూ, అందరూ కదిలారు, ఫైవ్ స్టారు హోటెల్ లో బాంక్వెట్ హాలు వైపు.

పక్క పక్కన కూర్చున్నారు రజనీ గారూ, మహీధర్ గారూ. చిన్న నాటి కథలు, ప్రాక్టికల్ జోక్స్, కాంపటిషన్లు ...వారి మెమరీస్ కు హద్దే లేదు!

"ఎలిజబెత్ తన అమ్మా, నాన్నలను చూడటానికి వెళ్ళింది. నేనూ, నా మనుమరాలు సజనీ పెళ్ళికి వచ్చాము." అన్నారు రజనీ గారు.

"సజనీను పిలవరా. తప్పక చూడాలి. అన్నట్టు నీ కొడుకు, కోడలు యేరి? ఒక్కడే అబ్బాయి కదా నీకు?"

రజనీగారి మొహం లో ఒక నీడ అలుముకుని మాయమయ్యింది. సద్దుకున్నారు కంఠాన్ని.

"అవును. ధర్మా నాకు ఒక్కడే కొడుకు. ఇక్కడే పుట్టి పెరిగిన తను, గుంటూరుకు వచ్చినప్పుడు నితార అనే అమ్మాయిని ఇష్టపడి పెళ్ళి చేసుకున్నాడు. కొన్ని సంవత్సరాల క్రితం, కారు ఆక్సిడెంటులో ఇద్దరూ పోయారు." అన్నారు రజనీ గారు నిర్లిప్తంగా.

"ఓ మై గాడ్. సారీ రజనీ. అన్నీ వున్న నీకు ఇంత కష్టమా? ఎవరి దృష్టి పడిందో?" అన్నాడు మహీధర్.

"ఇట్ ఈజ్ డెస్టినీ. మన కర్మలకు మరొకరిని అనటము ఎందుకు?" అన్నారు రజనీగారు.

"ఈ పెళ్ళికి నువ్వు దుబాయి నుండి ఇక్కడ ప్రత్యక్షమయ్యావు. మా ఇల్లు ఇక్కడే 30 మైళ్ళ దూరం లో

క్లోవర్డేల్ అనే చిన్న సబర్బన్ ఊరిలో. రేపు వచ్చి మమ్మల్ని విజిట్ చేయి." అన్నారు రజనీగారు సాదరంగా.

తలూపాడు మహీధర్. "30 మైళ్ళే అన్నావు కదా. నువ్వు వచ్చి తీసుకెళ్ళగలవా?"

మళ్ళీ రిటర్న్ దింపమంటాడనీ తెలుసు రజనీ గారికి. కష్టమే అయినా ఓకే అన్నారు. సజనీ పెళ్ళి పనులలో మునిగి ఉండటముతో ఆయన మరునాడు ఇంటి వద్ద మనుమరాలిని చూడవచ్చు అన్నారు. మరునాడు మహీధర్ రజనీ గారి చక్కటి గృహం చూసి, ఇంటి ధర ఎంత, టాక్సులు ఎంత కట్టాలి, ఫర్నిచర్ ఎక్కడ కొన్నారు వంటి ప్రశ్నలు బోలెడన్ని వేశాడు. రజనీగారు నవ్వుకొని, ఓపికగా సమాధానాలు చెప్పారు.

అప్పుడే టెన్నిస్ ఆడి వచ్చి, స్నానం చేసి, సజనీ చల్లటి కూల్ డ్రింక్స్ తో ప్రత్యక్షమయ్యింది.

"గుడ్ డే టు యూ! ఆర్ యూ సజనీస్ ఫ్రెండ్? లేక, రజనీ, మీ ఇంట్లో హౌస్ కీపరా?" అన్నాడు మహీధర్.

రజనీగారు సజనీ వైపు చూశారు. "నమస్కారం అంకుల్. నేను సజనీ. ఈయన మా తాతగారు." అని మహీధర్ కు, తనను తానే పరిచయం చేసుకొంది.

"ఓ! నీ లైట్ బ్రవున్ కలర్ జుట్టు, నీ రంగు చూసి, అమెరికన్ అనుకున్నాను. నువ్వు ఎలిజబెత్ పోలిక అన్నమాట." మహీధర్ సారీ కూడా చెప్పలేదు.

భోజనం లో మామిడికాయ పప్పు, పులుసు, దొండకాయ కూరా వగైరా వంటివి ఆరగించి, మహీధర్ చాలా తృప్తిగా, "సజనీ, ఈ వంటలు ఎక్కడ నుండి తెప్పించావు?" అన్నాడు. సజనీకు కనుబొమ్మలెత్తింది. వయసులో పెద్దవారు అంకుల్. ఆయనకు

తాను తన సహజ పద్ధతిలో సమాధానలు ఇస్తే తాతయ్య నొచ్చుకుంటారు.

"నేనే వండాను అంకుల్. కొన్ని కూర గాయల మొక్కలు మా తోటలోనే పెంచుతున్నాను కూడా." అన్నది.

"ఇంతవరకూ మనము ఇంగ్లీషులోనే మాట్లాడుతున్నాము. నీకు తెలుగు వచ్చా సజనీ?" అడిగాడు మహీధర్.

"మహీ! ఈ ఊరు కొత్తగా వచ్చినప్పుడు తెలుగు వారు కొద్ది మందే. అప్పుడు పట్టుమని నూరు మంది మెంబర్స్ ఉండే తెలుగు సంఘానికి ఫౌండర్ ను నేను. అంచెలంచెలుగా పెరిగిన మా సంఘం లో ఇప్పుడు రెండు వేల మంది సభ్యులు. ప్రస్తుతం కమిటీలో మా సజనీ కూడా ఉన్నది. యూత్ వింగ్ కు లీడర్ తనే." అన్నారు రజనీ గారు.

"అంకుల్. మా అమ్మని తలుచుకుని నేను తెలుగు నేర్చుకున్నాను. తెలుగు భాష నాకు మరొక తల్లి. మా నాన్నగారిని మరిపించిన తాతయ్య, నాకు డాడ్ ను మించిన తండ్రి. నాకు ఇంకా తెలుగు చదవాలని ఆశ." సజనీ ఆపిల్ పండ్లు అందిస్తూ తెలుగులో అన్నది.

మహీధర్ తలవంచుకున్నాడు. తాను కాస్త అలోచించి, యువతీ యువకుల సున్నిత మనస్తత్వాలు గ్రహించి మాట్లాడాలి, అని



చెట్టు సితార్

- డా. రవూఫ్

ఆకుల తంత్రుల్ని మీటి
చెట్టు సితార్ పై
గుసగుసల రహస్య రాగాల్ని
పలికిస్తుంది గాలి !

చెట్టు సితార్ రాగాలు తీస్తూ,
సరాగాలు పోతోంటే,
మైనాలు రా చిలుకలు
కోకిలలు గొంతెత్తి
పాడనారంభిస్తాయి.

ఆ పాటలకి సెలయేళ్ళు
నెమళ్లై నాట్యమాడుతాయి.
మేఘాలు పులకాంచితమై వర్షిస్తాయి .

చెట్ల సితార్ వాద్యాలు మోగుతుంటే,
పియానో మెట్ల వంటి
కొండల వరసలు కూడా పలుకుతూ,
జీవన సంగీతానికి
పక్క వాద్యాలౌతాయి.



ఎవరూ చూడటం లేదు
క్షితిజరేఖ వెనుక నిలచి పిలిచే రత్నకంకణ హస్తాన్ని
ఎవరూ వినడం లేదు
నిద్రకూ మెలకువకూ మధ్య ఒక్క క్షణం
మ్రోగిన జంత్ర సంగీతాన్ని

(తిలక్ - శిఖరారోహణ)

కర్ణుడి ప్రవేశం

- కాశీనాధుని రాధ

శా. సాలప్రాంశు, నిజోజ్జ్వలత్కవచు,శశ్వత్కుండలోద్భాసితున్

బాలర్కప్రతిమున్, శరాసనధరున్, బద్ధోగ్రనిస్త్రింశు శౌ
ర్యాలంకారు, సువర్ణవర్ణు, ఘనుఁ గర్ణాఖ్యున్ జగత్కర్ణ పూ
ర్ణాలోలద్గుణుఁ జూచి చూపరు ప్రభూతాశ్చర్యు లై రచ్చటన్
(మహాభారతం. ఆదిపర్వం. షష్ఠాశ్వాసం. ప. 3౧)

నాకు నచ్చిన ఈ పద్యం నన్నయ్యగారి శ్రీమదాంధ్రమహాభారతం, ఆదిపర్వం లోనిది. ముందుగా సందర్భం ఏమిటో చెప్పుకుందాం.

మహాభారతంలో సందర్భం చెప్పుకోవడమంటే అంత సులువైన పనేం కాదు. గొలుసుకట్టు కథలలో ఎక్కడో ఒక లంకె దగ్గర మొదలు పెడదాం. నిజానికి ఈ కథలు ఎన్నిసార్లు విన్నా తనివి తీరదు.

పాండురాజు మరణానంతరం ధృతరాష్ట్రుని అండన చేరిన పాండవులు, కౌరవులతో కలిసి ద్రోణాచార్యుల దగ్గర ధనుర్విద్యాదులను అభ్యసించడం మొదలు పెడతారు. కొన్నాళ్ళకు ద్రోణుడు భీష్మాదులతో కొలువు తీరిన ధృతరాష్ట్రుడిని సమీపించి, కుమారుల విద్యాభ్యాసం పూర్తయింది. వారి నేర్పరితనాన్ని ప్రదర్శించే ఏర్పాట్లు చేస్తే బాగుంటుందని అంటాడు. మహారాజు సంతోషంగా సరే నంటాడు.

అనుకున్నదే తడవుగా కుమార అస్త్రవిద్యా ప్రదర్శనకి రంగస్థలం సిద్ధమైంది. భీష్మ,కృప,విదుర,శల్యాది గురుమిత్ర బంధువర్గాలు, వ్యాసది మునిగణాలు, బ్రాహ్మణులు, మంత్రిసామంతాదులు, గాయక వైతాళికులు ఆశీనులయ్యారు. భేరీ లు మ్రోగాయి. చతుర్వర్ణాలవారు చేరి చేస్తున్న కలకం ప్రళయకాల సముద్రఘోషలా వినబడుతోంది. ఆ సమయంలో ధవళవస్త్రధారుడై, యజ్ఞోపవీతాన్ని ధరించి, నెరసిన జుత్తుతో, అశ్వత్థామతో కలసి ప్రవేశించిన ద్రోణాచార్యుడు, మేఘాలు తొలగిన స్వచ్ఛమైన ఆకాశంలో అగ్నిజ్వాలలామెరిసే అంగారకగ్రహంతో కలిసి, దివ్యతేజస్సుతో వెలుగుతున్న సూర్యునిలా ఉన్నాడు. అతని వెనుకనే కవచధారులు, ధృఢబాహులు అయిన ధర్మజాది శిష్యులు అంతా ఉడుము చర్మపు కవచాలను వ్రేళ్ళకు తొడుక్కుని, అమ్ముల పొదులను, ధనువులను ధరించి ప్రవేశించారు.

ఒక్కొక్కరు తమ తమ అస్త్రశస్త్రఖడ్గాది ఆయుధప్రయోగ నైపుణ్యాన్ని ప్రదర్శిస్తూ వచ్చారు. అటుపైన దుర్యోధన భీమసేనులు గదావిద్యాప్రదర్శనకు పోటీపడి నిలిచారు. పైకెత్తి తాకించిన గదలతో వారిద్దరూ ఒకే శిఖరం గల రెండు పర్వతాల వలె అగుపించారు. వారి పాదాల తొక్కిడికి భూమి కంపించింది. హుంకార ధ్వనులతో ఆకాశం బద్దలవుతున్నట్టు తోచింది. ఇక జనులంతా రెండు పక్షాలుగా విడి, కొందరు భీమసేనుడిని, కొందరు సుయోధనుడిని సమర్థిస్తూ, పరస్పర క్రోధవచనాలు పలుకసాగారు. పరిస్థితి శ్రుతి మించి రాగాన పడకముందే ద్రోణుడు, అశ్వత్థామ సహాయంతో వారిని వారించి, అర్జునుని ధను ర్విద్యాప్రదర్శనం జరుగబోతోందని ప్రకటించడం జరిగింది. సవ్యసాచి తాను విలువిద్యలో నేర్చిన నేర్పులన్నిటినీ నీటుకాడై (పోటుకాడై)ప్రదర్శిస్తూ ప్రేక్షకులను ఆశ్చర్యచకితుల్ని చేస్తుండగా, తన విద్యాకౌశల్యాన్ని ప్రదర్శించాలని తలపెట్టిన కర్ణుడు, భుజస్ఫాలనం చేస్తూ (భుజం చరుచుకుంటూ) రంగద్వారం ముందునిలబడ్డాడు.

ఈ సందర్భంలో కర్ణుడు ఒకసారి భుజం చరిచి ఊరుకోలేదు. ఎడతెరపి లేకుండా చేశాడు. ఆ ధ్వని పర్వతసమూహం మీద పడుతున్న మహత్తరమైన వజ్రాయుధపు దెబ్బలలాగ వినిపించగా, జనులంతా తొట్రుపాటుతో భయపడ్డారు. పాండవులు ద్రోణుని వద్దకు చేరితే, కౌరవులు తమ అన్న అయిన దుర్యోధనుని చుట్టూ చేరుకున్నారు. ఆ భుజస్ఫాలనం అక్కడ ఉన్న సమస్తజనులలో భయంతో కూడిన ఉలికిపాటుని కలిగించడమే కాదు, పాఠకుడికి కర్ణ మనోగతమైన తీవ్రమైన ఆవేశాన్ని, నిశ్చలతని, తన శౌర్య పరాక్రమాల మీద అతడికి ఉన్న అచంచలమైన విశ్వాసాన్ని కర్ణపుటాలని భేదించి బోధపరుస్తోంది. ఈ ధ్వని వెనుకనే నిలబడి, కనబడిన వాడే మహావీరుడు కర్ణుడు. ఇది నాటకీయమైన ఒక అత్యద్భుత పాత్రాప్రవేశం. ప్రసాద,ఓజో గుణాల కలగలుపైన ఈ పద్యం సమాసభుయిష్టమైనది కాబట్టి ముందుగా అర్థాన్ని భావాన్ని ఆకళింపు చేసుకుందాం.

(సాలప్రాంశు = మద్దిచెట్టు వలె ఎత్తైన వాడిని; నిజ ఉజ్వలత్ కవచు = సహజ సిద్ధమైన ప్రకాశిస్తున్న కవచం కలవాడిని; శశ్వత్ కుండల ఉద్భాసితున్ = ఆజన్మాంతం ఉండే కుండలాలతో ప్రకాశిస్తున్న వాడిని; బాల అర్క ప్రతిమున్= ఉదయ కాలపు సూర్యునితో సమానమైన కాంతి కలవాడిని; శరాసన ధరున్ = విల్లును ధరించిన వాడిని; బద్ధ ఉగ్ర నిస్త్రింశు = కట్టుకొనబడిన భయంకరమైన ఖడ్గం కలవాడిని; శౌర్య అలంకారు = శౌర్యమే అలంకారంగా కలవాడిని; సువర్ణ వర్ణు= బంగారపు చాయ గలవాడిని; ఘనున్= గొప్పవాడిని; కర్ణ ఆఖ్యున్= కర్ణుడు అనే పేరు గలవాడిని; జగత్ కర్ణ పూర్ణ ఆలోలత్ = లోకం యొక్క చెవులలో నిండి వ్యాపిస్తున్న; గుణున్ = గుణములు కలవాడిని(లేదా వింటినారి యొక్క ధ్వనులు); చూచి, చూపరు = చూచిన, ప్రజలు; ప్రభూత ఆశ్చర్యులు అయిరి = ఆశర్యం కలవారు అయ్యారు; అచ్చటన్ = ఆ స్థలము నందు.) – ఇది ప్రతిపదార్థం.

అక్కడ అంటే ఆ రంగస్థలంలో, మద్దిచెట్టు వలె ఎత్తైన వాడు, సహజమైన కవచంతోను,కుండలాలతోను ప్రకాశిస్తున్న వాడు, ఉదయిస్తున్న సూర్యుడి లాంటి ప్రకాశం కలవాడు, ధనువును, భయంకరమైన ఖడ్గాన్ని ధరించిన వాడు, శౌర్యమే భూషణంగా కలవాడు, బంగారపు చాయతో మెరిసేవాడు, గొప్పవాడు అయిన కర్ణుడనే పేరు గలవాడిని, లోకమంతా వ్యాపించిన గుణముల ప్రసక్తి గల వాడిని అని ఒక అర్థం, ('గుణ' వింటి నారి అన్న అర్థం కూడా ఉండటం చేత) తన ధనుర్విద్యా పాటవాన్ని చాటి చెప్పే వింటినారి ధ్వని లోకుల చెవుల బడి కీర్తిమంతుడైన అన్నది మరొక అర్థం. అటువంటి వాడిని చూసిన ప్రజలు ఆశ్చర్యచకితులయ్యారు. – అన్నది దీని భావం.

'సాలప్రాంశు' అన్న ఎత్తుగడతో మొదలైంది. అంటే ఇప్పుడే చెప్పుకున్నాం కదా మద్దిచెట్టువలె ఎత్తైన వాడు అని. ఇక సిద్ధం అవుదాం. నన్నయగారు (వేసి) చూపిస్తున్న ఈ బొమ్మ చెట్టంత ఎత్తుగా వుంది. కనుక తలెత్తి ఆపాదమస్తకము పరికించాల్సిన అపురూపమైన రూపం ఇది.

ఎత్తుగా ఉండడమేనా, సహజసిద్ధమైన దివ్యకాంతితో వెలిగిపోతున్న కవచాన్ని, కర్ణకుండలాలని ధరించి ఉన్నాడు. అప్పుడే ఉదయిస్తున్న బాలభానుడిలా మెరిసిపోతున్నాడు. దానితో బాటు వీరలక్షణ చిహ్నాలుగా ధనుస్సును, ఖడ్గాన్ని ధరించాడు. బంగారుకాంతితో మెరుస్తున్నాడు. వీటన్నిటిని మించిన శౌర్యగుణాన్నిఆభరణంగా అలంకరించుకున్నాడు. మంచి గుణగణాలు కలవాడిగా పేరు పొందిన వాడు, ఘనుడైన కర్ణుడు అనబడే ఈ వీరుణ్ణి చూసి అక్కడ ఆసీనులైన జనులే కాదు, చదివేవాళ్ళు కూడా దిగ్భ్రాంతులు కాక మానరు.

"సాలప్రాంశు, నిజోజ్జ్వలత్కవచు, శశ్వత్కుండలోద్భాసితున్, బాలార్కప్రతిమున్, శరాసనధరున్, బద్ధోగ్రనిస్త్రింశు, ఘనున్ గర్ణాఖ్యున్" – ఈ పదప్రయోగం, ముఖ్యంగా నకారాంతాలు వెయ్యడం కర్ణుని కరాఖండిగా వర్ణించడంతో ఆగి పోలేదు. పది పన్నెండు పద్యాలు వెనక్కి నడిపించి, ఆ రంగస్థలంలో ఇంతకుముందు మన ఎదురుగానే ప్రవేశించిన సవ్యసాచిని మరొక మారు చూడమని గుర్తు చేస్తుంది.

చ. హరివిచిత్రహేమకవచావృతుఁడున్నత చాప చారు దీ
ర్ఘోరుభుజుండు, భాస్వదసితోత్పలవర్ణుడు, సేంద్ర చాపశం
పారుచి మేఘమో యనగ బాండవమధ్యముఁ డొప్పి బద్ధతూ
ణీరుడు రంగమధ్యమున నిల్చె జనంబులు దన్నుఁజూడగన్.
– మహాభారతము. ఆదిపర్వం. షష్ఠాశ్వాసము. ప. ౧౭

ఈ రెండు పద్యాలలో ఈ వీరులు ఇద్దరు ఇలా వర్ణించబడ్డారు.

అర్జునుడు మనోహరమైన విచిత్ర వర్ణాలతో కూడిన బంగారు కవచాన్ని ధరించిన వాడైతే, కర్ణుడు వెలుగులు చిమ్మే సహజకవచ కుండలాలను ధరించి ప్రకాశిస్తున్నాడు. కౌంతేయుడు మనోజ్ఞమైన చాపాన్ని ధరించిన దీర్ఘబాహుడైతే, రాధేయుడు శరాసనధరుడు, మహోగ్రమైన ఖడ్గాన్ని బిగించి కట్టుకున్నవాడు. నరుడు మెరుపుతో కూడిన మేఘం వలె ఉంటే, కర్ణుడు బాలసూర్యుని పోలి ఉన్నాడు. పాండవ మధ్యముడు బద్ధతూణీరుడు (అమ్ములను పొదిలో కట్టుకున్న వాడు) అయితే, శౌర్యాన్ని ఆభరణంగా పెట్టుకున్న ఘనుడు కర్ణాఖ్యుడు. అర్జునుడు జనులు తన్ను చూస్తూ ఉండగా రంగమధ్యంలో నిలిచాడు. మరి కర్ణుడో జనులంతా తనను చూసి ఆశ్చర్యచకితులు కాగా, భీకరమైనభుజస్ఫాలనం చేస్తూ రంగద్వారం వద్ద నిలుచున్నాడు.

ఈ వర్ణన అంతా భారతకథలో ఉదాత్తవీరుడైన అర్జునునికి ప్రతివీరుడున్నాడు, అతడు అలవోకగా తొలగించ బడే వాడు కాడు. అతడు మహా వీరుడు, ఘనుడు, ప్రసిద్ధుడు, ప్రతిభావంతుడు,తేజోవంతుడు,ప్రతిఘటించడానికి సంసిద్ధుడు,సన్నద్ధుడు అన్న విషయాన్ని నొక్కి చెబుతున్నట్టుగా ఉంది.

"సూర్యమండలమొకొ, భూతలంబున బెడంగయి దీప్తి సహస్రకంబుతో వెలుగెడు నా, నిజద్యుతి సవిస్తర లీల వెలుంగుచుండగన్" (పంచమాశ్వాసం. ప. ౨౬) అంటూ – సూర్యమండలమే వేయి కిరణాలతో భూమి మీద ప్రకాశిస్తోందా అన్నట్టు దేదీప్యమానంగా వెలిగిపోతూ ఆ నాడు కుంతికి ఉదయించి, మంజసంలో పవళించి మందాకినీ తరంగాలపై పయనించి వెళ్ళిన ఆ బాలకర్ణుడు, పరిపూర్ణ యవ్వనవంతుడు, ధనుర్విద్యాపారీణుడుగా, శూరునిగా రూపుదిద్దుకున్న ఆకృతితో ఒక్క సారిగా కళ్ళ ముందు మెరిస్తే ఆశ్చర్యం కాక మరే భావం పుడుతుంది?

ఈ కర్ణుని వర్ణనాచిత్రం నన్నయ్యగారి నానా రుచిరార్థ సూక్తి నిధిత్వానికి ప్రాతినిధ్యం వహించిన మంచి వర్ణనలలో ఒకటి





బట్టర్ ఫ్లైస్ పంట

- ఎస్. జయ

మే మాసం. వసంత రుతువు. ఆదివారం సాయంత్రం, నులివెచ్చని వాతావరణంలో రజని తోట పని మొదలుపెట్టింది. దూరంగా పిల్లలతో ఆడుకుంటున్న ఏడేళ్ల శ్రావ్య వాళ్లమ్మను చూసి దగ్గరికి పరుగెత్తుకెళ్లింది. "మామీ... ఒక కుండీలో ధనియాలు ఎక్కువగా చల్లు. కొత్తిమీర చాలా పెరగాలి. బట్టర్ ఫ్లై వచ్చి ఆ మొక్కల మీద గుడ్లు పెడితే క్యాటర్‌పిల్లర్స్ కు సరిపోయేంత ఆకు మన కుండీలోనే వుండాలి. అవి తిండిపోతులు, తెలుసా. చాలా ఆకులు కావాలి" అంది.

రజని కుండీలో ధనియాలు చల్లితే, శ్రావ్య వాటి మీద మట్టి చల్లి, నీళ్లు చిలకరించింది. " మొక్కలు ఎప్పుడు వస్తాయి నేనే ముందు లేచి చూడాలి " అంది. "మొలకలు రావడానికి ఐదారు రోజులవుతుందిలే. " "అన్ని రోజులా?" అనుకుంటూ మళ్లీ పిల్లలతో అడుకోడానికి వెళ్లిపోయింది శ్రావ్య.

రజని తన ముందున్న ఇతర కుండీల్లో మట్టి నింపింది. ఒక కుండీలో గోంగూర విత్తనాలు, మరో కుండీలో ఒక మిరపకాయ మొక్క, ఇంకో కుండీలో రెండు టొమేటో మొక్కలు, ఒక కుండీలో మూడు దోసకాయ విత్తనాలు, దోస తీగలు పాకడానికని కుండీ పక్కన ఐదారు చిన్న కుండీల్లో పొద్దుతిరుగుడు పూల విత్తనాలు పెట్టింది రజని. శ్రావ్య కోరిక మేరకు ఆ పక్కనే పక్షులు, సీతాకోక చిలుకలు రావాలని నేలను శుభ్రం చేసి జినియా, బంతి, మందారం, మాండవిల్లా, వెండీస్ విషెస్ పూల మొక్కలు కూడా నాటింది.

శ్రావ్యకు మూడేళ్ళప్పట్నుంచే సీతాకోక చిలుకలంటే భలే ఇష్టం. తను వెళ్లే 'డే కేర్' సెంటర్లో రంగురంగుల పూల మీద బట్టర్ ఫ్లైస్ ఎగురుతుంటే "ఫ్లయింగ్ ఫ్లవర్స్" అంటూ వాటి కోసం పరుగెత్తేది. శ్రావ్య ఇష్టాన్ని గమనించిన రజని ఒక రోజు తనను ఒక ఇన్-డోర్ బట్టర్ ఫ్లై గార్డెన్ కు తీసుకెళ్లింది.

గార్డెన్ లోకి వెళ్ళడానికి టికెట్ కొంటే టికెట్ తో పాటు ఒక చదరపు అడుగు సైజు పేపర్ ఇచ్చారు. అది దళసరిగా వున్న గ్లేజ్డ్ పేపర్. దాని మీద పోస్టల్ స్టాంప్ సైజ్ లో యాభై రకాల సీతాకోక చిలుకల్ని, పేర్లతో సహా ప్రింట్ చేశారు. ఆ పేపర్ ను పట్టుకొని రజని, శ్రావ్య గార్డెన్ లోకి వెళ్లారు. ఎన్నెన్నో సీతాకోక చిలుకలు పొదల మీద, పూల మీద వాలుతూ ఎగురుతుంటే, మరెన్నో గాల్లో ఎగురుతున్నాయి. ఓ పది రకాల సీతాకోక చిలుకలు మాత్రమే వలలాంటి బుట్టల్లో ఎగురుతున్నాయి. శ్రావ్యను పూల పొద అనుకున్నాయేమో సీతాకోక చిలుకలు వచ్చి తన మీద వాలుతున్నాయి. శ్రావ్య కదిలితే వెంటనే ఎగిరిపోతున్నాయి. తన మీద వాలిన సీతాకోక చిలుకల్ని ఆశ్చర్యంగా చూసుకుంటూ కొన్ని క్షణాలు కదలకపోతే, అవి శ్రావ్య మీదనే ఉంటున్నాయి. మాజిక్ తెలుసుకున్న శ్రావ్య కదలకుండా కూర్చుంది ఒక బెంచీ మీద. అవి సుతారంగా ఎగురుతూ వచ్చి శ్రావ్య తల మీద, కళ్ల మీద భుజాల మీద, చేతుల మీద వాలుతున్నాయి. రజని కొద్దిగా దూరంగా వెళ్లి శ్రావ్య మీద వాలిన సీతాకోక చిలుకల్ని తన సెల్ సహాయంతో ఫొటోలు తీసింది. రకరకాల బట్టర్ ఫ్లైస్ చూస్తూ, తమ కిచ్చిన షీట్ లోని బొమ్మలతో పోల్చుకుంటూ, వాటి పేర్లు తెలుసుకుంటూ గార్డెన్ లో చాలా సేపు గడిపారు.

బట్టర్ ఫ్లై గార్డెన్ నుంచి తెచ్చుకున్న షీట్ ను భద్రంగా దాచుకుంది శ్రావ్య. అప్పుడప్పుడే లెటర్స్, వర్డ్స్ నేర్చుకుంటున్నది. అమ్మతో షీట్స్ లోని పేర్లు అడిగి తెలుసుకుంటూ ఆ పేర్లన్నీ నేర్చుకుంది. ఏ రకం బట్టర్ ఫ్లైని చూసినా వెంటనే దాని పేరు చెప్పేది. డాక్యుమెంటరీలో మోనార్క్ బట్టర్ ఫ్లై లైఫ్ సైకిల్ తెలుసుకుని మరింత ఆశ్చర్యానికి లోనయింది. బట్టర్ ఫ్లైలే లోకంగా అమితంగా ప్రేమించింది. ఆ ఏడాది జరిగిన హాలోవిన్ డే కి వాళ్లమ్మతో మోనార్క్ బట్టర్ ఫ్లై కాస్ట్యూమ్స్ కొనిపించుకొంది. ఆ రెక్కలు తగిలించుకొని తనే మోనార్క్ బట్టర్ ఫ్లై అయిపోయినట్టు ఆడుకుంది.

"అమ్మా, నువ్వు వేసే విత్తనాల్లోంచి మొక్కలు మొలుస్తాయి, తరువాత అవి పూలు పూస్తాయి. నేను చెప్పే విత్తనాల్లోంచి కూడా మొక్కలు వస్తాయి. కానీ ఎగిరే పూలు పూస్తాయి. అదే ఫ్లయింగ్ ఫ్లవర్స్ వస్తాయి. కొత్తిమీరను కాటర్ ఫిల్లర్స్ ఇష్టంగా తింటాయి. అందుకే బట్టర్ ఫ్లైస్ కొత్తిమీర మీద వాలి గుడ్లు పెట్టి పోతాయి" అని అంది.

నెలన్నర గడిచే సరికి మందారం పొద గుబురుగా పెరిగి మొగ్గలు తొడిగింది. నాలుగు ఎర్రని పూలు విచ్చుకున్నాయి. మాండవిల్లా కూడా ముదురు పింకు రంగు పూలతో విరగబూసింది. పొద్దుతిరుగుడు పూల మొక్కలు ఏపుగా పెరిగి మొగ్గలు తొడిగాయి. రెండు మొక్కలకు పసుపు పచ్చని రేకులు విచ్చుకుంటున్నాయి. నాలుగు రోజుల్లో అన్ని మొక్కలకు పూలు పూస్తాయని శ్రావ్య, రజని సంబరపడ్డారు. పెరట్లో పూలు పూయడంతో బంబుల్ బీస్ లాంటి రెక్కల పురుగులు, పక్షుల రాక పెరిగింది. బ్లూ జే, ఎల్లో పించ్, రెడ్ కార్డినల్, అమెరికన్ రాబిన్, మాకింగ్ బర్డ్, మోర్నింగ్ డోవ్.. చికిడీస్, చిన్న నల్ల పిట్టలు ... మరి కొన్ని పక్షులు వస్తున్నా ఇంకా హమింగ్ బర్డ్స్ రావడం లేదని శ్రావ్య విచారంగా వుంది.

" బర్డ్స్ వస్తున్నాయి కదా, కొన్ని గింజలు చల్లి, ఓ గిన్నెలో నీళ్లు పోసి వుంచుదామా" అని అడిగింది రజని. శ్రావ్యకు ఐదేళ్లు వచ్చేసరికి పక్షుల్ని కూడా అమితంగా ప్రేమించడం మొదలుపెట్టింది. స్ప్రింగ్ వచ్చిందంటే చాలు పక్షుల కోసం గింజలు చల్లి, ఓ గిన్నెలో నీళ్లు పెట్టేది. బ్యాక్ డోర్ కు దగ్గర్లోనే డైనింగ్ టేబుల్ వుంటుంది. వేసవి సెలవుల్లో డైనింగ్ టేబుల్ మీదే కూర్చొని గంటల కొద్దీ వచ్చి పోయే పక్షుల్ని గమనిస్తూ, టీవీలో బిబిసి, నేచురల్ హిస్టరీ ఛానల్స్ లో పక్షుల గురించిన ప్రోగ్రామ్స్ చూస్తూ గడుపుతుంది శ్రావ్య.

"గింజలు చల్లీ, నీళ్ళు పెట్టకుండా బర్డ్స్ కోసం డోర్ లోంచి చూస్తున్నావ్?" రజని అడిగింది శ్రావ్యను.

" కరోనా కాలం కదా, ఏ బర్డ్ వల్ల ఏం జబ్బులు వస్తాయో అని, బర్డ్స్ కోసం గింజలు చల్లడం, నీళ్లు పెట్టడం చేయకూడదని రూల్ తెలుసా? విండిస్ విషెస్, మండవిల్లా, మందారం పూల మొక్కలు వేసింది హమింగ్ బర్డ్స్ కోసం. అవి రావడంలేదు. వేరే బర్డ్స్ వస్తున్నాయి, కాని అవి పూల మీద వాలవు. ఏమైనా తిండి గింజలో, పురుగులో దొరుకుతాయేమోనని కుండీల్లో, కుండీల పక్కన వెతుక్కుంటున్నాయి."

శ్రావ్య బర్డ్స్ గురించి ఏ చిన్న విషయం చెప్పినా రజినికి ఆశ్చర్యమే. ఇంతలో హమింగ్ బర్డ్ రానే వచ్చింది.రెక్కలు ఆకుపచ్చగా, కాంతితో మెరిసిపోతున్నాయి. పొట్ట కింద తెల్లగా, రెక్కల కింద అంచుల్లో బ్రౌన్ రంగు. సూదిలా పొడవైనా నల్లని ముక్కు. వేగంగా రెక్కలు అల్లాడిస్తూ హెలికాప్టర్ లాగా గాలిలో తేలియాడుతూ సూది లాంటి పొడవైన ముక్కును పూలలోనికి పోనిస్తోంది.

రజని సంతోషంతో " హమింగ్ బర్డ్ కోసం చూస్తున్నావుగా, వచ్చేసింది" అని గుసగుసలాడింది.

"అమ్మా, బ్యాక్ డోర్ మూసే వుంది.డోర్ సౌండ్ ప్రూఫ్ వున్న ది కదా. మన మాటలు దానికి వినిపించవులే. గట్టిగానే మాట్లాడు" మరింత విచారంగా ముఖం ముడిచింది శ్రావ్య.

"కేరింతలు కొడతావనుకుంటే ఇంకా దిగులెందుకు? హమింగ్ బర్డ్ వచ్చిందిగా" అంది రజనీ. శ్రావ్య అరచేయితో నుదిటి మీద కొట్టుకుంటూ " నీకేం తెలియదమ్మా, దాని గొంతు కింద ఎర్రటి చారిక చూశావా? అంటే అది మేల్ హమింగ్ బర్డ్" అంది.

"మేలో, ఫిమేలో. హమింగ్ బర్డ్ అయితే వచ్చింది కదా! ఇప్పుడు ఒకటి వచ్చి పోతే, కాసేపటికో, రేపో మరి కొన్ని వస్తాయిలే" అంది రజని శ్రావ్యను ఊరడిస్తూ. "మేల్ హమింగ్ బర్డ్ వచ్చినందుకే విచారంగా ఉంది."

"పక్షుల దగ్గర కూడా ఈ ఫెమినిస్ట్ ఆలోచనలేమిటీ? జండర్ ఈక్వాలిటీ అని చెబుతూ పిల్లను పిడివాదిగా చేస్తున్నానా?" అనుకుంది రజని.

"మేల్ హమింగ్ బర్డ్ ఒకసారి ఇక్కడికి వచ్చిందంటే, ఈ ఏరియా అంతా తన టెరిటరీ అనుకుంటుంది. తన టెరిటరీలోకి మరో హమింగ్ బర్డ్ ను రానీయదు. అదే ఫిమేల్ బర్డ్ అయితే తన గుంపును తెచ్చుకుంటుంది. అట్లా కొన్ని బర్డ్స్ ఎప్పుడంటే అప్పుడు వచ్చి పోతుంటాయి. మన గార్డెన్ లో వాటికి ఇష్టమైన పూలుండాలే కానీ ఎప్పుడూ వస్తుంటాయి" అంది శ్రావ్య.

పక్షులంటే వుత్తి వుత్తి ఇష్టం కాదు శ్రావ్యకు. డేవిడ్ అటెన్ బరో కథనం తో వున్న పక్షుల గురించిన డాక్యుమెంటరీలు ఇష్టంగా చూస్తూ, వాటి రంగులు, ఇష్టాలు, ప్రవర్తనలు కూడా ఎన్నో తెలుసుకుందే తన పాప అనుకుని రజని సంతోషపడింది.

మరునాడు తెల్లారి మొక్కలకు నీళ్లు పోయాడానికి వెళ్లిన రజని సన్ ఫ్లవర్ మొక్కలను చూసి బిత్తరపోయింది. విచ్చుకున్న

పూలనే కాదు మొగ్గలతో సహా మిగిలిన మొక్కల తలలు అదృశ్యమయ్యాయి. అక్కడ మొక్కలుండేవి అని ఆనవాళ్ళ కోసం అన్నట్టుగా ఒంటి పుల్ల లాగా కాండం, దానికి అటు ఇటుగా రెండు మూడు ఆకులు తప్ప ఏమీ లేవు. అంతలోనే శ్రావ్య గుర్తుకు వచ్చి చాలా దిగులుపడింది. "పాపకు ఎలా చెప్పాలి, ఏడుస్తుంది. ఎలా ఓదార్చాల"ని ఆలోచనల్లో పడింది.

శ్రావ్య రానే వచ్చింది. ఉదయం పచ్చని నీరెండలో మెరిసిపోతూ కేరింతలు కొడుతూ వచ్చింది. పొద్దుతిరుగుడు మొక్కలను చూసి నమ్మలేనట్లు కళ్లు పెద్దవి చేసి చూస్తూ నిలుచుంది. "రాత్రెప్పుడో జింకలు తినేసినట్టున్నాయి" మెల్లగా, విచారంగా అంది రజని.

"అవునవును జింకపిల్లలే తినేసుంటాయి". సంతోషంగా చప్పట్లు కొట్టింది శ్రావ్య. "అవి చాలా ఇష్టంగా తిన్నట్టున్నాయి కదా! రెండు మూడు ఆకులే మిగిలాయి. బుజ్జి జింకలు కడుపు నిండా తిని వుంటాయి. వచ్చే ఏడాది సన్ ఫ్లవర్ సీడ్స్ చాలా వేద్దాం అమ్మా".

జింకలు పూలు తినేసినందుకు సంబరపడిన శ్రావ్యను చూసి రజని తేలికపడింది. అయితే అందమైన పచ్చని పూలు ఉన్నట్టుండి మాయం కావడాన్ని జీర్ణించుకోలేకపోయింది రజని మూడు నాలుగు రోజుల దాకా.

" అమ్మా, ఒక్క క్షణం ఆగు. కొత్తిమీరకు నీళ్లు చల్లకు" అంటూ శ్రావ్య పరుగెత్తుకెళ్లింది రజని దగ్గరకు. రజని, గుబురుగా పెరిగిన కొత్తిమీర మొక్కలకు నీళ్లు పోయడం ఆపి , నీళ్ల మగ్ పట్టుకొని నిలబడిపోయింది శ్రావ్య ఆదేశం మేరకు.

" కొత్తిమీర మొక్కల్ని కాసేపు నిశితంగా చూసిన శ్రావ్య " అమ్మా, చూడూ, కాటర్ పిల్లర్స్ మూడు పాకుతున్నాయి" అంటూ రెండు సెంటీమీటర్లు పొడవున్న ఆకుపచ్చని, సన్నటి పురుగుల్ని చూపించింది. దాని మీద నల్లని, తెల్లని, పసుపు రింగులుగా చారాలున్నాయి "అమ్మా, కాసేపుండు , ఇప్పుడే వస్తాను" అనుకుంటూ గరాజ్ లోకి వెళ్లి నైలాన్ నెట్ తో చేసిన బట్టర్ ఫ్లై బుట్టను తెచ్చింది. "అమ్మా, కొత్తి మీర పాట్ ను కదిలించకుండా ఈ బుట్టలో పెట్టు".

"కొత్తిమీర కుండీ బయటే వుండనీ, ఆ పురుగులు ఏదో ఒక కొమ్మకు ప్యూపాగా (గూడులాగా) అతుక్కున్నప్పుడు దాన్ని బుట్టలో పెడదాం. బుట్టలో వున్న ప్యూపా నుంచి బట్టర్ ఫ్లై గా మారి బయటికి వచ్చినా బుట్టలోనే వుండిపోతుంది" అని ఐడియా ఇచ్చింది రజని.

" కాటర్ పిల్లర్స్ బయటే వుంటే బర్డ్స్ తినొచ్చు. ఆకుల కోసం పాక్కుంటూ కుండీ బయటికి పోతే ఎండకు చచ్చిపోతాయి" అంది శ్రావ్య.

"అవునవును, నువ్వు చెప్పినట్టే చేద్దాం" అంటూ కొత్తిమీర కుండీని బుట్టలో పెట్టి ఇంట్లోకి తెచ్చింది రజని. ఒక మూలన స్టూల్ మీద బుట్టను పెట్టారు. రోజూ పదిసార్లయినా ఆ కాటర్ పిల్లర్స్ ను చూస్తూ మురిసిపోయేది శ్రావ్య. రజని కి మాత్రం అవి పురుగులే వాటి వైపు చూస్తే జుగుప్సగా వుండేది. అయినా రోజు రోజుకు అవి పొడవు సాగడం, లావు కావడం ఆశ్చర్యంగా వుండేది. ఎందుకైనా మంచిదని రెండు సన్నటి పొడవైన పుల్లల్ని కూడా బుట్టలోకి జారవిడిచింది శ్రావ్య. కాటర్ పిల్లర్స్ మూడో దశలోకి మారినప్పుడు ప్యూపా పుల్లలకు అతుక్కొని వుండాలని. ఐదు రోజుల్లో ఆకునంతా తినేశాయి. లేత కొమ్మల్ని కూడా మిగల్చలేదు. రెండుమూడు గట్టి పుల్లలు మాత్రమే మిగిలాయి. "కొత్తిమీర ఆకు సరిపోలేదేమో షాప్ నుంచి కొనుక్కొరానా" అని అడిగింది రజని. తొందరగా పోయి రాగలవా, అరగంట సేపు వాటికి తిండిలేకపోతే చచ్చి పోతాయేమో అని ఆందోళన పడింది శ్రావ్య. అంతలోనే, "అమ్మ అవసరం లేదు.కాటర్ పిల్లర్స్ కు ఒక చివరన జిగురు వస్తోంది. అంటే అవి క్రిసలెస్ గా మారుతున్నాయి. కాసేపట్లోనే అవి క్రిసలెస్ గా మారిపోవడం అది కూడా ఎండిన ఆకు రంగులో. ఒకటి కొత్తిమీర కాండం కే అతుకుంటే, మరోటి ఎండుపుల్లకు, ఇంకోటి బుట్ట పై మూతకు అతుక్కున్నాయి.ఈ వింత అంతా గంటలో జరిగిపోయింది. "అమ్మా, ఒక్క వారమన్నా రెస్ట్ తీసుకుంటాయి అవి" అని బుట్ట దగ్గరి నుంచి దూరంగా వెళ్లింది శ్రావ్య. ఇక శ్రావ్యకు కూడా విశ్రాంతే అనుకుంది రజని. కానీ రోజు ఉదయం లేస్తూనే ఆ బుట్ట దగ్గర తచ్చాడుతుంది శ్రావ్య.

ఐదో రోజే " అమ్మా, అమ్మా, చూడు, క్రిసలెస్ పై పొర గ్లాస్ లాగా ఎలా వుందో లోపల నల్లని, ఆరెంజ్ రంగులు కనిపిస్తున్నాయి"

శ్రావ్య మాటల్లోని ఆనందం, ఆశ్చర్యం రజనీ మనసులోనూ ప్రతిఫలించాయి. రజనీ పరుగున బుట్ట దగ్గరకు వచ్చి చూసింది.

"అమ్మా, కొన్ని మినిట్స్ లోనో, కొన్ని గంటల్లోనో బట్టర్ ఫ్లైస్ బయటకు వస్తాయి. నేను ఇక్కడే వుంటాను ఎంత సేపైనా." అంది. తనను దేనికోసం పిలవకూడదని, తను అక్కడ్నించి కదలనని అమ్మకు ముందే చెప్పేసుకుంది. ఓపికగా బుట్టవైపు చూస్తూ కూర్చుంది ప్రకృతి వింతను చూడ్డానికి.

" అమ్మా, ఒక సహాయం చేయి. ఒక సాసర్ లో రెండు మూడు ఆరెంజ్ పండ్ల తొనల్ని, షుగర్ నీళ్లల్లో ముంచి తీసిన రెండు కాటన్ వుండల్ని పెట్టి ఇవ్వు. అవి బుట్టలో పెడతాను. బయటికి వచ్చిన బట్టర్ ఫ్లైస్ కు మనం ఇచ్చే విందు అది అంది. శ్రావ్య అడిగినవి చేసి ఇచ్చింది రజని. బుట్టలో మెల్లగా సాసర్ ను పెట్టి బుట్ట ఎదురుగా ఒక కుర్చీలో కూర్చొని ఎదురు చూస్తూ ఉంది శ్రావ్య.

రెండుగంటలు గడిచాయి . ఒక ప్యూపాలో కదలిక, మెల్లగా అది చిరుగుతున్నది." అమ్మా చూడు, చూడు" అంటూ కేక వేసింది. రజని కూడా ఆ వింతను చూస్తూ వుంది. అందులోంచి కొద్ది కొద్ది గా బట్టర్ ఫ్లై బయటికి కనిపిస్తున్నది. విచిత్రంగా ప్యూపా నుంచి రెండు మూడు నెత్తురు చుక్కలు రాలిపడ్డాయి. బట్టర్ ఫ్లై సుతారంగా రెక్కలు కదిలించింది. తడి రెక్కల్నే ఆరబెట్టుకుంటున్నట్లు. మరి కొన్ని క్షణాల్లో రెక్కల్లోకి ఆక్సిజన్ ను పంప్ చేసుకోడానికి రెక్కల్ని వేగంగా కదిలించింది. మరో రెండు గంటలు గడిచే సరికి మూడు అందమైన మోనార్క్ బట్టర్ ఫ్లై లు బయటికి వచ్చాయి. "సాయంత్రమయింది. చీకట్లో ఏంతోదూరం పోలేవు. రేపు ఉదయాన్నే బ్యాక్ యార్డ్ లో బుట్ట తెరిచి బట్టర్ ఫ్లైస్ ను విముక్తి చేద్దాం" అని చెప్పింది శ్రావ్య. "బట్టర్ ఫ్లైస్ ను ఒక రోజంతా తన దగ్గర వుంచుకోవాలనుకుంటున్నది శ్రావ్య. ఎలాగూ వాటికి కావలసిన ఫుడ్ వుంది" అనుకుంది రజని.

మరునాడు ఉదయం బుట్ట తెరిచే సరికి అవి ఒక దాని తరువాత ఒకటి బయటికి వచ్చి ఆకాశంలోకి ఎగిరిపోయాయి. శ్రావ్య ఆనందంతో చప్పట్లు చరుస్తూ వుండిపోయింది చాలా సేపు. తీరికలేని కోలాహలంతో, ఉత్సాహంగా సాగిన ఆ రెండు వారాలు,ఆకస్మికంగా ముగిసిపోయినట్టు, చాల వెలితిగా అనిపించింది శ్రావ్యకు.

రజనికి, శ్రావ్యకు సమ్మర్ సెలవులు తోట పనులతో సందడిగా గడిచాయి.

కుందేల్లు, జింకలు, ఉడతలు తినగా రెండు టమోటా మొక్కలకు కాసిన ఐదు టమోటాలు, ఒక దోస తీగకు కాసిన రెండు దోసకాయలు శ్రావ్య, రజని కూడా తిన్నారు. ఒక మిరపమొక్కకు కాసిన మిరపకాయలు ఉప్మా కోసమని అడపాదడపా రెండు మూడు తెంచింది రజని. రెండు సార్లు గోంగూర కూడా తెంచి గోంగూర పప్పు వండి శ్రావ్యకు తినిపించింది.

అన్నిటి కన్నా కొత్తిమీర వల్ల వచ్చిన బట్టర్ ఫ్లైస్ పంట తల్లీకూతుళ్ల లో చాలా సంతోషం నింపింది



రెనొవేషన్

- పద్మావతి రాంభక్త

ఇరుకు గోడల నడుమ
మొలకపూలు పూసి
పొడవుగా సాగుతున్నపుడు
ఇంటికి ఊపిరాడలేదు.

ఇక పసిది పుప్పొడి వెదజల్లాక
మరుగు కరువైంది
నింగికి నిచ్చెనలు నిర్మించడానికి
కాగితంపై కలమై కదులుతుంటే
గాలిశబ్దం సైతం బరువైంది

అదిగో అప్పుడే
పాత కొత్తలను మేళవించి
స్వర్గాన్ని ఇలకు దింపాలనే
ఆలోచన మొదలైంది

అలా
పునాదులను కదపకుండా
చీకటి గుహలను విశాలం చేసి
వెలుతురును వెన్నెలను లోనికి ఆహ్వానించాం
రోడ్డుపై నడిచే వానను
చూపులతో ఒడిసిపట్టడానికి
కిటికీ కళ్ళను అమర్చాం

ఇదే స్థలంలో
ఎన్నో గొంగళీలు సీతాకోకలై ఎగిరాయి
కాలం నీడలు నెమ్మదిగా పాకుతూ
పరుగందుకున్నాయి

అంత అందమైన చరిత్రను
గుండెల్లో దాచుకున్న గూట్లోకి
రంగులు ఒంపి ఇంద్రధనుస్సులా ముస్తాబుజేసాం
పూర్తైన వర్ణచిత్రాన్ని సంభ్రమంతో చూసి మురిసి
నవ్వులచినుకులై కురిసిపోయాం

అప్పటి ఇంటికి తాపడం చేసిన కలలు
అలాగే ఉన్నాయి
ఆయన అమ్మానాన్నల శ్వాసలు
ఇక్కడిక్కడే తిరుగుతున్నాయి

ఇదివరకటి ఇల్లే నేడు మెరుపు బట్టలేసుకుని
పెళ్ళికూతురిలా ముస్తాబై మా పాదాలను ప్రేమగా మోస్తోంది
బహుశా మరొక తరాన్ని కూడా తప్పక చూస్తుంది

–

137

తెలుగుసాహిత్యం మీద సంస్కృతసాహిత్య ప్రభావం

- కె. వి. ఎస్. రామారావు

"మనకు తెలుగే సరిగ్గా రాదు; ఇక సంస్కృతం కూడానా?" – ఒక పాత సినిమా పాత్ర.

ఇది ఇప్పటి పరిస్థితి. యాభై యేళ్ల క్రితం వరకు సంస్కృతసాహిత్యంతో మంచి పరిచయం ఉన్న తెలుగువాళ్లు ఊరికి ఒకరిద్దరైనా ఉండేవారు. అలాగే, సంస్కృతసాహిత్యంలో గట్టిపట్టు లేకుండా తెలుగుకవులమని చెప్పుకోవటానికి ఎవరూ సాహసించేవారు కారు. ఎందుకని?

నన్నయకి ముందున్న తెలుగు సాహిత్యం గురించి మనకి పెద్దగా తెలీదు కాని అప్పటికున్న సంస్కృత సాహిత్యం చాలా విశాలమైంది. వేదసాహిత్యం, కావ్య పురాణాలు, ఇతర శాస్త్రాలు కూడ అప్పటికే ఎన్నో వచ్చాయి. ప్రాకృతం, పాళీ లాటి ఇతర భాషల్లో సాహిత్యం వున్నా అది సంస్కృతంలో వున్నంత విస్తృతం కాదు. అందువల్ల సహజంగానే సంస్కృత సాహిత్యం సాహిత్యాభిలాషుల్ని ఆకర్షించింది, ఆకట్టుకుంది. రామాయణ భారతాలు, పురాణాలలో వున్న కథలు ప్రజల్ని తన్మయుల్ని చేశాయి. పౌరాణికులు ఆ కథలకి తమ వ్యాఖ్యానాల్ని జోడించి "దేశ" భాషల శ్రోతల్ని మంత్రముగ్ధుల్ని చేస్తూ విస్తృతప్రచారాలు కలిగించారు. అలా సంస్కృతం దేశాంతరభాషగా అన్ని ప్రాంతాల వారికి ఆమోదయోగ్యం అయింది.

దాంతో ప్రాంతీయభాషల్లో సాహిత్యసృష్టికి పూనుకున్నవాళ్లకి సంస్కృత సాహిత్యంలో విస్తారంగా వున్న కథలు కరతలామలకాలుగా కనపడ్డాయి. కొందరికి రామాయణకథ నచ్చితే మరికొందరికి భారత భాగవతాలు తొలి ప్రయత్నాలకి అనుకూలంగా కనపడ్డాయి. బహుశా నన్నయకి భారతకథా విస్తృతి తన కవితాశక్తిని చూపటానికి సరైన మార్గంగా కనిపించివుండొచ్చు. ఆయన భారతకథల్ని తీసుకుని తన భావనాబలంతో వాటికి జీవం పోసి తెలుగులో కవిత్వానికి ఆద్యుడయాడు, ఆరాధ్యుడయాడు. అప్పటికే సంస్కృతంలో గద్యసాహిత్యం కూడ వచ్చివుంది. బాణభట్టు కాదంబరి, దండి దశకుమారచరిత్ర వీటిలో తలమానికాలుగా నిలిచాయి. కాని నన్నయ ఆ మార్గాన కాకుండా భారత రచనకి పద్య-గద్య మిళితమైన చంపూ శైలిని ఎన్నుకోవటం జరిగింది. తెలుగులో పూర్తిగా గద్య రచనలకి అప్పటికి ఎలాటి మూసలూ లేకపోవటం ఇందుకు ఒక కారణం కావొచ్చు. కన్నడంలో అంతకు కొద్దికాలం ముందే వచ్చిన పంప భారతం చంపూ శైలిలో ఉండటం మరో కారణం కావొచ్చు. కాకుంటే పంప జైనుడు. నన్నయ వైదికధర్మగ్రంథంగా భారతాన్ని చూశాడు. కనుక ఒకే మూలభారతకథని తీసుకున్నా దాన్ని వారు వారి భాషల్లో నడిపించిన దారులు వేరు. అలా ఒక విధంగా చూస్తే నన్నయ భారతం మీద మూల భారతంతో పాటు కన్నడ భారత ప్రభావం కూడ ఉందనుకోవచ్చు.ఇక్కడ 'ప్రభావం' అనే మాటని చాలా జాగ్రత్తగా వాడాలి. భారత కథని సంస్కృత మూలాన్నుంచి తీసుకున్నంత మాత్రాన సంస్కృత సాహిత్య ప్రభావం ఆంధ్రభారతం మీద వుందనటానికి లేదు. ఒకవేళ ఆ కథ ప్రాకృతం నుంచి వచ్చిందనుకోండి,

అప్పుడు సంస్కృత సాహిత్య ప్రభావం లేదనుకోవాలా?

విస్తృతమైన కథాసంపద కన్నా ముఖ్యం సాహిత్యస్వభావాన్ని నిర్దేశించే శాస్త్రాలు. అవి సంస్కృతంలోనే వచ్చాయి. తెలుగు సాహిత్యం మీద వాటి ప్రభావం చాలా ముఖ్యమైంది. అలంకారశాస్త్రం కవిత్వం ఎలా వుండాలి, ఏ విషయాల్ని ఎలా వ్యక్తీకరించాలి, ఏ భావచిత్రాలు ఆమోదయోగ్యాలు, ఏవి పరిహార్యాలు – ఇలాటి విషయాల్ని అప్పటికే నిష్కర్షగా, నిశ్చితంగా నిర్దేశించాయి. కారణాలు ఏవైనా కాని, తొలి తెలుగు కవులు వీటిని పూర్తిగా ఒప్పేసుకున్నారు, తెలుగు సాహిత్యానికీ అవే ప్రమాణాలుగా పాటించారు. ఈ నిర్ణయం వల్ల సంస్కృతసాహిత్యం అర్థమైతే తెలుగు సాహిత్యం కూడ అవే పునాదుల మీద తయారైంది కనుక దాన్ని అర్థం చేసుకోవటం కూడ తేలికైంది (తెలుగు సాహిత్యానికీ కొన్ని ప్రత్యేకతలున్నాయి, వాటి గురించి కొంచెం ముందుముందు చర్చిద్దాం). అలాగే సంస్కృతసాహిత్యంలో గట్టిపట్టు వున్న

వాళ్లకి తెలుగులో సాహిత్యం తయారుచెయ్యటం తేలికైంది.

ఒక చిన్న ఉదాహరణ చూద్దాం. బాణభట్టు "కాదంబరి" ఒక అద్భుతకథాకావ్యం. పూర్తిగా గద్యంలో రాయబడింది. దాని

కథాభాగం ఇలా మొదలుతుంది – ఆసీదసీద నరపతిశిర స్సమభ్యర్చిత శాసనః పాకశాసన ఇవాపరః చతురుదధి మాలా మేఖలాయా భువో భర్తా ప్రతాపానురా గావనత సమస్త సామంత చక్రః చక్రవర్తి లక్షణోపేతః చక్రధర ఇవ కరకమలోప లక్ష్యమాణ శంఖ చక్ర లాంఛనః హర ఇవ జితమన్మథః గుహ ఇవా ప్రలిహిత శక్తిః కమలయోనిరివ విమానీకృత రాజహంస మండలః జలధిరివ లక్ష్మీప్రసూతిః గంగాప్రవాహ రివ భగీరథ పద ప్రవర్తః రవి రివ ప్రతి దివ సోపజాయమానోదయః మేరు రివ సకల భువన తలోపజీవ్యమాన పాదచ్ఛాయః దిగ్గజ ఇ వానవరత ప్రవృత్త దా నార్ద్రీకృత కరః ... ఇలా సాగుతుంది శూద్రక మహారాజు వర్ణన. తెలుగు సాహిత్యంతో కొద్ది పరిచయం వున్న వారికైనా ఇలా సంధుల్ని విడదీసి చూస్తే ఇట్టే అర్థమై పోతుంది – సంస్కృతం ఏమాత్రం నేర్చుకోకపోయినా. ఎందువల్ల?

ఇందులో తొలి వాక్యం చూడండి – ఒక చక్రవర్తికి సామంతరాజులు శిరస్సులు వంచి నమస్కరించటం అనేది పురాణ తెలుగుసాహిత్యంలో ప్రతికథలోనూ కనిపించే అంశం. అందువల్ల తొలి ఒకటిరెండు పదాలు చూడటంతోనే ఆ తర్వాత ఏమి రాబోతుందో మనం ముందే ఊహించగలం. "చతురుదధి మాలా మేఖలాయా భువో భర్తా" చూడండి – "చతుస్సముద్రవేలావలయిత" అనే ప్రయోగం మనకు చిరపరిచితమే. "ప్రతాపానురా గావనత సమస్త సామంత చక్రః" అందామా – తన ప్రతాపంతో సమస్త సామంతుల శిరస్సుల్ని వంచాడు అనేదీ కొత్తవిషయమేమీ కాదు. ఇక విష్ణువులాగా కరకమలాల్లో శంఖచక్ర లాంఛనాలుండటం, జితమన్మథుడు కావటం ... ఇవన్నీ తెలుగుసాహిత్యంలో ప్రతిచోటా కనిపించే భావచిత్రాలే.

ఉదాహరణకి నన్నయ భారతం నుంచి ఈ ప్రముఖపద్యం చూద్దాం:

రాజకులైకభూషణుడు రాజమనోహరు డన్యరాజ తే
జోజయశాలి శౌర్యుడు విశుద్ధ యశశ్శరదిందుచంద్రికా
రాజితసర్వలోకు డపరాజిత భూరిభుజా కృపాణ ధా
రా జల శాంత శాత్రవ పరాగుడు రాజమహేంద్రు డున్నతిన్

రెంటికీ ఎంతో సాన్నిహిత్యం కనిపిస్తుంది కదా ! దీనర్థం నన్నయ కాదంబరి నుంచి ఈ భావచిత్రాలు తీసుకున్నాడని కాదు. సంస్కృత సాహిత్యం అంతటా ఇలాటి భావచిత్రాలు వున్నాయి – అది భారతం కానీ కాదంబరి కానీ మరోటి కానీ. నన్నయ, ఆ తర్వాతి తెలుగు కవులు సంస్కృత అలంకారాలకి ఇచ్చిన ప్రాధాన్యత వల్ల ప్రాచీనతెలుగు సాహిత్యంలో భాష తెలుగు కాని భావాలు సంస్కృతం అని అనటంలో కొంతైనా నిజం వుంది.

సంస్కృతంలోని ఎన్నో ప్రయోగాల్ని తెలుగులోకి పూర్తిగా దిగుమతి చేసుకోవటం వల్ల "తెలుగుకి సంస్కృతం తల్లి" అన్న భావన బలంగా నాటుకుంది. క్రీడాభిరామ కర్త దీన్ని స్పష్టంగా "జనని సంస్కృతంబు సకల భాషలకును/ దేశభాషలందు తెలుగు లెస్స/ జగతి తల్లికంటె సౌభాగ్యసంపద/ మెచ్చుటాదుబిడ్డ మేలుగాదె" అంటాడు. నిజానికి ఇది కొంతవరకు సాహిత్యానికి వర్తిస్తుంది కాని భాషకు కాదు. తెలుగుభాషకు సంస్కృతభాష తల్లి కాదు. పైన చెప్పిన అర్థంలో పాత తెలుగు సాహిత్యానికి సంస్కృతసాహిత్యం తల్లి అని ఒప్పుకోవచ్చు.

సంస్కృత అలంకారశాస్త్రం ద్వారా మనకు కావ్యలక్షణ ప్రమాణాలు, ఉపమాద్యలంకారాలు వాటి ప్రయోగాలు, వాటిలోంచి వచ్చే పదచిత్రాలు, ఆ పదచిత్రాల్ని గుదిగుచ్చి వ్యక్తీకరించే భావచిత్రాలు దొరికాయి. తెలుగు భాషకి, ప్రాంతానికి ప్రత్యేకమైన భావాలు, ప్రయోగాలు చొప్పించటానికి ప్రయత్నించిన కవులు లేకపోలేదు గాని ఆ ప్రయత్నం ఇటీవల, అంటే పదిహేనో శతాబ్ది తర్వాతనే ఎక్కువగా కనిపిస్తుంది. ముఖ్యంగా అన్నమయ్య, తెనాలి రామకృష్ణుడు లాటి వాళ్ల రచనల్లో మనం ఇది చూస్తాం. ఐతే అప్పుడుకూడా తొంభైశాతం పైగా తెలుగు కవులు సంస్కృత అలంకారశాస్త్రాల్ని విధిగా అనుసరించిన వారే. ఇరవైయో శతాబ్దంలోనే తెలుగు సాహిత్యంలో ఈ పోకడపై తీవ్రమైన తిరుగుబాటు వచ్చింది.

తొలినాళ్లలో తెలుగు జాతీయల్ని వాడిన వాళ్లలో ముఖ్యులు శైవకవులు. ఐతే మిగిలిన వాళ్లు వారిని "దేశికవులు"గా ముద్రవేసి చాలావరకు పక్కకు నెట్టేశారు. విమర్శకులు సైతం సంస్కృత అలంకారశాస్త్రాల దృష్టితోనే తెలుగు సాహిత్యాన్ని

బేరీజు వేశారు. "మార్గకవిత్వం" ప్రధానమర్గమని, దేశికవిత్వం దానికన్నా తక్కువ జాతిదని నిర్ధారించేశారు.

ఇదే ఛందశ్శాస్త్ర విషయానికి వచ్చేసరికి తెలుగు కవులు కొంత స్వతంత్రతని ప్రదర్శించారు.

సంస్కృతసాహిత్యం ముందుగా మౌఖికసాహిత్యంగా మొదలైంది. అప్పటికి సాహిత్యాన్ని లిఖితరూపంలో తయారుచెయ్యటం మొదలుకాలేదు. అందువల్ల సంస్కృత ఛందస్సులో కొన్ని ముఖ్యాంశాలు మౌఖితరూపానికి అనుగుణంగా వున్నాయి. ఒకటి – శ్లోకపాదాల మధ్యలో ఒక విరామస్థానం వుండటం, ఆ విరామస్థానం ఒకపదాన్ని విరిచేట్టు లేకపోవటం. అంటే విరామస్థానంలో ఒక పదం మొదలౌతుంది. అదే కారణం వల్ల పాదాంతంలో పదం విరగటానికి కూడ వీల్లేదు. ఏ పాదానికి ఆ పాదం విడిగా వుంటుందన్నమాట. ఉదాహరణకి కాళిదాసు మేఘదూతం

నుంచి ఈ తొలిశ్లోకం చూడండి –

కశ్చిత్ కాంతా విరహ గురుణా స్వాధికారాత్ ప్రమత్తః
శాపే నాస్తంగమితమహిమా వర్షభోగ్యేణ భర్తుః
యక్ష శ్చక్రే జనకతనయా స్నాన పుణ్యోదకేషు
స్నిగ్ధచ్ఛాయా తరుషు వసతిం రామగిర్యాశ్రమేషు

ఏ పాదానికి ఆ పాదం చక్కగా విరుగుతుంది, తొలిపాదంలో విరామం "గురుణా" తర్వాత, రెండోపాదంలో "మహిమా" తర్వాత,.. ఇలా ప్రతిపాదంలోనూ ఒక పదం మొదలుకావటానికి ముందుగా వుంటుంది. ఐతే తెలుగులో భారీస్థాయిలో సాహిత్యం మొదలయేనాటి పరిస్థితులు వేరు. తాళపత్రాల మీద రాయటం సర్వసాధారణమైంది, ఎంతోకాలం మన్నేలాగా తాళపత్రాల్ని తయారుచేసే విజ్ఞానం కూడ సంఘంలో తయారైవుంది. కనుక సంస్కృత ఛందస్సులో వున్న ఈ రెండు ప్రధాన నియమాల్ని తెలుగులో కూడ పాటించాల్సిన అవసరం లేదు. ఆ విషయాన్ని గుర్తించి వాటిని వదిలెయ్యటం తొలినాటి తెలుగు కవులు తీసుకున్న ఒక అద్భుతనిర్ణయం. విరామం స్థానంలో యతి వచ్చింది. ఒక సమాసం ఎన్ని పాదాలకైనా విస్తరించే సదుపాయం కలిగింది. వీటిని సమర్థులైన కవులు ఎంతో చాకచక్యంగా వాడుకుని అజరామరంగా నిలిచిపోయే పద్యాలు తయారుచేశారు. ఆదికవిగా భావించబడే నన్నయ "అక్షరరమ్యత" జాలువారే మహోన్నత కవిత్వాన్ని వెలువరించాడు. ఆ తర్వాతి తరాల వారికి మార్గదర్శిగా నిలిచాడు. ఆ తర్వాత శ్రీనాథాదులు, ప్రబంధయుగపు మహాకవులు పెద్దన, భట్టుమూర్తి లాటివాళ్లు, ఆ తర్వాత దక్షిణాంధ్రయుగంలోని అనేకమంది కవులు తెలుగు సాహిత్యాన్ని సుసంపన్నం చేశారు. కాలానుగుణంగా ఎన్నో కొత్తపుంతలు తొక్కారు. పద్యసాహిత్యమే కాకుండా పదసాహిత్యం, యక్షగానాలు, నాటకాలు, కొంతవరకు గద్యసాహిత్యం కూడ సృష్టించారు. పశ్చిమదేశాల సాహిత్యపఠన ప్రభావంతో కొత్తరకమైన సాహిత్యం తయారైంది. పఠాభి, శ్రీరంగం నారాయణబాబు లాటి వాళ్లు పనికట్టుకుని సంస్కృతప్రభావాన్ని ప్రశ్నిస్తూ పాత కవిసమయాల్ని వెక్కిరించారు, ఎగతాళి చేశారు, ఎండగట్టారు. సంస్కృత సాహిత్యప్రభావాన్ని పూర్తిగా తిరస్కరించని కృష్ణశాస్త్రి, శ్రీశ్రీ, తిలక్ లాటి కవులు కూడ కొత్తకొత్త ప్రయోగాలు చేశారు. ఐతే ఆ తరం వరకు కాస్త డొక్కశుద్ధి వున్న తెలుగుకవులంతా సంస్కృతసాహిత్యంతో మంచి పరిచయం వున్నవారే. వాళ్లు మొదలెట్టిన కవితావిప్లవాల వల్ల, ప్రపంచీకరణ వల్ల కలిగిన అనేక పరిణామాల వల్ల తర్వాతి తరాల వాళ్లు సంస్కృతసాహిత్యాన్నే కాదు, తెలుగుసాహిత్యాన్ని కూడ పట్టించుకోవటం మానేశారు. చివరకు సాహిత్యం మాట దేవుడెరుగు, మాట్లాడగలిగే స్థాయి తెలుగు వచ్చినా చాలుననుకునే స్థాయికి వచ్చింది తెలుగుభాష పరిస్థితి.

జిజ్ఞాసువులు అసలిప్పుడు తెలుగు ఒక ప్రత్యేకభాషగా ఎంతకాలం మనగలుగుతుందనే ప్రశ్న వేసుకోవాల్సిన సమయం వచ్చినట్లు కనిపిస్తుంది.



ఋతువుల్లో

- తమ్మినేని యదుకుల భూషణ్

నర మానవుడు
తిరగలేని మంచులో
పలకరించే దిక్కులేక
పార్కులో ఓ మూల
కప్పడి పోయింది
ఒంటరి బెంచి

ఎండ వేడికి
తలలు వాల్చిన
పొద్దు తిరుగుడు పూవుల మధ్య
దండివానలలో
తడిపి వేసే
దుందుడుకు మేఘాల మధ్య
పరిగెత్తే నన్ను
పండుబారిన ఆకు
ఒకటి రాలి పడి
'ఋతువు మారుతున్నద'ని
సుతారంగా తెలిపింది.

నల్లని ఇంటి కప్పు మీద
రాలే పండుబారిన ఆకులు!
కోత బెట్టే చలిగాలి
గుబురు తగ్గిన కొమ్మలను
వెలిగించే వెచ్చని ఎండ
'ప్రియా
ప్రయాణం
ముగిసి పోయింది '

ఆకురాలు కాలం
చీకటి రాత్రులు , దీర్ఘమై
సన్నటి వానలో తడిచిన
సమాధి ఫలకాల మీద
పరుచుకునే ఉదయపు
లేత ఎండ పలుకరించి
బరువెక్కిన గుండెను
తేలిక పరుస్తుంది
–



చెట్టపట్టాల్ పట్టుకుని
దేశస్థులంతా నడవ వలెనోయి
అన్నదమ్ముల వలెను జాతులు
మతములన్నీ మెలగవలెనోయి
ఆకులందున అణగి మణగీ
కవిత కోయిల పలకవలెనోయి
పలుకులను విని దేశమందభి
మానములు మొలకెత్తవలనోయి !
(గురజాడ - దేశభక్తి)

141

అమెరికాలో వానప్రస్థం

- భారతి భావరాజు

'వానప్రస్థం' అనే మాట కు ఈ మధ్యనే ఒక ప్రవచనం లో విన్న అర్థం: 'వానప్రస్థం అనేది వైదిక ఆశ్రమ వ్యవస్థలో భాగం. వ్యక్తి ఇంటి బాధ్యతలను తరువాతి తరానికి అప్పగించి, సలహాదారు పాత్రను స్వీకరించి, క్రమంగా ఐహిక బంధాల నుండి ప్రక్కకు తొలగడంతో ప్రారంభమవుతుంది.'

21 వ శతాబ్దంలో, అందులో అమెరికాలో ఈ మధ్యనే పదవీ విరమణ అంటే 'రిటైర్' అయిన మా శ్రీవారి వానప్రస్థం గురించి మీకు చెప్పాలని నా ప్రయత్నం. రిటైర్ అయిన వెంటనే పార్టీలు, అభినందనలు, వాటికి కృతజ్ఞతలు చెప్పడం అన్నీ నెలరోజులపాటు ఒక కలగా గడిచిపోయాయి. ఇక ఒకరోజు ప్రొద్దుటే కాఫీ త్రాగుతూ, ఇంక అంతా స్వేచ్ఛ, తాను అనుకున్నట్టు చెయ్యచ్చు, ప్రొద్దుటే లేచి ఉద్యోగానికి వెళ్ళ వలసిన తొందర లేదు అని అంటూ ఒక తెల్ల కాగితం, పెన్ను దగ్గర పెట్టుకుని, ఇక ఇంట్లో చేయ వలసిన పనులు, ఇండియా ప్రయాణాలు, చేయవలసిన వినోదయాత్రలు (Bucket list), చదవ వలసిన పుస్తకాలు, రాద్దామనుకున్న స్వీయ చరిత్ర, కలవాలనుకున్న బంధు మిత్రులు, ఇల్లా అనుకుంటూ, ఏ వరసలో ఇవన్నీ చేయాలా రాసుకోవడం ఇంజనీర్ గా తన మొదటి పని అంటూ పెద్ద జాబితాలో తోచిన వన్నీ రాశారు. అంతవరకు బాగానే వుంది. అప్పటికే కొన్ని సంవత్సరాల క్రితం లైబ్రరీ ఉద్యోగం నుండి రిటైర్ అయిన నాకు, ఇదే విధంగా కలలు కన్న నా ఆశలు, నిరాశలు కళ్ల ముందు కాసేపు మెదిలాయి.

ఒక మంచి ముహూర్తాన మావారు, బేస్ మెంట్ లో దశాబ్దాలుగా కూడబెట్టిన వస్తువులని (ఇప్పుడు వాటినే 'చెత్త' అంటున్నాం) తగ్గించడం తను చేయవలసిన మొదటి పనిగా మొదలు పెట్టారు. అయినా మనం ఇక అవసరం లేనివి, పనికిరానివి, పని చేయని వస్తువులని తగ్గించడం ముందు ముందు మన పిల్లలకు మనం చేయబోయే ఉపకారం అన్నారు, మా ఇద్దరి వయస్సు గుర్తుచేస్తూ. మొదట బేస్ మెంట్ లో ఉన్న కేసెట్స్, డీవీడీలు, సీడీలు, వాటితో బాటు వాటి ప్లేయర్స్ మరెన్నో, చాలా బాధపడుతూనే పారేశాము. నిజమే! యూట్యూబ్, వాట్సాప్ లాంటి అంతర్జాల పరికరాలు మన చుట్టూ వుండగా సంతోషించాలేగాని బాధపడ కూడదన్నారు మావారు. ఇవీ కాక 8 షెల్ఫుల నిండా పేర్చిన పుస్తకాల మాటేమిటి? నేను, మావారు ఎన్నో ఏళ్లగా బేస్మెంట్ లో మాకు నచ్చిన పుస్తకాలని చిన్న గ్రంధాలయంగా అమర్చాం. వచ్చిన బంధుమిత్రులకి గర్వంగా చూపించిన ఈ తెలుగు పుస్తకాల నిధిని వదులుకోవడం మనస్కరించక పోయినా, ఇక తప్పదని తెలుసు. వింత ఏమంటే, అదే బంధుమిత్రులని మీకు నచ్చినవి తీసుకోమంటే, కంప్యూటర్ ద్వారా అంతర్జాల పత్రికలు, పుస్తకాలు కొల్లలు, మాకే మా పుస్తకాలని ఏం చేయ్యాలనే సందిగ్ధం లో వున్నా మంటారు. మావారు మా పుస్తకాలు తీసుకుంటే షెల్ఫ్ కూడా ఇస్తా మన్నారు. విన్నవారు నవ్వేసి తప్పుకున్నారు. ఇక తెలుగు భాషకన్నా ఇంగ్లీషు భాషాభిమానులైన మా అమ్మాయిలు షెల్ఫ్ తీసుకుంటాం కానీ పుస్తకాలు వద్దన్నారు.

ఇవన్నీ ఆలోచిస్తుంటే, నా దిగులంతా వానప్రస్థం మాట అటుంచి, ఎంతో జాగ్రత్తగా ఇండియా నుంచి తెచ్చుకున్న వెండి వస్తువులు, బంగారు నగలు, పట్టు చీరలు మాటేమిటని మరింత బాధతో జవాబులకోసం స్నేహితురాళ్ళని అడిగితే, అదే పరిస్థితిలో వున్నామంటూ, పిల్లలకు అమెరికా వస్తువుల మీదున్న మమకారం మన ఇండియా వస్తువుల మీద ఏమాత్రం ఉండదన్నారు. మరి వానప్రస్థంలో ముందుకెళ్లడం ఏలా? పెద్ద సమస్యే!

మరి పెద్దవాళ్లగా ఎన్నో ఏళ్లగా సంపాదించుకున్న మా అనుభవాలని ఈతరం పిల్లలకు చెప్పాలంటే, పాత బడిన ఆలోచనలగా అనిపిస్తాయి. పైన ప్రవచనంలో చెప్పిన 'సలహాదారులగా' కూడా పనికిరావేమో! ఒక ప్రక్క సలహాలు ఇవ్వాలా, మన కన్న చిన్నయినా మన పిల్లల సలహాలు మనం తీసుకోవాలా అన్న విషయం ఆలోచిస్తే, రెండూ సమంజసమే అనిపిస్తుంది, అవసరం కూడా.

వానప్రస్థం అంటే ఇంటి బాధ్యతలను తరువాతి తరానికి అప్పగించమని కూడా అర్థం అని ఒప్పుకున్నాం. వేరే వూళ్ళల్లో నివాసాలు ఏర్పరుచుకున్న మన పిల్లలకి మన వయస్సు లో

142

వచ్చిన మార్పులు, రాబోయే మార్పుల గురించి చెప్పడం ఎంతయినా అవసరమని మనకి తెలుసు. ముందు ఆలోచనతోను, కొంత ధైర్యం తెచ్చుకుని మన ఇల్లు, ఆరోగ్య పరిస్థితులు, ఆర్థిక వ్యవహారాల గురించి చర్చించడం ముఖ్యమని, అత్యవసరమని మా వారు నేను గట్టిగా నమ్ముతున్నాం.

పైన చెప్పినవే సమస్యలనుకుంటే, అసలు నిజమైన సమస్యలు పెద్దవయస్సులో చెయ్యవలసిన పనులు, ఆరోగ్యంలో ఒడిదుడుకులు, వయసు పెరుగుతున్న కొద్దీ తరిగే శక్తి సామర్థ్యాలు, మన గురించి మనం ఆలోచించాల్సినవెన్నో వున్నాయి అంటారు మా కంటే పెద్దవాళ్ళు. వయస్సు వస్తున్నకొద్దీ మన శరీరం ఎన్నో సూచనలనిస్తుంది. చిన్నప్పటి కథలు తలుచుకునో, ఇదివరకులాగా అనో, కొన్ని సంవత్సరాల క్రితం చేసిన సాహసాలు గొప్పగా చెప్పుకుంటూ పోతున్నా, మన పిల్లలకి, మనని చూస్తున్నవారికి, మనలోని మార్పులు కొంతవరకు కనిపిస్తాయి. చెవులు, పళ్ళు, కళ్ళు, వెనకటిలాగా పనిచేయకపోగా, ఒంట్లో తగ్గిపోతున్న ఓపిక, ఓర్పు అట్టే దాచలేము. వచ్చిన మార్పులని ఒప్పుకుంటే, డాక్టర్లు, మన పిల్లలూ సానుభూతి చూపగలరు, కొంతవరకు సహాయం చెయ్యగలరు.

అమెరికాలో దశాబ్దాలుగా నివసిస్తూ, ఇక్కడ పుట్టి పెరిగిన మన పిల్లలూ, మనవలూ మంచి చదువులూ, ఉద్యోగాలూ, వాళ్ళ కాళ్ళ మీద వారు నిలబడే అవకాశం కలిపించిన మనం, ఈ నాడు, ఎంత వరకు సంతోషంగా ఉన్నామనిపిస్తుంది వానప్రస్థంలో.

మనం మన పిల్లల సహాయం మీద ఆధారపడకుండా శేష జీవితం గడపాలని, మావయస్సులో వున్న కొందరు, తాము అంతవరకు ఎన్నో ఏళ్ల గా నివసించిన ఇళ్ళని, వాటిలో వున్న పెద్ద వస్తువులని వదిలిపెట్టి, ముఖ్యమనిపించిన కొద్ది వస్తువులతో చిన్న ఇళ్లకు మారారు. కొందరు వృద్ధాశ్రమాలకి అంటే, అవసరాన్ని బట్టి, సీనియర్ హోమ్స్, అసిస్టెడ్ లివింగ్, నర్సింగ్ హోమ్స్ కి నివాసం మార్చుకుంటున్నారు. కానీ కొందరు, ఒకళ్ల కొకళ్ళు సహాయపడుతూ తమ పిల్లల ఇంట్లో నివసించడం వింటూనే వున్నాం.

భారతదేశం లో పుట్టి, పెరిగి, ఉద్యోగాలు చేసి, పదవీ విరమణం చేసి వానప్రస్థం లోకి అడుగుపెట్టిన తల్లితండ్రులని, అమెరికాలో స్థిర నివాసం ఏర్పరుచుకున్న పిల్లలు, అమెరికా సుఖాలు అనుభవిస్తారని, ఒకరికొకరు అండ దండగా వుంటారని అమెరికా తీసుకు వస్తున్నారు. 'అవ్వ, బువ్వ' అన్నట్టుగా వాళ్ళకి, తల్లితండ్రులకి అనుకూలమైన పరిస్థితి కల్పించింది ఆమెరికాదేశం విశాల హృదయంతో. గ్రీన్ కార్డ్ వచ్చిన వారికి, అమెరికా పౌరులయ్యే అవకాశమే కాక ఈ దేశంలో ఒక్క రోజు కూడా ఉద్యోగం చేయకపోయినా, వారికి మెడికేడ్ వచ్చే అవకాశం వుంది. ఆ తల్లితండ్రులకి వారి అర్హతని బట్టి మెడీకేడ్ తోబాటు, సప్లిమెంటల్ సోషల్ సెక్యూరిటీ క్రింద కొంచెం ధన సహాయం కూడా రావచ్చు. అయినా, తమ దేశం, బంధు మిత్రులని వదిలి అమెరికా వచ్చిన తల్లితండ్రులకి వానప్రస్థం ఎంత ఆనందాన్ని ఇస్తోందో?

మరొక కోవలో చెందిన జనాభా ఇండియా లో 58 సంవత్సరాలకే రిటైర్ అయి 60 నిండక ముందే అమెరికా వచ్చి తమ పిల్లలతో నివసిస్తున్న వారు. తమ పిల్లలు, మనవల దైనందిక జీవితంలో వీరు భాగం అవ్వాలని పిల్లలు ఆశిస్తారు. అమెరికా జీవితానికి, వాతావరణానికి మొదట్లో అలవరచుకోలేక కష్టపడినా, ఈ తల్లితండ్రులు కాలం మార్పులతో, కొన్నేళ్ళకి మార్పులని అలవరచుకుని అమెరికా లో తెలుగు వారితో కలుస్తారు. ఎప్పటికైనా తిరిగి భారత దేశం, తమ వూరు, పరిసరాలకూ వెళ్లిపోతామన్న ఆశ సన్నగిల్లుతూ 90 వ పడిలో వున్న వాళ్ళు ఇందులో కొందరు.

మరి పిల్లలు ఆమెరికాలో స్థిరపడినప్పుడు ఇండియాలోనే నివసిస్తున్న వాళ్ల వృద్ధ తల్లితండ్రులు ఏలా జీవితం గడుపుతున్నారో? వీలున్నప్పుడు ఆమెరికా నుంచి తల్లితండ్రులని చూడడానికి వెళ్తూ, అలాగే వీలుని బట్టి వాళ్ళని అమెరికా వచ్చే అవకాశం కల్పిస్తున్నారు పిల్లలు. ఆమెరికా కొడుకులు, కూతుర్లు, తల్లి తండ్రుల స్వేచ్ఛని గుర్తించి, ఇండియా లో రిటైర్ అయిన వారి జీవితానికి అట్టే మార్పు రాకుండా వుండాలని వారికి ఆర్థికంగా అమెరికా నుండి సహాయపడుతున్న విషయం కూడా మనం విన్నదే. తల్లితండ్రులు కొందరు వృద్ధాశ్రమాలు, నర్సింగ్ హోమ్స్ కు మారే అవసరం వస్తే, అమెరికానుంచి పిల్లలు ఎంత ఖర్చయినా

సరే సమకూరుస్తున్నారు. అప్పుడప్పుడు కలుస్తున్న అమెరికాలో వున్న పిల్లల కుటుంబాలు, వేలకొద్దీ దూరంలో వున్న ఆ తల్లితండ్రులు వారి వార్ధక్యంలో ఎంత ఆనందంగా వున్నారో? కొన్ని సందర్భాలలో, చిన్న పెద్ద అవసరాలకు, అనుకోని ఆపదలకు ఇండియా లో వున్న తల్లితండ్రులు ఇరుగు పొరుగు వారి సహాయం మీద ఆధారపడుతున్నారు. ఇటువంటి అవసరాలకి అమెరికా నుండి వెళ్ళగలిగే పరిస్థితిలో లేని కొడుకులూ, కూతుర్లు ఎంత సంతోషంగా వున్నారో?

వానప్రస్థం లో చివరిగా చెప్పవలసిన మరో కొద్ది జనాభా వున్నారు. అమెరికాలో చదివి వుద్యోగం చేసి రిటైర్ అయి ఇండియా తిరిగి వెళ్ళినవారు. వీరిలో కొందరు అమెరికాలో పుట్టిన తమ పిల్లలు పెరిగి మంచి చదువులు చదివి, వారి వారి ఉద్యోగాలలో వున్నారన్న తృప్తి తో, వారి పెళ్లి వేడుకలు జరిపి, తరవాత మనవలు పెంపకంలో కొన్నేళ్ళు పాలు పంచుకొని, ఇండియా తిరిగి వెళ్ళిపోయినవారు. ఇండియా గత 50 సంవత్సరాలలో అన్నీ రంగాలలో పురోగమించడమే కాకుండా ఎన్నో దేశాలకన్నా అధిగమించింది ఆర్థికంగా. జీవన సౌకర్యాలు అమెరికా తో సమానంగా వున్నాయని అంటారు వీరు. మనం అమెరికాలో ఉద్యోగాల్లో వున్నప్పుడు ఇండియా మన తల్లితండ్రులను కలవడానికి ఇండియా వెళ్ళినట్టే, ఇప్పుడు ఇండియా కి నివాసం మార్చుకున్న ఈ తల్లితండ్రులని వారి పిల్లలు, మనుమలు ఇండియా వెళ్ళి కలుస్తున్నారని ఆనందంగా చెప్తున్నారు.

మన ఆరోగ్యం, ఆర్థిక స్తోమత, అవకాశం, బంధు మిత్రులు, వాతావరణం ఇల్లా అన్నీ దృష్టిలో పెట్టుకుని అమెరికా వానప్రస్థ జీవితం మనకి నచ్చిన విధంగా మలుచుకోవడానికి పలు మార్గాలున్నాయి. పెద్దవారమవుతున్న కొద్దీ ఎన్నో ఒడుదుడుకులున్నా, వానప్రస్థంలో అనుభవిస్తున్న కొన్ని ఆనందాలని సంతోషంగా స్వీకరించండి. పెద్దవారంటూ, సీనియర్ సిటిజన్స్ గా అమెరికాలో ఎన్నో సౌకర్యాలనందు కుంటున్నాం. మెడికేర్, సోషల్ సెక్యూరిటీ లేదా మెడికేడ్, సప్లిమెంటల్ సోషల్ సెక్యూరిటీ ఉదాహరణకి. ఇవేకాక మన ప్రయాణాలలోనూ, సినిమాలు, వినోద ప్రదేశాలు, రెస్టారెంట్స్, దుకాణాలలోనూ, ఇలా ఎన్నో చోట్ల సీనియర్ల గా తగ్గించిన ధరలు సంతోషంగా అనుభవిస్తున్నాం. ఇవన్నీ అమెరికాలోనూ, ఇండియా, మిగతా దేశాలలో కూడా వృద్ధులని గుర్తుంచుకుని ఎన్నో రకాలుగా ఆదరిస్తున్నారని మనం గుర్తించాలి.

వానప్రస్థం గురించి మాట్లాడినప్పుడు, నేను వయస్సు పెరుగుతున్నదని దిగులు పడుతుంటే, మావారు సహజంగా వయస్సులో వచ్చే ఈ మార్పులని గుర్తించాలంటారు. మనం కష్టపడి గడించిన పేరు ప్రఖ్యాతులని, అనుభవాలని తలుచుకుంటూ, వీలయినంత స్వచ్ఛంద సేవ (volunteering) చేయవచ్చు. రిటైర్ అయిన వృత్తి, అనుభవంతో అంటే ఇంజనీర్ లు, వైద్యులు ఉదాహరణకి, అవసరమైన వారికి తోడ్పడం, లేదా మరో విధంగా మన వూరులో వున్న హాస్పటల్ లోనో, గుడిలోనో, సీనియర్ హోమ్ లో, సూప్ కిచన్ లోనో, ఇలా ఎన్నోవిధాలగా మనం చేయగలిగే సేవ చేయాలని అంటారు. మన పిల్లలు వాళ్ళ ప్రవృత్తులలో ఉద్యోగాలలో స్థిరపడిన తరువాత, మన కున్న ఆర్థిక స్తోమత, సుఖ జీవితానికి సరపడ్డ ఆర్జన వెనకేసుకుని, మిగతా ధనాన్ని అమెరికా, భారత దేశంలో కానీ ప్రపంచంలో మనకన్నా బీద జనానికో, వాళ్ళ జీవితాలు బాగుపరచే కార్యక్రమాలకో దానం చేయమంటారు. మావారి ఉన్నత భావాలకి, అదర్శాలకి నా జోహార్లు.



కుంభకోణం

- తమ్మినేని యదుకులభూషణ్

తరచూ వినిపిస్తూ ఉంటుంది , తమిళం సంస్కృతం కన్నా ప్రాచీనం అని , అదెలా సాధ్యం అని ఎవరైనా అడిగితే మాత్రం పెద్ద దండకం వల్లిస్తారు. ఉపయోగపడే ఒక్క ఆధారం కూడా చూపరు.ఈ గొడవకు మూలం ఏమిటి ?? అని జాగ్రత్తగా పరిశీలిస్తే ఇందులో చిదంబర రహస్యం ఏమీ లేదు – దీని వెనుక ఉన్నదల్లా భారీ కుంభ కోణం అని తేలుతుంది.

సంగం సాహిత్యం 300 BC నుండి 300 AD మధ్యకాలానికి చెందినదని తమిళ పండితుల అభిప్రాయం. తొల్కాప్పియం (తొలి కావ్యం) అన్న వ్యాకరణగ్రంధం సంగం సాహిత్యంలోకి చేరికే. భారతీయ భాషల్లో తిరుగులేని పండితుడు , గొప్ప మేధావి A. C. Burnel (1840–1882) అభిప్రాయ పడినట్లుగా –" Tolkappiyam could not be dated to much later than the eighth century". ఇదే అభిప్రాయాన్ని Herman Tieken –తమిళ ,సంస్కృత, ప్రాకృతాల్లో ఉద్దండుడైన డచ్ పండితుడు "8 వ శతాబ్దానికి ముందు తమిళం కావ్యభాషగా వాడుకలో ఉంది అని చెప్పడానికి ఎటువంటి ఆధారాలు లేవు" అని ఘంటాపథంగా తన గ్రంథాల్లో , పలువ్యాసాల్లో వెలిబుచ్చారు. గత రెండు దశాబ్దాలుగా తెలుగులో ఈ విషయాల మీద ఒక చర్చ కూడా జరగలేదు.

ద్రావిడ భాషల పరిశోధనల్లో జగమెరిగిన పండితులు భద్రిరాజు కృష్ణమూర్తి – 'తమిళం ప్రాచీనం అని date చేయడానికి ఆధారాలేమీ లేవు' అని తేల్చారు. అంతేకాకుండా "సామాన్యంగా శాసన భాష వచ్చిన తర్వాత కావ్య భాష వస్తుంది. కావ్య భాష ఉండగా శాసన భాష ఆ తర్వాత రాదు. మనకు బ్రాహ్మీ శాసనా లొచ్చి, తర్వాత తెలుగు శాసనాలిచ్చి , తర్వాత కావ్యభాష వచ్చింది ప్రపంచంలో భాషలన్నిటిలో సాధారణంగా జరిగేదే " అని తన అభిప్రాయాన్ని తేటతెల్లం చేశారు.

ఐరావతం మహదేవన్ అన్న శాసన పరిశోధకులు ఒక ఉద్గ్రంధాన్ని ప్రచురించారు (2వ శతాబ్దం BC నుండి 6 వ శతాబ్దం AD వరకు వచ్చిన చిన్నా చితక శాసనాలు – వీటిలో కనిపించేవి చిన్న చిన్న పేర్లు – భాష ప్రాథమిక స్థాయిలో ఉన్నప్పటివి.) ఆరవ శతాబ్దం దాకా శాసనభాషే అఘోరిస్తుంటే, కావ్యాలు ఎక్కడి నుంచి ఊడిపడతాయి? భాషే తప్పటడుగులు వేస్తున్నకాలంలో వ్యాకరణా లు ఎక్కడి నుంచి వస్తాయి ? మరి ఋగ్వేదం (1500 BC), పాణిని అష్టాధ్యాయి (600 BC) అశ్వఘోషుని బుద్ధ చరిత, శారదా లిపిలో ఉన్న ప్రాచీన గణిత గ్రంథాలు , ఖరోష్టి లిపిలో ఉన్న ప్రాచీన బౌద్ధ సూత్రాలు , కాళిదాసాదుల కావ్యాలు అన్నీ మన ముందున్న అదారాలు అమరవాణికి , అరవానికి పోలిక లేదు అన్న విషయాన్నీ నిర్వ్వంద్వంగా నిరూపిస్తున్నాయి. తమ భాషే ప్రాచీనం అన్న తమిళుల వాదంలో పస లేదు, ఉన్నదల్లా, గోబెల్స్ ప్రచారం , ఉట్టి ప్రాపగాండా అని తెలుస్తూనే ఉంది. మార్క్ ట్వెన్ సెలవిచ్చినట్టు "నిజం చెప్పులు వేసుకునే లోగా అబద్దం సగం ప్రపంచాన్ని చుట్టి వస్తుంది".

మరి ప్రధాన మంత్రి ప్రపంచ వేదికలెక్కి 'సంస్కృతం కన్నా తమిళం ప్రాచీనం" అనడాన్ని ఎలా అర్థం చేసుకోవాలి. సరే తమిళ నాట బీజేపీ కాలూనడానికి ఆడుతున్న నాటకం అని సరి పెట్టుకున్నా, కనిమొళి "సంస్కృతం హిందువుల భాష – మహమ్మదీయులు, క్రైస్తవులు దాన్ని చదవరు. తమిళం అలా కాదు" అనడాన్ని ఎలా అర్థం చేసుకోవాలి ?? మన రాష్ట్రంలో ప్రాథమిక స్థాయిలో బోధనా భాషగా ఎక్కడా తెలుగు లేకుండా చేయడాన్ని ఎలా అర్థం చేసుకోవాలి ? దీని వెనుక ఏమైనా అంతస్సూత్రం ఉన్నదా? దీని వెనుక దాగి ఉన్న కుంభకోణం ఏమిటి ?

తమిళ నాట బ్రాహ్మణ ద్వేషం

సంగం సాహిత్యం ప్రాచీనం అని ఢంకా బజాయించడానికి వెనుక ఉన్న కారణాలు ప్రధానంగా రాజకీయమైనవి. ఒక్క మాటలో చెప్పాలంటే బ్రాహ్మణ ద్వేషం. బ్రాహ్మణులకు వ్యతిరేకంగా ఏర్పడిన జస్టిస్ పార్టీ , తర్వాత అదే బాటలో పయనించి రాజకీయాల్లో బలపడిన DMK పార్టీ. వారి వాదం– తమిళం స్థానికం , కావున దాన్ని మాట్లాడే వారు స్థానికులు . సంస్కృతం బ్రాహ్మణుల భాష – కావున

145

బ్రాహ్మణులు బయటివారు. బ్రాహ్మణులు – బ్రాహ్మణులు కాని వారు అని సమాజాన్ని రెండుగా చీల్చి వేశారు. జిన్నా ద్విజాతి సిద్ధాంతాన్ని ప్రతిపాదించి భారత దేశాన్ని మూడు ముక్కలు చేసి కనీ వినీ ఎరుగని రక్తపాతానికి కారకుడయ్యాడు. అదే విధంగా బ్రాహ్మణ , అబ్రాహ్మణ భేదం ప్రాతిపదికగా పెరియార్ తీసుకువచ్చిన ద్విపద సిద్ధాంతం తమిళ సమాజాన్ని నిలువునా చీల్చివేసింది. (అప్పట్లో, జిన్నాతో చేతులు కలపాలని విఫల ప్రయత్నాలు చేశారు ఈ ద్రవిడ వాదులు) కాబట్టి , సంస్కృత వాసన సోకని ఒక ఊహాజనిత కాలం – అప్పటి అచ్చ అరవ సాహిత్యం అర్జంటుగా కావలిసివచ్చింది. ఆ అవసరంలోంచి పుట్టుకొచ్చిందే ఈ సంగం సాహిత్యం. తమాషా ఏమిటంటే – A.K. రామానుజన్, జ్వలబిల్ లాంటి పండితులు కూడా ద్రవిడ వాదానికి వంత పాడి బ్రాహ్మణ ద్వేషాన్ని తమిళనాట మరింత ఎగదోశారు. శైవ వైష్ణవ సాహిత్యాలను మించిన మతాతీత సాహిత్యం ఒకటి ఉంది అని బాకాలు ఊదసాగారు. వీరి మాటల్లో నిజం ఆవగింజంతైనా లేదు. కానీ, జరగవలసిన డామేజి జరిగిపోయింది. ద్రవిడ పార్టీల నాస్తిక ఎజెండాలో భాగంగా తమిళంలో పాలు నీళ్ళలా కలిసిపోయిన సంస్కృత పదాలను ఏరివేసే ఒక పనికిమాలిన ఉద్యమం – దినదినాభివృద్ధి చెందుతోంది. తమిళాన్ని శుద్ధి చేస్తున్నాము అని రూఢికెక్కిన సంస్కృత పదాలను తోసిరాజని – అటకెక్కిన అరవ పదాలను అందలమెక్కిస్తున్నారు.

తమిళ నాట కొత్త పెరుమాళ్ళు ఎవరు ?

ఈ ప్రశ్నకు సమాధానం తెలంగాణా గవర్నర్ పేరులో ఉంది. తెలియని వారి కోసం గవర్నర్ పేరు – 'తమిళ్ సై సౌందరాజన్' యావద్భారత దేశంలో భాషపేరు ఒక వ్యక్తి నామధేయం కావడం ఎక్కడైనా చూశామా ? అన్ని వింతలూ విచిత్రాలు తమిళనాట ఎందుకు జరుగుతున్నాయి. మతాన్ని, దేవుణ్ణి దూరంగా పెట్టిన కమ్యూనిజం, మార్క్సిజం , మావోయిజాలు కొత్త మతాలుగా రూపు దిద్దుకున్నాయి. కొత్త దేవుళ్ళు వెలిశారు. కమ్యూనిస్టు చైతన్యమున్న కోస్తా ప్రాంతాల్లో లెనిన్లు , బోల్షవిక్కులు పుట్టుకొచ్చారు. ఏలూరు రోడ్డు కాస్తా కార్ల్ మార్క్స్ రోడ్ గా నామాంతరం చెందింది. అదే పంపిణీ మీద, శైవ వైష్ణవాలను , బ్రాహ్మణవర్గాన్ని ద్వేషించిన ద్రవిడ వర్గాలకు కొత్త మతం ఒకటి కావలసి వచ్చింది. ఆ మతం పేరు తమిళం , అంతేకాదు – ఇస్లాం లాగా ఆ మతంలో మరే దేవుడికి చోటు లేదు. మరి కొత్తగా పుట్టుకొచ్చిన తమిళ మతంలో విరాజిల్లుతున్న అధిష్టాన దైవం ?? "తమిళ్" – కాబట్టే, వారు భక్తి ప్రపత్తులతో ఆ పేరు పెట్టుకొంటున్నారు. అంతే కాదు, 'వణక్కం' అన్న కొత్త పిలుపును తయారు చేసుకున్నారు, మనకు చక్కనైన 'నమస్కారం' వారికి గీర్వాణం వాసన వేయదా మరి.

నిష్కర్ష

తమిళ సంగం సాహిత్యం క్రీ. శ . 8–9 శ. లేదా దాని తర్వాతి కాలానికి సంబంధించినది. దాని ప్రాచీనతకు ఏ శాస్త్రీయ ఆధారాలు లేవు. తమిళం భాష కాదు , అది ఒక మతం – కాబట్టి ఎటువంటి శాస్త్రీయ చర్చలు అరవ వారితో సాధ్యం కాదు. తమిళం ప్రాచీనం కాదు అనడం blasphemy (దైవదూషణ) లో భాగం.



రంగ మహల్ రహస్యం

- డా. గంటి సూర్యం

ఒరేయి సూర్యం రంగమహల్ లో జంగ్లీ వచ్చిందిటరొయ్ క్రొత్త ప్రింట్ కూడాట పద పద అని ఒక అరుపు అరిచేసి మిగతా "బీజీస్" ను పోగెగయ్యడానికి రై మని వాడి డొక్కు సైకిలు మీద ఎర్ర యజ్డీ మీద రాజెష్ ఖన్నాలా ఫీలు అవుతు అద్రుశ్యమైపోయాడు మా "దావుదు" గాడు.

ఇక్కడ రెండు విషయాల మీద మీకు చిన్న క్లాస్ తీయాలి.దావూద్ అంటే ఏ ఇబ్రహీమో, మొహమ్మదో అనుకునేరు సుమా. వాడి అసలు పేరు దావులూరి శ్రీరామచంద్ర మూర్తి ,మోహన పెద్ద బొట్టూ వాడును ఎప్పుడు చూసిన అప్పుడే గుడినించి వచ్చినవాడిలా ఎంతో కళగా ఉండేవాడు .అప్పట్లో వాడు గుడికి వెళ్ళడానికి పెద్ద కారణం"కలరు".కలరు అంటే మెడికల్ కాలేజీ భాషలో అమ్మయిలు అనీ,మంచి కలరు అంటె అందమైన అమ్మాయిలు అనీ కాలేజిలొ అడుగుపెట్టగానే తెలుసుకున్నాను, సీనియర్ల ధర్మమా అని . వీడు మెడికో కాకపొయినా కలరు కోసం గుంటూరులో అన్నీ గుడులు రౌండ్ చేసేవాడు .వీడి దగ్గర కలరు కనిపెట్టే మిషిను ఉండేదని వినికిడి.

రెండోది, "బీజీస్" అంటే పాప్ గ్రూప్ గిబ్స్ బ్రదర్స్ కాదు . గుంటూరు బ్రాడీపేట లొ మేము పదిమంది అక్కడ ఉన్న గురవయ్య హైస్కూల్ లొ కలసి చదువుకున్న వాళ్ళము ఇప్పుడు ఎక్కడెక్కడకో వెల్లిపోయినా మమ్మల్ని మేము " బ్రాడీపేట గ్యాంగు "అని పిలుచుకుంటాము. ఆ బ్రాడీపేట గ్యాంగు కు షార్ట్ కట్" బీజీస్ "అని మార్చాడు పాశ్చాత్య సంగీతం వినే ఒక వెధవాయి .ఈ పదిమంది లో ఆరుగురు గుంటూరు మెడికల్ కాలేజి కి వెల్లడం మూలంగా మిగతా నలుగురికి కూడా ఒక్క డిగ్రీ మాత్రము లేదుగాని కాలేజి విషయాలు అన్నీ అంటే కలరు గురించి పాలిటిక్స్ గురించి కొంతమంది కాలేజి లొ చదివిన వాళ్ళ కన్నా ఎక్కువుగా తెలుసు. ఆ బీజీసుకు శేనాధి పతి మా ఈ దావూద్.అది ఎందుకో ముందు ముందు మీకే తెలుస్తుంది

ఇకట్టా అయిన బీజీస్ అందరు రంగమహల్ వైపు బయలుదేరాము.రంగమహల్ అంటే మరి దానికీ ఒక చిన్న కథ.పెద్దిల్లు చిన్నిల్లు టైపులో ఆకాలంలో గుంటూరులో మూడు జంట సినిమాహాళ్ళు ఉండేవి.క్రింద పెద్ద హాలులో మాస్ తెలుగు సినిమాలు పైన చిన్న హాలులో క్లాస్ హింది సినిమాలు వెసేవారు.మా అద్రుష్టం మా బ్రాడీ పేటకు రంగమహలు రాయి విసురు దూరం దానితొపాటు అన్ని మంచి హిందీ సినిమాలు అక్కడకే వచ్చేవి.రంగ మహలును చూస్తే ఇది నిజంగా ఒక ఇంజనీర్ ప్లాన్ వేసి కట్టాడా అని పిస్తుంది . కొన్ని వందల సినిమాలు చూసిన మా బీజీస్ కే అది ఒక పెద్ద ఫజిల్.ఎటునుంచి పనిక్ వెళుతున్నామో ఎటునుంచి దిగుతున్నామో ఎప్పుడూ కొత్తగా ఉండెది.మెట్లు ఎంత సన్నగా ఉండేవంటె కొద్దిగా లావుపాటి వాళ్ళు ప్రక్కగా తిరిగి మెట్లు ఎక్కేవాళ్ళు.ఇంక పైనుంచి ఎవడైనా దిగితే పల్లెటూళ్ళో రోడ్డు మీదలాగ ఎవరో ఒకరు వెనకకు వెళ్ళాల్సిందే.అందుకేనెమో స్టూడెంట్స్ తప్పితే ఎవరు వచ్చేవారు కాదు రంగమహలకు.అప్పట్లో ఒక నిండు చూలాలు సినిమా చూద్దామని వచ్చి మెట్లెక్కి పైకు వచ్చేటప్పటికి నొప్పులు మొదలైనాయని ఆవిడని క్రిందకు తీసుకు రావడం ప్రసవం కన్నా కష్టమైందని చెప్పుకునేవారు .

దావూదు పట్టుకు వచ్చిన టిక్కట్లు తీసుకుని మేము నెమ్మదిగా వెళ్ళి బాల్కని లో సెటిల్ అయ్యాము . ఏ సినిమాకైనా టిక్కట్లు పట్టుకు రావడంలో మా దావూదును మించినవాడు లేడు . వాడు మా బ్రాడీ పేట లిల్లీ, దానికి తోడు బస్కీలు ఆసనాలు వెసేవాడు ఎంత గుంపు జనమైనా దూసుకుపోయి ఇట్టే కౌంటర్ దగ్గర తేలేవాడు. మేము షొలే మొదటి రోజు మొదటి ఆట చూడగలిగామంటే అది మా దావూదు ప్రాప్తమే . అందుకే వాడు మా బీజీసుకు శేనాధిపతి. అంతేకాదు ఇంటర్వల్ లో టీ సమోసా కూడా వాడి ప్రాప్తమే. ఎంత జనం ఉన్నా రెండు చెతులతో 4 టీ కప్పులు రెండు పేట్ల సమోసాలు తీసుకు రాగల సామర్ధుడు .నేను ప్రయత్నించి వేడి వేడి టీ నా మీద ప్రక్కన వాడిమీద పోసి తిట్లు తిని మనకెందుకురా మన దావూదుండగా అని మానుకున్నాను.

జుంగ్లీ సినిమా మొదలైంది . బాల్కని అంతా నిండిపోయింది . దావూద్ గాదు అటు ఇటు చూసి ఒరెయి అంతా మెడికల్ కలరే రొయ్, ఫస్ట్ ఇయరునుండి ఫైనల్ ఇయరు వరకు అమ్మాయిలు

ఎవరెవరు వచ్చిందో చెప్పడం మొదలు పెట్టాడు. ఒరినీ కాలేజిలో చదివే మాకే తెలియదు మా సీనియర్ల పేర్లు నీ కెట్లా తెలుసురా ప్రక్కన రమణగాడి ఆవేదన. నేను మటుకు ఇవేమి పట్టనట్లు ఆ సినిమాతో ఫిల్మ్ ఫీల్డ్ లో అడుగుపెట్టిన సైరా బాను మీద ఫోకస్ అయిపొయాను . వెనక సీట్లో అమ్మయిలు గట్టిగా మాట్లాడుకుంటూ షమ్మీ కపూర్ మీద ఒకటే జోకులు .కోతి కపూర్ను చూడవే అని కాకి ముక్కు దొండ పండులా లెదు ఆ సైరా బాను అని కామెంట్స్ విసరడం మొదలు పెట్టారు. ఇలా ఆడవాళ్ళు జోకులు వేయడం మా బీజీసు కు నచ్చలా ఇదేమిటి ఎప్పుడూ గొడవ చెసే మన సూర్యం ఇలా మన్ను తిన్న పామైపొయాడు,ఈ వెనక వాళ్ళకు బదులు చెప్పెదెలా అని వాళ్ళ ఆందోళన . అప్పుడు వచ్చింది రఫీ గారి పాట "అయ్యాయ్య సూకు సూకు ". అందరు పాటలో నిమగ్నమై పోయారు చరణం అయిపోయినది ,మళ్ళీ రఫీ అయ్యయ్యా సూకు అనేలొపల నేను గట్టిగా అయ్యయ్యా సూకు సూకు అని అరచాను అంతే హాలు మొత్తము అందుకున్నారు .ఇంక పాట అంతా ఎప్పుడు ఆయ్యయ్యా సూకు సూకు వచ్చినా బాల్కనిలోని మోగవాళ్ళంతా కోరస్ అయిపొయారు. మా బీజీస్ అమ్మయ్య మనవాడు లేచాడు మన పరువు నిలబెట్టాడు అను కున్నారు. సినిమా అయిపోయినతరువాత బలరాం టీ స్టాల్ లో కలాకన్ ఇప్పించారు మా వాళ్ళు. ఇప్పటకీ ఆ పాట విన్నప్పుడల్లా ఈ సంఘటన గుర్తు వచ్చి చిరునవ్వు తెప్పిసుంది.

అన్ని మధుర స్మృతులకు కారణమైన రంగ మహల్ ఇప్పుడు లేదని ఈ మధ్యనే పూర్తిగా నేలమట్టం చేసారని మొన్న ఎవరో చెబితే నమ్మ శక్యం కాలేదు. వెంటనే గుంటూరులో ఉన్న దావూదును పిలిస్తే నిజమేరా అన్నాడు. మనప్పటి రంగ మహల్ కాదురా పూర్తిగా చెడిపొయింది, మలయాళం సినిమాలు వాటి మధ్య బ్లూ సినిమాలు చూపించేవారు కలక్షన్లకోసం . మల్టిప్లెక్స్ లు వచ్చి పాత సినిమా హాళ్ళలకు క్రొత్త సినిమాలు ఇవ్వకపోవడం వలన బిజినెస్సు పూర్తిగా తగ్గిపోయింది ,చివరకు నేలమట్టమైపొయిందిరా అన్నాడు.ఎన్నో విషయాలు చెప్పుకొని వాపోయాము.పోనిలే ఇకమీదట కట్టేదేదొ మంచి అర్కిటెక్ట్ తొ కట్టీస్తారులే అని సంత్రుప్తి పడ్డాము .ఎట్లా ఎక్కాలో ఎట్లా దిగాలో అంతా జిగి బిగి గా ఒక పద్మవ్యూహంలా వుండే మా రంగమహల్ ఇకలేదు .ఎందరో ప్రేమికులకు అండగా నిలిచిన మా రంగ మహల్ ఇక లేదు.

శంకర విలాస్ సెంటర్, మిరపకాయ బజ్జీలు, బలరాం టీస్టాల్, రంగ మహల్ సిమాలు ఇవన్నీ నా గుంటూరు జ్ఞాపకాలు ఎలా మరచిపోతాను ఆత్రేయ గారన్నట్లు " కాలాలు మారిన – గాడ్పులే వీచినా...

మనుజులే దనుజులై మట్టిపాల్జేసినా

నీవు నా హ్రుదయనా నిత్యమై సత్యమై
నిలిచివుందువు రంగ మహలు
నిలిచి వుందువు రంగ మహలూ



జయ జయ జయ ప్రియ భారత జనయిత్రి దివ్య ధాత్రి
జయజయ జయ శత సహస్ర నర నారీ హృదయ నేత్రి
జయ జయ సశ్యామల సుశ్యామచలాచ్చేలాంచల
జయ వసంత కుసుమలతా చలిత లలిత చూర్ణకుంతల
జయ మదీయ హృదయాశయ లాక్షారుణ పదయుగళా!

(కృష్ణశాస్త్రి)

148

రామరాజభూషణుడి వసుచరిత్ర

- డా. కొంపెల్ల భాస్కర్

రామరాజభూషణుడు అనే పేరున్న సుప్రసిద్ధ ప్రబంధకవి శ్రీకృష్ణదేవరాయల కాలంలో అష్టదిగ్గజాల్లో ఒకడు.ఈయన శ్రీకృష్ణదేవరాయల అల్లుడు అళియ రామరాయల ఆస్థానానికి ఆభరణంలా ఉండడం వల్ల ఈయనకు 'రామరాజభూషణుడు' అని పేరు వచ్చింది. ఈయన అసలు పేరు భట్టుమూర్తి అంటారు.

వసుచరిత్రము, హరిశ్చంద్ర నలోపాఖ్యానము, కావ్యాలంకార సంగ్రహము ఈయన రచియించిన గ్రంథాలు. హరిశ్చంద్ర నలోపా ఖ్యానంలో ప్రతి పద్యానికీ హరిశ్చంద్రచక్రవర్తి కథాపరంగానూ, నలచక్రవర్తి కథాపరంగానూ రెండు అర్థాలూ కలిగి ఉండడం వల్ల అది శ్లేషకావ్యం. వసుచరిత్ర అంతా శ్లేషమయం కాకపోయినా శ్లేష పుష్కలంగా ఉన్న కావ్యం. ఈ కావ్యంలా సంక్లిష్టమైన శైలితో కూడిందీ, మధురమయినదీ అయిన మరో శ్లేషకావ్యం తెలుగులో లేదని చెప్పవచ్చు. మూడవది కావ్యాలంకార లక్షణాల్ని తెలిపేది. తెలుగులో మేలైన అలంకార శాస్త్రగ్రంథం ఇది ఒక్కటే కనబడు తోంది. రామరాజభూషణుడు కవిత్వంతో రకరకాల ఆటలాడాడు.

భోగాంబువాహ వాహ విభాగేహాభావుకాంగభావభావమహా

భాగ మహీభాగమహాభోగావహబాహుభోగిపుంగవభోగా

అనే కందపద్యాన్ని చదవాలంటే నాలుప కదపక్కర్లేదు. ఇది ఒక చిన్న ఉదాహరణ మాత్రమే. ఈయన వ్రాసిన వసుచరిత్ర ఎంతో ప్రసిద్ధి పొందిన కావ్యం. దాన్ని గురించి కొద్దిగా మాట్లాడు కుందాం ఈ వ్యాసంలో.

రామరాజభూషణుడు వసుచరిత్ర వ్రాసే ముందు కొంత ఆలోచన చేసినట్టు కనిపిస్తోంది. 'కేవల కల్పనా కథలు కృత్రిమ రత్నము లాద్య సత్కథల్ వావిరి పుట్టురత్నము' లన్నాడు మొదట్లోనే. కల్పితకథలు కృత్రిమరత్నాలుగా భావించాడు కాబట్టి మహాభారతం ఆది పర్వంలోని ఉపరిచర వసువు కథ అనే ఒక చిన్న కథని తీసుకుని దానికి మెరుగులు,

ఉపరిచర వసువు యొక్క పాలనాసామర్థ్యానికీ, తపోదీక్షకూ మెచ్చి ఇంద్రుడు అతనితో స్నేహం చేశాడు. స్వర్గానికీ భూమికీ వస్తూ పోతూండడానికి వీలుగా 'కనక రత్నమయంబును, కామగమనంబును అగు విమానంబు'తో పాటుగా తన కొత్త మిత్రుడికి దేవత్వం, 'సకల ప్రహరణ నివారకంబగు ఇంద్రమాల అను కమలమాలయు, దుష్టశిక్షణ శిష్ట రక్షణ క్షమంబున వేణు యష్టియు' ఇచ్చాడు. వేణు యష్టి అంటే వెదురు బెత్తం. వసురాజు ఆ బెత్తానికి ఏటేటా ఇంద్రోత్సవం అనే వేడుక జరుపుతూ దేవతలతో సన్నిహిత సంబంధాలు పెంచుకున్నాడు. ఇంద్రుడిచ్చిన విమానంలో తిరుగుతూండడం వల్లనే అతనికి 'ఉపరిచర వసువు' అనే పేరు వచ్చింది. ఈ వసువు మిత్రులతో కలిసి, హిమవంతుడి కొడుకైన కోలాహల పర్వతం మీద ఆడుకునేవాడు.

ఈ కోలాహలుడు(పర్వతం), శుక్తిమతి అనే ఒక నది మీద మోజు పడి, ఆమెని బలవంతంగా తన అధీనంలోనికి తీసుకున్నాడు. ఆమెతో వసుపదుడనే కొడుకునూ, గిరిక అనే కూతుర్నీ కన్నాడు. అతగాడి బలవంతపు బంధాన్ని తట్టుకోలేక శుక్తిమతి ఒకసారి పొంగింది. ప్రజలను కాపాడేందుకు ఉపరిచర వసువు వెళ్ళాడు. ఆ సమయంలో వసువుకి ఆమె జరిగిన కథంతా చెప్పింది. వసువు తన కాలి బొటనవేలితో కోలాహలుడి దర్పాన్ని అణిచి, శుక్తిమతికి స్వేచ్ఛను ప్రసాదించాడు. శుక్తిమతి కూతురు గిరిక అతనికి అదే పర్వతం మీద వీణ వాయిస్తూ కనిపించి, అతని హృదయం దోచేసింది. వసువు కూడా ఆమె మనసును కొల్లగొట్టాడు. విరహ వేదనలో కొంతకాలం వాళ్లిద్దరూ బాధపడ్డారు. ఇంద్రుడి చొరవ మీద చివరికి వాళ్లిద్దరికీ పెళ్ళి అవడమే ఈ ప్రబంధంలోని కథాంశం.

కథ గొప్పగా ఉన్నట్టు అనిపించకపోయినా, కావ్యం అద్భుతంగా వ్రాయబడింది. కారణం రామరాజభూషణుడి కవితారీతులు. ఈ కవి గురించి పెద్దలేమన్నారో చూద్దాం.

"ఈ కవి గాయకుడు. సంగీత కళానిధి. సంగీతమునకు, కవిత్వమునకు గల పొత్తును ఇతనివలె మరి యే కవియు గ్రహించలేదు. ఇతని పద్యములన్నియు లయ గమకములు గలవి. కీర్తనలవలె పాడదగినవి. అంతే గాక ఈ కవి గొప్ప విద్వాంసుడు. నానాశాస్త్ర నిష్ణాతుడైన బుద్ధిశాలి. పద్య

149

రామణీయకత, ప్రౌఢ సాహిత్యము, విజ్ఞాన పటిమ ఇతని రచనలలో గోచరించును. ఇతనికి శ్లేష సహజము. రామరాజభూషణునివలె పద్యము వ్రాయగలవారు లేరు. కవులలోనింతటి లాక్షణికుడు లేడు" – ఆచార్యులు పింగళి లక్ష్మీకాంతం గారు

"వసుచరిత్రమునందు శ్లేషయో, ధ్వనియో, శబ్దాలంకారమో, అపూర్వమగు భాషాసౌష్టవమో, వర్ణనా చమత్కారమో లేని పద్యము అరుదు అనుట సాహసము కాదు" – శేషాద్రిరమణకవులు.

రామరాజభూషణుడి కవనంలో ఒక విశేషం అతని రసపిపాస. తన పూర్వకవుల్లో ఉన్న గొప్ప లక్షణాల్ని తాను సంతరించుకుని రచన చెయ్యడం. ఒక వనంలో రకరకాల చెట్లు రకరకాల పువ్వుల్ని పూయిస్తూ, రకరకాల సువాసనల్ని వెదజల్లుతూంటే, అకస్మాత్తుగా ఒక చెట్టు అన్ని పువ్వుల అందాల్నీ, సువాసనల్నీ తలపిస్తూ, ఒకసారి వాటిని మించిపోతూ, పూలహారాల్నే పూయించి, మనకి అందిస్తే ఎలా ఉంటుందో అలా ఉంటుంది రామరాజభూషణుడి కవిత్వం.

ఒకసారి కాళిదాసునీ, ఒకసారి భవభూతినీ, ఒకసారి శ్రీహర్షుణ్ణీ, ఒకసారి అల్లసాని పెద్దననీ, ఒకసారి నన్నయనీ, ఒకసారి శ్రీనాథుణ్ణీ. ఇలా ఒక్కక్కరినీ తనపై ఆవహింపజేసుకుని రామరాజ భూషణుడు ఈ వసుచరిత్ర అనే సుమనోహరమైన పద్యకదంబ మాలను తెలుగుతల్లికి అర్పించాడా అనిపిస్తుంది. ఒక్కక్కసారి నాటకీయతలో తిక్కన్నగారి ఒరవడిలో వెళ్ళాడా అనిపిస్తుంది.

సాధారణంగా కవులందరికీ ఆదర్శకవి కాళిదాసు. రామరాజభూషణుడి విషయంలో అది మరింత ఎక్కువగా కనిపి స్తుంది. పూర్వకవుల స్తుతి చేస్తూ ""నేను నీవనుమాట" అని ఒక అద్భుతమైన శ్లేష ప్రయోగించాడు కాళిదాసు విషయానికి వచ్చేటప్ప టికి. వసుచరిత్రకి కథని ఎన్నిక చేసుకోవడంలోనే ఆ విషయం కనిపిస్తుంది.

కాళిదాసు కుమారసంభవంలో ఉన్న ఒక సన్నివేశాన్ని గమనిస్తే అతని అభిమానం అర్థం అవుతుంది. పార్వతి శివుడి కోసం తపస్సు చేస్తుంటే, శివుడు బ్రహ్మచారి వేషంలో వచ్చి శివుణ్ణి తక్కువ చేస్తూ మాట్లాడతాడు. పార్వతికి కోపం వచ్చి తను అతని ఎదుటనుంచి వెళ్ళిపోతాను అని బయల్దేరబోతుంది. అప్పుడు శివుడు నవ్వుతూ ముసలి బ్రాహ్మణుని వేషంలో పార్వతికి దర్శన మిచ్చి ఆమె చెయ్యి పట్టుకుంటాడు. ఆ సందర్భంలో పార్వతి పరిస్థితిని మనందరికీ చెప్పాలని కాళిదాసు ఒక అనన్య సామాన్యమైన అద్భుతమైన ఉపమానం (పోలిక) చెప్పాడు.

తం వీక్ష్య వేపధుమతీ సరసాంగయష్టిః

నిక్షేపణాయ పదముధృతముద్వహంతీ
మార్గాచలవ్యతికరాకులితేవ సింధుః
శైలాధిరాజతనయా న యయౌ న తస్థౌ.
(పరమశివుని చూసి శరీరమంతా కంపిస్తూ ఉండగా స్వేదంతో శరీరం తడిసిపోతుండగా, ముందుకు పోదామని ఎత్తిన కాలును అలాగే ఉంచేసి, త్రోవలో కొండ అడ్డం తగలడంతో తొట్రుపడ్డ నదిలా, ఆ పర్వత రాజపుత్రి కదలనూ లేదు. నిలబడనూ లేదు).

మన రామరాజభూషణుడికి తన కథని ఎన్నుకోవడానికి ఇక్కడే పునాది పడ్డట్టుంది. వసుచరిత్ర కావ్యం చదువుతూంటే కాళిదాసుమీద ఉన్న ఆరాధనా భావం మనకింకా బాగా అర్థం అవుతుంది. అతని చేతిలో అందాల అద్దుకున్న గిరిక (కథానాయిక) చిన్ననాటి పార్వతిలాగా (కుమారసంభవం), పెద్దదయిన తర్వాత శకుంతలలాగా (అభిజ్ఞానశాకుంతలం) కనుపిస్తుంది. ఆ సందర్భాల్లో రామరాజభూషణుడి కవిత్వం అమోఘం.

వసుచరిత్ర కావ్యానికి ఒక గొప్పతనం ఉంది. మన పూర్వకావ్యాలు సంస్కృతకావ్యాలకి అనువాదాలు. వసుచరిత్ర విషయంలో అది తారుమారై, తెలుగు వసుచరిత్ర సంస్కృతంలో వ్రాయబడింది. అదే కాకుండా, తమిళం ఆంగ్లం మొదలైన ఎన్నో భాషల్లోకి అనువదించబడింది.

వీధికొక పిల్లవసుచరిత్ర పుట్టుకు రావడం చూస్తే, తర్వాత కవులపైన రామరాజభూషణుడి ప్రభావం ఎంత ఉందో అర్థమవుతుంది.ఇన్ని లక్షణాలున్న వసుచరిత్రలోని కొన్ని పద్యాల గురించి కొద్దిగా చెప్పాలన్నా ఒక పట్టాన తెమిలే

విషయం కాదు. మచ్చుకు కొన్ని పద్యాలు పరిశీలిద్దాం. ఈ కొన్నింటిలో కూడా పద్యానికి వివరంగా అర్థం చెప్పబోతే ఒక గ్రంథం అవుతుంది. అందువల్ల, పైపైన స్పృశించి వదిలేద్దాం.

రామరాజభూషణుడి చమత్కారానికి ఉదాహరణగా నాయకుడు చెప్పిన ఈ క్రింది పద్యం.

స్వైరవిహారధీరలగు సారసలోచనలున్న చోటికిన్
బోరన లాతివారు చొరబూనినచో రసభంగమంచు నే
జేరక పువ్వు దీవియల చెంతనె నిల్చి లతాంగి రూపు క
న్నారగ జూచి వచ్చితి నవాంబురుహాంబక నీకు దెల్పగన్'

(అర్థం – అక్కడ స్త్రీలు (సారసలోచనలు) స్వేచ్ఛగా విహరించడానికి అలవాటు పడ్డ ప్రౌఢలు. అలాంటి స్త్రీలున్న చోటకి తటాలున వేరే వాళ్ళెవరైనా వెళ్ళారంటే ఆ స్త్రీలకి రసభంగం అవుతుంది. అందువల్ల వాళ్ళకి ఎదురుపడకుండా ప్రక్కనే ఉన్న ఒక పువ్వుతీగెల పొద దగ్గర నిలబడి నా కళ్ళకి ఆనందం కలిగేలా ఆ అమ్మాయి అందాన్ని చూశాను. ఆ విషయం నీకు చెబుదామని వచ్చా).

ఇది చాలా సాధారణమైన పద్యంలా ఉన్నా ఇందులోని 'సారసలోచనలు' 'రసభంగం' పొందుతారు అనే మాటల్ని ప్రయోగించడం ద్వారా కవి చమత్కారం చేసాడు. రసభంగం అంటే "రస" అనే అక్షరాలు భంగపడ్డం అని అర్థం తీసుకుంటే, "సారసలోచన" కి రసభంగం కాగానే "సాలోచన" అవుతుంది.

వాళ్ళ సరస సంభాషణలకు భంగమౌతుందని అని ఒక అర్థం చెప్పుకున్నాంగదా. "సారసలోచనలు" అను పదములో 'రస' అను అక్షర భంగ మయితే అసలే పెద్ద కన్నులున్నవాళ్ళు,నన్ను చూసి యింకా కళ్ళు విప్పార్చుకొని సాలోచనలై "వీడెవడు? పానకంలో పుడక లాగ" అని ఆలోచిస్తూ ఉండిపోతారు అనే మరో అర్థం స్ఫురిస్తుంది.

మరో పద్యం – ఇది మనుచరిత్ర మార్గాన్ని అనుసరించి తెలుగులో చెప్పిన కాళిదాసు బాణీ.

ఒక అందమైన శ్లేష. శుక్తిమతిని నదిగానూ ఒక స్త్రీమూర్తిగానూ ఒకే పద్యంలో వర్ణిస్తున్నాడు.

వేణి చలింప గంపితనవీనమృణాలభుజాగ్రకంకణ
శ్రేణి నటింప లోలశఫరీనిబరీసకటాక్ష కాంతి వి
న్నాణము చూప హంసకగణ క్వణనంబును మీర సైకత
శ్రోణి వివర్జితాబ్జముఖశోభితయై కడు సంభ్రమించినన్

మొదటి అర్థం – నదీప్రవాహం అల్లకల్లోలం అవగా, తామరతూడులు అటూ ఇటూ కదుల్తూండడం చేత, నీటి బిందువులు కదిలిపోతూంటే, చేపలు మిడిసి మిడిసి పడి, మిలమిల మెరుస్తూంటే, హంసల గుంపులు రొదలు పెడుతూంటే, తామరపువ్వులు తారుమారవుతూంటే, ఆ నది విపరీతంగా కలకలం చెందింది.

రెండవ అర్థం – ఆమె (శుక్తిమతి) జడ అల్లల్లాడుతూంటే, లేతామరతూడుల్లాంటి చేతులు వణుకుతూంటే, చేతికి ఉన్న కడియాలు కదుల్తూంటే, ఎగిసిపడే చేపల్లా ఆమె కడకంటి చూపులు భయం భయంగా చూస్తూంటే, కాలి అందెలి మ్రోగుతూండగా తామరపువ్వులాంటి ఆమె ముఖాన్ని తిప్పుకుని మిక్కిలి తొందరపాటుని పొందింది.)

రామరాజభూషణుడి శబ్దాలంకారాన్ని ప్రతిబింబించే మరొక పద్యం. వసంత శోభని వర్ణిస్తూ వ్రాసిన ఈ పద్యం ఒక సంగీత రసప్రవాహం. రామరాజభూషణుడు మహా సంగీత వేత్త. గొప్ప వైణికుడు. ఆయన వీణ మీద వాయించి వినిపించేవాడట. ఈ పద్యం వింటూంటేనే మనస్సు ఉయ్యాలలూగుతుంది.

లలనాజనాపాంగవలనావసదనంగ
తులనాభికాభంగ దోఃప్రసంగ
మలసానిలవిలోల దళసాసవ రసాల
ఫలసాదరశుకాల పనవిశాల
మలినీగరుదనీకమలినీకృతధునీ క
మలినీ సుఖితకోకకులవధూక
మతికాంత సలతాంత లతికాంతరనితాంత
రతికాంతరణతాంత సుతనుకాంత
మకృతకామోద కురవకావికలవకుల
ముకులసకలవనాంతప్రమోదచలిత
కలితకలకంఠకులకంఠకాకలీ వి
భాసురము వొల్చు మధుమాసవాసరంబు

ఈ పద్యంలో మొదటి పాదంలో స్త్రీల క్రీగంటి చూపులతో పరవశిస్తున్న కాముకుల కౌగలింతలు, రెండవ పాదంలో మందమారుతంలో కదిలే తీయని మామిడి చిగురుటాకులని తినే రాచిలుకలు, మూడవ పాదంలో ఆడతుమ్మెదల గుంపుల రెక్కలచేత నల్లబడ్డ తామర తీగలలో దాక్కున్న చక్రవాక పక్షులు, నాలుగవ పాదంలో పూపొదరిళ్ళలో జంటలు, వర్ణింపబడ్డాయి. ఇక యెత్తుగీతలో, గోరంటపూల మొగ్గలు, కోయిల పాటలున్నాయి. ఈ విధముగా పద్యమంతా వసంత శోభతో నిండిపోయింది. రామరాజభూషణుడి నాయికలు ఏడవడం కూడా సంగీతయుక్తం గానే ఏడుస్తారు .

ఆ జాబిల్లి వెలుంగు వెల్లికల డాయన్ లేక రాకానిశా
రాజశ్రీసఖమైన మోమున బటాగ్రంబొత్తి యెల్గెత్తి యా
రాజీవానన యేడ్చె కిన్నర వధూరాజత్కరాంభోజకాం
భోజీమేళవిపంచికారవసుధాపూరంబు తోరంబుగాన్.

కిన్నెరస్త్రీలు కాంభోజీరాగం మేళవించి వాయిస్తున్న వీణానాదానికి దీటుగా రాగయుక్తంగా గిరిక ఏడ్చింది.

చివరిగా నిజజీవితంలో చూసే దృశ్యాల్ని ప్రతిబింబిస్తూ రామరాజభూషణుడు వ్రాసిన అమోఘమైన పద్యంతో ముగిద్దాం.

హరిదంభోరుహలోచనల్ గగనరంగాభోగరంగత్తమో
భరనేపథ్యము నొయ్య నొయ్య సడలింపన్ రాత్రిశైలూషికిన్
వరుసన్మౌక్తికపట్టముల్ నిటలమున్ వక్త్రంబునున్ దోచె నా
హరిణాంకాకృతి వొల్చె రేకయి సగంబై బింబమై తూర్పునన్

అర్థం – దిక్కులు అనే స్త్రీలు చీకటి అనే తెరని కొంచెం కొంచెం దించుతున్నారు. ముందుగా రాత్రిశైలూషి (రాత్రి అనే నటి) యొక్క ముత్యాల పట్టీ కనిపించింది. తరువాత నొసరు కనిపించింది. ఆ తర్వాత ముఖం పూర్తిగా కనిపించింది. అలా క్రమక్రమంగా చంద్రబింబపు ఆకారం, ముందు రేఖలాగా, తర్వాత సగం చంద్రుడి లాగా, ఆ తర్వాత లేడిని తనయందు గలిగి ఉన్న పూర్తి చంద్రబింబం తూర్పున కనిపించింది.)

నటీమణులు నొసటిపైన ముత్యాల పట్టీ ధరిస్తారు. స్త్రీ నొసరు చంద్రరేఖలా ఉంటుంది, స్త్రీ ముఖం పూర్ణ చంద్రునిలా ఉంటుంది. రామరాజభూషణుడు నిజజీవితంలో నాటకాల్లో చూసిన నటీమణి రంగప్రవేశాన్ని జ్ఞప్తికి తెచ్చుకొని, కవిత్వంలో దాన్ని అందంగా చంద్రోదయంతో పోలుస్తూ ఈ పద్యరత్నాన్ని మనకందించాడు. ప్రబంధకవిత్వాన్ని సంపూర్ణంగా చదివే సమయం, ఓపిక లేనివాళ్ళు రామరాజభూషణుడి వసుచరిత్రం ఒక్కటి చదివితే చాలు.

వసుచరిత్రలో ప్రతిపద్యం అశేషరసధారల్ని చిమ్ముతుంది.



నా యువకాశల నవపేశల సుమగీతావరణంలో నిను నే నొక
సుముహూర్తంలో, అతిసుందర సుస్యందనమందున
దూరంగా వినువీధుల్లో విహరించే అందని అందానివిగా
భావించిన రోజులలో, నీకై బ్రదుకే ఒక తపమై
వెదుకాడే నిమిషాలందున నిషాలందున, ఎటు నే చూచిన
చటులాలంకారపు మటుమాయల నటనలలో,
నీ రూపం కనరానందున నా గుహలో, కుటిలో, చీకటిలో
ఒక్కడనై స్రుక్కిన రోజులు లేవా? -

(శ్రీశ్రీ - కవితా ఓ కవితా)

మధుర వోణి

- డా. కలశపూడి శ్రీనివాస రావు

మనుమరాలికి కానుక ఇవ్వాలని ఎవరికి ఉండదు? అందరికీ ఉంటుంది. నాకూ ఉంది. పుట్టబోయే ఆ పిల్లకి ఇచ్చే కానుక గురించి, పెట్టే పేరు గురించి వాళ్ళ తల్లితండ్రుల నుంచి చుట్టాలు, బంధువులు, ఆత్మీయులు, మిత్రుల వరకూ అందరికీ ఎవరి ఆలోచనలు వారికి ఉన్నాయి.

నాకు మాత్రం ఇచ్చే కానుక గురించే ఆలోచన. మా అమ్మమ్మ 1900 సంవత్సరంలో పుట్టింది. నా మనుమరాలు 2020లో పుడుతుంది. ఆందువలన నా మానవ సంబంధాల కాల విస్తీర్ణం ఇప్పటికి 120 సంవత్సరాలు. అమెరికాలో నేడు పుట్టే ఆడపిల్లలు 100 ఏళ్ళు బ్రతుకుతారని శాస్త్రజ్ఞుల అంచనా. పుట్టబోయే నా మనుమరాలు 100 ఏళ్ళు బ్రతుకుతుంది. ఆమె ఆలోచనలలో నా జ్ఞాపకాలు అన్నాళ్ళు బ్రతికి ఉంటాయి. ఈమె పుట్టుకతో నా మానవ సంబంధ కాల విస్తీర్ణం మరో వందేళ్ళు పెరుగుతుంది. నా మనుమరాలు నాలోని ఒక అంశని తరవాతి తరాలకి అందిస్తుంది.అందుచేత ఇచ్చే కానుక అంత ముఖ్యమైనది కావాలనిపించింది. మా అమ్మమ్మ నన్ను ఎంత ముద్దు చేసేదో అంత ముద్దు చెయ్యాలి. అంతకన్నా ఎక్కువే ముద్దుచెయ్యాలి.

అహంకారం కొద్దీ అలా అంటాం కానీ ప్రేమించడం, ముద్దు చెయ్యడం లాంటివి వాటికవే సంపూర్ణాలు. అవి మనసుని ఆశ్రయించి ఉంటాయి. అందుకే అవి అభౌతికాలు. భౌతికమైన వాటికే చిన్న, పెద్ద, తక్కువ, ఎక్కువ కానీ, అభౌతికమైన వాటికి అవి వర్తించవు. కానీ అభౌతికమైన వాటిని అందిచేవి భౌతికమైనవి కూడా కావచ్చు. వాటినే కానుకలు అంటాం. మనిషికి మనిషికి మధ్య ఉండే సంబంధాలలో ఈ కానుకల పాత్ర ఉంటుంది. పొత్తిళ్ళలో పాపాయి దగ్గర నుండి పెద్దైన అమ్మాయి దాకా దానికి కావలసినది, ముచ్చట నిచ్చేది ఒక కానుక ఇవ్వాలి.

అమ్మమ్మని గుర్తుకు తెచ్చే తమ్మెట్లు, మంగళసూత్రాలు, పంచలోహపాత్ర, పూజసామగ్రి, వెండి గ్లాసులాంటి ఎన్నో వస్తువులు గుర్తుకు తెచ్చుకున్నాను.మరచిపోతున్న అమ్మమ్మ జ్ఞాపకాలని తరచి తరచి చూసేలా చేసింది పుట్టబోయే పిల్ల తనదైన జ్ఞాపకాల తొలి బీజం నాలో నాతోనే నాటిస్తూ.సృష్టిలో నాకు ప్రతీదీ ఎంతో వింత.పెరిగే మొక్క చూస్తే వింత,ఎగిరే పక్షిని చూస్తే వింత,మెరిసే మెరుపుని చూస్తే వింత,కురిసే వానని చూస్తే వింత,చక్కిలిగింతలు పెట్టే చినుకు స్పర్శ వింత.

ఇలా ప్రకృతిని చూసి పులకించే నాకు తిరిగి రాలేని చోటికి వెళ్ళిపోయిన అమ్మమ్మ జ్ఞాపకాలని రాబోయే మనుమరాలు రప్పించడం మరొ వింత ఆనందాన్ని కలిగించింది. మనిషి మాత్రమే ఇటువంటి ఆనందాలని పొందగలడేమో కదా! డబ్బుతో కొనలేని ఈ ఆనందంలో మునిగితేలుతూ ఉండగానే కొన్ని రోజులు గడిచాయి. కాని పుట్టబోయే పిల్లకి ఏ కానుక ఇవ్వాలో నిశ్చయించలేకపోయాను. ఆలోచిస్తూనే ఉన్నాను. ఆ ఆలోచనల అలలపై తేలుతూ ఆనందపుటంచులని తాకుతూనే ఉన్నాను. ఎవ్వరూ ఇవ్వనిది, ఊహించలేనిది, ప్రత్యేకమైనది, ఇచ్చే నాకు, తీసుకొనే మనుమరాలికి ఆనందాన్ని ఇచ్చే కానుక ఏమై ఉంటుందా అని ఆలోచించాను. ఏమీ తోచలేదు. ముందుకు వెళ్ళడానికి మార్గం తోచకపోతే ఆలోచనలను ఆపి, ఉదయాన్నే వచ్చే మొదటి ఆలోచనని ఆచరించమని సలహా ఇచ్చిన డాక్టర్ రామచంద్ర దాస్ మాట గుర్తుకి వచ్చింది ఒక రోజు.

ఉదయాన్నే లేచీ, లేవని స్థితిలో, కలో నిజమో తెలియని అవస్థలో, అమ్మమ్మ వోణీలో కనిపించింది. 'అమ్మమ్మా!" అని పిలిచాను. కళ్ళు విప్పి చూశాను. 2020 కొత్త కేలండరులో తెల్ల నందివర్ధనాలు పూచిన కొమ్మలా మంచుతో కప్పబడి ఉన్న చెట్టు ఫక్కుమని నవ్వుతున్న దృశ్యం. ఆశ్చర్యం. నేను పుట్టేసరికి అమ్మమ్మ వయస్సు 50 ఏళ్ళు దాటిపోయాయి. అందుచేత చీరలోనే కానీ అమ్మమ్మని మరోలా ఊహించుకోలేను. కానీ మరి 'వోణీలో అమ్మమ్మ' నా ఊహల్లోకి ఎలా వచ్చింది? స్మృతికి అందని కోరికలని, ఊహలని, ఆశలని చూపించే రంగస్థలం కాబోలు కల. విభిన్నమైన ఊహల అనూహ్య మిశ్రమమే కాబోలు కల. అమ్మమ్మ నాపై చూపిన ప్రేమని, నా మనసు లోపలి పొరలలో ఎక్కడో దాచింది కాబోలు. నాకు నా మనుమరాలిపై కలిగిన ప్రేమ దానితో అనుసంధానమైంది కాబోలు. దాని ప్రతిధ్వనే కాబోలు, ఈ కల.భూత, వర్తమాన, భవిష్యత్ ల విచిత్రమైన చిత్రం కాబోలు కల. ఒక మంచి వోణి ఎంచి కొనాలి. ఆ వోణిలో నా మనుమరాలిని చూడాలి. కలలో చూసిన చిత్రాన్ని సాక్షాత్కారం చేసుకోవాలి, అని నిశ్చయించుకుని మంచం దిగాను.

పుట్టబోయే పిల్లకి వోణి కానుకగా ఇస్తాను అంటే అందరూ

నవ్వారు. అమ్మమ్మ వోణి కల గురించి చెప్పాను. చిన్నప్పుడే పెళ్లిపోయిన మీ అమ్మమ్మ వోణీలు కట్టి ఉండకపోవచ్చు. అమెరికాలో పుట్టి, అమెరికాలో పెరిగే నీ మనుమరాలు వోణీలు వేసుకోకపోవచ్చు. అయినా కాకపోయినా, వోణీలో కొత్తదనమేముంది అన్నారు.కాని పైరు పొలాల పచ్చదనం లంగా, జాకెట్టుగా, పేదరాసి పెద్దమ్మ ఆకాశంలో ఆరబోసిన కుంకం రంగులాంటి ఎర్రని ఎరుపు వోణి నా కళ్ళముందు కనిపిస్తుంటే ఇంకో కానుక గురించి ఏలా ఆలోచించగలను?

మావూరు ఫోను చేసి మా చుట్టాలమ్మాయికి వోణి విషయం వివరించి ఒక వోణి కొనమన్నాను. ఆమె ఫక్కున నవ్వి, నీ పిచ్చి కానీ, ఆడపిల్లలంతా చూడిదార్లు, పేంట్లు, జీన్సు పేంట్లు, చిరిగిన జీన్స్, కన్నాలున్న జీన్స్, మరీ అభ్యుదయులైన వాళ్లైతే 'నా వళ్ళు నా ఇష్టం' అని నిక్కర్లు వేసుకొని వంటిని పచ్చబొట్లతో కప్పుకుంటున్నారు. నీ మనుమరాలిని బ్రతిమాలి వోణి కట్టించినా, అది పురావస్తుశాలలోని నమూనాగా ఉంటుంది. పారిస్ గీరిస్ లాంటి ఊర్లు తిరుగుతావు. అక్కడ మంచి మంచి లేటెస్ట్ ఫేషన్ బట్టలుంటాయి అవి కొను, అని నా అభిమతాన్ని మార్చడానికి ఇంటికొచ్చి, తలుపుకొట్టి, బైబిల్ చేతిలో పెట్టి, భయపెట్టి, మతం మార్చుకోమన్న జహోవా విట్నెస్ వాళ్ళలా పట్టుదలతో చెప్పుకొచ్చింది.

అంతా విని, నిజమే కానీ, వోణీ కొనాలని పట్టుపట్టాను. అది కూడా బత్తుల తవిటయ్య మనవల దగ్గరే కొనాలన్నాను. ఎందుకంటే నా చిన్నప్పుడు బత్తుల తవిటయ్య చీరల మూటతో మా ఇంటికి వచ్చేవాడు. ముందు వసారాలో అన్నీ పరిచి ఎంచుకోమనేవాడు. ఆ రెండు మూడు గంటల సేపు ఇంట్లో వున్న ఆడవారంతా అక్కడే వుండేవారు. అమ్మమ్మ, అమ్మ, పిన్నమ్మలు, అత్తయ్యలు, వదినలు, అక్కలు రకరకాల చీరెలు తీసుకొనేవారు. పెళ్ళి కాని వారంతా వోణీలు తీసుకొనేవారు, అని చెప్పి, నా కలలో నేను చూసిన చక్కని వోణి ఒకటి కొనమని ఆమెకి పురమాయించాను.

తరతరాలుగా బట్టలు నెయ్యడం, బట్టలు అమ్మడం వృత్తిగా ఉన్న సాలెల కుటుంబాలు ఎప్పుడో నేత పని మానేశారుట. అంచేత జరీ అంచు పెట్టి నువ్వు ఊహించినంత అందంగా నేయించడం కుదరదు. అయినా మీ అమెరికా వాళ్ళకేంటో ఈ రాచ్చిప్పలో పచ్చళ్ళు లాంటి ముచ్చట్లు అని విసుక్కుంది.

పోనీ కింతలి జనార్దనం బట్టల దుకాణంలో ప్రయత్నిస్తావా అని అడిగాను. ఆ రోజుల్లో కింతలి జనార్దనం బొంబాయి నుండి బట్టలు తెప్పించేవాడు. అక్కడ చాలా ఖరీదైన బట్టలు దొరికేవి. కింతలి జనార్దనం వయసు మీద పడడంతో బట్టల దుకాణం మూసేశారుట. అతని కొడుకులు గజాల్లో బట్టని కాక, భూమి అమ్ముతున్నారుట. పైగా నువ్వు అనుకున్నట్టు అవి అంత మంచివి కావు. అతను బొంబాయి మిల్లులో వచ్చే రెండో రకం బట్టని మధ్యవర్తుల ద్వారా కొని మరింత రేటు వేసి అమ్మేవాడుట.అన్ని తెలివితేటలున్న వాడివి అని అందరూ అంటారేమో గాని నీకు ఇలాంటి విషయాలలో ఎవరెంత చెపితే అంతేనా? నీకందరూ చెప్పేవి నిజాలని, వాళ్ళంతా సత్యహరిశ్చంద్రులని అనుకుంటావు. నిజమేమిటంటే వాళ్ళు చెప్పేవి డైలాగులని, వాళ్ళు స్టేజిమీద నటుల కన్నా గొప్ప నటులని నువ్వు తెలుసుకుని ఉంటే, ఈపాటికి ఎవరెవరికో వచ్చిన ప్రైజులు, అవార్డులు, రివార్డులు నీకే వచ్చేండేవి, అని నవ్వుతూ అనవలసిన నాలుగూ అంది. ఇక నాకు ఇలాంటి పనులు చెప్పకు. ఏదైనా ఒక మంచి కొత్త కానుక కోసం ఆలోచన చెయ్యి. కొత్త తరానికి తగిన ఆలోచన చెయ్యి, అని ప్రోత్సాహకరంగా కొద్ది సేపు చెప్పింది.

తరం నుండి తరం మారాలి. ఒక్కలాగే ఉండిపోకూడదు. కానీ తెగిన గాలిపటాలలా ఏ తరానికాతరమే అని దూరమైపోతే, మన సంస్కృతి – వేరు తెగిన చెట్టులా వాడిపోతుంది. మనలోని 'జీవం' కాలంలో ఇంకిపోయి, బ్రతుకు మోడువారి నిస్సారమవుతుంది. కొత్త తరానికి, గడిచిన తరాలకి వారధిగా ఉండేలాంటి ఆలోచనలు కావాలి. అప్పుడే కుటుంబానికి, మానవజాతికి ఒక అర్థం ఉంటుంది అని నా మనసులో మెదిలిన ఈ భావన నా మెదడులో బాగా నాటుకొంది. మనసు మెదడు, అనుసంధానమైతే మనిషి, మనిషిగా మరో మెట్టు ఎక్కుతాడు.

కొత్తదయి ఉండాలి, కొత్త తరానికై ఉండాలి. కొత్త, పాత తరాల మధ్య వారధై ఉండాలి... ఇలా ఆలోచించడం మొదలు పెట్టాను. రకరకాల కానుకల గురించి ఆలోచించాను. అయినా కానుకగా వోణి కాకుండా మరొకదానికి మనసు ఒప్పడంలేదు. ఈ సమయంలో మాచవరం మాధవయ్యగారు గుర్తుకి వచ్చారు. ఆయన పెద్ద బట్టల వ్యాపారి. ఆయనకి భక్తి ఎక్కువ. దేవుడి మీద భారం వేసి దేశంలో ఎక్కడున్న దేవాలయానికైనా వెళ్ళిపోతారు. వ్యాపారం, భక్తి, తీర్థయాత్రల సంగమమే ఆయన జీవితం. అందువలన ఆయనకి వోణీలలో కొత్తదనం గురించి తెలిసే ఉంటుందని ఆయనతో నాకు కావలసిన వోణి గురించి చెప్పాను. విషయం విని ఆయన భక్తిపారవశ్యంలో ఆడపిల్లకి శక్తి ముఖ్యమని కాశ్మీర్ లో సరస్వతీదేవి నుండి శ్రీలంకలోని

శంకరి దేవి వరకు ఉన్న 18 శక్తి పీఠాలకు ఒక వోణి పంపి ఆ దేవతలందరి ఆశీస్సులతో ఆ వోణి తెప్పించమంటే ఇప్పుడే ఆ పని మీద ఉంటాను అన్నారు.

భక్తి బాగా ఉన్నవారికి ఆయన ఇచ్చిన ఆలోచన ఒక వరం. కానీ ఇంత చేసినా పుట్టబోయే పిల్లకి భక్తి ఉంటుందని నమ్మకమేమిటి. భక్తి లేకపోతే ఈ ప్రయాస అనవసరం అని తటపటాయించాను. ఇంతలో ఆయనే మళ్ళీ ఫోను చెసి మీకు మధుర మీనాక్షి అమ్మవారి ఆలయం నుండి ప్రసాదంగా ఒక వోణి తెప్పించమంటారా? మీరు ఏప్రిల్ దాకా టైం ఇస్తే మీనాక్షి అమ్మవారి తిరుకల్యాణం నాడు అమ్మవారికి కట్టించి, తెప్పించి ఇస్తాను అన్నారు. అంత అభిమానంతో సాధారణంగా అందరికీ వీలుకాని రీతిలో వోణి తెప్పిస్తాను అంటే కాదని ఏలా అనగలను.

కానీ, దీనిలో ఉన్న కొత్తదనమేమిటి? జవాబులేదు. ఆయినా, ఈ వోణి ఎక్కడ కొంటారు? అని అడిగాను.

మనం మధుర మీనాక్షమ్మవారి ప్రసాదం అని అనుకొంటే మరెక్కడో ఎందుకండీ? అక్కడే మధురలోనే స్పెషల్ గా ఆర్డర్ చేయిస్తాను. వందల ఏళ్ళక్రితం గుజరాత్ లోని సౌరాష్ట్ర ప్రాంతం నుండి వచ్చిన మహా నేతగాళ్ళ వంశంలోని వాళ్ళతోనే నేయిస్తాను. మూడునాలుగువేల దారాల మేళవింపుతో వోణి బట్టని, బోర్డర్ డిజైన్ మనకి కావలసినట్టు చేయిస్తాను, అన్నారు.

"మనం డిజైన్ ఇస్తే అదే డిజైన్ చేస్తారా? లేక వాళ్ళ డిజైన్ మాత్రమే చేస్తారా" అని అడిగాను.

"మనమిచ్చిన డిజైన్ కి తగిన విధంగా నేయడానికి గట్టి అట్టల మీద కన్నాలు కొట్టి మనకి కావలసిన రంగు దారాలని వాటి ద్వారా పంపి నేస్తారు " అన్నారు.

"అట్టల మీద డిజైన్ కోసం కన్నాలు కొట్టడం అంటే ఏమిటి?" అని అడిగాను. "మీరు తాళపత్ర గ్రంథాలని చూశారా" అని అడిగారు, నేను జవాబిచ్చేలోపునే,

"మరేం కాదండి పూర్వం తాటాకులని శుభ్రం చేసి, రాయడానికి వీలుగా కోసి వాటి మీద గ్రంథాలని రాసేవారు కదా అల్లాంటిదే, కాకపోతే వెడల్పు ఎక్కువ ఉంటుంది. మన డిజైన్ కి కావలసిన కన్నాలు కొట్టి దీన్ని మగ్గం ఎక్కిస్తారు. ఆ కన్నాల ద్వారా కావలసిన రంగు దారాలు రావలసిన తీరులో రావడానికి ఏర్పాటు చేస్తారు. అప్పుడు నేత మొదలుపెడతారు" అని వివరించారు. "మీకు నచ్చిన డిజైన్ పంపండి. నేను పని మొత్తం అయ్యేలా చూస్తాను అన్నారు.

కార్డు, కన్నాలు అంటే ఎప్పుడో వాడిన కంప్యూటర్ పంచ్ కార్డులు గుర్తుకు వచ్చాయి. కన్నం ఉండడం లేదా లేకపోవడం ద్వారా అమెరికాలో ఇదే విధంలో ప్రతీ పేజీలో ఒక పద్ధతిలో ఉన్న కన్నాల ద్వారా జ్యుక్ బాక్స్ లో సంగీతం వచ్చే ఏర్పాటు ఉంది. వీటన్నిటికి మూలం జకార్డ్ కార్డు అని తెలుసుకొని చాలా సంతోషించాను. వెంటనే ఆ మ్యూజిక్ కార్డులు తెప్పించాను. ఇల్లాంటి కార్డు కంప్యూటర్ మీద చెయ్యడానికి కావలసిన సాఫ్ట్ వేర్ ప్రోగ్రాం కూడా తెప్పించాను. ముందు కొన్ని భారతీయ రాగాలని ఇచ్చే పంచ్ కార్డ్స్ తయారు చేశాను. ఆ రాగాల కార్డులని కంప్యూటర్ లోనే నేతకి వాడితే ఎలాంటి డిజైన్ వస్తుందో చూశాను. ఒక నెలరోజులలో నాకు నచ్చిన డిజైన్ దానివలన వచ్చే రాగం నిశ్చయమైంది. ఈ సమాచారాన్ని మధురైలో నేత పనివారికి పంపించాం. దాని ప్రకారం వారు నేసిన వోణి అందింది. సప్తస్వరాలని రంగుల్లోకి మార్చి, ఆ రంగులపోగులతో బట్టను నేసి సంగీతాన్ని కట్టుకొనేందుకు వీలు చేసిన ఈ వోణి చాలా ముచ్చటగా ఉంది.

దీని వలన సంగీతం మరోనాలుగు కాలాలపాటు ప్రజల బట్టల రూపంలో నిలబడుతుంది, నేతగాళ్ళకి కొత్త మార్గంలో ఆదాయం వస్తుంది అని తోచింది. ఆ డిజైన్ చూసి అందరూ ముచ్చట పడ్డారు. ఎప్పుడూ ఎక్కడా ఇలాంటి బోర్డర్ చూడలేదే అన్నారు.

"అవును చూసి ఉండరు. ఎందుకంటే ఇది మధువంతి రాగం." అన్నాను.

"మేం బోర్డర్ అంటే నువ్వు రాగం అంటావేంటి?" అన్నారు.

"అవును 72 భారతీయ రాగాలలో అతి మధురమైన, మధువంతి రాగంతో చేసిన బోర్డర్ ఇది", అని ఎలా చేసానో వివరించాను.

వోణి చేతిలోకి తీసుకొని అందులో అమర్చిన మైక్రో చిప్ నొక్కాను. మధువంతి రాగం హరిప్రసాద్ చౌరాసియా ఫ్లూట్ లోంచి ప్రవహించింది. పుట్టిన పిల్ల పెరిగే దాకా సంగీతాన్ని విని ఆనందిస్తే, పెద్దెన తరువాత సంగీతాన్ని, డిజైన్ని కూడా ఆనందిస్తుంది అన్నారు కొందరు.

"వావ్, మాకూ కావాలి ఈ వొణి. ఈ వోణి పేరేంటి ?" అన్నారు అందరూ ఆనందంగా.

"ఈ వోణి పేరు మధుర వోణి!"

ఒకే ఒక్కడు ఇస్మాయిల్

- డా. రవూఫ్

గురజాడ వాడుక భాషకి దారులు వేశాక తెలుగు కవిత్వాన్ని కొత్త పుంతలు తొక్కించిన వాడు ఇస్మాయిల్!

చెట్టు నా ఆదర్శంలో పదచిత్రాల మేళనంతో ఆధునికతకి అద్దం పట్టిన అతడి కవిత్వం తదనంతర కాలంలో మృత్యువృక్షంతో పతాకస్థాయిని అందుకొంది.సరళమైన భాష, మొనదేరిన బాణంలా సూటిగా నాటుకొనే శైలీ శిల్పం, పంచేంద్రియాల్ని స్పృశిస్తూ జీవితానుభావాల్ని చిత్రించే ఒడుపే ఇస్మాయిల్ కవిత్వాన్ని ప్రత్యేకంగా తీర్చిదిద్దింది. వచనంలో చెలం చేసిందే కవిత్వంలో ఇస్మాయిల్ చేశాడు. సునిశితమైన శైలితో కథానుగుణమైన మూడ్ ని సృష్టించి, పాఠకుల హృదయాలపై బలీయమైన ముద్ర వేశాడు చెలం. అదే విధంగా పదచిత్రాలతో కవి సమయాల్ని అద్భుత దృశ్యానుభవాలుగా మలిచాడు ఇస్మాయిల్!

'రాత్రి కారు ప్రయాణం' కవితలో "చీకటి జిప్పుని విప్పుతో" ప్రయాణిస్తోన్న కారు హెడ్ లైట్ల కాంతిని "అలవాటైన పగటి వెలుతురు కాదిది " అంటూ ముక్తాయించి శృంగార భావనని అలవోకగా పలికించాడు కవి . 80యో దశకంలో ఆంధ్రజ్యోతి వీక్లీలో ఈ కవిత అచ్చైనపుడు ఆశ్చర్యానందాలకి లోనైంది తెలుగు పాఠక లోకం. ఏ పాశ్చాత్య కవో రాసిన కొంగొత్త కవిత్వమని కూడా భావించారు అనేకులు. కానీ, ఈ కవిత రాసింది ఇస్మాయిల్ అని తెలిసి విస్మయానికి లోనయ్యారు పాఠకులు. కవిత్వమంటే మూస వాక్యాల దొంతరో, పదాడంబరమో కాదు, ఇంద్రియాల్ని స్పృశించే రసాయనిక చర్య అని తన కవితల్తో మనకు అనుభవపూర్వకం చేశాడు ఇస్మాయిల్!

ఉదాహరణకి ,చిలకలు వాలిన చెట్టు కవితలో :

కిచ కిచమని శబ్దమైతే
కిటికీ లోంచి చూశాను
ఎప్పటి లాగే చెట్టు
గుప్పిట విప్పి నిలుచుంది
మరెక్కడిదీ చప్పుడు?
పరాకాయించి చూశాను
పచ్చటి చీకట్లో
మంటేదో ఎర్రగ కదిలింది
గుట్టు తెలిసింది : చిలక!"

కిచకిచలాడుతోన్న చిలుకల ఎర్రటి ముక్కుల్ని పచ్చటి చీకట్లో కదిలే ఎర్రటి మంటగా దృశ్యమానం చేసి మన శ్రవణేంద్రియాల్ని, చక్షువుల్ని స్పృశిస్తాడు ఈ కవితలో !

ఇంకో కవిత .... Left Bank, Paris లో రోడ్డు పక్క ఆర్టిస్ట్ గురించి చెప్తో ...

కాగితం లోతుల్లోకి
కుంచెను గేలంగా విసిరి
పొంచి ఉన్నాడు
ఏ అద్భుతమైన ప్రాణుల్ని పట్టే ప్రయత్నమో? " అంటాడు.

ఆ ఆర్టిస్ట్ చేతి కుంచెలో ప్రాణం పోసుకోనున్న సజీవ చిత్రం గురించి ప్రస్తావిస్తాడు. ఏ కళ కైనా సజీవత్వమే ముఖ్యమని అన్యాపదేశంగా చెప్తాడతడు. పలికే వరకు సదరు చిత్రం కోసం ఎదురు చూస్తోన్న ఆ ఆర్టిస్ట్ లాంటి వాడే ఇస్మాయిల్ కూడా! అనేక సందర్భాల్లో నేను స్లో రైటర్ ని అని చెప్పుకున్నాడు కూడా! ఇస్మాయిల్ సైతం రోడ్డు పక్క ఆర్టిస్ట్ కి మల్లే కవిత్వం తనంతట తను తన హృదయం లోంచి అప్రయత్నకం గా పెల్లుబికే క్షణం కోసం యుగాలకి యుగాలు ప్రతీక్షించాడు కనుకనే, అతడి కవిత్వం ప్రాణ స్పందనల్తో తొణికిసలాడుతుంటుంది.

ఇస్మాయిల్ కవిత్వమంతా కలిపి ఓ 200 పేజీలకి మించదు .... ఒరిజినల్ వర్క్స్, అనువాదాలు, హైకూ పద్యాలతో సహా! కవిత్వాన్ని అతడు తపస్సులా భావించాడు. మునిలా జీవితాన్ని వెళ్ళమార్చిన మౌని ఇస్మాయిల్! అందుకే, అతడి కవిత్వం లో అంతటి ప్రగాఢతా , ప్రభావశీలతా!

ఇస్మాయిల్ గొప్ప పఠిత! దేశ దేశాల కవుల్ని చదివాడు. సాకల్యంగా కవిత్వాన్ని, కవిత్వ రీతుల్ని అవగతం చేసుకొని ; తనదైన మార్గాన్ని స్పష్టపరచుకొని, ఆ మార్గంలో సృజనని కొనసాగించాడు. ఇస్మాయిల్ కవిత్వ ధోరణి తెలుగు పాఠకులకి కొత్త! జీవితం, కవిత్వం రెండూ ఒకే నాణానికి రెండు పార్శ్వాలుగా భావించాడు. తన జీవితానుభవాల్నే కవిత్వంగా ఆవిష్కరించాడు. ఆ అనుభవాల్ని సార్వత్రిక సత్యాలు చేసి

ఎగరేశాడు. ఇస్మాయిల్ కి కవిత్వమంటే, ముడుచుకుపోయిన రాయి కాదు ; తెరిచిన తలుపులతో ఉవ్వెత్తున ఎగసి ముంచెత్తే సముద్ర కెరటం ! అందుకే, ఎప్పటి కప్పుడు కొత్త అర్థాలతో, కొంగొత్త అందాలతో అలరారుతుంటుంది అతడి కవిత్వం!

'హంపీ' అనే కవితలో యేరు గురించి, శిథిల శిలల గురించి ప్రస్తావిస్తాడు . ఆ పద్య భావం అతడి కవిత్వానికి అతికినట్టు సరిపోతుంది.

మెలికలు తిరిగొచ్చి
చెళ్ళున బండల్ని తాకి
ప్రాణమొచ్చిన కొరడాలా
ప్రవహించి పోతోంది యేరు.
నీళ్ళకి ఒళ్ళంతా నోళ్ళే
తలుపులన్నీ బార్లా తెరిచి
నిన్ను ఆహ్వానిస్తుంది యేరు.

'కాంతిని పీల్చేసే దీపం ' కవిత ఇస్మాయిల్ జీవితం, కవిత్వానికి సంబంధించిన ఫిలాసఫీని ప్రతిబింబిస్తుంది.

జీవితం, మృత్యువూ ; వెలుతురూ, చీకట్లకి నడుమ నున్న బాంధవ్యాన్ని విశదీకరిస్తుంది.

'డబ్బు మీద రెండు పద్యాలు' కవితలో.....

1

వేయి సువర్ణ ప్రభాతాల మేరకు
ధనవంతుణ్ణి,
నేను డబ్బు సంపాదించలేదని
మా ఆవిడ సణుగుతుంది.

2

డబ్బు లేదంటావా?
డబ్బెందుకు?
ఈ కిటికీ లోంచి వాలి
టేబిల్ మీది పుస్తకాన్నీ, పెన్ననీ,
ఇంకు స్థాండునీ మంత్రించే సూర్య కిరణం ఖరీదెంత?
ఎంత డబ్బు పెడితే దొరుకుతుంది? "

డబ్బు, ఆస్తి, అంతస్థుల కంటే కవిత్వమే గొప్ప అని భావించాడు కనుకనే, గొప్ప సాహిత్యాన్ని తన వారసత్వ సంపదగా మన కందించాడు. అతడు మరణించి రెండు దశాబ్దాలైనా అతడి కవిత్వం వసివాడలేదు. నిత్య నూతనమై విరాజిల్లుతూనే ఉంది. అతడూ, అతడి కవిత్వమూ అజరామరం !

తన మార్గం అనితర సాధ్యమైన ఒకే ఒక్కడూ, అపురూప కవీ, ధన్య జీవీ ఇస్మాయిల్!



నిజంగానే నిజంగానే నిఖిల లోకం నిండు హర్షం వహిస్తుందా
మానవాళికి నిజంగానే
మంచి కాలం లభిస్తుందా ?
జడలు విచ్చిన సుడులు రెచ్చిన
కడలి నృత్యం శమిస్తుందా ?
నడుము తడబడి సడలి మునుగక
పడవ తీరం క్రమిస్తుందా ? (నిజంగానే)

(శ్రీశ్రీ - నిజంగానే)

అన్వేషణ – రుబాయీలు

- జెజ్జాల మోహన రావు

తెలుగులో రుబాయీ ప్రక్రియ కేవలము అంత్యప్రాసకు (aaba) మాత్రమే పరిమితము. పారసీక, ఉర్దూ ఛందస్సులలోవలె ఛందోనియమము లను పాటించరు. పై రుబాయీలన్నియు ఛందోబద్ధములు. ఇట్టివి తెలుగు సాహిత్యములో లేదని చెప్పవచ్చును. మొదటి, మూడవ గణములు UUU లేక UUII. రెండవ గణము UUU లేక UUII లేక UIUI. అన్ని పాదములలో చివర ఒక గురువు లేక గురువుపైన పొల్లు అక్షరము.

ఏకాంతము పుట్టునప్పు డీజన్మములో
నేకాంతము చావు గాదె యీజన్మములో
నేకాంతమె యామె లేని యీరాతిరిలో
నేకాంతము వానితోడ నేకాలములో

ఈనన్నటఁ జేయుచుండ నేమైనదియో
తానప్పుడు డస్సెనేమొ తథ్యమ్మదియో
యానొప్పులఁ గైవడంకె నాబమ్మకు, హా
నేనైతిఁ గురూపిగాను నిప్పీమదియే

సాయంత్రపు నీరెండయు సౌందర్యములో
నాయింద్రధనుస్సక్కడ యాకాశములోఁ
జేయింగొన దానినౌనె చెల్వమ్మనఁగా
నాయందము స్వల్పకాల మాశల్ మదిలో

ఈవేళయు పండుగంచు నృత్యమ్ములతో
దేవాలయమందుఁ జాల దృశ్యమ్ములతో
నేవైపును జూడ భక్తులే స్తోత్రముతో
దేవుండును ద్రాగు నన్ను దిట్టెన్ లలితో

నాగాథయు వాని వ్రాత నాపాత్రలతో
నాగాథయు నాదు చేత నాయాత్రలతో
రాగమ్ములు ద్వేషమ్ములు ప్రాప్తమ్ములుగా
నాగాథయు వాని గాథ నాచిత్తముతో

వేదమ్ముల వల్లించిన ప్రేమమ్మగునా
పాదమ్ముల వ్రాత గొప్ప పద్యమ్మగునా
మోదమ్ములు ఖేదమ్ములు మోహార్జితమే
హ్లాదమ్ములు వాని సేవ, వ్యర్థమ్మగునా

నేనేడ్వఁగ నోదార్చఁగ నెయ్యిం డెటనో
నేనేడ్వఁగ కన్ దుడ్వఁగ నేస్తం బెటనో
మౌనమ్మున నెవ్వరిందు మై దాఁకెదరో
దీనమ్మగు నన్ను గాంచు దేవుం డెటనో

ఆయెఱ్ఱని రంగు మార్చ నౌనా రయమై
ఈయానము సాఁగిపోవ నెట్లో సుగమై
ఆయీశ్వరు నాన లేక నౌనా యెదియున్
ఈయాత్రకుఁ బచ్చ దీప మెప్డో ధరపై

అన్వేషణ వద్దు నాకు నాస్వాములకై
అన్వేషణ వద్దు నాకు నావెల్గులకై
అన్వేషణ వద్దు నాకు నామార్గముకై
అన్వేషణ నాలోననె యాదేవునికై

వేగమ్మగు వాహనాలఁ బ్రేమన్ జనుటే
భోగమ్ముల చింత గొప్ప మోదమ్మనుటే
రాగమ్ములు ద్వేషమ్ములు రావే మనతో
నాగమ్యము చేర పాదయాత్రన్ జనుటే

ఏకుమ్మరి చేసినాడొ యీకుండ నిలా
యీకుండలు బద్దలైన నీమట్టి యిలా
యీకుండలు నీమట్టియు నేకమ్మె గదా
యీకుండలు నీమట్టియు నీస్వప్న మిలా

మోదమ్ములు మూడు నాళ్ల ముచ్చట్లేనా
వాదమ్ములు స్పర్ధలన్ని వ్యర్థమ్మేనా
యేదీపము లేని చోట యింకింతేనా
యాదైవము సేయు నాట కర్థమ్మేనా

158

ఆఁయి యెఱుంగునా తనాదేవునిగా
సారాయి కెఱుంగనౌనె సోన్మత్తునిగా
కారాగృహ మెట్లెఱుంగు ఖైదీలను దా
చేరంగను వానినౌనె చింతామణిగా

వేధించెడు నీవు గొప్ప ప్రేమేశుఁడవై
నాదృష్టికిఁ గానరావు నాకేశుఁడవై
మోదమ్ములులేక నీవు భూమిన్ మనరా
ఓదేవా నారీతిగ నున్మత్తుఁడవై

కానున్నది కాకుండునె కాదన్నను నేన్
రానున్నది రాకుండునె రావద్దన నేన్
నేనున్నది వాని యిచ్ఛ నేనన్నది లేన్
బ్రాణమ్మును వాఁడె యిచ్చు రాణన్ గొను దాన్

నేనుండెడు నాయీస్థితి నీవే గనుమా
ఆనందము లేదిక్కడ యాదన్ వినుమా
కానంగను జీఁకటింటఁ గాంతుల్ లేవే
ప్రాణమ్మొక పావేమో పాణిం గొనుమా

భారమ్మది నిన్ను నమ్మ భారమ్మగునా
నేరమ్మది నీకుఁ దెల్ప నేరమ్మగునా
దూరమ్మది నిన్ను దల్వ దూరమ్మగునా
నారాజా నీవు లేక నాకమ్మగునా

వేదమ్ములు వద్దు నాకుఁ బ్రేమమ్మె సదా
వాదమ్ములు వద్దు నాకు భావమ్మె సదా
నాదమ్ములు చాలు నాకు నాదేవునికై
మోదమ్మల మోహనుండు ముక్తుండు గదా



ఆశ లేదు,ఆస్కారం లేదు
ఫలానారోడ్డు గమ్యం చేరుస్తుందనే సూచన లేదు
జీవితం ఎప్పుడూ ఇలా కన్నీళ్ళ ప్రవాహం గానే
సాగుతుందనుకుంటాను
రోడ్డు పొడవునా చెట్లు కూలుతున్న దృశ్యాలనే
చూపుతుందనుకుంటాను

(అజంతా – చెట్లు కూలుతున్న దృశ్యం)

అనువాదమంటే?

- గరికపాటి పవన్ కుమార్

ఒక చల్లని సాయంకాలం, నేను తాగుతున్న తేనీరు మహాత్మ్యమేమో కానీ, అలస్టయిర్ రీడ్ ఆంగ్లంలోకి అనువదించిన, పాబ్లో నెరుడా స్పానిష్ కవిత "పదం" నా మెదడులో దిగుతోంది. ఆశ్చర్యమేమిటంటే అక్కడ నాకు కనిపిస్తూ, వినిపిస్తూ భావనగా మారుతున్న పదాలు, భావాలకి భాష అన్న పరిధి లేదు, భావన మాత్రమే. కొన్ని పంక్తుల తరువాత చిన్నగా ఆంగ్ల పదాలు కనిపించడం మొదలయ్యింది. ఇప్పటివరకు భావనగా మెదడులో ఇంకుతున్న కవిత భాష మార్చుకుందే ? అలౌకిక భావనాలోకాలకు తీసుకుపోయిన కవిత , నేనున్న ప్రదేశంలో కూలబడేసిందే? ఎందుకు అని చూసాను?

ఎందుకో "

This is the wavelength which connects us
With deadmen and the dawning
Of new beings not yet come to light"

అన్న వాక్యాలు నాబుర్రకి కవితాత్మకంగా ఎక్కడంలేదు.

నా చేతిలో ఉన్నది, స్పానిష్ మూలం, ఆంగ్లానువాదం పక్క పక్కనే ప్రచురించిన పుస్తకం. చటుక్కున నాకళ్ళు స్పానిష్ వాక్యాలవైపు మళ్ళాయి. ఏదో భావన కళ్ళను మెరిపిస్తోంది. ఇక్కడే ఏదో భావం నాకు అందట్లేదని అర్థమవుతోంది. పెన్ను పేపరు తీసుకొని చదివినంతవరకు ఆ కవితని మళ్ళీ తెలుగులో వ్రాసుకొని, ఆ రెండు వాక్యాలని స్పానిషులో పదే పదే చదివాను. ఆంగ్లంలో అర్థం స్పష్టమే అయినా, భావం తెగిపోతోందనిపించింది. అప్పుడు నాకు తెలియదు, అది నా అనువాద ప్రయత్నానికి మొదటి మెట్టు అని, కవి హృదయాన్ని అర్థం చేసుకోవడానికి నేను పడుతున్న తపనే అనువాదకుడికి కావలసిన మొదటి దినుసని, ఒక భాషలోని కవితను, నాకోసం నేను నా భాషలో మారుస్తున్నానని. స్పానిషులో వాక్యాలు:

"este es el aire que nos communica
con el hombre enterrado y con la aurora
de nuevos seres que aun no amanecieron.

నెట్టంతగా ప్రబలిన రోజులు కాకపోవడంతో, స్పానిష్-ఆంగ్ల నిఘంటువులతో కుస్తీ పడి ఆ రెండు వాక్యాలకి అర్థమిదని తేల్చాను.

"ఆ గాలే కలుపుతుంది
దివ్యతేజసుతో పాతబడ్డ మన పూర్వులను
తోలి కిరణం తాకని పసిగుడ్డులను"

ఓహో ! చక్కని అనుభూతి, తృప్తి. ఉత్తమోత్తమమైన కవితలో శబ్దార్థాలు అప్రధానమై రమణీయమైన అర్థాన్ని చమత్కరిస్తుంది. ఆ రమణీయమైన అర్థాన్ని (మూల భాషలో) పట్టుకొని మన (లక్ష్య) భాషలో అదే రమణీయమైన అర్థాన్ని తిరిగి చెప్పడం అలౌకికమైన ఆనందం. అదే అనువాదం.

మళ్ళీ నా చేతిలోని తేనీరు పనిచేయడం మొదలయ్యింది, కవిత భావనాత్మకంగా నా మదిలో ప్రవేశిస్తోంది. తెలుగులో నా భావాలను తిరగ వ్రాసుకుంటూ ఆ కవిత మొత్తాన్ని అలా తెలుగులో తిరిగి చెప్పగలిగాననిపించింది. అంటే ఆ కవితను అను-వదించాను (చెప్పిన దాన్ని మళ్ళీ చెప్పాను)

మనం పలుమార్లు అనువాదం, అనుకరణ, అనుసరణ, అనుసృజన అనే పదాలు వింటూ ఉంటాము. అనువాదం అంటే మూల భాషలోని రమణీయమైన అర్థాన్ని లక్ష్యభాషలో తిరిగి చెప్పడం అనుకున్నాము, అంటే చిలక పలుకులన్నమాట. మూలాన్ని చదివిన మూలభాషాపాఠకుడు పొందే అనుభవాన్ని లక్ష్య భాషా పాఠకుడికి అందించడమే అనువాద ముఖ్యోద్దేశం. అనువాదం గురించి మరింత లోతుగా చర్చించే ముందు అనుకరణ, అనుసరణ, అనుసృజనలను కూడా కొంత పరిశీలిద్దాము.

అను-కరణ అంటే ఒకరు చేసిన పనినే మళ్ళీ చేయడం. ఉదాహరణకి మనం ముక్కు గోక్కుంటే మన ముందున్న కోతి కూడా ముక్కు గోక్కుంటుంది కదా అలాగే, కోతి చేష్టలన్నమాట. మరి కవిత్వానికి అనుకరణ అంటే ఏమిటి? మనని కదిలించిన కవిత రమణీయార్థంతో సంబంధంలేకుండా శబ్దార్థ శైలీ ప్రయోగాలని మన స్వంత కవితలలో వాడుకోవడం (అనుకరించడం). దీనికి మూలభాష, లక్ష్య భాష వేరువేరు కావలసిన అవసరం లేదు. కొన్ని కవితల

నడక మననెంతగా కదిలిస్తుందంటే అదే నడకలో మన భావాలు కూడా వ్యక్తమవుతూ ఊంటాయి, ఆ ఛాయలు ఒక పట్టన మనని విడిపోవు. స్విన్ బర్న్ పాటలని (కవితలని) శ్రీ శ్రీ తన మాటల్లో

"విషం క్రక్కే భుజంగాలో,
కదం త్రొక్కే తురంగాలో,
మదం పట్టిన మాతంగాలో
కవీ, నీ పాటల్?
వలయ విచల ద్విహంగాలో,
విలయ సాగర తరంగాలో,
యుద్ధగుంజన్మృదంగాలో
కవీ, నీ పాటల్ ?" అన్నాడు.

స్విన్ బర్న్ తన కవితలలో ప్రతిపాదించినది ప్రేమ, అందం, కోరిక, కామం ప్రాచీన గ్రీకు కవయిత్రి శాఫో ని ఆదర్శంగా తీసుకుని చేసిన రచనలు. కమ్యూనిజానికి తన కవితలకి ఆమడదూరం. కానీ స్విన్ బర్న్ కవితల్లో, ఒరవడి, ప్రాస, చందస్సులతో, పంచేంద్రియాలను ప్రభావితం చేసే చిత్రణ నడుస్తుంది. శ్రీ శ్రీ ఇటువంటి నడకని తన కవిత్వంలో వాడుకున్నాడు. ఆ నడక వల్లనే, శ్రీ శ్రీ కవితలు అర్థం కాకపోయిన ఎలుగెత్తి చదువుకోని కవితా ప్రియులు అతని కాలంలో లేరనే చెప్పుకోవాలి. శ్రీ శ్రీ కవితలు చాల వరకు అనుకరణలుగా చెప్పుకోవచ్చు, ఒక్క స్విన్ బర్న్ కనే కాదు, వివిధ కవుల అనుకరణలుగా ఉంటాయి. అందుకేనేమో మహాప్రస్థానం తరువాత, అనుకరణ ఆగడంతో శ్రీశ్రీ కలం నుంచి కవితా ధార సన్నబడిపోయింది.
మహాప్రస్థానం లో శ్రీ శ్రీ వ్రాసిన గంటలు కవిత కింద శ్రీ శ్రీ వ్రాసుకున్న వాక్యాలు (E. A. Poe వ్రాసిన The Bells కనువాదం కాదు) వ్రాయని వాక్యం (,అనుసరణ) ఒక కవితని చదివి లోతుగ ప్రభావితుడై, అదే అర్థాన్ని తన శైలిలో, తన మాటలుగా చెప్పడం అనుసరణ.

అలాగే శ్రీ శ్రీ వ్రాసిన పేదలు (Emile Verhaeren వ్రాసిన Les Pauvres అనే గీతానికి అనువాదం) – భావమదే చిత్రణ మారిపోతుంది – అణగార్చగ విధి తోడ్రోపులు, గోమాతల కన్నుల తమ్ములు, తిరిపెమునకు పిడికెడు మెతుకులు మొదలైన తనదైన శైలీ పదాలతో అదే భావం వెంట వెంట చరించడం. అనుసృజన – దీనికొక కథ చెప్పాలి, కాలేజీ రోజుల్లో భూషణ్ వ్రాసిన "చెల్లెలి గీతాలు" నన్ను నా బాల్యమనే ప్రపంచంలోకి తీసుకొని వెళ్ళిపోయాయి, ఎన్ని సార్లు అనందించానో తెలియదు, బాల్యానికి తిరిగి వెళ్ళాలి అనిపించినప్పుడల్లా టైం మెషీన్ లా వాడుకునే వాడిని, చెల్లెలి గీతాలనుంచి ఒక గీతం:

ఇంతకీ నీవెవరి జట్టు?

దేవుడి ముందు దీపం వెలిగిస్తానని చెప్పి
నూనెంతా వలక బోశావు
అమ్మ పట్టుకు బాదపోతే ..
నావంక వేలు చూపించి ఏడుస్తావా?
వంటింట్లో ఉండే అమ్మకేం తెలుసు?
నన్ను పట్టుకొని ఉతికేస్తుంటే
గౌనుతో కన్నీళ్ళు తుడుచుకొని
గలగలా నవ్వుకొంటూ పారిపోతావా?
అమ్మ నన్ను కొట్టడం ఆపి
నీవంక గుడ్లురిమి చూస్తుంటే
"నాన్న రానీ చెబుతా.. అన్నయ్యని కొట్టావా"
అని దూరంగా నించుని అరుస్తావా?
ఇంతకీ నీవెవరి జట్టు??

చెల్లెలి గీతాలు నుంచి పుట్టినవే నా 'బడి దారి' పద్యాలు, కొన్ని ఉదాహరణలు కింద:

బక్కచిక్కే పుస్తకాలు

రెక్క పడవలు, కత్తి ఉన్నవి
సాగుతున్నవి వాన నీటిన
విమానాలకు ప్రమాదాలూ
పిలక మేష్టరి గుడ్లు గుర్రుగ
బక్క చిక్కే పుస్తకాలు
అంతు చిక్కదు అమ్మకెప్పుడు

గోళీలు

పుస్తకాలకి అందమంతా
అలమరాలోనే . . .
బడిలో బెంచి ఎక్కిన
గంట సేపూ..
మైదానమంతా పరుచుకున్న
రంగు రంగుల గోళీలు

పరీక్షలొచ్చేవి

పెద్దన్న ఉరిమే గుడ్లకు
అమ్మ చీర చెంగే జవాబు
అమ్మ దగ్గర ముద్దుగా
అన్నయ్య కదే ధీరంగా
మందుకొచ్చిన అన్నయ్య
అమ్మతో కోపంగా
అమ్మ లాలనగా
అనుకున్న సమయానికి
పుస్తకాలొదిలేసి
పక్క మీద ముసి ముసిగా

నేను కొన్ని కవితలు చదివినప్పుడవి వేరొక ప్రపంచానికి తీసుకుపోతాయి, ఆ ప్రపంచం నుంచి భావ శైలీ బేధాలతో వర్షించే కవితలన్నీ అనుసృజన, బడి దారి కవితలొక రోజు అదాటుగా పాతికకి పైగా వ్రాసాను, ఇవన్నీ చెల్లెలి గితాలకు అనుసృజనే. అనువాదం, అనుకరణ, అనుసరణ, అనుసృజనల గురించి నా కవిత, అనువాద స్వీయ అనుభవాలనుంచి, వేరే కవితలు, (అను)వాదాలు, కరణలు, సరణలు, సృజనలు పరిశీలించిన నా భావాలు పంచుకొన్నాను.



నగరం నడి సముద్రంలో తేలాడుతున్న ద్వీపం లా ఉంది
ఉడుపీధి నుండి జారిన ఒక మంచుకొండ ఏదో పగిలి
శతకోటి శకలాలు జలబిందువులుగా మారి
ముసురుగా ముంచెత్తుతుంటే
గూట్లోకి చేరిన గువ్వలా నగరం నక్కి కూచుంది

(కుందుర్తి - నగరం లో వాన)



పారిజాతాపహరణం

- దివాకర్ పేరి

ఒరేయ్ పారిజాతం అక్క గన్నేరుపప్పు తినేసిందిట" సూరిగాడు ఆయాస పడుతూవచ్చాడు.

"మనకి పెట్టకుండానే" సుబ్బిగాడు ఏడుపు మొహం పెట్టాడు.

"వెధవా! గన్నేరుపప్పు తింటే చస్తావ్" సూరిగాడు విసుక్కుంటే, "అయితే అక్క చచ్చి పోతుందా?" అంటూ సుబ్బిగాడు నిజంగానే ఏడుపు మొదలెట్టాడు.

"అక్కకి గన్నేరుపప్పు ఎక్కడిదిరా? మనం ఇచ్చింది బాదం పప్పుగదా" బుచ్చి గాడికి అనుమానం వచ్చింది.

"నేను కూడా ఆ పప్పే తిన్నానోయ్ ... నేనుకూడా చచ్చిపోతానేమో" సుబ్బిగాడి రాగం స్థాయి పెరిగంది.

సుబ్బిగాడిని, సూరిగాడినీ పక్కకిపంపి – నేను, బుచ్చి, బాచి, అక్క ఇంటికేసి వెళ్ళాం. అక్కడ మా డిఎస్పీ మావ అందరిమీద నిప్పులు చెరుగుతున్నాడు. కోపం వస్తే మా మావ అగ్నిహోత్రావధాన్లే. నూతి పళ్ళెంలో చేదకి తాడు కడుతూ, గన్నేరుపప్పు తిన్నందుకు అక్కని, మావిడికాయ పప్పులో కందిపప్పు వేయించి వెయ్యనందుకు అత్తయ్యని కంబైండ్-గా చెరిగి పారేస్తున్నాడు. అక్క తలుపులోపల గడియ పెట్టుకుందిట. గదిలో అలికిడి వుంది మరేమీ ఫరవాలేదని అందరూ తీర్మానించారు.

సుబ్బిగాడి బామ్మ వచ్చి "ఒరేయ్ అవధానీ! నీ తిండి బంగారంగానూ. ఆ మావిడికాయ పప్పేదో నే తగలేడతా గానీ అసలా పిల్ల ఈ అఘాయిచ్చపనెందుకు చేసిందో కనుక్కో" అని మావని గదమాయించింది. డిఎస్పీ మావ ఎవరిముందయినా అగ్గే కాని బామ్మ ఎంటరయితే మాత్రం బుగ్గి. "ఆ ముండ తలుపు తియ్యటం లేదే పిన్నీ, నేనేం చెయ్యను" అని నసుగుతున్నవాడల్లా మమ్మల్ని చూసాడు. "ఇదిగో ఈ వానర మూకే దీనంతటికీ కారణం." అంటూ కొబ్బరి డోలక పుచ్చుగుని మా వెనక పడ్డాడు. మేం ఆలీసం చెయ్యకుండా కాలికిబుద్ధి చెప్పాం.

పారిజాతం అక్క అంటే మా డిఎస్పీ మావ కూతురు. మావ కూతురు అక్కేవిటనీ ముక్కు మీద వేలేసుకున్నారా? తీసెయ్యండి. మా అగ్రహారాల్లో అంతే. ఎవరూ పేర్లు పెట్టి పిలుచుకోరు. అక్కా, అన్నా, మావయ్యగారు, అత్తయ్య గారు అల్లా అన్నమాట. మేం పిల్ల బుడంకాయలం కాబట్టి మాకందరూ అక్కలూ అన్నలే. ఒక్క శీనుగాడు తప్ప. పారిజాతం అక్క చెప్పింది వాణ్ణి బావగారు అనాలని. అల్లా అని చెప్తే మా అమ్మ-నాన్నా మొఖాలు చూసుకున్నారు. ఎమ్మే పాస్ అయి మాతో కిరికేట్లాడేవాణ్ణి 'గారు' అనడానికి మా సుబ్బిగాడు కూడా ఒప్పుకోలే. మేం శీను గాడనే పిలుస్తాం. అప్పుడప్పుడు ఎవరూ లేనప్పుడు మాత్రం ఒరేయ్ బావా అంటాం. వాడు ఈ ఏడాదో, రేపో కలక్టర్ అవుతాడని మా నాన్నగారు చెప్పేరు.

మా డిఎస్పీ మావ మాత్రం "వీడి ఎదానికి కలక...టే..రు ... వాడి బొంద ... డిప్టీ తాసీల్దారు అయితే మాగొప్ప మాట" అని తెల్చేసేవాడు. ఇంతకీ చెప్పనే లేదు డిఎస్పీ మావ – నిఝాం పోలీసు కాదు. యాగ్గీకాలు చేసే పోలీసు. అంటే పొద్దున్న బ్రామ్మన్నాత్తాలు, సత్యనారాయణ పూజలూ చేసుకుని, మధ్యాన్నం భోయినం తరవాత ఓ కునుకు లాగి లేచి, టీ తాగి డిఎస్పీగారింట్లో పిల్లలకి తెలుగు ట్యూషనో, వాళ్ళింట్లో బామ్మలకి పురాణం చెప్పడవో చేస్తాడు. ఓ డిఎస్పీ తరవాత ఇంకో డిఎస్పీ – ఇల్లాగ మా వూర్లో వచ్చిన డిఎస్పీలకల్లా ఏదో పని చేసి వాళ్ళని మంచి చేసుకుంటాడు. ఇంక చూస్కో నా సామి రంగా – వూర్లో అందరికీ తనే డిఎస్పీ అయినట్లు హడావుడి చేస్తాడు. పోయి పోయి ఈ ముక్క మా మావ దగ్గిర అనేరు గానీ. నా నడ్డి పేలిపోతుంది.

మా ముఠాని మీకు పరిచయం చెయ్యలేదు కదా. ముందస్తుగా సుబ్బిగాడు. వీడు మా అందర్లోకీ చిన్నవాడు. గుండ్రంగా బంతిలా ముద్దోస్తూవుంటాడు. అన్నిటికీ నేనే ముందంటాడు. వీడి బామ్మ వీడికి వత్తాసు. వీడు, సూరిగాడు, బాచిగాడు ఒకే క్లాసు, మూడు. నేను కూడా ఆక్లాసు లోనే వుండాలి కాని డబల్ ప్రమోషన్ కొట్టేసి బుచ్చిగాడి తో పాటు ఐదో క్లాసుకెళ్ళి పోయాను. ఏమిటీ అయిదోక్లాసు వాడు ఇంత పెద్ద కబుర్లు చెపుతున్నాడేవిటా అని ఆచ్చేర్య పోతున్నారా? పోకండి ... నేను అగ్రహారం డిబ్బీని కదా ... బాపూ గారి బుడుగు టైపు. కొంచం ముదురు. అదీ సంగతి. సందేహాలాపి ఇంక చదవండి.

163

బుచ్చిగాడు నెమ్మదస్తుడు, లౌక్యుడు. ఎక్కువ మాట్లాడడు. మా ముఠాలో సుబ్బిగాడు ఆటల్లో అరటి పండయితే బుచ్చిగాడు లీడరు. ఒక్కోసారి పారిజాతం అక్కకూడా బుచ్చి మాటే వింటుంది. అప్పుడప్పుడు మేం కూడా వింటాం. పొతే సూరిగాడు, బాచిగాడు ఎవరిమాటా వినరు. వాళ్ళ మాటే వాళ్ళు వినరు. ఎప్పుడూ పోట్లాటలే. బామ్మ వాళ్ళని వాలి సుగ్రీవులని పిలుస్తుంది. పైగా సూరిగాడు వాళ్ళ అమ్మా, బాచిగాడు వాళ్ళ నాన్నా సొంతంగా అక్క-తమ్ముడు. అంటే సూరిగాడికి బాచిగాడి నాన్న మేనమావవుతాడన మాట.

ఇంక శ్రీను గాడు. వీడు మాకన్నా చాలా పెద్ద. మా ఇంటి దగ్గర వుండే కాలేజీ లెక్చరర్ గారి దగ్గరికి వస్తూంటాడు, స్కూటర్ మీద. మా నాన్నగారితో బోల్డు సేపు ఖబుర్లు చెప్తూంటాడు. మాతో పాటు క్రికెట్ ఆడతాడు. అప్పుడప్పుడు ఎవరికీ తెలీకుండా అక్క కాలేజీ దాకా వెళ్లి అక్కడ నించుని వుంటే, శ్రీనుగాడు అక్కని వాడి స్కూటర్ మీద ఎక్కించుకుని సినిమాకి తీసుకెడతాడు. వాళ్ళు సినిమాకి వెళ్లినట్లు ఎవరికీ చెప్పకుండా వుండడానికి – సినిమా హాల్ దగ్గిర బండి మీద అమ్మే ఉల్లిపాయ మషాలా పకోడీలు మా గాంగ్ కోసం పట్టుకోస్తారు. ఎందుకంటే మా ఇళ్ళల్లో మషాలా పకోడీలే చెయ్యరు సరికదా ఉల్లిపాయలు కూడా కొనరు – ఎప్పుడేనా చిన్నపిల్లలం అడిగితె "ఏవిటీ అప్రాచ్యపు తిండి అప్రాచ్యపు తిండాని ... వెధవకానల్లారానీ ... బ్రాహ్మణీకం మంటకలిపెస్తున్నారు" అని కొత్తి పడేస్తారు. రెండు వారాల క్రితం సుబ్బిగాడికి పకోడీల్లో వాటా తక్కువోచ్చిందని (సూరిగాడు కొన్నిపకోడీలు కొట్టేసాడు లెండి) వీళ్ళ సినిమా రహస్యం వాళ్ళ బామ్మకి చెప్పేసాడు. ఇంకే వుంది పెరట్లో నూతి పళ్ళెంలో డిఎస్పీ మావ శివతాండవం – నట్టింట్లో పారిజాతం అక్కకి మంగళ హారతి. అప్పణ్ణుంచీ అక్క బయటికి వెళ్లడం కష్టవైపోయింది. కష్టవై పోయింది అంటే అక్క తెలివిగా కష్టపడి అబద్ధాలు చెప్పాల్సొచ్చేది, వెళ్ళాలంటే. అదీ సంగతి.

రాత్రి అమ్మా నాన్న మాట్లాడుకుంటే తెలిసింది. పొద్దెన్నే డిఎస్పీ మావ, అక్క దెబ్బలాడుకున్నారుట. అక్క శ్రీనుగాణ్ణి తప్ప పెళ్ళడనని చెప్పిందిట. మావ అక్కమీద చెయ్యి చేసుకున్నాడుట. చెయ్యి చేసుకోవడం అంటే ఏమిటో నాకు అర్థం కాలేదు. అక్క "విషం మింగి చస్తాను కానీ ఇంకోళ్ళని పెళ్ళాడనని గదిలోకి వెళ్ళి తలుపేసుకుంది. ఆ తరవాత ఏడుస్తూ ఏవో కాయలు బద్దలు కొట్టడం అత్తయ్య విందిట. అంతే అక్క గన్నేరు పప్పు తినేసిందని గోల మొదలైంది.

నిన్న బుచ్చిగాడు, సూరిగాడు సీతమ్మ గరువు మీదకెళ్ళి బాదం కాయలు తెచ్చారు. అవే అక్కకి ఇచ్చాం. ఈ గన్నేరు పప్పు ఎక్కడనించి వచ్చిందో నాకు తెలీలేదు.

"వాళ్ళు మనవాళ్ళు కాదు కదండీ అన్నగారు మాత్రం ఏం చేస్తారు" అని అమ్మ అంది.

"చక్కటి కుర్రాడు. రేపో మాపో కలక్టర్ అవుతాడు. భూషణానికి డబ్బు, పలుకుబడీ వున్నాయి. కుర్రాడు తెలివయినవాడు. కులం-గోత్రం ఏవయినా కూడు పెడతాయా. అయినా ఈ రోజుల్లో ఎవరికీ చెప్పలేం. అందులో అవధాని మరీ త్రాష్టుడు. వాడికి అసలు చెప్పలేం. బంగారం లాంటి పిల్లని ఎవరో నస్మరంతిగాడికిచ్చి కట్టబెడతాడు." అన్నారు నాన్న. దానికి అమ్మ "పారిజాతాన్ని వాళ్ళ అన్న ఇంటికి పూనా పంపించేస్తారని వదినగారు చెప్పారు." అంది. నాకు ఒక్క ముక్క కూడా అర్థం కాలేదు. అక్క ఇంకో వూరు వెళ్లి పోతుందని అర్థం అయింది. ఈ సంగతి రేపు శీను గాడికి, బాచి గాడికీ చెప్పాలి అనుకున్నాను.

ఇంక అప్పట్నుంచి రోజులు సందడిగా గడిచాయి. రోజూ తెల్లారి లేవగానే డిఎస్పీ మావ కేకలు. మిలటరీని తెప్పించి శ్రీను గాడి ఫ్యామిలీని మామాయం వండించేస్తాననిన్నీ, డిఎస్పీతో మాట్లాడి శ్రీను గాడి కలక్టరు పరీక్ష గుండెక్కిం చేస్తాననిన్నీ. మా నాన్నగార్ని అడిగితె "వాడి మొహం. మిలటరీ వాళ్లకి మరేం పనిలేదేవిటీ. శ్రీనివాస్ కి ఏం భయంలేదు. ఈ మాటలు భూషణం గాని వింటే మీ డిఎస్పీ మావకే గుండు చేయిస్తాడు. పో ... పోయి ఆడుకో." అన్నారు.

ఈ హడావుడిలో శ్రీను గాడు ఢిల్లీ వెళ్ళిపోయాడు. కలక్టర్ అవడానికి పెద్ద పరీక్ష, ఆ తరవాత ఇంకేదో వుందిట. ఆ కర్మ కాండలన్ని అయ్యాక, శీను గాడు కలక్టర్ అవుతాడని నాన్న, బాచిగాడు వాళ్ళ నాన్నా అనుకుంటే తెలిసింది.

ఓ రోజు పోద్దెన్నే బ్రహ్మాండం బద్దలయింది. తెల్లారకుండానే డిఎస్పీ మావ కేకలు. అత్తయ్య ఏడుపులు. "పారిజాతం అక్క లే

... చి ... పోయిందిట." అంటే మాకెవ్వరికీ అర్థం కాలేదు. లేస్తే తప్పేవిటో, అక్క ఎందుకు కనిపించడం లేదో ... వీళ్ళ గోలేవిటో. అక్కడకీ సుబ్బు డిఎస్పీ మావ దగ్గిరకెళ్ళి చెప్పాడు "అక్క పూనా వెళ్ళింది. రేపో ఎల్లుండో వచ్చేస్తుందని." ఇంకేవుంది వాడి వీపు, పక్కనే వున్న నావీపు గోహిం..దా .. విమానం మోతే. ఈ హడావుడిలో సూరిగాడు, బాచిగాడు పారిపోయారు. ఎందుకో బుచ్చి గాడు ఆ రెండు రోజులూ మా ఇంటి చుట్టుపక్కల కనపడ్డం మానేసాడు.

రోజులు గడిచే కొద్దీ అందరిమీదా కేకలేసే డీఎస్పీ మావ, పెద్దగా మాట్లాడ్డం మానేశాడు. పెద్ద గడ్డం, నీరుకావి అంగోస్త్రం. బుజం మీద కాశీ తువ్వాలు. ఎప్పుడు స్నానం పూజా చేసేవాడో కానీ, ఎప్పుడూ అరుగు మీదే కూర్చుని దిగులుగా చూస్తూండేవాడు. బామ్మ కూడా రోజూ అనేది. "ఏనుగులాంటి పిల్లాడు ... ఎల్లా అయిపోయాడోమ్మా" అని. బామ్మ బలవంతం మీదే ఎదో ఎంగిలి పడేవాడు. ఎంత మారిపోయడంటే ... మేం ఆడుకుంటున్నప్పుడు బంతి మీద పడితే పూర్వంలా మమ్మల్ని తరిమేవాడు కాదు. పైగా సుబ్బుగాడు బంతి తేడానికి వెడితే, వాణ్ణి పట్టుకుని "అక్క ఎక్కడుందిరా? నువ్వేనా చెప్పరా? చచ్చి నీకడుపున పుడతాను" అంటూ ఏడిచేవాడు. బామ్మ వచ్చి 'ఏమిట్రా అవధానీ! నిండింట్లో ఈ ఏడుపులు ... ఊరుకో ! అన్నింటికీ భగవంతుడే వున్నాడు." అనేది. అంతే సహస్ర నామాలు చదివిన నోటితోనే దేవుణ్ణి అమ్మా–ఆలీ బూతులు తిట్టేవాడు. ఒక్కోసారి ఏమీ మాట్లాడకుండా కళ్ళు తుడుచుకుని వెళ్ళిపోయేవాడు.

పోలీసులు మాత్రం దేశవంతా శ్రీనుగాడి బంధువులు, స్నేహితులు ఎవర్నీ వదిలిపెట్టకుండా అందర్నీ వాకబు చేసారు. ఏమీ ప్రయోజనం లేదు. ఊళ్ళో వాళ్ళు మాత్రం "భూషణం దేవతలకి పంచాంగం చెప్పగలడు. వాడి ఎత్తులకి ఈ పోలీసులేపాటి. పారిజాతం మైనారిటీ తీరగానే తన కొడుకునీ కోడల్నీ తెచ్చి నీముందు పెడతాడు. వూరికే ఖంగారు పడకు" అనేవారు. అప్పుడు మాత్రం డీఎస్పీ మావ మొహంలో కొంచం సంతోషం కనిపించేది.

ఇల్లా ఆర్నెల్లో ... ఏడాదో గడిచింది. ఓరోజు పొద్దున్నే లేవగానే బయట పెద్ద గోలా ... సందడీని ... ముఖ్యంగా మా డీఎస్పీ మావ గొంతు పెద్దగా వినిపిస్తోంది. "నాకు తెలుసయ్యా నువ్వు సాధిస్తావని. చూసావా గోపాలం బావా ... నా అల్లుడు అసాధ్యుడయ్యా.. అయ్యేఎస్ సాధించేసాడు."

బయటికి పరిగెత్తాను. బయట రెండు పోలీసు జీపులు. అప్పుడే సూరిగాడు, బాచిగాడు పోలీసుల దగ్గర చేరిపోయారు. సూరిగాడయితే పోలీసు టోపీ పెట్టుకుని, జీపు చక్రం తిప్పేస్తున్నాడు. లోపలకి పరిగెత్తాను. అక్కడ ఫుల్ సూట్లో శ్రీనుగాడు శంఖచక్రాలు లేని విష్ణు మూర్తిలా వున్నాడు. అక్కయితే పట్టుచీర కట్టుకుని లక్ష్మీదేవిలా కొత్తగా వుంది. పరుగెత్తుకెళ్ళాను. అక్క దగ్గరకి వెళ్ళే లోగానే శ్రీనుగాడు నన్ను పట్టేసుకున్నాడు. "ఏరా! మీ అక్కకోసమేనా ... నాకోసం బెంగ పెట్టుకోలేదా అని". ఇకపోతే సుబ్బిగాడు ... చెప్పడానికి మీకు తెలియనిదే ముంది. అక్క ఒళ్ళో చేరి ఈ ఆర్నెలల్లో జరిగినవీ, మామీద చాడీలతో సహా చెప్పేస్తున్నాడు.

అంతే కథ కంచికీ ... అక్క అత్తారింటికీ.

ఉపసంహారం అంటే తెలుగులో ఎపిలోగ్

నేను కొంచం పెద్దయ్యాక మా నాన్న, అమ్మ చెప్పినదాని ప్రకారం, పారిజాతం అక్క పారిపోయిన రోజు తెల్లవారు ఝామున బుచ్చి గాడు దొడ్డి గుమ్మం తలుపు తీసి అక్కని ఇంట్లోంచి బయటికి తెస్తే – సూరిగాడి నాన్న అక్కని పూనే లో మా డీఎస్పీ మావయ్య వాళ్ళ అక్క ఇంట్లో దిగబెట్టాడుట. అలవాటు ప్రకారం పోలీసులు శ్రీనుగాడి బంధువుల్ని, స్నేహితుల్ని సతాయించారు గానీ ... డీఎస్పీ మావ తాలూకు వాళ్ళని వదిలేసారు. ఇదంతా బామ్మా–భూషణం మావా కలిపి వేసిన ప్లాన్ అని, భూషణం మావ పోలీసుల్ని మేనేజ్ చేసాడని. అన్నిటికన్నా పెద్ద న్యూస్ ఏమిటంటే ... డీఎస్పీ మావకి తప్ప మా చుట్టూ వున్న మా పెద్ద వాళ్ళందరికీ, ఆఖరికి అత్తకి (డీఎస్పీ మావయ్య భార్య) కూడా ఈ ప్లాన్ సంగతి ముందే తెలుసనీ.

ఎంతయినా అగ్రహారీకులు కదా ... పాపం మా డీఎస్పీ మావ !!

దిద్దుబాటు

- గురజాడ అప్పారావు పంతులు

"తలుపు! తలుపు!"

తలుపు తెరవబడలేదు. ఒక నిమిషమతడూరుకొనెను. గదిలోని గడియారము టింగుమని ఒంటి గంట కొట్టినది.

"ఎంత ఆలస్యము చేస్తిని! బుద్ధి గడ్డి తిన్నది. రేపటి నుంచి జాగ్రత్తగా వుంటాను. యాంటినాచెల్లా పోయి సానిదాని పాట సరదాలో మనసు లగ్నమై పోయినది. ఒక్క పాట సరదాతో కుదరలేదు, మనిషి మీద కూడా సరదా పరిగెత్తుతూంది. లేకుంటే, పోకిరి మనిషి వలె పాట ముగిసిన దాకా కూర్చోవడ మేమిటి ? ఏదో వక అవకాశము కలుగజేసికొని దానితో నాలుగు మాటలు ఆడడపు ఆసక్తి ఏమి? ఇదిగో లెంపలు వాయించు కొంటున్నాను. రేపటి నుంచి మరి పాటకు వెళ్ళను. నిశ్చయం. నిశ్చయం.. గట్టిగా పిలిచితే కమలిని లేవగలదు. మెల్లిగా తలుపు తట్టి రాముడిని లేపగల్గితినా చడిలేకుండా పక్క జేరి పెద్దమనిషి వేషము వేయ్యవచ్చును."

గోపాలరావు తలుపు చేత నంటగానే రెక్క విడబారెను. "అరే యిదేమి!" అనుకొని, రెక్క మెల్లన తెరవ,నడవలో దీపము లేదు. అంకణము దాటి తన పడక గది తలుపు తీయ, నందును దీపము లేకుండెను. చడిలేక అడుగు వేయుచు మంచము దరికి పోయి కమలిని నిద్రించుచుండెనా, మేల్కొని యుండెనా యని కనుగొన యత్నించెను గాని, యేర్పరింప లేడయ్యె. అంత జేబు నుండి అగ్గిపెట్టె తీసి పుల్ల వెలిగించెను. మంచముపైని కమలిని కానరాలేదు. నిశ్చేష్టుడై చేతి నుండి అగ్గిపుల్ల నేలరాల్చెను. గదినీ , అతని మనస్సు ను కూడ చీకటి క్రమ్మెను. వెట్టి శంకలును అంతకు వెట్టి సమాధానములును మనసున పుట్టుచు గిట్టుచు వ్యాకులత కలుగజేసెను. బుద్ధి తక్కువకు తనయందో , కానరామికి కమలిని యందో యేర్పరింపరాని కోపావేశమును, చీకాకును కలిగెను. నట్టి వాకిటికి వచ్చి నిలువ చుక్కల కాంతిని దాసిగాని దాసుడు గాని కనపడలేదు. వారికి తగిన శిక్ష వురియేనని గోపాలరావు నిశ్చయించెను.

తిరిగి గదిలోనికి పోయి దీపము వెలిగించి గది నలుదెసల పరికించెను. కమలిని కానరాలేదు. వీధి గుమ్మమును జేరి తలుపు తెరిచి చూడ చుట్ట కాల్చు చు తలయెత్తి చుక్కల పరీక్షించు చున్న రాముడు వీధి నడుమ కానవచ్చెను. పట్టరాని కోపముతో వానిని జూచి గోపాలరావు "రామా! రా!" యని పిలిచెను . రాముడు గతుక్కుమని చుట్ట పారవైచి 'బాబు' అని డగ్గరెను.

" మీ అమ్మేదిరా ?"

"మా యమ్మా? యింటున్నది బాబూ."

"మీ అమ్మ కాదురా! బుద్ధిహీనుడా! నా భార్య."

"అమ్మగారా? ఎక్కడుంటారు బాబూ? పడుకున్నారు."

"యింట్లోనే లేదు."

రాముడి గుండెలో దిగులు ప్రవేశించెను. గుమ్ములో అడుగు పెట్టగానే రాముని వీపుపై వీశ గుద్దులు రెండు పడెను. 'చంపేస్తిరి బాబూ' అని రాముడు నేల కూలబడెను.

గోపాలుడు సదయ హృదయుడు. అక్రమ మాచరించితినను జ్ఞానము వెంటనే పొడమి ఆగ్రహావేశము దిగజారి పశ్చాత్తాపము కలిగెను. రాముని చేత లేవనెత్తి వీపు నిమిరి పశువు వలె నాచరించితినని యనుకొనుచు గదిలోనికి తీసుకొని పోయెను.

కుర్చీపయి కూర్చుని " రామా, ఏ మాయెరా" అని దైన్యముతో ననెను.

"యేటో మాయలా వుంది బాబూ."

"పుట్టింటికి వెళ్ళియుండునా?"

"అంతవారు కారనా ? బాబూ, కోపగించితే చెప్పలేను గాని ఆడారు చదువు నేరిస్తే ఏటౌతది?"

"విద్య విలువ నీకేం తెలుసురా, రామా!" అని గోపాలరావు మోచేతులు బల్ల పయినాని వాని నడుమ తలయుంచి యోచించుచుండ కమలిని చే వ్రాత నొక యుత్తరము కానవచ్చెను. దానిని చదువసాగెను.

"అయ్యా!"

" 'ప్రియ' పోయి 'అయ్యా!' కాడికి వచ్చేనా?"
"పెయ్య పోయిందా బాబూ!"
"మూర్ఖుడా! వూరుకో!"

"అయ్యా! పది దినములాయె. రాత్రులు నింటికి మీ రాకయే నే

166

నెరుగను. మీటింగులకు బోవుచుంటి మంటిరి. లోకోపకారములగు నుద్యమముల నిదుర మాని చేయుచుంటిమంటిరి. మా చెలుల వలన నిజము నేర్చితిని. నేనింట నుండుటను గదా మీరు కల్లలు పలుక వలసి వచ్చె. నేను పుట్టింటనున్న మీ స్వేచ్ఛకు

నిర్బంధమును, అసత్యమునకు అవకాశము కలుగకుండును. మీచే దినదినము అసత్యమాడించుట కన్నా మీ త్రోవకు అడ్డుగ నుండకుండుటయే, పతి మేలు కోరిన సతికి కర్తవ్యము కాదా? నే నీ రేయి కన్నవారింటికి జనినయెడ సంతసింపుడు వెచ్చముగాక ఏపాటి మిగిలియున్నను దయ నుంచుడు."

ఉత్తరము ముగించి "నేను పశువును" అని గోపాలరావు అనెను.

"అదేమిటి బాబూ అలా శలవిస్తారు?"

"శుద్ధ పశువును!"

రాముడు అతి ప్రయత్నముచే నవ్వు ఆపుకొనెను.

"గుణవతి, విద్యానిధి, వినయసంపన్నురాలు నా చెడు బుద్ధికి తగిన శాస్తి చేసినది."

"ఏ టి చేసినారు బాబూ?"

"పుట్టింటికి వెళ్ళి పోయినది – గాని నీకు తెలియకుండా ఎలా వెళ్ళిందిరా?"

రాముడు రెండడుగులు వెనుకకు నడిచి " నాను తొంగున్నాను కావాల బాబూ– అలక చేస్తే చెప్పాల్ను గాని బాబూ! ఆడదయి చెప్పకుండా పుట్టినారింటికి ఎల్తానంటే చెంపలాయించి కూకోబెట్టాలి గాని మొగోరిలాగా రాతలూ కోతలూ మప్పితే ఉద్దోరం పుట్టదా బాబూ?"

"ఓరి మూర్ఖుడా! భగవంతుడి సృష్టిలో కెల్లా ఉత్కృష్టమైన వస్తువ విద్య నేర్చిన స్త్రీ రత్నమే. శివుడు పార్వతికి సగము దేహము పంచి యిచ్చాడు. ఇంగ్లీషువాడు భార్యను బెటర్ హాఫ్ అన్నాడు. అనగా పెళ్ళాము మొగుని కన్న దొడ్డది అన్న మాట. బోధ పడ్డదా?"

"నాకేం బోద కాదు బాబూ!" రామునికి నవ్వు ఆచుకొనుట అసాధ్యమగు చుండెను.

"నీ కూతురు బడికి వెడుతున్నది గదా! విద్య విలువ నీకే బోధపడుతుంది. ఆ మాట అలా వుండనియ్యి. కాని, నువ్వో నేనో వెంటనే బయలుదేరి చంద్రవరం వెళ్ళాలి. నేను నాలుగు రోజుల దాకా వూరి నుంచి కదలడము వీలు పడదు. నువ్వు తాతలనాటి నౌఖరువి. వెళ్ళి కమలిని తీసుకురా. కమలిని తో ఏమి జెప్పవలెనో తెలిసిందా?"

"యేటా? బాబూ! బాబు, నా యీపు పగలేసినారు, రండమ్మా అంతాను."

"దెబ్బల మాట మారిచిపో. కొట్టినందుకు రెండు రూపాయిలిస్తాను. తీసుకో. మరి యెన్నడూ ఆ వూసెత్తకు. కమలినితో గాని తప్పిజారి అనబోయేవు సుమా."

"అనను బాబూ!"

"నువ్వు చెప్పవలసిన మాటలు చెబుతాను. బాగా విను. 'పంతులికి బుద్ధి వచ్చింది. ఇక ఎన్నడూ సానుల పాట వినరు. రాత్రులు యిల్లు కదలరు, ఇది ఖరారు. తెలిసిందా? మిమ్ములను గెడ్డము పట్టుకుని బతిమాలుకున్నానని చెప్పమన్నారు. దయదలచి ఆయన లోపముల బయలు పెట్టక రెండు మూడు రోజులలో వెళ్ళిపోయి రమ్మన్నారు. మీరు లేని రోజో యుగముగా గడుపుతున్నారు ' అని నిపుణతగా చెప్పు తెలిసిందా?"

"తెలిసింది బాబూ!"

"ఏమని చెబుతావో నాతో వొక మాటు చెప్పు."

రాముడు తల గోకుకొనుచు "యేటా – యేటా – అదంతా నాకేం తెలదు బాబూ– నానంతాను అమ్మా! నా మాటినుకోండి – కాలం గడిపి నోణ్ణి – ఆడోరు యెజమాని చెప్పినట్టల్లా యిని వల్లకుండాలి. లేకుంటే మా పెద్ద పంతులార్లాగ అయ్యగారు కూడా సానమ్మ నుంచుగుంటారు. మీ శెవులో మాట. పట్టంలోకి బంగార బొమ్మలాంటి సానమ్మ వొచ్చింది. మరి పంతులు మనసు మనసులో లేదు. ఆ పైన మీ సిత్తం! అంతాను."

" ఓరి వెధవా!" అని గోపాలరావు కోపముతో కుర్చీనుండి లేచి నెలిచెను.

ఊస వలె రాముడు వెలికెగసెను.

అంతట మంచము క్రింద నుండి అమృత నిష్యందిని యగు కలకల నగవును కరకంకణముల హృద్యారావమును వినయ్యెను.

('ఆంధ్ర భారతి' 1910, ఫిబ్రవరి)

ఉరి

- కవిసామ్రాట్ విశ్వనాథ సత్యనారాయణ

నాకు మీరు ఉరిశిక్ష వేశారు. నన్ను చెప్పుకునేది చెప్పుకోమన్నారు. శిక్ష వేయక ముందు చెప్పుకోమంటే అర్థం ఉండేది.ఇప్పుడు చెప్పుకొన్నా ఒకటే.చెప్పుకొనకపోయినా ఒకటే. కాని మీరిప్పుడు చెప్పుకొనమనటంలో ఒక విశేషం ఉంది. ఎట్లాగూ చస్తున్నాడు కదా, చచ్చింతర్వాత మాట్లాడేది లేదు పెట్టేదిలేదు,ఆ మాట్లాడేది కాస్తా యిప్పుడే మాట్లాడమని. మనుష్యుడై జన్మ యెత్తిన తర్వాత మాట్లాడటం లో కొంత లౌకికమైన సంతోషం ఉంటుంది. అది మాయాపిహితులైన మానవులకు సహజలక్షణం. మీకు నా శరీరం మీద ప్రేమ లేదు. నా ఆత్మ మీద ప్రేమ . నా ఆత్మ మీ ఆత్మలు అందరివి ఒకటే గనుక,అయినా కాకపోయినా మీరనుకొంటున్నారు గనుక యిది ఒక మామూలు.

ఇప్పుడు నేను మాట్లాడకపోతే నష్టం లేదు. మాట్లాడితే వచ్చే లాభం లేదు. కాని నేను మాట్లాడితే లాభం ఉంటుందని కొందరనుకుంటారు. వాళ్ళ ఉద్దేశం లో మాట్లాడవలసిందే. ఏమైనా సరే మాట్లాడవలసిందే. బ్రతికియున్నంతవరకు ప్రయత్నం చేయవలసినదే. బ్రతికియున్నంతమందీ ప్రయత్నం చేయవలసినదే. వాళ్ళు మీకన్నా మాయాపిహితులు.

నేను మనిషిని చంపానని మీరు నాకు ఉరిశిక్ష వేశారు. ఆ చంపానన్నది నాకు తెలియదు. మీకూ తెలియదు.సాక్ష్యం యిచ్చిన వాళ్ళకీ తెలియదు. నాకు తల్లీ పెళ్ళాం బిడ్డలు ఉన్నారు. వాళ్ళను పోషించలేక నేను చాలా బాధ పడ్డా. వాళ్ళకు తిండి లేదు. నాకూ తిండి లేదు. మీ దయ వల్ల రెండు నెలలనుండి ఖైదు లో కూర్చొని అన్నం మాత్రం తిన్నాను. ఈ రెండు నెలలు వాళ్ళేమైనారో నాకు తెలియదు. ఈ పాటికి వాళ్ళూ చచ్చే వుంటారు. వాళ్ళ కన్నా నేనే అదృష్టవంతుణ్ణి. వాళ్ళు చావకముందు మాడి మాడి చచ్చివుంటారు. నేను చచ్చేముందు ఏదో యింత అన్నం తినే చస్తున్నా.

నేను ఉద్యోగం చేయలేదు. కూలీ నాలీ కుదురలేదు. మోసం చేయలేను. ఎక్కడో నాలుగురాళ్ళు సంపాదిస్తే దాంతో బియ్యం కొనుక్కుందామంటే బియ్యం దొరకలేదు. అదివారకు నాల్గురోజులు ఇంటిల్లిపాదీ పస్తున్నాం. నేను,నా భార్యా ఎల్లాగో అల్లాగా తమాయించుకున్నాం. పిల్లలు బక్క నరాలై కూర్చున్న చోటునుంచి లేవలేక యేడ్చేశక్తి గూడా లేక బ్రతికున్న శవాలల్లే పడి ఉంటే చూడటం యెలాగా?

బియ్యం అమ్మే దుకాణం పెద్దపులల్లే ఇరవైగజాల తోక పెంచుకుని– ఆ తోక చివర నేను. నాలుగురోజులు ఈ తోకచివరితనం పొందలేక పొందలేక, విసిగి చివరికి యింటికి వచ్చాను. ఒక ముసలిది నా మీద దయపుట్టి తనకు వచ్చిన బియ్యం లో సగం నాకు రెట్టింపు ధరకు అమ్మింది. ఆ బియ్యం తీసికొనివచ్చి వండి పిల్లలకు పెడదామంటే అవి గొడ్లు తినాలిగాని మనుష్యులు తినరు. నాలుగు పోట్లు వేసి చెరిగితేగాని వండటానికి పనికి రావు. దంచాలి అంటే నాలుగు రోజులు తిండి లేని మా యింటిదానికి వోపిక లేదు,నాకూ లేదు. అయినా పిల్లల స్థితి చూడలేక మా యింటిది ఆ బియ్యం చిరిగిన చీర కొంగున కట్టుకొని పది కొంపలు తిరిగింది. ఒకళ్ళు విసిరి కొట్టారు. మరి ఒకళ్ళు– వాళ్ళ ఇంట్లో నోమట – అట్ల కోసం పిండి దంచుకొంటున్నారు. అన్ని యిళ్ళు యిట్లాగే అయినవి. చివరకా బియ్యమే ప్రొయ్యి రాళ్ళ మీద పెట్టింది మా యింటిది. ప్రొయ్యి క్రింద మంట లేదు. ఒకాయన దొడ్డి చుట్టూ కంచె వేశాడు. ఆ కంచె గాడిదలూ,కుక్కలూ,పందులూ విరగతొక్కినవి. కంచె పుల్లలు యిటూ అటూ పది ఉన్నవి. అవి యెవరికీ పనికి రావు. అవి నేను యేరి తెస్తుంటే ఆ ఒకాయన "ఎవడి అమ్మా మొగుడి సొమ్మను కొన్నావు" అని వచ్చి నన్ను కట్టతో విరగగొట్టాడు.

ఇంటికి వచ్చాను. యిల్లంటే నవ్వు వస్తోంది. ఎవళ్ళదో పడిపోయిన గోడ ఉంటే – ఆ స్థలం లో యెవళ్ళూ కాపరానికి లేరు – ఆగోడ క్రింద ఉంటున్నాం. అదే యిల్లు. పైన పుల్లా పుడకా పెట్టి,తలలు మాత్రం దాని క్రింద పెట్టి నిద్ర పోయేటట్లుగా మా యింటిది ఆధారం చేసింది. నేను వెళ్ళేటప్పటికి ఆ ఆధారం తీసి దానితో మంట వేస్తోంది. ఆ ఆధారం ఎక్కువా ? పిల్లల కడుపు మంట ఎక్కువా?

మరునాడు మా పిల్లలస్థితి చూడగా కడుపులో నొప్పితో మెలితిరిగి పోయినారు. నాలుగు వాము పరకలు తెద్దామంటే చేతిలో ఉన్న నాలుగణాలు నిన్నటి ముసలమ్మ కాజేసింది. మళ్ళీ తర్వాత నాలుగు రోజుల వరకూ బియ్యం లేవు. పిల్లల కడుపు నొప్పులూ తగ్గలేదు. మా యింటిది లేవనే లేకపోయింది. నేనట్టాగే తిరుగుతున్నాను.

ఆరోజున మధ్యాహ్నం జనం గుంపులుగా వెళ్ళుతున్నారు. నేను వాళ్ళెక్కడికి వెళుతున్నారని అడిగాను. అందరికీ బియ్యం ఇస్తారట అని చెప్పారు. నేను వాళ్ళ వెంట వెళ్ళాను. వాళ్ళు వందా రెండు వందలమంది ఉన్నారు. జనం ఒకచోటికి వెళ్లారు. జనం కేకలూ బొబ్బలూ నానా హంగామాగా ఉంది. ఒక యింటి దగ్గర ఆగారు. ముందర యేమి జరుగుతోందీ నాకు తెలియదు.నేను వెనక ఉన్నాను. బియ్యం కోసం త్రొక్కిళ్లాడుతున్నా రనుకున్నాను. చుట్టు ప్రక్కల యిళ్లవాళ్ళందరూ కొందరు తలుపులు వేసికొన్న వాళ్ళూ,కొందరు తొంగి చూచేవాళ్ళూ గా కన్పించారు.

కొంతసేపటికి రక్షకభటులు వచ్చారు. నేననుకొన్నాగదా "అమ్మయ్యా!వీళ్ళు వచ్చారు గదా ! అందరికీ సరిగ్గా పంచిపెట్టిస్తారు" అని. క్రమక్రమం గా నాకు తెలిసింది, ఈ గుంపుకీ ఆ రక్షకభటులకీ దెబ్బలాట జరుగుతోందని.

ఇంతలో రక్షక భటులు తుపాకులు కాల్చారు.ఈ గుంపు లోంచి రక్షకభటుల మీద రాళ్ళు విసురుతున్నారు.

వ్యవహారం యెప్పుడయితే ముదిరిందో నాకెందుకురాబాబూ ఇది పోదామనుకున్నాను. కాని పోవటమెట్లా ? అదివరకు నెల్లాళ్ళమట్టి తిండే లేదు. వారానికోకసారి యేదో తినీతిననట్టు తిన్నా నా వంట్లో ఓపిక లేదు. మనిషిని మరీ అర్భనాకారిని కాదు గనుక మనుష్యాకృతి లో లోపం లేదు.

రక్షకభటులలో కొందరికి దెబ్బలు తగిలినవి. ఒకడికి రాయి నెమరకణతకు తగిలిచచ్చాడు. ఆ రాయి ఆ చుట్టుప్రక్కలవాడెవడు విసిరాడో నాకు తెలియదు.

పైగా చంపడం లో యిన్ని భేదాలేమిటి? రాయి తగిలితే చచ్చి,తుపాకి గుండు తగిలితే బ్రతుకుతాడా?తుపాకి గుండు తగిలి చస్తే శిక్ష లేదూ! రాయి తగిలి చస్తే శిక్షా ?

ఆ కళ్ళు లేని దేవుడు –ఆ రాయి నేనే విసిరానన్నాడు. ఆ రాయి విసరడం మాట అట్లా ఉంచండి. నేను చేయి యెత్తగలిగితే చాలు ! ఆ స్థితి లో ఉన్నాను. రక్షక భటులు తరిమారు. అందరూ పారిపోతున్నారు. నేనూ పారిపోతున్నాను. పరిగేత్తేందుకు నాకు ఓపిక యేది? వెనక నుంచి నా నెత్తి మీద పెద్దదెబ్బ పడ్డట్టుగా మాత్రమే నాకు తెలుసు.

ఒక రాత్రివేళ నాకు మెలకువ వచ్చింది. గాఢాంధకారం లో కూర్చొనివున్నా. మరునాటి ప్రొద్దుటికి తెలిసింది నాకు అది ఖైదని.

ఒకటి రెండు పూటలైన తర్వాత నా కన్నం పెట్టారు.అన్నం చూస్తే నా ప్రాణాలు లేచి వచ్చినవి. వెంటనే పిల్లలు జ్ఞాపకం వచ్చారు. వాళ్ళకు పెడదామని అన్నం అట్టే పెట్టాను. మరునాటికి తెలిసింది. యింక వాళ్ళు నా దగ్గరకు రారని.

వాళ్ళేమయినారో ?! ఏమైనారో యెవడికి కావాలి ?

పూట పూటా అన్నం తినడం నాకూ అలవాటైంది.

నా పని రాజభోగం గా ఉంది. రెండు పూటలా తిండి.ఎక్కడికైనా తీసికొనివెళ్ళితే మోటారు కారులో తీసికొని వెళ్లారు. పెద్ద కోర్టు లో కూడా నాకోసం ఒక ప్రత్యేక స్థానం. చివరి రోజుల్లో నాకు దశ యెత్తుకుంది. ఆ పాడు దేవుడు ఈ మాత్రంగా ఆ వెనుక కూడా సాగిస్తే యెంత బాగుండేది ?

ఇంతకన్నా యేమి చెప్పను? నాకు ఇంత ఉపకారం చేసిన మీరు వెయ్యేళ్ళు బ్రతకండి. బ్రతుకంతా తిండిలేక చచ్చిన నాకు రెండు నెలలు సుఖం గా తిండి పెట్టారు. మీ కడుపులు చల్లగా ఉండాలి.

కాని నా యింటిది, పిల్లలూ యేమైనారో తెలియలేదు. నాకు ఒక్కటే చింతగా వుంది. నా పిల్లలు కొంచెం పెద్దవాళ్ళు అయితే ఎల్లాగో అల్లాగా పెద్దవాళ్ళు అయితే చివరి రోజుల్లో వాళ్ళకు గూడా నాకు పట్టిన యోగం పడుతుందా అని. అదంతా మీదయ. వాళ్ళని వెదికించి యీ ఉపకారం చేయిస్తే మీ కడుపున పుట్తాను.

('ఆనందవాణి' 1950, డిశంబర్)

ఆదర్శ జీవులు

- శ్రీ శ్రీ

ఒక రోజు జోరుగా వాన కురుస్తోంది. మా శకుంతలకి వానంటే ఎంతో ఇష్టం. కిందటి జన్మలో నెమలి కాబోలు శకుంతల. నాకు మాత్రం వానంటే అసహ్యం. వాన కురిసిన సాయంత్రం సేవా సమితిలో చిక్కుకున్నాను. గొడుగు లేదు. ఎంత సేపటికీ వర్షం తగ్గదు. ఆఖరికి తెగించి యింటికి బయల్దేరాను తడుచుకుంటూ. వానని తిట్టుకుంటూ ఇల్లు చేరుకున్నాను.

శకుంతల ముఖంలో ఇదివరకెన్నడూ చూడనిదేదో వికాసం కనిపించింది. ఆ ముఖాన్ని చూస్తుంటే నా చిరాకంతా కరిగిపోయింది. వాన కురుస్తూనే వుంది. శకుంతల లేనప్పుడు నన్నల్లరి పెట్టిన వాన ఆమె సమక్షంలో నాకెంతో ఆప్యాయం కలిగించింది. ఆ రాత్రంతా వాన కురుస్తూనే వుంది.

ఆ రాత్రే శకుంతల ఎన్నో దినాలుగా దాచివుంచిన తన రహస్యాన్ని నాకు చెప్పింది.

2

నేను బుద్ధ భగవానుణ్ణి కాను. కాని నాకో కొడుకో, కూతురో పుట్టబోతున్నట్లు తెలియగానే 'ఇంకో బంధనం,ఎంతో బాధ్యత' అని చాలా నిర్వేదం పొందాను. 'ఈ లోకంలోకి ఇంకో ప్రాణిని తీసుకొచ్చి ఏం లాభ'మనిపించింది. ఆ రాత్రి శకుంతల హాయిగా నిద్రపోయింది. నాకు మాత్రం ఎంత గింజుకున్నా నిద్రపట్టలేదు.

కిటికీ తలుపు తీసి, ఆకాశం వైపు, లోకం వైపు చూశాను. అంతా గాఢాంధకారం. సాయంత్రం కన్నా వాన జోరు హెచ్చింది. ఇంతట్లో జిగేలుమని ఒక మెరుపు మెరిసింది. ఇరుగుపొరుగు ఇళ్ళన్నీ కనబడ్డాయి. 'ఇంతేనా లోకం' అనుకున్నాను. కిటికీ తలుపులు మూశాను. ఉరుము చప్పుడు వినబడింది. మళ్ళీ మంచం మీద వాలి నిద్ర పోదామని ప్రయత్నించాను. కళ్ళంటే మూసుకున్నాను గాని నిద్రపట్టదే! అలాగే కళ్ళు మూసుకుని వాన చప్పుడు వింటున్నాను. హఠాత్తుగా మూడు ప్రపంచాలు కనిపించాయి నాకు. ఒకటి మా నాన్నది. ఇంకొకటి నాది. మరోటి నా కొడుకుది. తర్వాత నాకు కూతురే పుట్టింది గాని, అప్పుడు మాత్రం పుట్ట బోయేది మగబిడ్డే అని నా నమ్మకం. నిజానికి ఈ మూడు ఒక లోకమే. కాలాలు వేర్వేరు. భూతవర్తమాన భవిష్యత్కాలాలూ మా నాన్నది భూతకాలం, నాది వర్తమాన కాలం, నా కొడుకుది భవిష్యత్కాలం. ఆ మాటకొస్తే కాలం కూడా ఒక్కటే. కాలావకాశాలు కూడా ఒకటే. ఈ క్షణంలో భూగోళంతో బాటు నేనూ అనంతాకాశం లో పరిభ్రమిస్తున్నాను. నాతో బాటు ఈ సృష్టి పరిభ్రమిస్తోంది. ఎక్కడికో ఈ పరుగు? ఎప్పుడో దీని అంతం.

చిత్రం! ఆ రాత్రి నేను అనంత విశ్వాన్ని గూర్చి ఆలోచించినప్పటికీ లోకం అంటే నాకు కనబడ్డది ఇరుగు పొరుగు ఇళ్ళు మాత్రమే. నాది పరిమిత జీవితం దానికి కొన్ని హద్దులున్నాయి. వీటి ఆవరణలోనే నేను సుఖాన్నైనా, దుఃఖాన్నైనా అన్వేషించాలి అనుభవించాలి.

లోకం అంటే ఇరుగూ, పొరుగూ ఎరిగిన వాళ్ళు. ఇంకా మనం ఎరగని ముఖాలు ఎరగని స్థలాలూ ఎన్నో ఉన్నాయి. మనకి అవతల మనతో నిమిత్తం లేకుండా ఎన్నో పరిణామాలు సంభవిస్తున్నాయి. వాటి ప్రభావం మన మీద అనునిత్యమూ ప్రసరిస్తూనే ఉంటుంది! కాని, వాటి గతిని మాత్రం మనం నిరూపించలేము. ఉదాహరణకి యుద్ధం. దీన్ని నేను ప్రారంభించలేదు. కాని, నా ఇష్టానిష్టాలతో నిమిత్తం లేకుండా ఇది సాగిపోతుంది. ఆగిపోతుంది. యావత్ప్రపంచం మీదా దీని ప్రభావం పనిచేస్తుంది. ఈ యుద్ధపు వానలో తడియని వాళ్ళెవ్వరూ లేరు.

వాన వినబడుతోంది. నేను మళ్ళీ నా ఆలోచనలో పడ్డాను.

'లోకం! విశ్వం!' 'లోకం పరిమితం' 'విశ్వం అనంతం.' లోకంలో నా జీవితం పరిమితం. విశ్వంలో నా ఆత్మ అనంతం.

Max Planck వ్రాసిన "Where is Science going" అనే పుస్తకం వచ్చింది. Niels Bohr అణుశక్తి పరిశోధనలు జ్ఞాపకం వచ్చాయి. నేను కాలేజీ మాగజైన్ లో ఐన్ స్టైయిన్ మీద వ్రాసిన వ్యాసాన్ని తలుచుకున్నాను. వైజ్ఞానిక విషయాలలో పాశ్చాత్య దేశాలు ఎంతగా పురోగమించాయి? జీవిత ప్రమాణాలను బట్టి చూస్తే మన దేశం ఎంత నికృష్ట స్థితిలో వుంది! భయంకరమైన దారిద్ర్యము, అజ్ఞానమూ ప్రళయ తాండవం చేస్తున్నాయే. వీటి నిర్మూలనం ఒక్కడి వల్ల సాధ్యమవుతుందా? ఎవ్వరూ కలుగజేసుకోరేం? చదువుకున్నా మనుకున్న వారు కూడా గుమాస్తాలు గానో , పెద్ద కూలీలు

170

గానూ మారిపోయి తమ సంకుచిత ద్వారబంధాల వెనుక దాగిపోతున్నారు. ఈ అజ్ఞానం దారిద్ర్యం, అనారోగ్యం, ఇవన్నీ ఉన్నాయిగాని ఉండనక్కర లేనిదనీ, వీటిని మానవ ప్రయత్నంతో తొలగించ వచ్చుననీ అంటే అందరూ నన్ను అనుమానంతో చూసే వారే! నేనేదో అందని మ్రానిపళ్ళ కోసం అర్రులు చాచే రకం అంటారు. అసాధ్యాన్ని సాధించడానికి బతుకంతా భ్రష్టం చేసుకుంటున్నానంటారు. కాని నేను తలపెట్టిన పని నిజంగా అసాధ్యమైన దేనా? ఒక్కొక్కప్పుడు నాకూ అనిపిస్తుంది. కేవలం ఎందమావులాశించి పరుగెత్తుతున్నానేమో నని. ఈ జీవితంలో శకుంతల వంటి భాగస్వామి దొరక్క పోతే, నేనేమై పోయి వుందునో ?

శకుంతల వైపు చూశాను. గాఢ నిద్రలో మునిగి వుంది. దుప్పటి మెడ దాకా కప్పుకుని ఉందేమో, ఆ అమాయకమైన ముఖం ఒక్కటి మాత్రమే కనబడుతోంది. ఆమె గర్భంలో ఇంకా పూర్తిగా ఆకారం ధరించని ఒక శిశువు ఉంది. మళ్ళీ మూడు లోకాలు తలపుకొచ్చాయి. అక్కడలేని మా నాన్న, అక్కడ వున్న నేను, అక్కడ వుండీ లేనట్లున్న లేక ఉన్నట్లున్న నా కొడుకూ, ప్రతి క్షణమూ నేనూ, మా నాన్న, నా కొడుకూ పెరుగుతూనే ఉన్నాము. చిట్టచివరికి మేమింకా మృత్యువు వైపుకే పెరుగుతున్నప్పటికీ, ఎందువల్లో మా నాన్న మరణం దిక్కుగానూ, నా కొడుకు జీవితం దిక్కుగానూ ఎదుగుతున్నారనిపించింది.

మా నాన్న ప్రపంచాన్ని నేను పూర్తిగా గర్హిస్తున్నాను. దాని వారసత్వమే నా బాధలన్నీటికీ కారణమని నమ్ముతున్నాను. జీవితంలో నా పోరాటం ఒక ఎత్తూ! మా నాన్నతో నిశ్శబ్దంగా ప్రతిక్షణమూ నేను సాగించే పోరాటం ఒక ఎత్తూ! రూపాయి అణా పైసలను దాటి ఏం కొంచెం హెచ్చు విలువలకైనా మా నాన్న ప్రాముఖ్యం ఇచ్చి ఉంటే, నా జీవితం లో ఇంత సంఘర్షణ ఉండేది కాదు. అయితే మా నాన్నకీ నా ఆలోచనలేవీ అర్థం కావు. నేను అప్రయోజకుణ్ణని ఆయన ఏనాడో నిశ్చయం చేసుకున్నాడు. ఆయన ధాన్యం వ్యాపారానికి నేను కలిసి రాలేకపోయాను. ఆయన మిల్లులో నేనొక మరను కాలేకపోయాను. ధనం ఆర్జించడంలో ఆయన అవలంబించుతూన్న పద్ధతులలో ఒక్కటీ కూడా నాకు రుచించలేదు. అధిక వ్యాపారపు పన్ను ఎగవెయ్యడానికని తన మిల్లులో పనిచేసేవాళ్ళందరికీ బోనసులు ఇస్తున్నాననడం , రెండు వందలకి రసీదు పుచ్చుకుని నూరు రూపాయలివ్వడం! కాని అలా రసీదు లిస్తున్న వారి చర్య మాత్రం దారుణం కాదూ? లేకపోతే ఆ నూరు రూపాయలు దక్కవని భయం కాబోలు! అబ్బ! ఈ అన్యాయం చెయ్యడంలో కూడా ఎన్ని తికమకలున్నాయి! అబద్ధాలలో ఎన్నో రకాలు. ఎన్నో రంగులు. సత్యానికి రంగు లేదు. దాన్ని తెల్లరంగని కూడా అనలేము. కొన్ని అబద్ధాల రంగు లెంత ఆకర్షణీయంగా ఉంటాయి? అసత్యం శాఖోపశాఖలతో ప్రపంచాన్నంతా ఆవరించింది. అంధకారబంధురమైన ఈ అబద్ధాల అరణ్యంలో ఏ జ్ఞానదీపిక వెలిగించుకొని దారి చేసుకోవడం, అసలు ఏది అసత్యమో ఏది నిజమో కూడా నిర్ణయించుకోవడం ఒక్కొకప్పుడు కష్టమయి పోతుందే!

నా చిన్నతనంలో మా నాన్న నన్ను కొట్టిన సందర్భం జ్ఞాపకం వచ్చింది.

ఎనిమిదేళ్ల వాణ్ణి మా యింటికి నాతో చదువుకుందామనే మిషతో ఆడుకోవడానికి వచ్చే స్నేహితుడు మా నాన్న జేబులోని చిల్లర డబ్బులు దొంగిలించాడు. ఆ పని నేను చేశానని నేరం నా మీద వేసుకున్నాను. ఫలితం లెంపకాయ! నా మొగం జుమాలుమంది. పట్టపగలు నక్షత్రాలు కనబడడం అంటే ఏమిటో నాకప్పుడు తెలిసింది. మంచి చెడ్డల విషయమై నేను పెట్టుకున్న అమాయకపు నమ్మకాలన్నీ కరిగిపోయాయి. ఇవి ఒక దాన్నొకటి పెనవేసుకొని ఉంటాయనీ, వేరువేరుగా విడమర్చి చూడ గలగటం చాలా కష్టమనీ గ్రహించాను. తర్వాత మా నాన్నకి తెలిసింది నేను నేరగాణ్ణి కానని. అయినా అబద్ధ మాడినందుకు లెంపకాయ తగల వలసిందే అన్నాడు మా నాన్న. అప్పీలులో నా శిక్ష ఖాయమయింది.

మా నాన్న పరిస్థితిలో నేనూ, నా పరిస్థితిలో నా కొడుకూ నేను మాత్రం ఏమి చేస్తాను? మా నాన్నలాగ నేను చెయ్యి చేసుకొనని నిశ్చయం గా చెప్పగలను. అసలు అటువంటి పరిస్థితి బయలుదేరడానికి వీలులేనట్లుగా నా కొడుకును పెంచుతాను. సామాన్యంగా ప్రస్తుతం అన్ని కుటుంబాలలోనూ పిల్లలు గాలికి పుట్టి, ధూళికి పెరుగుతున్నారు. పిల్లల పెంపకంలో సరియైన శ్రద్ధ తీసుకుంటున్న వారెంతమంది? అయిదేళ్లు రాగానే కుర్రాణ్ణి బడికి పంపించేస్తే చాలు బాధ్యత తీరిపోయిందనుకునే వాళ్ళే అనేకులు. పైగా, ఇంట్లో బోలెడు అల్లరి తగ్గిపోయిందని తృప్తి పడతారు. మన ఇళ్ళలో పరిస్థితులు కూడా అంతంత మాత్రంగానే వుంటున్నాయి. ఇంటా బయటా కూడా ఎక్కడా ప్రశాంతి లేని లోకంలోకి ఇంకో భావి పౌరుడు ప్రవేశిస్తున్నాడు. ఆ పౌరుడి జీవితం ఎన్ని విధాల క్షోభపడడానికి వీలుందో అన్నిటినీ అమర్చి ఉంచాం.

171

వ్యక్తిగత సుఖదుఃఖాలలో మునిగి తేలుతూ సాంఘిక చైతన్యాన్నే విస్మరించి పోయాం. ఏమాత్రం సంఘదృష్టి చూపించినా, ఇప్పుడున్న అసౌకర్యాలని తొలగించవచ్చు. మనం సుఖపడి ఇంకొకర్ని సుఖపెట్ట వచ్చు. కాని ఏదీ ఇంకా మనలో అటువంటి దృష్టి?

3

వాన కురుస్తోంది. నిద్ర పట్టడంలేదు. మంచం మీద నించి దిగ్గుమని లేచిపోయాను. ఏదో రాయాలని బుద్ధి పుట్టింది. పక్క గదిలోకి వెళ్ళి దీపం వెలిగించాను. కాగితం,కలం తీశాను. నేను రాద్దామనుకున్నది ఒక ఉత్తరం కాదు. ఒక హెచ్చరిక. పుట్టబోయే నాకొడుకును ఉద్దేశించి రాశాను. ప్రస్తుత ప్రపంచం గురించి భావితరం వారికి ఒక లోపాయికారీ నివేదిక ఇది.

'చిరంజీవి చిట్టి సుదర్శనం!' అని ప్రారంభించాను. ప్రపంచం గురించి నీకు బోధపరచాలని నా ఉద్దేశం. దీనిని నేను సరిగా అర్థం చేసుకున్నానో లేదో తెలియదు. నా విలువలకీ, ప్రపంచ విలువలకీ అడుగడుగునా సంఘర్షణ. నేను తలపెట్టిన పనులన్నిటికీ ఎప్పటికప్పుడు విఘాతాలే సంభవిస్తున్నాయి. నా విలువను ప్రపంచం హర్షించదు. ప్రపంచం విలువలను నేను అంగీకరించను.

'నువ్వు పెద్దవాడివైన తర్వాత మా నాన్న ప్రపంచం ఇంత అధ్వానంగా ఉండేదా అని ఆశ్చర్యపడతావు. కాని ఏమాత్రమూ అతిశయోక్తి లేకుండా చెబుతున్నాను. ఆదర్శ జీవులను ప్రపంచం ఆదరించదు. నువ్వు స్వతంత్రంగా ఆలోచించుకోగలిగే సరికి, ప్రపంచం పరిస్థితులు ఇంతకన్నా బాగుపడతాయేమో నాకు తెలియదు. అయితేనేం నేను ఆశావాదిని. భవిష్యత్తులో నాకు నమ్మకం వుంది. అంటే ఈ ప్రపంచం ఇప్పటికంటె ఎక్కువ ఉజ్జ్వలంగాను, ఎక్కువ విజ్ఞానవంతంగాను వుండగలదని ఆశిస్తున్నాను. మేము మాత్రం ఏ దారీ దొరకక ఉక్కిరిబిక్కిరి అయిపోతున్నాము.'

నాకు స్పష్టంగా కనబడుతున్న సత్యం లోకాని కెందుకు అబద్ధంగా కనబడుతుంది? అసలు నా చిత్తశుద్ధినే లోకం శంకించడమెందుకు? ఏ చిన్న పనికి పూనుకున్నప్పటికీ, స్వార్థచింతనే ఆరోపించుతుందే! మొన్న ఏమయిందంటే –

'మాలగూడెం ఆకలితో మలమల మాడిపోతోంది. శేషాయి చచ్చిపోవడం నేను కళ్ళారా చూశాను. సేవాసమితి నిధిలోంచి నా సొంత పూచీ మీద డబ్బు ఖర్చు చేశాను. ఇల్లిల్లు తిరిగి, నేనూ,శకుంతలా ధనం పోగుచేశాం. దీని ఫలితం ఏమిటో తెలుసునా? ఆ డబ్బు శకుంతల చీరల కింద ఖర్చయిందని, దుష్ప్రచారం జరిగింది. దీన్ని ప్రారంభించిన వారు ఎవరో కాదు. మన బంధువులే. మాలకొంపలలో తిరిగినందుకు మిమ్మల్ని వెలివెయ్యాలని కొందరు పట్టుబట్టారు. ఇప్పటికీ నన్ను ఎడంగానే ఉంచి, నాస్పర్శ తగిలితే మైల బడిపోయేటట్లు భావించే వారెందరో ఉన్నారు. ఏ ఉద్యోగమూ లేని నాకు జీవనోపాధి యెలా అని సందేహించే వాళ్ళు అనేకులు.'

"మోసమూ చేయకుండా ఎలా బతుకుతున్నామనే అందరికీ ఆశ్చర్యం. కాబట్టి మేము తలపెట్టిన ప్రతికార్యం లోనూ, ఏదో ఒక కుతంత్రం ఉందనే వాళ్ళ విశ్వాసం.'

'లోకపు ధోరణి చాలా విచిత్రమైంది. లోకులందరూ ఒక సభ చేసి – శకుంతలా సుదర్శనం ఫలానా నేరం చేశారు కాబట్టి, ఫలానా శిక్ష వేస్తున్నాం." అని ఏకగ్రీవంగా తీర్మానించారు. అభిప్రాయాల సంఘర్షణ ఒక కనబడని యుద్ధం. నీళ్ళు కాగబెడితే క్రమక్రమంగా వేడి ఎక్కినట్లు విరుద్ధ వాతావరణం క్రమంగా పెరుగుతుంది. వీడే నా విరోధి అని వేలుపెట్టి ఎవరినీ చూపించలేవు. కాని వాతావరణంలో వేడి అనుక్షణమూ అనుభవమవుతూనే ఉంటుంది.'

'ఇటువంటి పరిస్థితులలో లోకం విలువలను ధిక్కరించి, నీ సత్యంకోసం నిలకడగా నిలబడడమా ? లేక ఏ ఎండకా గొడుగుపట్టి, ఎప్పటికప్పుడే రాజీ పడడమా? ఈ రెండో పద్ధతి చాలా సదుపాయమైనది. అత్యున్నతాదర్శాలలో జీవితాన్ని ప్రారంభించిన వాళ్ళు కూడా ఒక్కొక్క సారి అలసిపోయి ఓటమిని, అంగీకరించి అస్త్రసన్యాసం చెయ్యడం చూస్తూనే ఉన్నాము. ఇంతవరకూ మాకిట్టి దురవస్థ పట్టలేదు. ఇకముందు లోకంలో మా పోరాటం ఎలా పరిణమిస్తుందో! నీవు మాలాగానే బాధ పడవలసిన అవసరం ఉంటుందో, లేక, అప్పటికైనా లోకం ఆదర్శ జీవితాన్ని అర్థం చేసుకోగలుగుతుందో! లోకాని కోసం నీవు నీ ఆదర్శాన్ని మార్చుకోవలసిన అవసరం ఉండకూడదు. మరి లోకం నీ అభిప్రాయాల కోసం తాను మారుతుందా? ఏమో!'. ఉత్తరం ముగిసేసరికి తెల్లారిపోయింది.

వాన మాత్రం కురుస్తూనే వుంది.

('నవోదయ' 1947, మే)

రచయితల పరిచయం

శ్రీ సత్యం మందపాటి: జననం తూర్పుగోదావరి జిల్లా ఆత్రేయపురం. పెరిగింది, చదివింది గుంటూరులో. ఇంజనీరింగ్లో ఎంటెక్ అనంతరం విక్రం సారాభాయ్ స్పేస్ సెంటర్లో ఉద్యోగం. అమెరికాలో సెమీకండక్టర్ పరిశ్రమలో వైస్ప్రసిడెంట్ పదవి నిర్వహించి, విరమణానంతరం – విశ్రాంతజీవితం ప్రశాంతంగా గడుపుతున్నారు. వృత్తి ఇంజనీరింగ్ అయితే ప్రవృత్తి సాహిత్యం. 1962 నుంచీ అనేక రచనలు చేసారు. వీరు వ్రాసిన "అమెరికా బేతాళుడి కథలు" మొదటి "అమెరికన్ డైస్పోరా" రచన. వంగూరి ఫౌండేషన్ "జీవన సాఫల్యపురస్కార" గ్రహీత.

శ్రీ జెజ్జాల మోహన రావు : జననం నెల్లూరు (1943). మదరాసులో SSLC, తిరుపతిలో ఉన్నత విద్యాభ్యాసం. ఐ.ఐ.ఎస్సీ,బెంగుళూరులో క్రిస్తలోగ్రఫీ లో Ph.D పట్టా; ౧౯౮౦ దాకా మధురై కామరాజ్ విశ్వవిద్యాలయంలో రీడర్గా విద్యాబోధన; దీర్ఘకాలం గా అమెరికాలో శాస్త్రజ్ఞులు. ప్రస్తుత నివాసం: ఫ్రెడరిక్, మేరీలాండ్. పాటలు, పద్యాలు, ఛందస్సు మీద విస్తారంగా వ్యాసాలు రాశారు. అనువాదాలు చేశారు. వీరి సుభాషితాల సంకలనం: Today's Beautiful Gem. ఛందశ్శాస్త్రంలో కృషి, పరిశోధనకు గాను విరోధినామ (2009) సంవత్సరపు బ్రౌన్ పురస్కారాన్ని అందుకున్నారు. హాబీలు: సాహిత్యము, సంగీతము, ముగ్గులు.

శ్రీమతి లలిత రామ్: శ్రీమతి రేవతి, దేవులపల్లి కృష్ణ శాస్త్రి గారు మనుమరాలు. మద్రాసులో పెరిగి, అమెరికా పోర్ట్లాండు నగరంలో, వివాహం తర్వాత స్థిరపడ్డారు. లలిత రామ్ అన్న పేరుతో, "అవంతీ కల్యాణం" తెలుగు నవలతో కలం చేపట్టారు. 'మేఘు" అన్న ఆంగ్ల నవల, తెలుగు, ఆంగ్ల కథలు, కవితలు, వ్యాసాలు వ్రాసి, వంశీ ఆర్ట్స్ వద్ద, టాగ్స్ సాక్రమెంటో తెలుగు సంఘం వద్ద మెప్పు, అవార్డ్లు పొందారు. దేవులపల్లి కృష్ణ శాస్త్రి రచించిన లలిత గీతాల అల్బం ప్రొడ్యూస్ చేశారు. పలు అంతర్జాతీయ, అంతర్జాల కార్యక్రమాలలో పాల్గొన్నారు. యూట్యూబ్ లో మహాభారతం లో కొన్ని పాత్రలపై విశ్లేషించారు. అమెరికాలో ఆంగ్ల "రైసింగ్ స్టార్ అవార్డ్స్" కు జడ్జిగా పని చేశారు. వంటలు చేయటము, సంగీతము వినటము, మొక్కలు పెంచటము ఇష్ట పడే లలితకు కొన్ని భాషలు నేర్చుకోవాలని ఆసక్తి.

శ్రీమతి భావరాజు భారతి : పెరిగింది బొంబాయి లో. 1966 నుండి అమెరికాలో నివాసం. 1984 నుండి తెలుగు కళా సమితి సభ్యురాలిగా ఎన్నో కార్యక్రమాల నిర్వహణలోను , తెలుగు జ్యోతి పత్రిక ప్రచురణకి సహాయం చేశారు. తెలుగు, ఆంగ్లంలో వ్యాసాలు వ్రాసారు. పది సంవత్స రాలు న్యూ జర్సీ 'సాహిత్య భారతి' కార్యక్రమాలు జరపడానికి తోడ్పడ్డారు. చిత్రకళలో ప్రవేశం. సంగీత సాహిత్యాలలో మక్కువ. భర్త పరబ్రహ్మ మూర్తి, అమ్మాయిలు రజిత, వసుధ, అయిదుగురు మనుమలతో అమెరికాలో స్థిరనివాసం.

శ్రీమతి పద్మావతి రాంభక్త: విశాఖపట్నం వాస్తవ్యులు. కవయిత్రి,రచయిత్రి . రెండు కవితా సంపుటులు,ఒక కధా సంపుటి ప్రచురించారు. అనేక కధల ,కవితల పోటీలలో బహుమతులు, రాధేయ కవితా పురస్కారం-2019,జనరంజక కవి ప్రతిభా పురస్కారం, శ్రీమతి జింకా రుక్మిణమ్మ గంగిశెట్టి స్మారక పురస్కారం,శ్రీశ్రీ కవితా పురస్కారం అందుకున్నారు. స్త్రీవాదం, సామాజికస్పృహతో పాటు భావుకతతో కవిత్వం, కథలు సృజించడం ఆమెకు ఇష్టం. హాబీలు-డాబా తోట పెంపకం

శ్రీ ముకుంద రామారావు: కవి, రచయిత, అనువాదకులు అయిన రామారావుగారి ప్రస్తుత నివాసం హైదరాబాదు. ఎనిమిది స్వీయ కవిత్వ సంకలనాలు, 14 అనువాద గ్రంథాలు, మరికొన్ని ఇతర పుస్తకాలు వచ్చాయి. కథలు, వ్యాస సంకలనం రాబోతోంది. తెలుగు విశ్వవిద్యాలయం నుండి, వచన కవిత్వానికి కీర్తి పురస్కారం, అనువాదానికి సాహితీ పురస్కారం లభించింది. తాపీ ధర్మారావు పురస్కారంతో పాటు, అనేక ఇతర పురస్కారాలు లభించాయి.

శ్రీ బాలాంత్రపు వెంకటరమణ: తూర్పుగోదావరి జిల్లా బాలాంత్రపు గ్రామంలో జననం. బహుముఖ ప్రజ్ఞాశాలి. తెలుగులో అనేక గ్రంధాలు రచించారు. వీరి ప్రధమ గ్రంధం "తెలుగు పద్యమధురిమలు" తెలుగు అకాడెమీ వారిచే ప్రచురించబడినది. తెలుగు పంచకావ్యాలకు, హరివంశానికి సామన్యులకు అర్థమయ్యే రీతిలో పరిచయ గ్రంధాలు వ్రాసారు. పొట్టి శ్రీరాములు విశ్వవిద్యాలయం 'బండ్ల సుబ్రహ్మణ్యం కీర్తి పురస్కార గ్రహీత.

173

శ్రీమతి సుజాత బెడదకోట : స్వస్తలం పల్నాడు జిల్లా నరసరావు పేట, ప్రస్తుత నివాసం హైదరాబాద్. 2021 లో పల్నాడు ప్రాంత జీవితాల ఆధారంగా రాసిన "పల్నాడు కథలు" సంకలనం కు విమలా శాంతి పురస్కారం, గంధం నాగరాజు స్మారక పురస్కారం లభించాయి. దాదాపు 30 కథలు రాశారు. 2022 లో " కొన్ని జీవితాలు -కొన్ని సందర్భాలు" పుస్తకం ప్రచురించారు. రాయటం కంటే చదవటం ఇష్టం. జీవితంలో పోరాడి నిలిచే బలమైన పాత్రలను సృష్టించడాన్ని ఇష్ట పడతారు. అటువంటి కథలు మరిన్ని రాయగలరని ఆమె విశ్వాసం.

శ్రీమతి ఎస్. జయ : కర్నూలు జిల్లా లో జననం, నందికొట్కూరు, కర్నూలులో విద్యాభ్యాసం హైదరాబాదులో "విమోచన", "నలుపు" "ఈనాడు"పత్రికల లో పనిచేశారు. అనంతరం "అన్వేషి" విమెన్స్ స్టడీ సెంటర్ లో కో- ఆర్డినేటర్ గా పనిచేశారు. ప్రస్తుత నివాసం న్యూజెర్సీ "రస్తా" వెబ్ మాగజైన్ లో సహా సంపాదకులుగా పనిచేశారు. ఒక కథా సంకలనం, ఒక కవితా సంపుటి వెలువరించారు. ఒక అనువాద పుస్తకాన్ని, గ్లోబలైషన్ పై రాసిన వ్యాససంపుటిని హైదరాబాదు బుక్ ట్రస్ట్ ప్రచురించింది

శ్రీ హెచ్చార్కె: (హనుమంత రెడ్డి కొడిదెల) కర్నూలు జిల్లాలో జననం. విజయవాడ మరియు విశాఖపట్నం లో లో ఉన్నత విద్యాభ్యాసం. ప్రస్తుతం న్యూజెర్సీలో నివాసం. చాల కాలం సి పి ఐ (ఎం ఎల్) పార్టీలోకార్యకర్త గా , 'విమోచన'కు సంపాదకుడిగా, 'విరసం లో రాష్ట్ర కార్యవర్గ సభ్యుడిగా పని చేశారు 'ఉదయం', 'ఈనాడు దినపత్రికలలో ఎడిట్ పేజీ బాధ్యతలు నిర్వహించారు. ఐదారేళ్లు ఎన్ జీ వో లలో, విజువల్ మీడియంలో పని చేశారు. సుమారు పన్నెండు కవితా సంపుటాలు ప్రచురించారు.చాలా పుస్తకాలు అనువాదం చేశారు. అనేక సాహిత్య వ్యాసాలు, రెబెల్' అనే నవల ప్రచురించారు .

కాశీనాథుని రాధ : బాల్టిమోర్ , మేరీలాండ్ లో నివాసం. సాహిత్యాభిమాని. ఒక అమ్మాయి,ఒక అబ్బాయి. పూర్వం ఇండియాలో ఉండగా కాలేజీలో ఉపాధ్యాయ వృత్తి. ప్రస్తుతం వ్యాసంగాలు చిన్న పిల్లలకి తెలుగు నేర్పడం. వీళ్ళ కోసం కథలు, నాటకాలు రాయడం, వాళ్ళ చేత వేయించడం. మరికొంత పెద్దపిల్లలకి 'ఆన్ లైన్ ' లో తెలుగు మాట్లాడం నేర్పడం. రాయగలను అనే సాహసంతో కథలు,వ్యాసాలు వంటివి వ్రాయడం. ' సాహిత్యభారతి' అన్న పేరుతో కొందరు స్నేహితులతో కలిసి ఏడాదికి ఐదు,ఆరు సార్లు చక్కటి విషయాలను గురించిన ఉపన్యాసాలను ఏర్పాటు చెయ్యడం. సంప్రదాయ సాహిత్యం అంటే అభిమానం. వాలంటీర్ చెయ్యడం అంటే బోలెడు సరదా. కలిగిన భావాలను, వచ్చిన భాషను, ఒంట్లో ఉన్నశక్తిని తోటి వాళ్ళతో పంచుకోవడం అంటే ఇష్టం.

శ్రీ కలశపూడి శ్రీనివాసరావు: జననం బొబ్బిలి,ఉన్నత విద్య విశాఖపట్నం మరియు పారిస్. అనేక సంవత్సరాలుగా పరిశోధకుడిగా అమెరికా లో జీవనం. ప్రస్తుతం న్యూయార్క్ నివాసి 1975 'మొదటి ప్రపంచ తెలుగు మహాసభ'ల నుండి తెలుగు సాహిత్యం తో సభా పరిచయాలు. 1993 నుండి అనేక కథలు ప్రచురించారు. 2014 లో 'కలశపూడి కథలు' ప్రచురించారు 2020 లో 'గురుదక్షిణ' కథల పుస్తకావిష్కరణ ఏడవ ప్రపంచ తెలుగు సాహితీ సదస్సులో జరిగింది. వీరికి పరిశీలన, పరిశోధన, రచన వృత్తి ప్రవృత్తి కూడా.

శ్రీమతి పాలపర్తి ఇంద్రాణి: కృష్ణా జిల్లా అవనిగడ్డ లో జననం . విజయవాడ లో ఇంజనీరింగ్ విద్యాభ్యాసం .డెట్రాయిట్ లో ఎమ్మెస్ చేసి ప్రస్తుతం హెల్త్‌కేర్ ఏకానమిస్ట్ గా పనిచేస్తున్నారు . ప్రస్తుతం టెక్సాస్ లో కుటుంబం తో నివసిస్తున్నారు. ఇప్పటి వరకూ నాలుగు కవితా సంకలనాలు , ఒక చిన్న కథల సంపుటి, ఒక నవలిక, ఒక వచన సంపుటి ప్రచురించారు. ఆమె వానలో తడిసిన పువ్వొకటి కవితాసంకలనం కు ఇస్మాయిల్ అవార్డ్ లభించింది.

డా. వేదుల సుభద్ర: గోదారొడ్డున అమలాపురం లో జననం. జెనెటిక్స్, మాలిక్యులర్ బయాలజీలో పి .హెచ్.డీ దాకా విద్యాభ్యాసం. ప్రస్తుతం అమెరికాలో న్యూ జెర్సీ లో నివాసం, ఉద్యోగం. అమ్మ ప్రోత్సాహం తో చిన్ననాట మొదలైన రచనా వ్యాసంగం నాతో పాటు పెరిగి నన్నో చిన్నపాటి రచయిత్రిగా నిలబెట్టింది. కౌముది వెబ్ పత్రికలో ధారావాహికంగా ప్రచురించబడిన 'అగ్రహారం కథలు' పుస్తకరూపం లో కూడా చాలా పేరును తెచ్చాయి. అలాగే కౌముది లో మహానగరం

174

కథలు, ఆంధ్రభూమిలో ప్రచురితమైన E – తరం కథలు జనాదరణ పొందాయి. నా కథలని మన సాహితీ మిత్రులెందరో తమ యూట్యూబ్ ఛానెల్స్ లో చదివి ప్రాచుర్యాన్ని తెచ్చారు.. ప్రముఖ రాజకీయ వేత్త, విశ్లేషకులు శ్రీ పరకాల ప్రభాకర్ గారు నా అగ్రహారం కథ 'పిన్ని ' చదవడం ఒక గొప్ప అనుభూతి.

శ్రీ చేపూరు సుబ్బారావు: జన్మస్థలం పల్నాడు, . ప్రస్తుత నివాసం హైదరాబాదు. విశ్రాంత ఆంగ్ల అధ్యాపకులు.ఆంగ్లాంధ్రాలలో కవి,విమర్శకులు,అనువాదకులు. అమృతం కురిసిన రాత్రి ఆంగ్లానువాదం, సహ అనువాదకులతో కలిసి వేయిపడగలు నవల ఆంగ్లానువాదం చేసి,సహ సంపాదకత్వం వహించారు. Shakespeare Sonnets, An Indian in South Africa పుస్తకాల ఆంధ్రానువాదం చేశారు. మార్వెల్ ఆఫ్ శంకరాభరణం (ఆంగ్లం) , ఆంగ్లాంధ్రసాహిత్యం పై విమర్శనా వ్యాసాలు /రేడియో ప్రసంగాల సంపుటి (ఆంగ్లం), సాహిత్య వ్యాసాలు సమీక్షల సంపుటి(తెలుగు) వెలువరించారు.ఇంగ్లీష్ MA విద్యార్థులకు లిటరరీ క్రిటిసిజం పాఠ్యాంశాలను ప్రాసిన అధ్యాపకులలో ఒకరు. అనువాద సాహిత్యం లో 2021 కీర్తి పురస్కార గ్రహీత.

శ్రీ యదుకుల భూషణ్ తమ్మినేని: కవి ,విమర్శకులు అనువాదకులు. జననం రాయల సీమ,ఉన్నత విద్య విజయవాడ ఇంజనీరింగ్ కాలేజీ ,ప్రస్తుత నివాసం న్యూజెర్సీలో. వృత్తి పరమ గా గత ఇరవై ఏళ్లు గా సమాచార సాంకేతిక రంగంలో నిపుణులు. మూడు కవితా సంకలనాలు, ఒక కథా సంకలనం,ఒక సాహిత్య విమర్శల సంకలనం ,ఒక అనువాదాల సంపుటి ప్రచురించారు. అనువాదాలు అస్సామీ మహాకవి, గొప్ప అనువాదకులు, జ్ఞానపీఠ అవార్డు గ్రహీత నీలమణి ఫూకన్ ప్రశంసలందుకున్నాయి. ప్రఖ్యాత కవి, ఆస్కార్ అవార్డు గ్రహీత గుల్జార్ "పదార్థం " అన్న కవితను మెచ్చి, స్వయంగా అనువదించి గానం చేశారు.

డా.వైదేహి శశిధర్: జన్మస్థలం నర్సరావుపేట. మెడికల్ విద్యాభ్యాసం ఆంధ్రమెడికల్ కాలేజ్ విశాఖ పట్నం. వైద్యవృత్తి చేస్తూ కుటుంబం తో కలసి న్యూజెర్సీలో నివాసం. తెలుగు,ఇంగ్లీషు భాషలలో కవిత్వం,వ్యాసాలూ వ్రాస్తుంటారు .తెలుగులో రెండు కవితా సంకలనాలు వెలువరించారు. సహ అనువాదకులతో కలిసి వేయిపడగలు గ్రంధాన్ని ఆంగ్లం లోకి అనువదించారు. కవిత్వానికి ఇస్మాయిల్ అవార్డుని,వెలిచాల కేశవరావు అవార్డుని అందుకున్నారు. కవిత్వం సాహిత్యం,సంగీతం అభిమాన విషయాలు . గత పాతికేళ్ళ గా తెలుగు కళాసమితి తో అనుబంధం.

శ్రీమతి శ్యామలాదేవి దశిక : బాల్యం అంతా బాపట్ల దగ్గర ఉన్న చెరుకూరు అనే చిన్న పల్లెటూరు లో గడిచింది. 1976 నుంచి రామకృష్ణ తో న్యూజెర్సీలో నివాసం. నాకు అమెరికా వచ్చిన తర్వాతే తెలుగు సాహిత్యం మీద ఆసక్తి, రాయాలన్న అభిలాష కలిగాయి. పురాణం వారి ఇల్లాలి ముచ్చట్లు చదివి ఆ స్ఫూర్తితో తో 60 కి పైగా "అమెరికా ఇల్లాలి ముచ్చట్లు" రాసాను. వంగూరి ఫౌండేషన్ వారి ద్వారా నా రచనలు అన్నీ రెండు పుస్తకాలుగా ప్రచురింపబడ్డాయి. 2021లో దాసుభాషితం వారు ఈ రెండు పుస్తకాల్ని ఆడియో బుక్స్ గా రిలీజ్ చేసారు. భావరాజు మూర్తిగారు, పేరి దివాకర్ గారి ఆధ్వర్యంలో నడిచిన "తెలుగు జ్యోతి" పత్రిక సంపాదక వర్గంలో 14 సంవత్సరాలు పనిచెయ్యడం గొప్ప అనుభవంగా, అదృష్టంగా భావిస్తాను.

శ్రీ పాపినేని శివశంకర్: స్వస్థలం గుంటూరు జిల్లా. విశ్రాంత తెలుగు అధ్యాపకులు. ప్రముఖ కవి , కథకులు, సాహిత్యవిమర్శకులు. కథాసాహితి పేరిట ఉత్తమ కథా సంకలనాలను వాసిరెడ్డి నవీన్ తో కలిసి గత ముప్పై ఏళ్లుగా ప్రచురిస్తున్నారు . ఇప్పటి వరకూ అయిదు స్వీయ కవితా సంకలనాలు, రెండు స్వీయ కథా సంపుటులు, అయిదు సాహిత్య విమర్శా సంకలనాలు ప్రచురించారు. సాహిత్యం–మౌలిక భావనలు' అనే అంశంపై వీరు చేసిన ఉత్తమ పరిశోధనకు ఆచార్య తూమాటి దొణప్ప స్వర్ణపతకం లభించింది. 2016 లో వీరి రజనీగంధ కవితా సంపుటికి ప్రతిష్టాత్మకమైన కేంద్రసాహిత్య అకాడెమీ పురస్కారం లభించింది . అంతేకాక వీరు ఫ్రీవర్స్ ఫ్రంట్ అవార్డ్ ,నాగభైరవ కళాపీఠం అవార్డు,ఆవంత్స సోమసుందర్ కవితా పురస్కారం కేతు విశ్వనాధరెడ్డి కథా పురస్కారం వంటి అనేక పురస్కారాలు అందుకున్నారు,

శ్రీ గరికపాటి పవన్ కుమార్: ఖమ్మంలో బాల్యం.విజయవాడ సిద్ధార్థ ఇంజనీరింగ్ కాలేజిలో విద్యాభ్యాసం రాంచీలో M.

Tech చేశారు . ఉద్యోగ రీత్యా అస్సాంలో బొంబాయి, లండన్ నగరాల్లో అమెరికాలో మిల్వాకీలో ప్రవాసజీవితం గడిపి కుటుంబం తో ప్రస్తుతం బెంగళూరు లో స్థిరనివాసం. కవి ,రచయిత, అనువాదకులు. "ఆ సాయంత్రం" కవితా సంకలనానికి ఇస్మాయిల్ అవార్డు (2007) లభించింది. ఉత్తమ కవిత్వంగా పేరుపొందిన నెరుడా Plenos Poderes పుస్తకాన్ని "సంపూర్ణాధికారం" గా అనువదించారు. అస్సామీ భాషలోకి పలు అనువాదాలు చేశారు.

శ్రీ విన్నకోట రవిశంకర్ : కవి విమర్శకులు శ్రీ రవిశంకర్ జన్మస్థలం కాకినాడ. ఇంజనీరింగ్ విద్యాభ్యాసం చేసి,వృత్తి రీత్యా దాదాపు పాతిక సంవత్సరాలుగా సౌత్ కెరోలీనా రాష్టం కొలంబియా నగరంలో నివాసం . కొన్ని దశాబ్దాలుగా వచన కవిత్వంలో కృషి. కవితలు, సాహిత్య వ్యాసాలు అనేక పత్రికలలో ప్రచురితం. ఇప్పటివరకు "కుండీలో మర్రి చెట్టు", "వేసవి వాన", రెండో పాత్ర", "మంచు కరిగాక" అనే కవితా సంపుటాలు, "కవిత్వంలో నేను" అనే సాహిత్య వ్యాసాల సంపుటి పుస్తక రూపంలో వచ్చాయి.

డా. కె.గీత : రచయిత్రి, గాయని,కవయిత్రి , భాషా నిపుణులు. 2006లో అప్పటి ఉమ్మడి ఆంధ్ర ప్రదేశ్ ప్రభుత్వం నించి "ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు" పొందారు. "నెచ్చెలి" అంతర్జాల వనితా మాస పత్రిక వ్యవస్థాపక సంపాదకులు. సాఫ్ట్ వేర్ ఫీల్డు లో పనిచేస్తూ కాలిఫోర్నియాలో ప్రస్తుత నివాసం . అయిదు కవితా సంకలనాలు,ఒక కథా సంపుటి, ఒక నవల ప్రచురింపబడ్డాయి. "అపరాజిత"– పుస్తకానికి సంపాదకత్వం వహించి ప్రచురించారు. కవిత్వంలో అజంతా, దేవులపల్లి, రంజనీ కుందుర్తి, సమతా రచయితల సంఘం మొదలగు అవార్డులు, నవలకు.

మమత కొడిదెల : బాల్యం కర్నూలు జిల్లా, నందికొట్కూర్ తాలూకా లోని మండ్లెం గ్రామంలో. హైస్కూల్ , ఇంటర్ హైదరాబాదులో చదివిన తరువాత, బి.టెక్ కర్నూల్లో. ప్రస్తుత నివాసం పెన్నింగ్టన్, న్యూ జెర్సీ. అనేక కవితలు,వ్యాసాలు అంతర్జాల పత్రికలలో ,అచ్చు పత్రికలలో ప్రచురించారు . ఆమెకి సామాజిక స్పృహ ఉన్న సాహిత్యం చదవడం, వ్రాయడం ఇష్టం.

డా. కొంపెల్ల భాస్కర్: పుట్టింది తణుకు, ప.గో.జిల్లా లో ; పెరిగింది – విశాఖ, అనకాపల్లి లలో . యూనివెర్సిటీ ఆఫ్ హైదరాబాద్ లో పిహెచ్ డి చేసారు .ప్రస్తుత నివాసం – డోయిల్స్ టౌన్, పెన్సిల్వేనియా. వృత్తి – శాస్త్రపరిశోధనా యాజమాన్యం. తెలుగు, సంస్కృతంలో కవిత్వం, ఇంగ్లీష్ నవల, నాటక సాహిత్యాల పట్ల అభిరుచి.

డా గంటి సూర్యం: కోనసీమ మాతామహుల స్వస్థలం. గుంటూరు మెడికల్ కాలేజీలో వైద్య విద్యాభ్యాసానంతరం, గత నలభై ఏళ్ళుగా భార్య అరుణతో న్యుజెర్సీలో నివాసం. కార్డియాక్‌అనస్థీషియా ప్రాక్టీసు వృత్తి. మంచి పుస్తకాలు చదవడం, అప్పుడప్పుడు రచనలు చేయడం, ఎప్పుడెప్పుడూ పాటలు పాడటం ప్రవృత్తి. ఈమధ్యనే యూట్యూబ్లో, ఇన్స్టాగ్రాంలో రీల్స్ చేస్తున్నారు. తెలుగు అంటే మక్కువ.

డా. రవూఫ్: 1982 బ్యాచ్ రంగరాయ మెడికో విద్యార్థి గా ఉన్న రోజులలోనే 19 ఏళ్ళ వయస్సులో అతడి తొలి కవితా సంపుటి " అంతర్నేత్రం " వెలువడింది. అంతర్నేత్రం కవిగా గుర్తింపులోకి వచ్చిన రవూఫ్, తన రెండో కవితాసంపుటి " కనురెప్పల కిటికీ రెక్కల మధ్య.... " తో కవిగా ప్రాచుర్యం పొందారు . "ఒకపరి హత్తుకు పో!" అతడి ఇటీవలి కవితా సంపుటి NATS 2023 వేదిక పైన న్యూ జెర్సీ లో ఆవిష్కరించబడింది. కవిత్వమే కాకుండా వచనమూ, కాల్పనిక సాహిత్యమూ సృజిస్తున్నారు. మంచి కవిగా,సహృదయునిగా పాఠకలోకానికి సుపరిచితమైన డా. రవూఫ్ గుంటూరు నగరంలో గత 27 యేళ్ళుగా మధుమేహ వ్యాధి నిపుణుల గానూ రాణిస్తున్నారు .

దివాకర్ పేరి : భార్య లక్ష్మి , కుమారుడు నీహార్ తో డేటన్ (న్యూ జెర్సీ) లో నివాసం. సాఫ్ట్–వేర్ ఇంజనీర్ గా వృత్తి ఓ పాతికేళ్ళు తెలుగుజ్యోతితో సావాసం, ఓ పుంజీడు ఏళ్లు సంపాదక బాధ్యత నిర్వహించారు చదవడం, అభిరుచివున్న వాళ్ళని ప్రోత్సహించి రచనలు చేయించడం ప్రవృత్తి. పూర్వ కవుల తెలుగు సాహిత్యం అంటే బోలెడు ఇష్టం.

SiliconAndhra MANABADI

(Only Telugu School accredited by ACS-WASC in USA & Canada)

New Students

4 - 6 Years
BalaBadi

6 + Years
Pravesam

Admissions Started for Classes

Pravesam
Prasunam
Prakasam

Pramodam
Prabhasam
BalaBadi*

* BALABADI admissions are open throughout the year in USA & Canada

Learn To Listen, Speak, Read, Write **Telugu**

16+ Years of Service

10+ Countries

30+ States in the USA

85,000 Students

250+ Locations

2000+ Volunteers

Balabadi registrations are open throughout the year

Classes From **September 9th 2023**

Recognition

- The only Telugu learning program accredited by ACS-WASC
- Approved as world language course for secondary grades students in several U.S school districts
- Affiliated to Potti Sreeramulu Telugu University

Exams

- Potti Sreeramulu Telugu University certificate for Prakasam and Prabhasam levels
- Classes by well-trained Teachers

Co-Curricular Activities

Pillala Panduga, Telugu Maatlaata, Balanandam, Teluguku Parugu, PalukuBadi, Padyanatakam, Natakotsavam, Bala Chandrika

BalaRanjani

Self-paced Telugu learning **mobile App FREE for all students**

JOIN MANABADI - LEARN TELUGU

For more details and to register:

manabadi.siliconandhra.org
info@manabadi.siliconandhra.org
1-844-626-BADI (2234)

Follow us on :

VASAVI
DEVELOPERS USA

LET'S GROW TOGETHER FOR BETTER FUTURE..!

INVESTMENT OPPORTUNITIES

- Land Acquisitions
- Commercial Properties
- Residential Properties
- Multi Family
- NNN Properties
- Sports Academy
- RV Park
- Self Storage
- Rental Apartments

Want to know more?
Scan to learn more

ABOUT US

Vasavi Developers USA is a real estate investment company with a vision for people's future, acquired more than 4,000 acres of land in various states and vision to build homes and commercial spaces. With more than 200 million+ projects in the pipeline, Vasavi Developers has the capacity to deliver on any project of any size.



PRAVEEN THADAKAMALLA



NAGENDER AYTHA



ASHOK ELLENDULA



RAJA PAMPATI

www.vasavidevelopers.com

178

/ VasaviDevelopers

Global IT Solutions (GITSUS)

AdvoLogix

CLOUD BASED LEGAL MATTER MANAGEMENT

AdvoLogix Cloud Based Legal Matter Management application is a leading Law practice and Legal Matter Management solution that helps Law Firms, Legal Departments, and Public Service organizations automate unique business processes surrounding case management operations.

Global IT Solutions (GITSUS) is an AdvoLogix partner and leading IT services company based in Brooklyn, New York City. GITSUS has 20+ years of IT Development, Consulting and Services experience in various verticals.

AdvoLogix Implementation & Support: GITSUS is a certified Salesforce partner having successfully implemented AdvoLogix Matter Management an innovative end to end legal case management solution on Salesforce platform. AdvoLogix offers high security and reliability, high-level functionality and customization, endless features, configuration, and optional integration. This helps the Law Firms, Legal Departments, and Public Service organizations to follow the standard workflows and Legal Practice Standards.

AdvoLogix Features:

- **Management of Legal Matters, Documents, Events, Clients, Contacts, Communication & Resources**
- **Time Tracking, Schedule Management, Calendar, Alerts, Reminders, Research & Search Functionality**
- **Automation, Case Templates, Checklist Generation, Task & Workload Management**
- **Multi Currency enabled Invoicing & Billing, Reporting, Dashboard & Expense tracking**

Advantages:

- **All legal facets are available end to end at one place**
- **Easy and recordable communication with clients**
- **Effective time management of legal, paralegal and administrative resources**
- **Scalable search and research of legal cases and pertinent documentation**
- **Transparent and accurate invoicing**
- **Privacy of client information is regulated by strict access rules**

Contact our GITSUS team to get started with a personalized AdvoLogix experience.



Sai Suryadevara | **sai@gitsus.com** | **(718) 676-9575 Ext. 207 / (510) 209-2119 (Cell)**
https://gitsus.com | **info@gitsus.com** | **(718) 377-4525 (Direct)** | **(718) 377-2527 (Fax)**
1133 East 35th Street, Suite 2D, Brooklyn, New York 11210 USA

Certified Minority-owned Business Enterprise (**MBE**) – New York City (**NYC**), New York State (**NYS**) and The Port Authority of New York & New Jersey (**PANYNJ**)

BHOG

REDEFINED INDIAN CUISINE

Elevate Your Culinary Experience with Bhog Caterer









Please Contact

Nimma Ravi Reddy - 601-316-4456

Srinivas Ganta - 732-692-9462